శ్రీమత్పరదేవతాయైనమః

మృచ్ఛకటిక.

(శూద్రకమహాకవికృతికిఁ దెలుగు)

శ్రీ తిరుపతివేంకటీయము

6 వ కూర్పు 1000 ప్రతులు

ఫ-106

ప్రాప్తిస్థానము :
శ్రీ తిరుపతి వేంకటేశ్వర పబ్లికేషన్సు,
రాజమండ్రి.

శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయము,
విభాగము ....
విభాగ సంఖ్య ....

Rs. 2

సర్వహక్కులు
తిరుపతివేంకటేశ్వరులవి.

అవంతీ ప్రెస్, రాజమహేంద్రవరము
కాపీలు 1000 - 8-7-1948

శ్రీమత్పరదేవతాయైనమః

మృచ్ఛకటికము

ప్రథమాంకము.

నాంది.

మ. అహిమోకాళ్ళకు రెండుచుట్టలుగఁ బర్యంకంబు బంధించి లో
నహముంద్రుంచి మనంబు వంచి విషయత్యాగంబు గావించి యా
దహరాకాశమునం దనంతఁ బరమాత్మంజూచుచుం దత్త్వదృ
ష్టి హరుండున్న సమాధినిష్ఠ మిము రక్షించుం దయావంతమై.

గీ. గౌరిచేతులగాటంపుఁ గౌఁగిలింత • మెఱపుగాన్పింపదను మేటి కొఱఁతఁదీర్ప
నీలమేఘముతోఁబోలు డాలుగల్గు • కాలకంఠుని గళము మిమ్మేలుఁగాత.

(నాంద్యంతమున సూత్రధారుఁడు) చాలుఁజాలు. సభాసదుల కుల్లాసము గలుగఁ జేయని పరిశ్రమమేల? పూజ్యులగు పండితులార! మీకొక విన్నపము. మేము తెనుఁగున మృచ్ఛకటికమను ప్రకరణము నభినయింపఁదలఁచి యున్నారము. ఆ నాటకము సంస్కృతమున నొనర్చిన యతఁడు—

గీ. పూర్ణచంద్రాననుండు ప్రభూతకీర్తి • ద్విజుల తలమానికము మదద్విరదగామి
రాచతబిసి చకోరవిలోచనుండు • శూద్రకుండను కవిరాజు సుందరుండు.

సీ. చదివె ఋగ్వేదంబు సామవేదము గణితంబు పైశికవిద్య దంతిశిక్ష
కాంచెఁ బర్వతకన్యకాభర్తదయచేతఁ దిమిరంబువాసిన దివ్యదృష్టిఁ
బడసె వసుంధరాపాలనాచాతుర్యమునఁ దనయంతవానిని గుమారుఁ
దనియించె నశ్వమేధముచేసి మేటి దక్షిణలచే సురలను క్షితిసురులను

గీ. నప్రమత్తుండు సంయుగవ్యసని, శత్రు • గజములంగూల్చు చేలావు గలుగువాఁడు
బ్రదికె నూఱేండ్లపై నొక పదిదినములు • వ్రాల్చె మేనగ్నిలోన శూద్రకవిభుండు.

చ. సరసగుణాభిరాముఁడు ప్రశస్తయశస్స్ఫురభీభవద్దిగం
తరుఁడు గభీరుఁ డున్నతుఁ డుదారుఁడు ధీవరుఁడైన కృష్ణభూ
వరుని కవీంద్రులై రెవరు ప్రస్తుతమందు శతావధానులే
తిరుపతివేంకటేశ్వరులు తెల్గొనరించిరి వారు దానికిన్.

ఈ నాటకమునందలి కథ యేమనగా,

గీ. బ్రాహ్మణుఁడు పేదవడిన వ్యాపారిపడుచు • చారుదత్తుఁడనంగ నుజ్జయినిఁ గలఁడు,
కలదు వేశ్యయొకర్తు చక్కఁదనమున వ • సంతశోభను బోలు వసంతసేన.

గీ. వారి యిరువుర ప్రేమానుబంధ మిందు • వర్ణనీయంబు, కలదు సర్వత్రనీతి
తెలియు దుర్వ్యవహారంబు, ఖలచరిత్ర • వితము, భవితవ్యతావశ్యకతయు దీన.

(పరిక్రమించి యెదుటికిఁజూచి) ఏమిది, మాసంగీతశాలలో నొకరును లేరు! నాటకులందఱు నెచ్చటికిఁ బోయిరో! (ఆలోచించి) అవును తెలిసినది.

గీ. సుతులులేని యిల్లు శూన్యంబు, చిరశూన్య • మనుఁగుకాఁడులేని యతనిబ్రతుకు,
మోఱకునకు శూన్యములు దిక్కులెల్ల, స • ర్వంబుశూన్య మర్థరహితులకును.

సంగీతముగూడ నేనే పాడితిని. ఈ పాటవలన నాఁకలిచేత గ్రీష్మమునందలి యెండవేఁడిమిని వాడిన తామరగింజలవలె నల్లపాపలల్లాడ నా కన్నులు కట కట లాడుచున్నవి. చలిదియన్న మేమైన నున్నదో లేదో నా భార్యనుబిలిచి యడిగెదను. అబ్బబ్బ! ఈ చిరసంగీతోపాసనము వలన నా యవయవములన్నియు నెండిపోయిన తామరతూండ్లవలె నాఁకలిచే వ్రేలఁబడుచున్నవి. (ఎదుటికిఁ జూచి) ఇంటికిఁ బోయి పెండ్లము చల్దియన్నము దాఁచినదో లేదో యడుగవలయును. ఇదిగో! మా యిల్లు. ప్రవేశించెదను. (ప్రవేశించిచూచి) ఏమివింత యిది! మా గృహమంతయు నేఁడు క్రొత్తగా నున్నదే! నడుమవాడవునఁ గడుఁగునీరు కాలువలు గట్టినది. లోహపుఁ గాఁగులు పొరలించుటచేత మసియంటిన భూమియంతయుఁ దిలకము దాల్చిన పురంధ్రివలె శోభించుచున్నది. ముక్కుపుటములఁ బ్రవేశించిన తాలింపు వాసనలు నా యాఁకలి మఱింత వృద్ధిపఱచుచున్నవి. పూర్వులార్జించినఁ పాఁతేమైన బయల్పడెనా లేక యాఁకలిచే నాకు జగమంతయు నన్నమయముగాఁ గనఁబడుచున్నదా? ఇంటిలో జలిది యుండదు. ఆఁకలిచే నాకుఁ బ్రాణములు వోవుచున్నవి. నేఁ డిట నన్నియుఁ గ్రొత్తవ్యవహారములే జరుగుచున్నవి. ఒక్కతె మైపూఁత రంగులు నూరుచున్నది, ఒకతె పూవులు గుచ్చుచున్నది. (యోజించి) ఎందులకో! కానిమ్ము. మా యజమానురాలిని బిలిచి యడిగి యథార్థము దెలిసికొనియెదను. (తెరవంకఁ జూచి) ఆర్యా! యిటురమ్ము.

నటి——(ప్రవేశించి) ఆర్యపుత్ర! ఇదిగో వచ్చితిని.

సూత్ర——ఆర్యా! నీకు స్వాగతమా?

నటి——నేనేమి చేయవలయునో నియోగింపుము.

సూత్ర——ఆర్యా! ("ఈచిరసంగీతోపాసనము" అనునది చెప్పి) మన యింటిలోఁ దినుట కేమైన నున్నదా, లేదా?

నటి——ఆర్యపుత్ర! అన్నియు నున్నవి.

సూత్ర——ఏమేమి యున్నవి?

నటి— గుడాన్నమున్నది, పెరుఁగున్నది, నేయియున్నది, బియ్యమున్నవి. మీరు తినఁదగినరసాయనములన్నియు నుండునట్లు మీకులదేవతలు సమకూర్తురుగాక!

సూత్ర— నిజముగా మనయింటనున్నవా, పరియాచకమాడుచున్నావా?

నటి—(తనలో) వేళాకోళమే చేసెదను. (ప్రకాశము) ఆర్యపుత్ర! అంగడిలోనున్నవి.

సూత్ర—(కోపముతో) ఓసి! అపవిత్రురాల! నా యాశవలె నీయాశ నిరాశ కాఁగలదు. నీవు కోరిన పదార్థములు దొరకకపోవును. ఏతపుబానవలె నెత్తి కుదపై చితివిగదే?

నటి—ఆర్యపుత్ర! క్షమింపుము. పరిహాసమునకంటిని.

సూత్ర—సుందరీ! మనయింట గ్రొత్తక్రొత్త పనులు జరుగుచున్నవి. కారణమేమి? ఒక్కతె పిండి పిసుకుచున్నది. ఒక్కతె పువ్వులు గుచ్చుచున్నది. ఒక్కతె ముగ్గులు పెట్టుచున్నది.

నటి—నేనొక నోము నోచుకొనుచున్నదానను.

సూత్ర—ఈనోము పేరేమి?

నటి—అభిరూపవతియని దీనిపేరు. ఈనోము నోఁచిన మంచిమగఁడు దొరకునట.

సూత్ర—ఈలోకమందా, పరలోకమందా?

నటి—పరలోకమందే.

సూత్ర—పెద్దలార! చూడుఁడు, చూడుఁడు. నా ధనము వెచ్చించి పరలోకమున నింకొక మంచిమగని వెదకికొనుచున్నదఁట!

నటి—ఆర్యపుత్ర! అనుగ్రహింపు మనుగ్రహింపుము. పరలోకమునందును నీవే భర్తవు కావలెనని యీవ్రత మనుష్ఠించుచున్నదానను.

సూత్ర—ఇది నీకెవ్వ రుపదేశించిరి?

నటి—దేవర ప్రాణమిత్రుఁడగు చూర్ణవృద్ధుఁడు.

సూత్ర—ఓరి తొత్తుకొడుకా! చూర్ణవృద్ధ! సుగంధిలమగు నవవధూకేశకలాపము ను ఛేదించిన పగిదిఁ గుపితుండగు పాలకరాజు నీతలఁ దఱుగుచుండఁగా నెపుడుచూచెదనో.

నటి—ప్రాణేశ్వరా! దయయుంచుము. నీకొఱకే యీవ్రతము (అని పాదముల మీఁదఁ బడును.)

సూత్ర—ప్రియురాల! లెమ్ము. ఈవ్రతమున కింకేమి కావలయునో నుడువుము.

నటి—మనయింటికిఁ రాఁదగిన యొకబ్రాహ్మణుని భోజనమునకు బిలువవలయును.

సూత్ర—అటులేని నీవు నడువుము. నేనుబోయి బ్రాహ్మణుని భోజనమునకుఁ బిలుచుకొని వత్తును.

నటి—దేవర చెప్పినట్లు చేసెదను. (నిష్క్రమించును.)

సూత్ర—(తిరిగి తిరిగి) వింతగా నున్నదే! సుసమృద్ధమైన యీ యుజ్జయినీ పురమున నాకుఁ దగిన బ్రాహ్మణు నెట్లు వెదుకఁగలను (ముందుకుఁజూచి) ఇదిగో, చారుదత్తుని మిత్రుఁడు మైత్రేయుఁ డీవీధివెంబడి వచ్చుచున్నాఁడు. కాని! వీని నడిగెదను. (సమీపించి) ఓ మైత్రేయ! నేఁడు మాయింటికి భోజనమునకు దయచేసి మమ్ముఁ గృతార్థులను జేయుము.

(తెరలో) ఇంకొక బ్రాహ్మణునిఁ బిల్చుకొమ్ము. నాకుఁ బనియున్నది.

సూత్ర—అయ్యా! మృష్టభోజనముపెట్టెదము. పంక్తికి రెండవవారెవ్వరునుండరు. కొంచెము దక్షిణకూడ నిచ్చెదము.

(మరలఁ దెరలో) ఇప్పుడేగదా రానని చెప్పితిని, నాకీ నిర్బంధమేటికి? పదిసారు లడిగెదవు.

సూత్ర—ఇతఁడు నామాట నిరాకరించెను, కాని మ్మింకొక బ్రాహ్మణుని బిలిచెదను. (నిష్క్రమించుచున్నాఁడు.)

ఇ ది యా ము ఖ ము.

(పిదప నుత్తరీయము చేతఁబుచ్చుకొని మైత్రేయుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

మైత్రే—అక్కటా! మైత్రేయుఁడుగూడఁ బరులయింటికి నిమంత్రణభోజనమునకుఁ బోవలసిన దురవస్థకు లోఁబడవలసివచ్చెఁగదా! మహానుభావుఁడు చారుదత్తుఁడు ధనవంతుఁడై యున్న దినములలో లోగిటి లోపటిముంగిలి పైపునఁగూర్చుండి, పరిమళద్రవ్యముల సంభారముతోఁ బ్రయత్నపూర్వకముగ వండించుకొన్న మోదకములచేతనే తృప్తినొంది, విస్తరిచుట్టును బదార్థములచే నిండియున్న దొన్నెలలో, చిత్రకారుఁడు చుట్టునున్న రంగుగిన్నెలలోఁ గుంచె ముంచినట్లు వ్రేలుముంచి వాచవిమాత్రము చూచుచుండువాఁడను. అచ్చుపోసిన యాఁబోతు నెమరువేయుచు నడువీధిలోఁ బండుకొనునట్లు వారియింటనే నిద్రించువాఁడను. నేటికిఁ బరులయిండ్లకు నిమంత్రణభోజనములకై పోవలసివచ్చినది. భోజన మెచ్చటఁ జేసినను పెంపుడుపావురమువలె నతని యిల్లుమాత్రము వదలలేకున్నాఁడను. జాజిపూవు వాసనలు గ్రమ్ము నీ యుత్తరీయము దేవతార్చన చేసి కొనినపిమ్మటఁ జారుదత్తున కిమ్మని యతని ప్రియమిత్రుఁడు చూర్ణవృద్ధుఁడు నాచేతి కిచ్చెను. కావున నతనిం జూచుటకై పోయెద. (ఎదుటఁజూచి) ఇతఁడె! చారుదత్తుఁడు. దేవతాపూజ గావించుకొని గృహదేవతలకు బలియిచ్చుటకీవంకకే వచ్చుచున్నాఁడు.

(పిదప యథోక్తముగాఁ జారుదత్తుడు రదనికయను దాసియు బ్రవేశించుచున్నారు.)

చారు—(ఆకసమువంకఁజూచి నిర్వేదముతో నిట్టూర్చి)

గీ. తొల్లి యేయింటిగుమ్మములెల్ల నిండె • బలులు తిను హంససారసకులముచేత
నట్టి మాగుమ్మముల బలియవలు తినునె • పెరుగు పచ్చికలోనుండు పురుగులకట!
(అని మందముగాఁ బరిక్రమించి కూర్చుండును.)

మైత్రే—ఈయనయే చారుదత్తుఁడు! దగ్గఱకుఁబోయెదను. (సమీపించి) మిత్రమా! నీకుఁ గుశలమా? నీవు వర్ధిల్లుదువుగాక.

చారు—(చూచి) సార్వకాలిక మిత్రుఁడగు మైత్రేయుఁడా! చెలికాఁడా! కుశలమా? కూర్చుండుము.

మైత్రే—మంచిది, అటులే కూరుచుందును. (కూర్చుండి) మిత్రమా! జాజిపుష్పముల తావిఁగ్రమ్ముచున్న యీ యుత్తరీయము దేవతాపూజయైన పిదప నీకిమ్మని చూర్ణవృద్ధుఁడు నాచేతికిచ్చెను. ఇదిగోఁ బుచ్చుకొనుము. (అందిచ్చును.)

చారు—(పుచ్చుకొని నిర్వేదముతోఁ జింతించును.)

మైత్రే—స్నేహితుఁడ! చింతించెదవేమి?

చారు—మైత్రేయ! చింతించుటయే లేదు.

గీ. కీడ్వడినమీఁద జనుఁడు సుఖింపవచ్చుఁ • గటికచీఁకటిలో దివ్వెగాంచినట్లు
మే లనుభవించి మీఁద లేమివడెనేని • వాఁడు నిజముగ జీవచ్ఛవంబ చూవె.

మైత్రే—చెలికాఁడ! నీమదికి దారిద్ర్యము మేలా? చావు మేలా?

చారు—

గీ. మరణమందును దారిద్ర్యభరమునందు • మరణమే మేలు దారిద్ర్యభరముకంటెఁ
దత్సమయమాత్రదుఃఖప్రదంబు చావు • చచ్చినందాఁక దుఃఖమొసంగు లేమి.

మైత్రే—చెలికాఁడ! చింతింపకుము. ఐశ్వర్యమంతయు నర్థిజనము పాలు గావించిన నీ పేదతనము, కళలన్నియు దేవతలకిచ్చిన చంద్రునిక్షయమువలెఁ గొనియాడదగినదియే.

చారు—మైత్రేయ! నాకు ద్రవ్యము లేదనుచింత లేదు.

గీ. మదము లేకున్ననాఁడు తుమ్మెదలు దంతి • చెంతకైనను జనక త్యజించుపగిది
నతిథులందఱు మాయింటి కర్థహీనుఁ • డంచు రాకుంటఁజేసి చింతించుచుంటి.

మైత్రే—మిత్రుఁడా! అరణ్యమునఁ గందిరీగలు గుట్టనిచోట్లకెల్లఁ బరువిడు గొల్లపిల్లవాండ్రవలె, యీ పనికిమాలిన పాడుసంపదలుగూడఁ ద మ్మెవరు ముట్టకముడిపైతురో వారిచెంతకే పోవుచుండును. వానికై చింతింపకుము.

చారు——మైత్రేయ !

గీ. బ్రతికి చెడితినటంచు నే వగవ; సిరులు•వచ్చియును బోయి వచ్చుచుఁ బోవుః
ధనములేకున్కి మిత్రబృందమ్ముగూడ•వదలునను దుఃఖమే నన్ను వదలకుం
మఱియును,

శా. దారిద్ర్యంబున సిగ్గుగల్గుఁ, బ్రపచేతం దేజముం బోవుఁ, దే
జోరాహిత్యమునం భరావము వచ్చుం, దాన నిర్వేద మే
పారుం, దాన జనించు వంత, మతి వమ్మై పోవు దుఃఖమ్మునన్
గారించు న్మతిలేమి ; లేమి సకలానర్థప్రదం బక్కటా !

మైత్రే——వయస్య ! పొసినకూటివంటి ధనమును స్మరించుకొని విచారింపకుః

చారు——మిత్రమా ! పురుషునకు దారిద్ర్య మెట్టిదో యెఱుఁగుదువా ?

ఉ. చేరిక చింతకుం, బరులు సేయు తిరస్కృతి, బంధుకోటికిం
దూరము, వైరిలేనిపగ, దోహద మాఱని శోకవహ్నికిన్,
దారల కీసడింపు, విపినంబులపాలగు బుద్ధి, బంధువుల్
చేరనిదారి, లోపలికిఁ జేరియుఁ జంపని చిచ్చుగాదొకో.

కానీ దీనికేమి. నే నీ గృహదేవతలకు బలియొసఁగినాడఁను. నీవు చ
థమునందలి గ్రామదేవతల కీబలి తీసికొనిపొమ్ము.

మైత్రే——నేను బోను.

చారు——ఏమి కారణము ?

మైత్రే——నీ వీగతిఁ బూజించుచున్నను నీ యం దీ దేవతల కనుగ్రహము
పోయెఁగదా. యిఁక వీరికి బలియిచ్చుటవలనఁ బ్రయోజనమేమి ?

చారు——అట్లనరాదు. గృహస్థుల కిది నిత్యమైన విధి.

గీ. తపముచే వాక్కుచేతఁ జిత్తమ్ముచేత • బలులచేతను బూజింపఁబడిరయేని
సంతసింతురు వేల్పులు; శమముగల్గు • వారి కేటికి వేఱువిచారణములు

కావున నీవు పోయి గ్రామదేవతలకు బలియొసఁగిరమ్ము.

మైత్రే——నేను బోను. ఇంకొకరి నెవ్వరినైనఁ బంపుము. నావంటి బ్రాహ
దేవిచేయఁ బోయినను, నద్దములోని ప్రతిబింబమునకుఁ గుడివై పెడచ
నెడమవైపు కుడియు నైనట్లు, విపరీతముగాఁబరిణమించును. ఇదిగాక యిః
హేతువు కలదు. ఈ ప్రదోషవేళయందు రాజమార్గమున వేశ్యకాంతలు
చేటులు రాజానుగ్రహముగల పురుషులు తిరుగుచుందురు. కప్ప కొఱకు
యున్న పామున కెదురుపడిన యెలుకకువలె నా కెవ్వరిచేతనో చావు నిశ్చ

ఇక్కడఁ గూర్చుండినవాఁడవు నీ వేమిచేయగలవు ?

చారు—కానీ, కూర్చుండుము, నేను సమాధి నిర్వర్తించెదను.

(తెరలో) వసంతసేనా ! నిలువు నిలువుము.

(పిదప విటశకారచేటులచేఁ దఱుమఁబడుచు వసంతసేన ప్రవేశించుచున్నది.)

విటు—వసంతసేనా ! నిలువు నిలువుము.

గీ. నాట్యనిపుణంబులగు చరణంబు లదర • సౌకుమార్యంబుచెడ, భయచంచలంబు
లైన క్రీఁగంటి చూపులతో నడలుచు • నెఱుకు తరిమెడు లేడినాఁ బఱచెదేల ?

శకా—వసంతసేనా ! నిలు నిలుము.

గీ. ఏలపోయెదు, పాఱిపోయెదవు తొట్రు • పాటుతో, దయయుంచు చంపము లతాంగి!
బొగ్గు నిప్పులలోఁ బడ్డ పొలసువలెనె • కాల్చుచున్నాఁడు నామది కంజశరుఁడు.

చేటు—ఆర్యులారా ! ఉండుము ండుము.

గీ. జంకిపోయెదవేల ? వేసంగులందు • నీడ కెఱకలు సాచిన నెమ్మివోలె
నడవిఁజొచ్చిన కోడిపుంజట్టు లిదిగో! • తొట్రుపడుచున్నవాడు మాదొర మృగాక్షి!

విటు—వసంతసేనా ! నిలునిలుము.

గీ. ఉలులచేఁ జెక్కఁబడు మణిసిలకు నెట్టి • కలువలంబోలు ఘనదీప్తు లలముపగిది
గాలిచేఁదూఁగు రక్తాంశుకంబుతోడ • లేయనఁటివోలెఁ గదలుచుఁ బోయెదేల ?

శకా—వసంతసేనా ! నిలు నిలుము.

గీ. ప్రక్కపై నిద్రయైనను బట్టకుండ • నాకు మదను ననంగు మన్మథుని వృద్ధి
పఱచి,దశకంఠరునకు లోఁబడిన కుంతి • పగిది నెటకేగెదే? తొట్రుపడుచు బడుచు!

విటు—వసంతసేనా ! నిలు నిలుము.

గీ. వైనతేయభయాకులంబైన పాప • పడఁతి గతిని నాకంటెముం దడుగులిడుచుఁ
బఱచె దేడకు? గాలిని బట్టఁగలము • కూడఁ బరువెత్తి నినుఁబట్టుకొనుటయెంత?

శకా—బావా ! బావ !

సీ. నాణెంబులుహరించు నలినాస్త్రువేత్రంబు, సంజుదు తినులంజ, నాట్యమాడు
వెలఁది, చప్పిడిముక్కుగలనాతి, వంశంబు లడఁగించుకామిని, యవశురాలు,
పూవింటివాని సొమ్ములపెట్టె, విలువైన భూషణంబులుదాల్చు పువ్వుఁబోఁడి,
డబ్బిచ్చి చొరఁగనాటంకంబుగల్గనిమేడఁ గాఁపురమున్నవాడవెలఁది,

గీ. పడపుమగువలకెల్లర క్రొడయురాలు • నంచుఁ బది మంచిపేర్లు కల్పించినాఁడ
నన్నుఁజూచియుఁ బ్రేమంబునాటదకట ! • నిలువదేటికి బావ ! యీ నీలవేణి.

విటు—

గీ. ఉఱుము విని జంకు సారసయువతిఁబోలె • పల్లవులు గోటదీటిన వల్లికివలె
నడలుచే నిల్లు మదిదప్పి యరిగెదేల? • లలనః గండములందు గుండలము లొరయ

శకా—

గీ. గల్లురని నగలు మ్రోయఁగ వెళ్లెదేల? • రామునకు జంకి పఱువెత్తు ద్రౌపదివలె;
హనుమ, విశ్వావసునిచెల్లెలగు సుభద్ర • పగిది, నిను బల్మిహరియించువాడజూపె

చేటు—

ఆ. వె. దొరకు నీకు మంచికఱకుట్లు, పొందుమా రాజవల్లభుండు రమణి! యితని;
మాంసభోజనంబు మరగుకుక్కకునైన, శవపుఁదిండి దెసకుఁజనునె బుద్ధి?

విటు—పూజ్యురాలా! వసంతసేనా!

గీ. పైఁడిగంటల మొలనూలుతోడ, ముద్ద • యగు మనశ్శిలపోలికి మొగముతోడ
నగరదేవతవోలె సంభ్రమము మీఱఁ • బఱచెదేటికె భీతిమై పడుచుదాన!

శకా—

గీ. అడవిలో వేఁటకుక్కల కాడునక్క • యడలుగతి బల్మిమాచేత నభిసరింపఁ
బడుచుఁ బఱువెత్తెదేటికే? వడిగ వేగ • మూలముట్టుగ నాదెందమును హరించి.

వసం—ఓరీ పల్లవకా, పల్లవక! ఓసి పరభృతికా, పరభృతిక!

శకా—బావా! ఎవ్వరోమనుష్యులు! ఎవ్వరో మనుష్యులు!

విటు—జడియకుము, జడియకుము.

వసం—ఓసీ, మధుకరికా! మధుకరిక!

విటు—(నవ్వుచు) మూర్ఖుఁడా! పరిజనమును వెదకుచున్నది.

శకా—బావా! ఆఁడువారినేనా వెదకుచున్నది?

విటు—అగును.

శకా—ఆఁడువారైనచో వందలకొలఁది వచ్చినను జంపుటకు శూరుఁడనే.

వసం—(ఎవరును గనఁబడక) అమ్మయ్యో! పరిచారకులందఱు చెదరిపోయిరి.
ఇఁక నాయాత్మను నేనే రక్షించుకొనవలెను.

విటు—పరిజనమును వెదకికొనుము, వెదకికొనుము.

శకా—వసంతసేనా! పల్లవపరభృతికలనేకాదు. వసంతమాసమంతయుఁ దలంచు
కొని యేడ్చినను సరియే. నేఁ దఱుముచుండ నిన్నుఁగాపాడువాఁడెవ్వఁడు?

గీ. ఏను దుశ్శాసనునివలె నిపుడు నీదు • కొప్పుదొరకొందు, జమదగ్నికొడుకు భీమ
సేనుఁడేతెంచియాఁపునో? చాన కుంతి • కాత్మజుండగు దశకంఠుఁ డాపఁగలడొ?
ఇదిగో! నావంకకుఁ జూడుము.

గీ. ఉత్తరింతునా? యీవాఁడికత్తినీదు • కుత్తుకను, బల్లమనఁ దలఁగొట్టి నిన్ను
జంపుదునొ? చావుమూడిన జనుడు బ్రతుక • డెందు; నీవేలపాటిపోయెదవు గోల!

వసం—అయ్యో! అబలను.
విటు—కావుననే రక్షింపఁబడితివి.
శకా—అందుచేతనే చంపఁబడలేదు.

వసం—(తనలో) ఏమీ! వీని యనునయముగూడ భయము పుట్టించుచున్నదే!
కానీ, యిట్లనెదను. (ప్రకాశము) ఆర్యా! నాయెడలి నగలేమైనఁ గావలెనా?

విటు—పాపము శాంతించునుగాక! పూజ్యురాల! వసంతసేన! ఉద్యానలతకుఁ
బూవులు ద్రెంపుదురా? అలంకారము లాసించువారముగాము.

వసం—ఇఁక నివ్వఁదగినదేది?

శకా—నేను వాసుదేవుఁడను, దేవపురుషమనుష్యుఁడను. కావున నన్నుఁగామింపుము.

వసం—పాపము శాంతించునుగాక! చాలుజాలు అయోగ్యప్రశంస చేయకుము, పొమ్ము.

శకా—(చప్పటులు చఱచుచు నవ్వి) బావా! బావా! నే నూరువిడిచి పోతినా,
పురమువిడిచి పోతినా! నన్ను, 'రమ్మ అలసితివి, సొలసితివి' అనుచున్నది.
ఈ భోగముపిల్లకు నాయందే తాత్పర్యమునుమా! పూజ్యురాలా! వసంతసేనా!
మా బావతల నాపాదములకంటించి యెట్టుబెట్టుకొందును, నిజముగా నీవెంటఁ
బడి తిరుగుటచే నలసితిని, సొలసితిని.

విటు—(తనలో) అది 'పాపము శాంతించునుగాక' అనగా, వీఁడు, 'శ్రాంతి
జెందితి' వని తన్నుఁగూర్చి యన్నదనుకొనుచున్నాఁడు. (ప్రకాశము) వసంత
సేనా! నీవనినమాట లంజెవీధిఁ గాఁపురమున్న దనవలసినదికాదుసుమా!

మ. కలిగెంబో భువి అంకుగూడెములు మాకై, సుంతయోజింపుమా
వేలప్రోయాలవుగావఁటే! పథిభవోర్వీజంబు చందంబుగా
వెలచేతం గొనఁదగ్గదీయొడలు; నీవే లంజవా? యందఱన్
వలపున్నన్వలపుండకున్న సమభావంబొప్ప సేవింపుమా.

చ. తెలిసినబ్రాహ్మణోత్తముఁడు దీర్థములాడినబావిఁ గ్రుంకఁడే
పలుచనిమాలఁడున్; నెమిలి వంచినతీఁగను గాకి వంపదే;
పలువురు వాడరే ద్విజులువాడిన యోడను; బావి శ్రీవి, దీఁ
గలవలె, నోడజాడ వెలకామినివై తివి పొందుమందఱన్.

వసం—అనురాగమునకు యోగ్యత కారణముగాని బలాత్కారముగాదు.

శకా—బావా! ఈ గర్భదాసి కామదేవాలయోద్యానమునం దా దరిద్ర చారుద

త్తునిఁ జూచినది మొదలు వానియెడ వలపు దగిలి నన్నుఁ గామింపకు
వానికొంప యీ యెడమచేతిపైపుననే యున్నది కావున నిది మనచేతులలో
నుఱిగిపోకుండఁ జూచుచుండవలయును.

విటు—(స్వగతము) ఈ మూర్ఖుఁ డేది తెలుపరానిదో దానినే తెలుపుచున్నా
ఏమీ, వసంతసేన పూజ్యుఁడగు చారుదత్తుని వలచినదా! బాగుగాను
రత్నము రత్నముతోఁ గలియక గాజుజాతితోఁ గలియునా? ఈ మూర్ఖ
నేమి? ఈమె యతని యింటికే పోవునుగాక. (ప్రకాశము) ఓరీ, కాణేలీ
చారుదత్తుని యిల్లీ యెడమచేతిపైపున నున్నదా?

శకా—అవును, ఈ యెడమచేతిపైపుననే యున్నది.

వసం—(తనలో) అమ్మయ్య! బ్రతికితిని. ఈ దుర్జనుఁ డపకారము చేయ
చియు నా ప్రియుని యింటికి గుర్తుచెప్పి యుపకారమే చేసినాఁడు.

శకా—బావా, బావా! ఈ యంధకారమున మినుములరాశిలోఁబడిన మసిం
వలె, నీ వసంతసేన చూచుచుండఁగనే మాయమైనదోయి!

విటు—ఓహో! అంధకారము దట్టమగుచున్నది.

గీ. అంధకారమ్ము జొచ్చినయంత నా వి • శాలలోచనముల శక్తి సమసిపోయె
గ్రమముగాగ్రమ్ము కారుచీకటుల కతన • గనులు మూసియు దెఱచినగతినెయ

గీ. చదలు కాటుక గురియుచున్నదియొ, లేక • తనువునిండారబూతపూసెనొ త
వ్యర్థమైపోవుచుండె దురాత్మసేవ • చందమున నేత్రములలోని శక్తియొకట

శకా—బావా, బావా! నేను వసంతసేనను వెదకుదును.

విటు—వెదకి కనుఁగొనుటకు గుర్తులేమైన నెఱుఁగుదువా, నీవు?

శకా—బావా! ఏమి గుర్తులవి?

విటు—పూవుదండల పరిమళమును, నగల చప్పుడును.

శకా—మాల్యగంధము వినఁబడుచున్నది కాని ముక్కులలోఁ జీఁకటి ద
వలన నగల చప్పుడుమాత్రము స్పష్టముగాఁ గనంబడుటలేదు.

విటు—(జనాంతికము) వసంతసేనా!

గీ. కన్పడవునీవు సంజచీఁకటిని మెఱపు • మబ్బుకడుపున డాఁగినమాడ్కిఁ గ
పూవుదండలయందలి పొలుపు, నగల • చప్పుడును జెప్పుచున్నవో చకిత
వసంతసేనా! వింటివా!

వసం—(తనలో) వింటిని, తెలిసికొంటినిగూడ. (అందెలూడఁదీసి పూ
పాఱవైచి గోడతడవుచు) గోడతడపుటవలన తెక్కతలుపులగుమ్మమొకటి

కినది. కాని తలుపులు మూయఁబడియున్నవి. నేనేమిచేయుదు?

చారు—చెలికాడా! జపసమాప్తమైనదికావున నీవు గ్రామదేవతలకైబలినిదీసికొనిపొమ్ము.

మైత్రే——నేను వెళ్ళనయ్యా!

చారు——ఎంత కష్టకాలము వచ్చినది!

గీ. మాటవినరింటిచుట్టాలు, మాఱు మొగము వెట్టుదురు మిత్త్రు,లాపదల్వొరలఁగఁ, గ్రాసార్తి
వాఱు, శీలంబు దఱుఁగుఁ, బైఁబడు నితరుల పాపకృత్యంబులును బేదవానికకట

చ. చెలిమియొనర్పఁడెవ్వఁడును, జేరికచేయఁడొకండు, భాగ్యవం
తులగృహ ముత్సవంబులఁ గనుంగొనఁబోవ నిరాకరింత్రు, పె
ద్దలదరికేగ సిగ్గుపడుఁ దాఁ దగువల్వలులేమి, నక్కటా!
యలము దరిద్రతాకలుష మాఱవపాతకమొర గేహికిన్.

మఱియును,

గీ. సుహృదమనియెంచినాలోనఁజొచ్చితీవు మందభాగ్యుండనగునేను మడియునాఁడు
ఘోరదారిద్ర్యమా! యేదిదారి నీకు? నిన్నుఁగూర్చి విచారించుచున్నవాఁడ.

మైత్రే——(తలతెలఁబోవుచు) అయ్యో! ఇఁక నాకుఁ బోకతప్పదు. ఈ రదనికను గూడ నాకుఁ దోడంపుము.

చారు——రదనికా! నీవీ మైత్రేయునితోఁగూడఁ జనుము.

రద——దేవా! చిత్తము సెలవైనఁ బోయెదను.

మైత్రే——రదనికా! నీవీ బలియును దీపమును బుచ్చుకొమ్ము. నేనీ ప్రక్కల తలుపు గడియఁదీసి తెఱచెదను. (తలుపులు తెఱచుచున్నాఁడు.)

వసం——(తనలో) ఎవ్వరో నా కుపకారముచేయు తలంపుతో ప్రక్కలతలుపులు దెఱచుచున్నారు; లోపలికిఁ బోయెదను. (లోనికిఁబోయి) అయ్యో! అయ్యో! దీపము! దీపము! (రదనిక చేతిలోని దీపమును పైఁటకొంగుతో నార్పును.)

చారు——మైత్రేయ! అదియేమి?

మైత్రే——ప్రక్కలతలుపులు దెఱచినవెంటనే ఝుయ్యమనివచ్చిన గాలిచే దీప మాఱిపోయినది. పూజ్యురాలా! రదనికా! నీవీ గుమ్మముపెంట వీథిలోనికిఁబొమ్ము. నేను లోపలివరాండికలోని కరిగి దీపము వెలిగించితెత్తును. (నిష్క్రమించును.)

శకా——బావా, బావా! వసంతసేనను వెదకెదను.

విటు——వెదకుము వెదకుము.

శకా——(ఇట్టటుఁదిరిగి చేతితోఁదడవుచు) బావా! దొరకినది. (విటునిబట్టుకొనును.)

విటు——ఓరిమూర్ఖుఁడ! నన్నురా, పట్టుకొంటివి.

శకా—బావా ! నీవీ వైపున రహస్యముగా నిలిచియుండుము. (చేతులతోఁ ద్రోసి కొనిపోయి నిలువఁబెట్టి, వసంతసేనను వెదకుచు) బావా ! దొరకినది (అని చేటుని బట్టుకొనును.)

చేటు—దేవా ! నేను చేటుఁడను.

శకా—ఓరీచేటా ! నీ వీపైపున నుండుము. (అని మఱియొకమూలకుఁ ద్రోసికొని పోయి నిల్పి) ఈవైపున బావ, ఈవైపునఁ జేటుఁడు. ఈవైపున బావ (అని పదిసారు లనుకొని, గుర్తుంచుకొని, మరలవెదకుచు రదనిక కేశపాశముఁ బట్టుకొని) బావా ! ఇపుడు నిజముగా వసంతసేన దొరకినది.

గీ. కటికి చీఁకటిలోఁగన్ను గానకుండఁ • బోవుతలఁ బూవుదండల తావివలన
నట్టిగుర్తించి కీల్జడ పట్టుకొంటి • యాజ్ఞసేనిని చాణక్యుఁ డట్లు నేను.

విటు—(విచారించుచుఁ దనలో)

క. పరువపుదర్పమ్మునఁ గులపురుషు నభిసరించు పూవుఁబోఁడిని గుసుమో
త్కరభూషితమగు కబరీభరముంగొని రాగుచుండె పాపుం డకటా !

శకా—

గీ. దొరకెనోబాల ! నీవాలభరము నీ శి • రోరుహాభరంబు నీకేశభారమిపుడు
పొగులు, మేడువు, మంగలార్పుము, తలంపు• మీశునో శంభునో శంకరేశ్వరులనొ

రద—(భయముతో) పూజ్యులైన మీకిట్టిపని తగునా ?

శకా—బావా ! బావా ! మీగడ్రమింగిన పిల్లివలె నీలంజ కంఠస్వరము మార్చినది.

విటు—కాణేలీపుత్రా ! కంఠస్వరము మార్చినదిగా ! చిత్రముగానున్నదే ! (ఆలోచించి) ఇందుఁ జిత్రమేమున్నది ?

గీ. అభ్యసించిన దఖిలవిద్యలును, గాక • కాంతయగుచు నటించు రంగస్థలములఁ
గలదు వంచన కులమంద; కాన గంఠ • రవముమార్చుట యొక విచిత్రంబుగాదు.

మైత్రే—(దీపముతోఁ బ్రవేశించి) రదనికా ! ఇదియేమిచిత్రమోగాని యూపస్తంభమునకుఁ గట్టిన మేఁకహృదయమువలె, నీ ప్రదోషమందమారుతముచే నీ దీపము పురపురలాడుచున్నది.

శకా—బావా ! బావ ! ఎవ్వరోమనుష్యులు ! మనుష్యులు !

మైత్రే—(విని) ఇది తగదు. ఇది కూడదు. ఆర్యచారుదత్తునకు నేఁడు దారిద్ర్యము వచ్చినదని పరపురుషు లింటిలోఁ జొచ్చుచున్నారా !

రద—ఆర్యా ! మైత్రేయ ! నాకుఁగలిగిన పరాభవము చూడవేమి ?

మైత్రే—నీకా పరాభవము. మాకా ?

రద——నా పరాభవము మీ పరాభవము కాదా ?

మైత్రే——బలాత్కారప్రసంగమా యేమి ?

రద——అవును.

మైత్రే——నిజముగా !

రద——అయ్యో ! నిజమే.

మైత్రే——భయపడకుము. తనయింటిలోఁ గుక్కకుగూడ శౌర్యమెక్కువగానుండును. ఇఁక మహాబ్రాహ్మణునకు నాకుఁ జెప్పవలయునా ? ఇదిగో ! మావంటివారి యదృష్టమువలెఁ గుటిలముగానున్న యీచేతికఱ్ఱతోఁ బుచ్చిపోయిన ప్రాఁత వెదురుబొంగును బగులకొట్టినట్లు వానితల ప్రక్కలుచేసెదను.

విటు——మహాబ్రాహ్మణ ! సహింపుము, సహింపుము.

మైత్రే——(విటునివంకఁజూచి) ఇతఁడుకాదు దోషి. (శకారునిఁజూచి) వీఁడే యపరాధి. ఓరీ ! రాజశ్యాలకా ! సంస్థానకా ! దుర్జనుఁడా ! నీ కిది తగునటరా, దుర్మనుష్యుఁడా ! చారుదత్తభట్టారకుఁడు నేఁడు దరిద్రుఁడై నఁగావచ్చును గాని, యతని సద్గుణములచే నీ యుజ్జయినీపట్టణమంతయు నలంకరింపఁబడుటలేదా ! ఆ మహాభాగుని యింటికి వచ్చి పరిజనము నిట్లు నిగ్రహించెదవటరా ?

గీ. పరిభవమువచ్చునే పేదవాఁడటంచు • గలిమియును లేమి విధికి నొక్కటియె సూవెః
ద్రవ్యమెంతున్న దగు చరిత్రంబులేని • యతఁడెపో పేదయన, ధనచ్యుతుఁడు కాఁడు.

విటు——(వెలవెలఁబోవుచు) మహాబ్రాహ్మణ ! సహింపుము, సహింపుము ! ఇవి అన్యజన భ్రాంతిచే జరిగినపనిగాని పొగరుఁబోతుదనముచేఁ గాదు.

గీ. వెదకుచున్నార మేమొక్క ముదిత వలచి

మైత్రే——ఈ రదనికనేనా ?

విటు——పాపము శాంతించునుగాక !

అంకుకోలముది, పడుచుపట్టుదియొకర్తు
కన్మొఱఁగెఁ జూచుచుండ నాకాంత ; దాని • భ్రాంతిచేఁగల్గె నీశీలవంచనంబు.

పెక్కువిధముల నిన్నుఁ బ్రార్థించుచున్నాను. నాయనునయము నిరాకరింపకుము. (కత్తి పాఱవైచి కాళ్ళమీఁదఁబడి, అంజలియొగ్గును.)

మైత్రే——సత్పురుషుఁడా ! లెమ్ము. ఎఱుఁగక నిన్ను నిందించిన నా తప్పు సైరింపుము. బ్రతిమాలుకొనుచున్నాను.

విటు——కాదుకాదు. మాదియే తప్పు. ఒక్క యభయమిచ్చెదవా, లేచెదను.

మైత్రే——లేచి చెప్పుము.

విటు——ఈ వృత్తాంతము చారుదత్తభట్టునకుఁ దెలియఁగూడదు.

మైత్రే——నేను చెప్పనులెమ్ము.

విటు——(లేచి)

గీ. ఇదిగో! నీకూర్మి శిరసావహించుచుంటి • బ్రాహ్మణోత్తమ! నీపాదరజముతోడ,
శస్త్రపాణులమయ్యును జంకుచుంటి • మనఘ! గుణశస్త్రభూషితులైనమీకు.

శకా——(అసూయతో) బావా! నీ వెందులకీ దుష్టబ్రహ్మచారి కాళ్ళమీఁదఁ బడెదవో చెప్పుము.

విటు——భయపడితిని.

శకా——ఎవరివలన?

విటు——చారుదత్తుని గుణములవలన.

శకా——ఇంటిలోఁ దినుటకుఁ దిండిలేనివానికి గుణములెక్కడివోయి?

విటు——ఛీ, అట్లనరాదురా!

గీ. మండువేసంగిలోన సమస్తజంతు • వులకు నీరిడి యెండినకొలనుపగిది
రిక్తులను బ్రోవ నతఁడు దరిద్రుఁడయ్యె • గాని యైశ్వర్యమదమునఁ గాదుసూవె.

శకా——ఆగర్భదరిద్రపుఁ దొత్తుకొడుకెవ్వఁడోయి!

గీ. రాధకొడుకింద్రదత్తుడో, రావణుండో, • కాక మును రాముకుఁ గుంతిగనిన ధర్మ
రాజో, లేక యశ్వత్థామయో, జటాయు • పక్షియో, శ్వేతకేతువో, పాండవుండో?

విటు——ఓరిమూర్ఖా! పూజ్యుఁడగు చారుదత్తుఁడురా.

చ. తెలివికిఁ గాఁపురం బతఁడు, దీనులపాలిటి వేల్పుఁజెట్టు, యో
గ్యులకుఁ గుటుంబి, త్యాగమునకుం గని, యెవ్వని నించుకేని నోఁ
బలుకని శీలముం గుణము పౌరుషముంగలమేటి, వానిచే
నిలిచెజగంబు; లట్టి రమణీయచరిత్రుని నీ వెఱుంగుదే!
కావున నిచటినుండి మరలిపోవుదము రమ్ము.

శకా——వసంతసేనను వదలియే పోవుదమా?

విటు——నీ కింక వసంతసేన లేదు.

శకా——ఏల లేదు?

విటు——

గీ. గ్రుడ్డివారికి దృష్టి, రోగులకుఁ బుష్టి • యలసులకుఁ గార్యసిద్ధి, మూర్ఖులకుబుద్ధి,
వ్యసనులకు విద్య, వైరుల కాదరంబు • సరణి నీకు లేదింక వసంతసేన.

శకా——వసంతసేనను దీసికొనిరాకుండ నేను రాను.

విటు—నీ వీ పలుకు లెన్నఁడైన వింటివా లేదా ?

గీ. కట్టుఁగట్టకుఁ గట్టినగజము దొరకుఁ • గళ్లెముబిగించుచోఁ దురగంబు దొరకు
హృదయమునఁ బ్రీతిగల్గిన సుదతి దొరకు • గాని, లేకున్న దానిశక్యంబె పట్ట ?

శకా—నీవు వెళ్ళిన వెళ్ళుము. నేను రాను.

విటు—అటులేని నేను బోవుచున్నాను. (నిష్క్రమించును.)

శకా—బావ వెళ్ళిపోయెనే. (మైత్రేయునితో) ఓరీ, ధూర్తాగ్రేసరా ! కాకికాళ్ళవంటి జుట్టుగల దుష్టబ్రహ్మచారీ ! కూర్చుండుమురా, కూర్చుండుము.

మైత్రే—మేమింతకుమున్నే కూలఁబడియున్నాము.

శకా—ఎవనిచే ?

మైత్రే—విధిచే.

శకా—అటులేని నిలువుమురా, నిలువుము.

మైత్రే—నిలిచెదములే.

శకా—ఎన్నఁడు ?

మైత్రే—మాకు దైవ మెన్నఁ డనుకూలమగునో నాఁడు.

శకా—అటులేని యేడువురా, యేడువుము.

మైత్రే—ఏడ్చుచునే యున్నాము.

శకా—ఎందుచే ?

మైత్రే—దారిద్ర్యముచేత.

శకా—ఓరీ, నవ్వుమురా, నవ్వుము.

మైత్రే—నవ్వెదములే.

శకా—ఎన్నడు ?

మైత్రే—మరల మా చారుదత్తున కైశ్వర్యమువచ్చినపుడు. స్వ. సి.

శకా—ఓరీ, దుష్టబ్రహ్మచారీ ! నీ వా దరిద్రునియొద్దకుఁబోయి, 'ఓయీ ! చారుదత్త ! కామదేవాలయోద్యానమున నిన్నుఁజూచినదిమొదలు నీయందు వలపు దగిలియున్న వసంతసేనయను బోగముపిల్ల, క్రొత్తనాటకమును బ్రదర్శింప ముందువచ్చిన సూత్రధారివలె, నొడలునిండ బంగారునగల నలంకరించుకొని వచ్చుచు బలాత్కరింపఁబడి నీ యిల్లు దూఱినది. దానిం దీసికొనివచ్చి చేతులార నీవే నాకు సమర్పించితివేని నధికారులతోడి వ్యవహారము ముదరకుండఁ జులకనగాఁ దేలిపోదువు. నాకును నీయందు దయగలుగును. లేదేని నీకును నాకును బ్రతికియున్నంతవఱకును విరోధము తప్పదు' అని నాపలుకులు బోధపఱచుము.

ఆ. కూరవరుగుచెడదు, గుమ్మడికాయయుఁ • జెడదు గోమయంబుఁదొడిమఁబూయ
బోదు నీటికూడుఁ బొగచినమాంసంబు • నావిరోధ మెన్నినాళ్ళకైన.

తిన్నగాఁజెప్పుము. కపటముగాఁ జెప్పుము. మాబాలాగ్ర ప్రాసాదవిటంకముననున్న మాకు వినఁబడునట్లు చెప్పుము. లేదేని తలుపుసందునఁబెట్టి నొక్కిన వెలఁగకాయవలె నీతల మడమడలాడించెదను.

మైత్రే—తప్పక చెప్పెదను.

శకా—(అపవారించి) ఓరీ చేటా! నిజముగా బావ వెళ్ళిపోయెనా?

చేటు—అవును వెళ్ళెను.

శకా—అటులేని మనముగూడఁ ద్వరగఁ బోదము రమ్మ.

చేటు—చిత్తము తమరీకత్తిఁ జేతఁబట్టుకొనుఁడు.

శకా—నీచేతనే యుండనిమ్ము.

చేటు—కాదుకాదు. దేవరకత్తి దేవరచేతనే యుండనిండు.

శకా—(తలక్రిందుగాఁ బట్టుకొని)

గీ. తొల తొలంచిన ముల్లంగిదుంపబోలుఁ • కత్తి యొఱనుంచి నా భుజస్కంధమందు
మోచికొనిపోదు నింటికి బొయ్యమనుచు • గుక్కలఱచిన భయపడ్డ నక్కవోలె.

(పరిక్రమించి నిష్క్రమింతురు.)

మైత్రే—రదనికా! నీకు జరిగిన యీ యవమానముఁ జారుదత్తునకుఁ దెలుపకుమా. లేమిచేఁ జివికియున్న యాతనిమనస్సునకు మఱింత ఖేదము కలుగును.

రద—మైత్రేయ! నే నెవతెను? ఏమాటనైన గడుపులోదాచుకొను రదనికనుసుమా!

మైత్రే—మంచిది.

చారు—(వసంతసేనతో) రదనికా! గాలికొఱకు బైటపరుండిన మన రోహసేనునకుఁ జలిపేయును. కావున లోపలఁబరుండబెట్టి యీయుత్తరీయముఁ గప్పుము.
(మైత్రేయుఁడు దెచ్చియిచ్చిన యుత్తరీయము వసంతసేన కీఁబోవును.)

వస్తం—(తనలో) ఈ మహాభాగుఁడు నేను రదనిక యనుకొనెను. ఏమిచేయుదును? (ఉత్తరీయ మందుకొని, యాఘ్రాణించి, తనలో) ఔరా! ఇది జాజిపూలతావులు గ్రుమ్మరించుచున్నది! ఇతని యౌవన మింకను నుదాసీనము కాలేదు. (అపవారించి ఉత్తరీయము కప్పుకొనుచున్నది)

చారు—రదనికా! రోహసేనునిఁ ద్వరితముగా లోనికిఁ దీసికొనిపొమ్ము.

వసం—(తనలో) లోపలికిఁ బోఁదగని నిర్భాగ్యకులముదాననైతినిగదా! ఉఁ.

చారు—రదనికా! మాఱుపలుకవేమి? హా! ఎంతకష్టము!

గీ. మాలవిధిచేత, ధనియైనమనుజుఁ డకట! • భాగ్యహీనుడుగాఁ జేయఁబడినవాఁడు
ప్రాణమిత్రులు శత్రువులౌదు, రెంత • భక్తిగలపరిజనము విరక్తిఁజెందు.
(రదనిక, మైత్రేయుఁడు సమీపింతురు.)

మైత్రే—ఆమె రదనిక కాదు. రదనిక యిదిగో!

చారు—రదనిక యిదియా! మఱి యామె యెవ్వరు?

గీ. తెలియ కొనగిన నాపయివలువక లాఁతి • చెలువదేహము నకట! దూషితముచేసె

వసం—(తనలో) దూషితము కాలేదు. భూషితమేయైనది.

చారు—
తెల్లమబ్బుచే లేఁతచందిరుడు మరుగు • వడినగతి జెన్నుమాసె నీపడతి మొగము.
కానీ, పరకళత్రమును జూడరాదు.

మైత్రే—అయ్యా! ఈమె పరకళత్రముకాదు. కామదేవాలయోద్యానములో నిన్ను జూచినది మొదలు నిన్నువలచిన గుణానురక్తయగు వేశ్యాంగన.

చారు—ఆఁ! వసంతసేనయేనా! (తనలో)

గీ. విభవమంతయుఁబోయిన వెనుక నన్ను • వలచినది కాంత, యిప్పుడీ వనితమీఁద
నాకుఁగల మోహమకట! యణంచుకొంటి • నల్పనరునల్ల నోలె దేహంబునంద.

మైత్రే—అయ్యా! రాజస్యాలకుఁడు, అనగా రాజుగారి యుంపుడుకత్తె తమ్ముఁడు మీతోఁ గొన్నిమాటలు చెప్పుమనియె.

చారు—ఏమి మాటలవి?

మైత్రే—"కామదేవాలయములో నిన్నుఁజూచినది మొదలు వలచియున్న వసంతసేన యను బోగముపిల్ల, క్రొత్తనాటకములో ముందుగావచ్చిన సూత్రధారివలె, నొడలునిండ బంగారుసగ అలంకరించుకొని వచ్చుచు మాచేత బలాత్కరింపఁబడి మీయిల్లు దూఱినది."

వసం—బలాత్కరింపఁబడి యనునక్షరములే నన్ను బ్రతికించుచున్నవి—

మైత్రే—"దానిం దీసికొనివచ్చి చేతులార నీవే నాకు సమర్పించితివేని నధికారులతోడి వ్యవహారము పుదరకుండఁ జులకనగాఁ దేలిపోదువు. నాకును నీయందు దయ గలుగును. లేదేని నాకును నీకును బ్రతికియున్నంతవఱకు విరోధము తప్ప"దని.

చారు—(తిరస్కారభావములో) వాఁడా! తెలివితక్కువవాఁడు. (తనలో) ఈ యువతి దేవతలకు లభింపఁదగిన స్త్రీ రత్నము. కాదేని వాఁడిట్టి చీఁకటి సమయమందు

గీ. రమ్ము నాయింటి కనుచు బేరమ్ములాడ • ద్రవ్యమున కాశపడి పోవఁదలపకున్నె?
సరసవచనంబు లెఱిగియు బురుషపరిచ• యమ్మునకు బ్రౌఢముగ మాటలాడకున్నె?

(ప్రకాశముగా) పూజ్యురాల! వసంతసేన! తెలియక పరిచారికకు నియోగింపఁదగిన పని నియోగించి యపరాధముచేసితిని. ఇదిగో! నా తలయొగ్గి బతిమాలుకొనుచున్నాఁడను.

వసం—ఇట్టి యనుచితవేషముతో వీధికెక్కినందులకు దేవరపాదముల నా తల యంటించి యనుగ్రహింపఁ జేసికొనుచున్నదానను.

మైత్రే—ఓహోహో! పండినవరిచేలవలె మీరిరువురు నొకరిపై నొక రొరిగి నమస్కరించుకొనుచుండ నే నూరకయుందునా! లొట్టిపిట్టమోకాలివంటి నా తల మీ యిరువురి పాదములకంటించి బతిమాలుకొందును. (లేచును)

చారు—చాలు, నీ చనువు నంతట నిలుపుము.

వసం—(తనలో) ఏమీ! ఈ ప్రౌఢోక్తిచాతుర్యము. నే నీవేషముతోవచ్చి యితని ఇంట నిలువరాదు. ఇట్లనియెదను, (ప్రకాశము) ఆర్యపుత్ర! మీకు నాయందు దయగలదేని యీ యలంకారకము మీయింట దాఁచుఁడు. ఈనగ నాయొద్ద నుండెనేని దీనికై పాపాత్ములు నావెంటఁబడుదురు.

చారు—నా యిల్లింత విలువగల నగ దాఁచుటకుఁ దగినదా?

వసం—అబద్ధము. వస్తువులు దాచుటకుఁ బురుషులయోగ్యత కారణముగాని యింటి దిట్టతనము గాదు.

చారు—మైత్రేయ! ఆ నగఁ బుచ్చుకొనుము.

వసం—నాపై దయవచ్చినది (నగనిచ్చును.)

మైత్రే—నీకు శుభము.

చారు—మూర్ఖుఁడ! దాఁచుకొన్నదికాని నీ కిచ్చినదికాదు.

మైత్రే—(అపవారించి) అటులేని దొంగ లెత్తుకొనిపోవుదురు-

చారు—కొలఁదికాలములోనే-

మైత్రే—మనకు దాఁచనిచ్చిన యీనగను....

చారు—మరల నిచ్చివేయుదును.

వసం—ఆర్య! నే నింటికిఁబోయెదను. నాతోఁడ నార్యమైత్రేయునిఁగూడఁ బంపవలయును.

చారు—మైత్రేయా! పోయి యామె నింట దిగవిడిచిరమ్ము.

మైత్రే—నీవు పోయిన రాజహంసి వెంటఁజను రాజహంసవలెనుందువు, నేనేల,

బాపఁడను ? కుక్కలచేఁ జిమ్మఁబడిన నడువీథిలోని బలియన్నమువలె జనులచే నగుబాట్ల పాలగుదును.

చారు——కానిమ్ము, నేనే చనియెదను. రాజమార్గమునఁ గొనిపోఁదగిన దీపమును దెప్పింపుము.

మైత్రే——ఓరీ ! వర్ధమానక ! దీపము వెలిఁగింపుము.

వర్ధ——(రహస్యముగ) చమురులేనిదే నే నెట్లుదీపము వెలిఁగింతునయ్యా ?

మైత్రే——(చారుదత్తునితో రహస్యముగ) మనదీపికలన్నియు, దబ్బంతయు నపహరించి కాముకుల నవతలకుఁ బాఱఁద్రోలిన భోగములంజలవలె స్నేహశూన్యములుగా నున్నవి.

చారు——మైత్రేయ ! దీపమే యక్కఱలేదులే !

గీ. గ్రహగణముతోడ రాజమార్గప్రదీప
మో యనఁగఁ జంద్రుఁ డుదయించుచున్నవాఁడు
పలపలని పంకమందలి పాలువోలె
నిరులలోఁ బడుచుండెఁ జందురునికాంతి.

(అనురాగముతో) వసంతసేనా రమ్ము, పోదము.

(పరిక్రమించి) ఇదిగో ! నీయిల్లు లోనికిఁ జనుము.

వసం——(అనురాగముతోఁ జూచుచు నిష్క్రమించును.)

చారు——మైత్రేయ ! వసంతసేన వెళ్ళినది. మనమింటికిఁబోదమురా.

గీ. కలకలము వాసె రాజమార్గంబులెల్లఁ
బురమునిండఁ దలారులు దిరుగుచుండ్రి
మోసపోకుండఁ బోవలె; దోసములకుఁ
బుట్టినిల్లుగదా యెప్పు డిట్టిరాత్రి.

(పరిక్రమించుచు) ఈ సువర్ణభాండము రాత్రి నీవు దాఁచుచుఁ బగలు వర్ధమానుని చేతి కిచ్చుచుండుము.

మైత్రే——మంచిది..

(ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతంబగు మృచ్ఛకటికమను
ప్రకరణమునఁ బ్రథమాంకము.

మృచ్ఛకటికము.

ద్వితీయాంకము.

చేటి——(ప్రవేశించి) తల్లిచే వసంతసేనకడకు సందేశము పంపఁబడితిని. కావున నామెయొద్దకుఁ బోయెదను. [ఎదుటజూచి] ఇదిగో నార్యురాలు వసంతసేన మనములో నేదియో యాలోచించుకొనుచుఁ గూరుచున్నది. దగ్గఱకుఁబోయెదను.
(పిదప బీటమీద గూర్చుండి వసంతసేనయు మదనికయు బ్రవేశించుచున్నారు.)

వసం——మదనికా! తరువాతఁ దరువాత?

మద——అమ్మా! నేనేమియు జెప్పుచుండుటలేదు. తరువాత దరువాత ననెదవేమి?

వసం——చేటికా! నే నేమంటిని?

మద——తరువాతఁ దరువాతనంటివి.

వసం——ఆఁ! (ఆలోచించి) అగును. అంటిని.

చేటి——(సమీపించి) అమ్మా! మీయమ్మ స్నానముచేసి దేవతాపూజ చేసికొమ్మని చెప్పుమన్నది.

వసం——చేటీ! 'నే నీనాఁడు స్నానము చేయను. బ్రాహ్మణునిచేతనే పూజచేయింపు' మని మా యమ్మతో మనవిచేయుము.

చేటి——చిత్తము (నిష్క్రమించును.)

మద——అమ్మా! స్నేహముచే నడుగుచున్నానుకాని నీ దోషములు వెదకుటకుఁ గాదు. 'తరువాతఁ దరువాత' యేమిటి?

వసం——మదనికా! నేను నీ కెట్లుకనఁబడుచున్నదానను?

మద——శూన్యహృదయురాలవై మనసులో నెవనినో కామించి వానికై విచారించుచున్నట్లున్నావు.

వసం——చక్కఁగఁ దెలిసికొంటివే? పరహృదయగతమునుఁ దెలిసికోఁజాలిన మదనికవుగదా.

మద——అమ్మా! సంతోషము. పడుచువాండ్రకుఁ బండువైన మదనుఁ డనుగ్రహింపఁబడినాఁడు. నీకు సేవ్యుఁడైన యా పురుషుఁడు రాజా, రాజవల్లభుఁడా?

వసం——చేటీ! నేనుకోరునది భోగముగాని సేవకాదు.

మద——చదువుకొన్న బ్రాహ్మణునిఁ గోరితివాయేమి?

వసం——నాచే బ్రాహ్మణులు పూజింపఁదగినవారు.

మద—అనేకదేశములుతిరిగి వర్తకముచేసి డబ్బుసంపాదించిన కోమటిఁ గోరితివా?

వసం—వర్తకులతో స్నేహముచేసినవారు ప్రణయిజనమునందలి స్నేహమువదలి వాణిజ్యమునకై దేశాంతరముపోవునపుడు వియోగదుఃఖ మనుభవించుట కష్టము.

మద—అమ్మా! రాజుకాఁడు, రాజవల్లభుఁడుకాఁడు, బ్రాహ్మణుఁడుకాడు, కోమటి కాఁడు; ఇం కెవరినిఁ గోరితివి?

వసం—నీవు నాతోఁ కామదేవాలయములోనికి వచ్చితివా?

మద—వచ్చితిని.

వసం—వచ్చినచో నీకుఁ దెలిసియేయుండును. న న్నడిగెదవేల?

మద—ఎఱుఁగుదును. నీవు నమస్కరించిన దీవించిన యతఁడేకాదా!

వసం—అతని పేరెఱుఁగుదువా?

మద—అతఁడు కోమటివీథిలోఁ గాఁపురమున్నాఁడు.

వసం—అతనిపేరే నే నడిగినది.

మద—అతఁడా! జగత్ప్రసిద్ధమైన పేరుగల చారుదత్తుఁడేకదా!

వసం—మదనికా! బాగు! లెస్సగాఁ దెలిసికొంటివి.

మద—ఆర్యురాలా! అతండు దరిద్రుఁడని విందుమే!

వసం—కనుకనే కోరితిని. దరిద్రునిఁగోరిన బోగముది లోకములోదూష్యురాలుకాదు.

మద—భర్తృదారికా! పూవులులేని మామిడిచెట్టుమీఁది కాఁడుతుమ్మెదలుపోవునా?

వసం—అవి మధుకరులు గనుక మకరందములేదని పోవు.

మద—వానిఁ గామించితివేని, ఏల వారియింటికిఁ బోరాదు; ఏల యింటికిఁ దీసికొనిరారాదు?

వసం—ఓసీ! నే నీకార్యము తొందరపడి చేసితినేని నతఁడు ప్రత్యుపకారము చేయ లేక పోయితి ననుసందేహముచేఁ దరువాతఁ గంటికే కనఁబడఁడేమో?

మద—అందుచేతనే సువర్ణభాండ మతని కిచ్చితివా?

వసం—చెలీ! నీవు బాగుగాఁ దెలిసికొంటివి.

(తెరలో) ఓరీ! భట్టారక! పదిసువర్ణము లప్పువడి యీజూదగాఁడు పరుగెత్తు చున్నాఁడు. పట్టుకొనుము. పట్టుకొనుము, ఓరీ! నిలువుమురా. నిలువుము.

(పిదప సంవాహకుఁడు అపటీక్షేపముగాఁ బ్రవేశించును.)

సంవా—అబ్బబ్బ! ఈజూదమాడుటకంటెఁ గష్టమయిన పనిలేదు.

గీ. కట్టుగిం ద్రెంపికొని తన్ను గర్దభివలె • మించి గర్దభి నన్ను వంచించె నేఁడు
కర్ణశక్తిచే నల ఘటోత్కచుఁడువోలె • ఘాతితుఁడనైతి శక్తిచే ద్యూతమందు.

గీ. పద్దులనువ్రాయు సభికుని బారినుండి • ఎట్లొతప్పించుకొనివచ్చి యిపుడు రాచ బాటc బడినంత నడ్డమై వచ్చెవాడు • అకట ! యెవ్వరి రక్షింపుమందు నిపుడు.

ఈ సభికుcడు, ద్యూతకారుcడు నన్ను వెదకుచు వచ్చుచున్నారు. కావున నేనిపు డెదురునడకతో నీపాడుదేవాలయముc జొచ్చి యమ్మవారు నయ్యెదను. (అనియట్లు వెనుకకునడచుచు గుడిలోc బ్రవేశించి దేవియుండుచోటగూర్చుండెను)

(అంతట మాథురుcడు, జూదగాcడును బ్రవేశించుచున్నారు.)

మాధు—ఓరీ ! భట్టారక ! పది సువర్ణముల కొఱకుc దగవుచేయcబడి జూదగాcడు పాఱిపోయెc బాఱిపోయె. నీవువానిం బట్టుకోవలయును, బట్టుకోవలయును.

జూద —

గీ. బెదరి పాతాళబిలము దూఱుదువుగాక • స్వర్గమునకేగి దేవేంద్రు శరణమనుచు వేడెదవుగాక నినుబ్రోచు వీరుcడెవcడు ? • బ్రోవదలచిన సభికుcడే బ్రోవవలయు.

మాధు—గీ. జూదరికొలంబునకునెల్ల వాడుదెచ్చి • పాఱిపోయెదవేమిరా పాపి! భీతి నొడలు వడకగ నింక దురోదరంబు • మొనకుc జనుదెంతె సభికుని మోసపుచ్చి.

జూద—(అడుగుజాడ పరీక్షించి) ఇదిగో యడుగులజాడ ! (కొంతదూరముచూచి) అడుగులజాడ కనcబడదేమి ?

మాధు—(చూచి యాలోచించి) ఓరీ ! యడుగులిచ్చట నెదురుగానున్నవి. దగ్గర పాడుదేవాలయముకూడ నున్నది. వాcడు మిగులమోసగాcడు. వెనుక నడకతో నీ దేవాలయముc బ్రవేశించియుండును.

జూద—మనమును బ్రవేశించి చూతము.

మాధు—మంచిది. (అని యిరువురును దేవాలయములోనికిcజొచ్చి యొకరికొకరు సంజ్ఞజేసికొని)

జూద—ఈ బొమ్మ కఱ్ఱబొమ్మ.

మాధు—కఱ్ఱబొమ్మకాదురా, ఱాతిబొమ్మయే (అని కొంతసేపు వివదించి) కానీ, యేదియో యొకటి. మనము జూదమాడుకొందము రా. (యిరువురును జూద మాడుదురు.)

సంవా—(జూదమాడవలయుననుతలంపుచే బుట్టినవికారముల నణంచుకొని తనలో)

గీ. రాజ్యమునుగోలుపోయిన రాజుమనము • భేరికాధ్వనివోలెc గంపింపcజేయు నాసపుట్టించి, జూదంబునందు ధనము • చెడినవానికి మఱల పాచికలరొదయు.

ఆ. పైcడికొండనుండి పడcద్రోయు నెక్కించు జూదమింక నాడరాదటంచు నొట్టువెట్టుకొనియు నుడుగcడు కోకిలారవముc బోలు నక్షరవము విన్న.

జూద—నాదిపందెము; నాదిపందెము.

మాధు—నీదికాదు. నాదిపందెము, నాదిపందెము.

సంవా—(లోనుండి పరుగెత్తివచ్చి) నీదియుఁగాదు, నీదియుఁగాదు. నాది పందెము.

జూద— దొరికితివిరా! దొంగ!

మాధు—(సంవాహకుని బట్టుకొని) ఓరీ! లుప్తదండక! నాపదిసువర్ణములు నాకిమ్ము.

సంవా—ఇచ్చెదనులే.

మాధు—ఇప్పుడిమ్ము.

సంవా—అయ్యో! ఇచ్చెదను. అనుగ్రహింపుము.

మాధు—నాకుఁ బనికిరాదు. ఇప్పుడిమ్ము.

సంవా—అయ్యో! నాతల తిరుగుచున్నది. (అని నేలమీఁదఁ బడును. ఇరువురు గొంతసేపు తన్నుదురు.)

మాధు—ఓరీ! జూదరుల కందఱికి లోకువైతివిరా.

సంవా—(లేచి, యేడ్చుచు) అయ్యో! నేనింక జూదమునకు వెలియైపోతినిగదా! నిజము. ఇది జూదగాండ్ర సిద్ధాంతము. దాటరానిది. నే నీ సొమ్మెచ్చటదెత్తును?

మాధు—ఓరీ! ఎవ్వరినైన జామీ నిమ్ము.

సంవా—మంచిది. (జూదగానియొద్దకువచ్చి) సగమిచ్చెదను. సగము నీవచ్చుకొమ్ము.

జూద—మంచిది. ఆసగమే తెమ్ము.

సంవా—(సభికునొద్దకువచ్చి) అయ్యా! సగమునకు జామీనిప్పించెదను. సగము నీవు వదలుకొనుము.

మాధు—మంచిది. ఆలాగే కానిమ్ము.

సంవా—అయ్యా! నీవు సగము వదలుకొంటివిగదా?

మాధు—ఆఁ! వదలితిని.

సంవా—(జూదగానితో) అయ్యా! నీవు సగమచ్చుకొంటివిగదా?

జూద—ఔను. అచ్చుకొంటిని.

సంవా—అటులేని, నేను బోయెదను.

మాధు—ఎక్కడికేగెదవు. నా పదిసువర్ణము లిచ్చి యేగుము.

సంవా—అయ్యా! పెద్దలారా! చూడుఁడు. చూడుఁడు. ఇప్పుడే సగమునకు జామీ నిచ్చిన సగము వదులుకొందునని మరల సొమ్మంతయుఁ దెమ్మనుచున్నాఁడు.

మాధు—(పట్టుకొని) ఓరీ ధూర్తుఁడా! నేను మాధురుఁడను. నేర్పరినగు నాచెంత నీజిత్తులు పనికిరావు. నాసొమ్ము నాకిచ్చి కదలుము. నాకు జామీనక్కఱలేదు.

నేను వదలుకొనను.

సంవా—ఎక్కడనుండి తెచ్చియిచ్చెదను?

మాధు—నీ యబ్బనమ్మి తీసికొనిరా.

సంవా—నాకుఁ దండ్రిలేఁడు.

మాధు—నీయమ్మ నమ్మి తీసికొనిరమ్ము.

సంవా—నా కమ్మయులేదు.

మాధు—నీవే అమ్ముడువోయి యిమ్ము.

సంవా—అనుగ్రహించి నన్ను రాజవీధికిఁ గొనిపొమ్ము.

మాధు—పదపద. (పరిక్రమించుచున్నారు.)

సంవా—కానిండు. ఆర్యులార! ఎవరైన నన్నుగొని యీ సభికునకుఁ బది సువర్ణము లిచ్చెదరా? (ఆకసమువంకఁ జూచి) నీ వేమిచేయఁగలవని యడుగుచున్నారా? మీ యింటఁగల పనులన్నియుఁ జేసెదను. అడిగి మాటలాడక పోవుచున్నాఁడే! కానీ, యింకొకని నడిగెదను. (మరల నట్లేయడిగి) ఇతఁడు గూడ నామాట వినకయే పోవుచున్నాఁడు, హా! మహాభాగుఁడగు చారుదత్తుని విభవ మంతరించుటఁజేసికదా, యీ మందభాగ్యున కిట్టి దుస్థితి వచ్చినది?

మాధు—ఓరీ! తెమ్ము.

సంవా—ఎక్కడనుండి తెచ్చియిచ్చెదను? (నేలపైఁబడును. మాధురుఁడు లాగును) అయ్యలారా! రక్షింపుఁడు, రక్షింపుఁడు.

(పిదప దర్దురకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

దర్దు—అహా! జూదమనగాఁ బురుషునకు సింహాసనములేని రాజ్యముగదా!

గీ. ఎన్నడైనఁ బరాభవంబెన్న, దొకని • కిచ్చు నొక్కనివలన గ్రహించు ధనము,
ఆయమును గూడబెట్టిన యధిపుమాడ్కి • ద్రవ్యవంతులు చుట్టును దవిలియుంద్రు.

గీ. అర్థమబ్బిన జూదంబునంద యబ్బు • నాలు జూదరికే వశ్యురాలు, కుడువ
నొరుల కీయగజెల్లు జూదరికె, జూద • గానికే పోవు ధనమెల్ల గడియలోన.

గీ. త్రేత సర్వధనమ్ముహరించె, మేను • పావరమ్మున శుష్కించె; బాటఁజూపె
నర్థితమ్మక్కటకట! అంతమున నిటులు • కటముచేఁ గోలుపోయి పొకాలుచుంటి.

(ముందుకుఁజూచి) మా పూర్వసభికుఁడు మాధురికుఁ డిదిగో నిచటనే యున్నాఁడు. కానిమ్ము. తప్పించుకొన వీలులేదు. కావున ముసుఁగువైచుకొని యెద. (అనేకవిధముల నుత్తరీయము గప్పికొని, దానిజూచి)

గీ. నూలుపోగులులే విందు నూఱుచిల్లు • లున్న పెటు గప్పుకొందు నీయుత్తరీయ
మున్న చందమ్మునసె దీని నుంచవలయు • మడతవిప్పిన శోభ కన్పడదు దీన.

ఏల యీ ప్రయాసము ? ఈ దీనుఁడు నన్నేమిచేయఁగలఁడు ?

గీ. ఆకసముమీఁదికై యొక్క యంగఁజాచి • ధరణిమీదను నొక్క పాదంబునిలిపి
యరుణుఁ డెందాకనుండునో యంతదాకఁ • గదలకుండెద జిత్రంబుగతిగ నేను.

మాధు—ఓరీ ! యిప్పింపుమురా, యిప్పింపుము.

సంవా—నే నెవరిచే నిప్పింతునయ్యా ! (మాధురుఁడు లాగుచున్నాఁడు.)

దర్దు—(ముందుజూచి) ఇదియేమి ? (ఆకసమువంకఁజూచి) ఈసభికుఁడీ జూదరి
నమ్మజూప నెవ్వరును సొమ్మిచ్చి విడిపింపరై రనుచున్నారా ? ఈ దర్దురుఁడు
విడిపింపఁగలఁడు. (సమీపించి) తొలఁగుఁడు. తొలఁగుడు. (చూచి) ధూర్తుఁ
డగు మాధురుఁడే ! ఈ లాగఁబడు దీనుఁడు సంవాహకుఁడే !

శా. వ్రేలన్‌జాలునొ కొమ్మలందొదిగి యీభీరుండు నల్లాములుణ
దాళన్‌జాలునొ వీపుగాయపడఁ గ్రిందన్ రాళ్ళపై లాగఁగా
జాలింజెందఁడొ లోదొడల్ గఱచుచున్ శ్వానమ్ము లీడ్వంగ, ని
ట్లేలా ? కోమలగాత్రుఁ డీతనికి ద్యూతేచ్ఛాపరత్వమ్మహో !

కానీ, యీ మాధురుని బ్రతిమాలుకొనియెద. (సమీపించి) మాధురికా !
దండము.

మాధు—(ప్రతినమస్కార మొనర్చుచున్నాఁడు)

దర్దు—ఈ గడబిడ యేమిటి ?

మాధు—ఈ సంవాహకుఁడు మాకు బదిసువర్ణము లప్పువడియెను.

దర్దు—ఇంతియే కదా.

మాధు—(దర్దురుని చంకలోని వస్త్రపుమడత లాగి చూపుచు) చూచితిరా ? అయ్యా
లార ! ఈ చినుఁగులబొంతఁ దాల్చిన యీతనికిఁ బదిసువర్ణములన నెంత
తేలికగా నున్నవో ?

దర్దు—ఓరి మూర్ఖుఁడా ! నీ పదిసువర్ణములు రే పొక్కపందెములోఁ దీర్చివైచెదను.
ధనమ్మున్నవారు మాత్రము సొమ్ము కొంగునఁగట్టుకొని తిరుగుదురా యేమి ?

గీ. సొమ్ము, నీవెంత నీసువర్ణమ్ములెంత ? • ఏమి పోగాలమిది ? ఎవ్వరెవ్వరికిని
నప్పువడరొక్కొ? యీమాత్ర కకట! నిండు • ప్రాణి వధియింతువే? సాటివాని నిట్లు.

మాధు—నాయనా ! పదిసువర్ణములన నీకింత చులకననగా నున్నవేమొ కాని నా
కవియే మహాభాగ్యము.

దర్దు—అటులేని నామాటవిని యింకొక పదిసువర్ణములప్పిచ్చి మరలజూదమాడుము.

మాధు—ఆడిన నేమి ప్రయోజనము ?

దర్దు—గెలిచిన నీయప్పు దీర్చును.

మాధు—గెలువలేక పోయినయెడల?

దర్దు—ఇవ్వఁడు.

మాధు—ఇట్టితగవు చెప్పకుము. ఇంత నమ్మకమున్నవాడవు నీవప్పీయరాదా? నేను జూదములో నీకంతె ధూర్తుఁడను. నే నరువాట యాచకుఁడనటరా? నీతి మాలినవాఁడా! ఎచ్చుతగ్గుమాట లాడకుము. నీకు జడియువాఁడనుగాను.

దర్దు—ఓరి! నీతిమాలినవాఁడెవ్వఁడురా? మరల నను ము.

మాధు—నీవు నీతిమాలినవాఁడవు.

దర్దు—నీతండ్రి నీతిమాలినవాడు. (సంవాహకుని బాటిపొమ్మని సన్నచేయును.)

మాధు—లంజకొడుక! నీ వీలాగుననే జూదమాడితివా?

దర్దు—అవును. ఇటులే యాడితిని.

మాధు—ఓరీ, సంవాహక! నా పదిసువర్ణములు నాకీరా?

సంవా—ఇదిగో! ఇచ్చుచున్నాను. (మాధురుఁడు వానిని లాగును.)

దర్దు—ఓరిమూర్ఖ! నాముందే వాని నిట్లు బాధించెదవేమిరా?

మాధు—ఆఁ! బాధించెదను. (సంవాహకుని లాగి ముక్కుమీఁద గ్రుద్దును. సంవాహకుఁడు ముక్కున నెత్తురుగాఱ మూర్ఛిలును. దర్దురుఁ డడ్డమురాఁగా మాధురుఁడు వానిని దన్నును. దర్దురుఁడు మరలఁ దన్నును.)

మాధు—లంజెకొడుకా! దీనికిఁ దగినఫల మనుభవించెదవులే.

దర్దు—దురాత్మా! నాదారిని నేను పోవుచుండ నన్నుగొట్టెదవుగా! రేపు రాజసభలో గొట్టుదువుగాని.

మాధు—నేను జూచెదనులే.

దర్దు—ఎట్లు జూచెదవు?

మాధు—ఇట్లు (కన్నులు తెఱచును. దర్దురుఁడు వానికన్నులలో దుమ్ముజల్లి సంవాహకుని బాటిపొమ్మని సన్నచేయును. సంవాహకుఁడు పాటిపోవును. మాధురుఁడు కన్నులు నులుముకొనుచు నేలపైఁబడి యేడ్చును.)

దర్దు—(తనలో) ప్రధానసభికుఁడగు మాధురునితో విరోధము దెచ్చుకొంటిని. కావున నే నిచట నిల్వరాదు. ఆర్యకుఁడను గొల్లపిల్లవాఁడొకఁడు ముందు రాజు కాఁగలడని యొకయోగి చెప్పినట్లు నా ప్రియమిత్రుఁడు శర్విలకుఁడు చెప్పెను. నావంటివా రందఱా గోపాలబాలకు నాశ్రయించుచున్నారు. నేనుగూడ వాని యొద్దకే పోయెదను. (నిష్క్రమించును.)

సంవా—(భయముతోఁ బఱువెత్తుచు నెదుటికిఁజూచి) ఎవరిదో యీయిల్లు? వీధి తెక్కల తలుపు తెఱచియున్నది. ఇందుఁబ్రవేశించెదను. (ప్రవేశించి, యచట వసంతసేనంజూచి) అమ్మా? శరణు శరణు.

వసం—భయములేదు. రమ్ము. చేటీ! నీవు తలుపుమూయుము, (చేటి మూయుచున్నది.) అయ్యా! నీ కెవనివలన భయము?

సంవా—అప్పులవాని వలన.

వసం—చేటీ! ఇఁక దలుపులు తెఱవవచ్చును. తెఱవుము.

సంవా—అప్పులవాని భయమన నీమెకింత యలక్ష్యమేమో! అవును లోకమున నిట్లు చెప్పుకొందురుగదా!

ఆ. తనబలంబెఱింగి దానికిఁ దగినంత బరువు మోయుచున్న పురుషుఁ డెట్టి
గహనమునకుఁ బోవుఁగాక విపన్నుండుగాఁడు తొట్రుపడఁ డొకానొకపుడు.

మాధు—(కన్నులలోదుమ్ము తుడిచికొని జూదగానితో) ఓరీ! నా పదిసువర్ణములీరా,

జూద—అయ్యా! మనమా దర్దురకునితో కలహమునకు డీకొన్నపుడే వాఁడు పాఱిపోయె.

మాధు—వానిముక్కు చితుక గ్రుద్దితిని. రక్తము కాఱుచున్నది. ఆ యానవాలు చూచుకొనుచుఁ బోదమురమ్ము. (వెదకుదురు.)

జూద—అయ్యా! వాఁ డదిగో వసంతసేనయింటిలోఁ దూఱెను.

మాధు—అటులేని మనసొమ్ము పోయినది.

జూద—పోవుటయేమి? రాజకులమునకుం బోయి తెల్పుకొందము.

మాధు—మనమిటనుండి కదలితిమా వీఁడు మనకు దొరకఁడు. వీనిం బొంచి యుండియే పట్టుకొందము.

వసం—(మదనికతో సన్న చేయుచున్నది.)

మద—అయ్యా! మీ రెందుండివచ్చితిరి? ఎవ్వరు? ఎవ్వరివారు? ఏవృత్తివారు?

సంవా—అమ్మా! నేను బుట్టినది పాటలీపుత్ర పురము. నేనొక సంసారిబిడ్డను. సంవాహన వృత్తిచే జీవించువాఁడను.

వసం—అతిసుకుమారమైన విద్య నేర్చుకొంటిరి.

సంవా—అదియు నొకవిద్యకదాయని నేర్చితిని. ఇప్పుడదియే జీవనాధారము.

మద—మీరు మిగుల విచారించుచు బదులుపల్కుచున్నారు. తరువాతఁ దరువాత?

సంవా—నేను మాయింటికి వచ్చువారివలన బోధింపఁబడి, క్రొత్తదేశములు జూచు తలంపుతో నీదేశమువచ్చి, యీ యుజ్జయినీపురమునం దొక మహాభాగుని

యింటఁ గొలువునకుఁ గుదిరితిని. (మా యేలికవంటి ప్రియదర్శనుండును ప్రియవాదియు, నుపకారముచేసి తలపనివాఁడును, యాచకులకిచ్చి కొండాడు కొననివాఁడును లోకమున లేఁడు. పెక్కుమాటలేల ? అతఁడు దాక్షిణ్యముచేఁ దనశరీరమును, సంపదను నొరులకై వినియోగపఱచినవాఁడు. శరణాగత వత్సలుఁడు,)

మద—అమ్మా, వసంతసేన ! ఇన్నిసుగుణములను దొంగిలించి యీ పురమలంకరించువారు నీ మనోరథముకంటె నితరు లెవ్వరున్నారు ?

వసం—మేలు, చేటికా ! మేలు. నాడెందము తలంచినటులే తలంచితివి.

మద—అయ్యా, తరువాతఁ దరువాత ?

సంవా—దీనులయెడ జాలిపడి యిచ్చిన దాతృత్వముచే నాతఁ డిపుడు....

వసం—వైభవము కోలుపోయెనా యేమి ?

సంవా—అమ్మా ! చెప్పకయే తెలిసికొంటివి.

వసం—ఇందుఁ దెలిసికోఁదగిన దేమున్నది ? గుణసంపత్తియు ధనసంపత్తియు నొక్కచోట నుండుట యరుదుగదా. మంచినీళ్ళచెఱువులో నీళ్ళు మిగులునా ?

మద—అయ్యా ! ఆయనపేరెవ్వరు ?

సంవా—అమ్మా ! భూలోకచంద్రుఁడగు నాయేలిక పే రెఱుఁగనివారెవరు ? కోమటివాడలోఁ గాపురమున్న ఆ సుగృహీతనామధేయునిఁ జారుదత్తుఁ డందురు.

వసం—(సంతోషముతోఁ బీటదిగి) అయ్యా ! ఈయిల్లు తమదియే. చేటీ ! పీఁట వేయుము. వింజామర పుచ్చుకొనుము. ఆర్యుఁడు మిగుల డస్సియున్నాఁడు.

మద—(అట్లు చేయుచున్నది.)

సంవా—(తనలో) ఆర్యచారుదత్తుని పేరుచెప్పినంతలో నీమె నా కెంత గౌరవము చేయుచున్నదో ! సెబాసు, చారుదత్తా ! సెబాసు. బ్రదుకన్న నీయదియే. బ్రదికియుఁ జచ్చినవారెందఱులేరు ? (ప్రకాశము) అమ్మా ! నా కీ యుపచారము చాలు; నీ వింకఁ గూరుచుండుము.

వసం—(కూర్చుండి) అయ్యా ! అట్టిపుణ్యులకు, సంపదకుఁ జాలదవ్వుగదా !

సంవా—

గీ. సంపదలుచూడ నెవరికిశాశ్వతములు?•యోగ్యులకు గీర్తియొక్క పేయుండు ధనము
పరులబూజించువాడెపో యొరులచేత • నతివిశేషంబుగాఁ బూజలందువాఁడు.

మద—తరువాత నేమిజరిగినది ?

సంవా—నే నా మహాభాగునికాళ్ల పిసుకుచు జీవించుచుండువాఁడను. ఆయన దరి

ద్రుఁడైన పిదప దిక్కులేక, యీజూదముచే జీవించుచుంటిని. ఆజూదమునందు నదృష్టములేమిఁ బదిసువర్ణము లప్పువడితిని.

మాధు—మోసముచేసి దాఁటిపోయితివిగదరా!

సంవా—అమ్మా! అదిగో వారిరువురు నన్ను వెదకుచు వచ్చుచున్నారు. నీవే నాకు దిక్కు.

వసం—మదనికా! నివాసవృక్షము మొఱడగుటచే దానిమీఁదిపక్షులు నాలుగు దిక్కులకును జెదిరిపోయినవి. నీవుపోయి ఆసభికద్యూతకరులకు సంవాహకుఁడే యిచ్చినాడని యీ నగనిమ్ము. (కంకణము దీసి యిచ్చును.)

మద—(పుచ్చుకొని) అమ్మా! చిత్తము. (నిష్క్రమించును.)

మాధు—మోసముచేసి దాఁటిపోయితివిగదరా.

మద—వీరెవ్వరో మీఁదికి జూచుచు నిట్టూర్పు పుచ్చుచున్నారు. ద్వారమువంకకు జూచుచు నేమేమో యనుకొనుచున్నారు. వీరే ఆసభికద్యూతకరులని తలఁచెదను. (సమీపించి) అయ్యా! నమస్కారము.

మాధు—

గీ. మగనిపలునాట్లుగల మోవి సొగసుతోడ • బలుకరించితివిటుఁ జిన్నపడుచువయ్యు
జూచుచుంటివి క్రీగంటిచూపుచెదర • నెవతె? నెవ్వరిదానవే, చిగురుబోడి!
మేము ద్రవ్యవంతులముగా మింకొకచోటికిఁ బొమ్మ.

మద—నీ మాటలుజూడ నీవు జూదగానివలె లేవు. మీ కెవ్వరైన ఋణపడిరా?

మాధు—ఆఁ. నాకొకఁడు పదిసువర్ణము లీయవలెను. వానికేమి?

మద—వానియప్పుఁ దీర్చుటకై మా యేలికసాని యీ మురు గిచ్చినది. కాదుకాదతఁడే యిచ్చినాఁడు. (ఇచ్చుచున్నది.)

మాధు—(పుచ్చుకొని) మంచిది. వాని యప్పు తీరినదనిచెప్పి మరల జూదమాడ రమ్మనుము. (నిష్క్రమింతురు.)

మద—(వసంతసేనయొద్దకువచ్చి) అమ్మా! వారు సంతసించుచుఁ బోయిరి.

వసం—అయ్యా! నీవింక మీవారి నూరార్పఁ బొమ్మ.

సంవా—అమ్మా! మీపరిచారకుడు నేర్చినవిద్య నీయింట సార్థకముచేయించుకొనుము.

వసం—(ముక్కునవ్రేలిడి) ఎవ్వని నిమిత్త మీవిద్య నేర్చితివో, యింతదనుక నెవ్వని శుశ్రూషచేసితివో ఆయనయొద్దనే సార్థకపరచుము.

సంవా—(తనలో) ఆర్యురాలు నా యనునయము నిపుణముగా నిరాకరించినది. ఈమెకు నేనింక నెట్లు ప్రత్యుపకారము చేయగలను. (ప్రకాశము) అమ్మా!

నేనింక జూదమాడను, నాకీ యవమానము చాలును. నేనింక బౌద్ధ సన్యాసినై తిరిగెదను. ఈ సంవాహకుఁడు బౌద్ధసన్యాసి యయ్యెనన్నమాట మాత్రము మఱవకుము.

వసం—అయ్యో! ఇట్టిసాహసము చేయకుఁడు.

సంవా—నే నిశ్చయించుకొంటిని. ఇంకమానను.

గీ. జూదమాడుచు నిందనఁ జొరనివలెఁ • జాటువాటునఁ దిరిగితి సర్వులకును;
బౌద్ధసన్యాసినై నేను భయముడిఁటి • మసలుచుండెద నిఁక రాజమార్గమంద.

(నేపథ్యమునఁ గల్కకలమువిని) ఇదియేమి! (ఆకసము జూచుచు) ఖుంటమోదకమను వసంతసేన దుష్టగజము తిరుగుచున్నదనుచున్నారా? అమ్మయ్యో మా వసంతసేన మదపుటేనుఁగును జూచెదను. (ఆలోచించి) నాకీ మత్తగజముతో నేమిపని? తలచుకొన్నపని నెఱవేర్చెదను. (నిష్క్రమించును.)

(సంతసముతో నపటీక్షేపమున వికటోజ్వలవేషుఁడు కర్ణపూరకుడు ప్రవేశము.)

కర్ణ—వసంతసేన యెక్కడ? వసంతసేన యెక్కడ?

మద—ఓరి దుర్మనుష్యుఁడా! నీకేమి యుపద్రవము వచ్చినదిరా? ఎదుటనున్న యేలికసానియే కనఁబడకున్నది.

కర్ణ—(చూచి) అమ్మా! నమస్కారము.

వసం—కర్ణపూరకా! సంతోషించుచువచ్చితివి, కారణమేమి?

కర్ణ—(సగర్వముగా) అమ్మా! జాగ్రత్తగా వినుము. ఖుంటమోడకము మదించి కట్టుఁగట్టు పెకలించుకొని మావటీనిఁ జంపి జనులెల్ల గందరగోళము జెంద రాజమార్గమునఁ బడినది.

క. వడివడిగఁ జెట్లపై కెక్కుఁడు పిల్లల వీధినాడుకో నీకుఁడు, పో
వుఁడు మేడలలోపలికిఁ విడివడియెన్ మత్తగజము వీధి కవశమై.

ఆ. అందెలూడిపోవ నల్లాడిమొలనూలు జాఱిపోవ మణులుజాఱిపోవ
రాలిపోవుచుండె రతనంపువలయముల్ పఱచుచుండె దంతి పణ్యవీధి.

అనుచుఁ బ్రజలందఱు గోలయెత్తసాగిరి. పిదప నా మత్తగజము వికసించిన పద్మమువలెనున్న యుజ్జయినీపురమునఁ జొచ్చి, కాళ్ళచే దంతములచేఁ దొండముచే గలచి యాడుచుండ నొక బౌద్ధసన్యాసి యెదురుపడియె. వాని దండ కమండలములు పోనడఁచి శీకరములు మొగమునిండఁ జిమ్ముచు దంతముల నిఱికించుకొని పోవుచుండఁ బ్రజలు 'సన్యాసి చచ్చెఁ జచ్చె' నని యుద్ఘోషించిరి.

వసం—(తొందరలో) అయ్యో, ప్రమాదము ప్రమాదము.

కర్ణ—అమ్మా! మఱియేమియుఁ బ్రమాదము కాలేదు. తొందరపడక వినుము. పిమ్మట నా మత్తగజము, తెగిపోయి కాళ్ళవ్రేలాడు సంకెలతోడను, దంతముల సందునఁ జిక్కిన సన్యాసితోడను నిర్నిరోధముగా విజృంభింప, నీకర్ణపూరకుఁడు - కాదు కాదు - మీ యన్నము దిని బలిసిన యీదాసుఁ డంగడిలోనుండి యొక యినుపకోలఁదెచ్చి యా యేనుఁగును మొత్తెను.

వసం—తరువాతఁ దరువాత?

కర్ణ—

గీ. వింధ్యగిరిశృంగమునుబోలె వీధిఁబడ్డ • దంతిని మరల్చి దానిదంతముల నడుమఁ
జిక్కికొనియున్న సన్యాసి జీవనంబు • నిల్పినాఁడు గదమ్మ : యీ నీభటుండు.

వసం—కర్ణపూరక! చాల దొడ్డపనిచేసితివి.

కర్ణ—తరువాత నీ విశాలాపురమంతయు, బరువంతయు నొక్క ప్రక్కనున్న యోడవలె నాప్రక్క కొరగినది. అందొక పుణ్యాత్ముఁడు తన యొడలంతయుఁ దడవికొని యొక్క నగయైనను లేకుండుట యరసి, నిశ్వసించుచు దనమేనిన నున్న యీయుత్తరీయము నామీఁదఁ బడవైచెను.

వసం—కర్ణపూరకా! ఆయుత్తరీయము జాజిపూవులవాసన గ్రమ్ముచున్నదేమో కనుపెట్టితివా?

కర్ణ—అమ్మా! ఈ మదగజగంధమున నేనా పరిమళము గుఱుతింప నేరకున్నాను.

వసం—చిగురునఁ బేరున్నదేమో చూడుము.

కర్ణ—ఏదియో యున్నది. చూడుము. (చేతికిచ్చును.)

వసం—(చదివి) చారుదత్తుఁడుగారిదే! (సంతోషమున మీఁద గప్పుకొనును.)

మద—కర్ణపూరక! ఈ యుత్తరీయ మమ్మగారిమేన నెంత బాగున్నదో!

కర్ణ—ఔను. చాల బాగుగా నున్నది.

వసం—కర్ణపూరక! ఇదిగో నీకు బహుమానము. (ఒకనగ నిచ్చును.)

కర్ణ—మదనికా! ఇప్పు డది మఱింత బాగున్నది సుమా!

వసం—ఈ సమయమునఁ జారుదత్తుఁడుగా రెచట నుందురో?

కర్ణ—ఈ వీధిదారినే యింటికిఁ బోవుచున్నారు.

వసం—మదనికా! మేడముంగలి మీఁదికెక్కి ఆ మహాభాగుని జూతమురా!

(నిష్క్రమించు చున్నారు.)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతంబగు మృచ్ఛకటికమను
ప్రకరణమునఁ ద్యూతకర సంవాహకంబను ద్వితీయాంకము.

మృచ్ఛకటికము.

తృతీయాంకము.

(పిదపఁ జేటుఁడు ప్రవేశించును.)

చేటు—(ప్రవేశించి)

గీ. సుజనుఁడై భృత్యులను దయఁజూచె నేని • పేదవడియును శోభించుఁగాదె నృపతి
పిసినిగొట్టును విత్తగర్వితుఁడు నేని • పరమదారుణుఁడతడు దుష్కరుఁడతండు.

మఱియును,

గీ. దొంగచేల్మేయు నాఁబోతు, దొంగరతుల • కానపడు బొజుంగును, జూదమాడువాని
దుష్టులకు సహజంబగు దుర్గుణంబు • బ్రహ్మకైనను మానిపింపఁగఁదరంబె?

చారుదత్తుఁడుగారు సంగీతము వినఁబోయి చాలసేపైనది. ఇంకనురాలేదు. నడిరేయికూడ దాఁటుచున్నది. వచ్చుదనుక గుమ్మము వెలుపలనున్న సాలలోఁ బరుండెదను.

(పిదపఁ జారుదత్తుఁడును విదూషకుఁడుఁ బ్రవేశింతురు.)

చారు—ఆహాహా! రేభిలుని పాటసొగసు వీణయనఁగా సముద్రములోఁ బుట్టని రత్నమే. ఏలన, ఈ వీణయే.

మ. ఎదుటన్వర్తిలుకాంతపో విరహవహ్నింగ్రాఁగుచో రాగికిన్
మదికింపైన వయస్యసుమ్ము వలప్రేమం గుందుచోఁ గామికిన్
ముద మిచ్చుం బ్రియవిప్రలబ్ధయయి వ్యామోహించుచోఁ గాంతకున్
మదనాటోపము పెంచు నౌషధముసుమ్మా యీగృహస్థాశికిన్.

విదూ—చాలుఁజాలు, రావయ్యా! యింటికిఁబోదము.

చారు—ఔరౌరా! రేభిలుఁడు చాల మంచిపాటఁ బాడెనోయీ.

విదూ—నా కాఁడుదాని సంస్కృతము విన్నను, మగవాని కాకలిగీతము విన్నను నవ్వులాటగా నుండును. ఆఁడుది సంస్కృతభాషఁ జదివినప్పుడు ముక్కుత్రాడు వోసిన యాఁబెయ్యవలె సూ సూ సూ యనును. మగవాఁడు సంగీతము పాడినచో వృద్ధపురోహితుఁడు మెడనిండ నెండిన పూవుదండలుదాల్చి వేదమంత్రములు చదివిన ట్లుండును.

చారు—నీవు సంతోషించితివిగావుగాని యీనాఁటి రేభిలునిపాట చాలమంచిపాట.

గీ. రక్తిగాఁ దీపుగ మనోహరమ్ముగ లలి • తముగ సమముగ భావాన్వితంబుగాఁగ
స్ఫుటముగాఁబాడె లేకున్నఁ బొగడనేల • యువతియేసుమ్ము చాటుగానుండెనేని.

చ. మృదువగు తంత్రిమ్రోఁతకు సమేళముగాఁదగు నోటిపాటతోఁ
బొదలు స్వరప్రచారములు మూర్ఛనలందును దారమధ్యమం
ద్రదశలు చూపి పాడె నవురా యనుచో ద్విగుణంబుసేయుచున్
మది ముద మొందెదున్ వినుట మానియు హా వినుచున్నయట్టులన్.

విదూ—చెలికాఁడా! రచ్చక్రంతలలోని యంగళ్ళలో, కుక్కలుగూడ సుఖముగా నిద్రించుచున్నవి. ఇఁక నింటికిఁ బోదమురా! ఇటుచూడుము. చీఁకటికిగూడఁ గొంతయవకాశ మిచ్చుచున్నవాఁడుంబోలె భగవంతుండగు చంద్రు డాకాశసౌధమునుండి దిగుచున్నాఁడు.

చారు—నిజము.

గీ. తమమునకుఁ దావొసంగ నస్తంగమింప • సాగె నున్నతకోటియై చంద్రరేఖ
నీటిలోమున్గు నడవి యేనికకు నీటి • మీఁద దంతపుఁగొన కొంత మిగిలినట్లు.

విదూ—అయ్య! ఇదిగో మనయిల్లు. (తలుపుదగ్గఱకుఁ బోయి) వర్ధమానకా! వర్ధమానక! తలుపు తెఱువుము.

వర్ధ—(లేచి) మైత్రేయుని కంఠధ్వనివలె నున్నది. చారుదత్తుఁడుగారు వచ్చిరి. తలుపు తెఱచెదను. (తెఱచి) అయ్యా! దండములు. మైత్రేయా! నీకును. ఇదిగోఁ జాఁప. ఇందుఁ గూర్చుండుఁడు.

(చారుదత్త మైత్రేయు లిరువురును గూర్చుందురు.)

విదూ—వర్ధమానకా! రదనికను బిలువుము. కాళ్ళు కడుగవలయును.

చారు—(దయతో) నిదురబోవుచున్నదాని నేల లేపవలయును పోనీ.

వర్ధ—మైత్రేయా! నేను నీళ్ళుతెచ్చెదను. నీవు కాళ్ళుకడుగుము.

విదూ—(కోపముతో) మిత్రమా! చూడు మీతొత్తుకొడుకు నీళ్ళుతెచ్చునఁట. నేను బ్రాహ్మణుఁడను కాళ్ళు కడుగవలెనఁట.

చారు—మైత్రేయ! నీవు నీళ్ళు తీసికొనిరా. వర్ధమానకుఁడే కాళ్ళు కడుగును.

వర్ధ—ఏవయ్యా! నీళ్ళుతీసికొని రమ్ము.

(విదూషకుఁడు నీళ్లు తెచ్చిపోయగా వర్ధమానకుఁడు చారుదత్తుని కాళ్లు కడుగును.)

చారు—వర్ధమానకా! మైత్రేయునికిఁగూడఁ బాదోదకము తీసికొనిరమ్ము.

విదూ—నాకుఁ బాదోదకమేల? మరల దెబ్బలుతిన్న గాడిదవలె భూమిమీద నేకదా దొరలవలసినది.

చారు—మైత్రేయా! నీవును బ్రాహ్మణుఁడవేకదా.

విదూ—అవును. పాములలో దుండుపామున్నది. బ్రాహ్మణులలో నేనున్నాను.

వర్ధ—ఐనను గాళ్ళు కడుగకమానను. (కాళ్ళు కడిగి) అయ్యా! ఇదిగో సువర్ణ భాండము పుచ్చుకొనుము. పగలు నే దాఁచవలసినది, రాత్రి నీవు దాచవలసినది కదా. (అని చేతికిచ్చి నిష్క్రమించుచున్నాఁడు.)

విదూ—(పుచ్చుకొని) ఈ దిక్కుమాలిన సువర్ణభాండ మింకను బోకున్నది. నాసిద్ర నపహరించుచున్న యీ తొత్తుకొడుకు నగను నపహరించుట కింత యుజ్జయినీ పట్టణములో నొక్కదొంగకే కఱవైపోయినదికదా (ప్రకాశముగ) మిత్రమా! దీనిని మన నాలుగిండ్లబవంతి చావడిలో దాఁచెదను.

చారు—వలదు. వలదు.

క. ఈనగ బోగముదానిది గానం దాఁచకుము లోనఁ, గనుగల్గి మెయిన్
బూనఁదగునోయి! క్రమ్మఱ దానితొడవు దాని కిచ్చుదాఁక నునుంగా.

(అని ఆవలించుచు "మృదువగు తంత్రిమోతకు" అను పద్యము జదువును.)

విదూ—చెలికాఁడా! నిదుర వచ్చుచున్నదాయేమి?

చారు—అవును. వచ్చుచున్నది.

గీ. నొసలిపైనుండి మెల్లఁగన్నులకు దిగుచుఁ • బ్రామికొనుచుండె నొడలెల్లఁ బాపినిద్ర
మనుజులకుఁగల్గు బలమెల్ల మాయపఱపఁ • జాలు జరవోలె దా నదృశ్యతవహించి.

విదూ—అటులే నొక్క కునుకు కునుకుదమురా. (అని లోనికింబోయి నిదురింతురు.)

(పిదప శర్విలకుఁడను దొంగ ప్రవేశించును.)

గీ. ఒడలు సుఖముగఁ జోరజాలు వెడఁదగల బి • లంబుబలమున శిక్షాబలమునఁ ద్రవ్వి
సీఁదమూడిచి చనుపాముమాద్రి ప్రక్క • గీరుకొనిపోవుచుండఁగఁ దూఱువాఁడ.

(ఆకసము వంకకుఁజూచి సంతోషముతో) చంద్రభగవానులు గూడ నస్త మించుచున్నాఁడు.

గీ. యామికులు చూతురన్నభయంబుతోడ • నూఁచముట్టుగ నొరులను దోచుకొనఁగఁ
జూచు నను రాత్రి తల్లియై కాచుచుండె • మబ్బుచీఁకట్లఁ జుక్కలు మఱుగుఁపఱచి.

వృక్షవాటికాసమీపమునం జుట్టుప్రహరికి సొరంగముత్రవ్వి లోపలికిం బ్రవేశించితిఁగదా ఇఁక నాలుగిండ్లముంగిటిలోనికిం దూఱవలయును.

ఉ. నమ్మినవారిపట్ల శయనస్థులపట్లఁ బరాభవంబు నీ
చమ్మని యెంచి పల్కుదురు చౌర్యము శౌర్యము కాదటంచు! నే
నమ్మను, మున్ను ద్రౌణి రిపునాశ మొనర్పఁడె రాత్రిపూఁట ని
క్కముగ నొక్కనింగొలుచుకంటెను దొంగతికంబు తక్కువే.

ఇంకఁ గన్నముఁద్రవ్వుటకుం దగిన ప్రదేశముఁ గనుఁగొనవలయును.

చ. తడిసినచోటు గ్రక్కుదలఁ ద్రవ్వినఁ జప్పుడు కానిచోటు నె
వ్వఁడు గనుఁగోనిచోటు సులభంబుగ సంధికిఁ బెద్దరూప మే
ర్పడఁగలచోటు చొడురలిరాలెడు చోటును మేలు స్త్రీలు క
న్పడని ప్రదేశమున్ మిగులఁ బాడగుమేడయుఁ గార్యసిద్ధికిన్.

(గోడఁదడవి) ఎల్లప్పు డెండ నెండి వానను దడసియుండుటచే నిచట గోడకుఁ జవుడు రాలుచున్నది. ఎలుకలుగూడఁ దొలిచినవి. వహవా! నాకార్యము సానుకూలమగును. స్కందపుత్రులమగు మాకు ముం దిటువంటివే కార్యసిద్ధి సూచకములు. ఇఁక సౌరంగ మేరూపముగాఁ ద్రవ్వవలయునో యాలోచింప వలయు. భగవంతుఁడగు కనకశక్తి "పండిటిక లూడదీయుము. పచ్చియిటికలు పగులఁగొట్టుము. మట్టిముద్దలగోడ తడుపుము. బల్లలకూర్పు చీల్చుము" అని కన్నముఁ ద్రవ్వుటకు నాలు గుపాయములు చెప్పియున్నాఁడు. అందిది పండిటి కలగోడ కావున నిటిక లూడదీయవలయు. పద్మవ్యాకోశము, భాస్కరము, బాలచంద్రము, వాపి, విస్తీర్ణము, స్వస్తికము, పూర్ణకుంభము నని యేడుపేర్లు గల కర్మమార్గములలో నిందుఁ బూర్ణకుంభనామధేయంబగు సౌరంగమే త్రవ్వ వలయు.

గీ. ఇరుగు పొరుగుల యిండ్లవారెల్లఁజూచి • బళిర యీదొంగ నేర్పని ప్రస్తుతింపఁ
దొల్లి నేనెన్నిగోడలు దొలిచినాఁడ • నాల్గువిధముల నేఁడు కన్నములుఁగూడ.

వరదులగు కుమారకార్తికేయులకు నమస్కారము. బ్రహ్మణ్యదేవుండును దేవవ్రతుండునగు కనకశక్తికి నమస్కారము. భాస్కరనందికి నమస్కారము. యోగాచార్య గురుచరణారవిందములకు వందనములు. నేనా మహానుభావునకుం బ్రథమప్రియశిష్యుఁడ నగుటంజేసి యోగరోచనయను నొక విద్యను నాకు దయచేసె.

గీ. రక్షకుల కంటఁ బడకుండ రాత్రులందుఁ • గాచుచున్నది యావిద్యగాదె నన్ను
బాకుదెబ్బయు మేనిపైఁ దాఁకకుండఁ • గాచుచున్నది యావిద్యగాదె నన్ను.

(కన్నము ద్రవ్వుచు) అయ్యయ్యో! కొలదారము మఱచిపోతిని. (ఆలో చించి) ఇదిగో జందెమున్నదిగదా! దీనినే కొలదారముగాఁ జేసికొనియెదను. బ్రాహ్మణులకు యజ్ఞోపవీతము పరమోపకారమగు వస్తువు. అందులో నావంటి వానికి మిగుల నుపయుక్తమైనది.

గీ. దీనిచేఁ దల్పుగడె లూడఁదీయవచ్చు • దీనిచే సీల నగలకుఁ ద్రిప్పవచ్చు
దీనిచేఁ గొల్వవచ్చుభిత్తికి సురంగ • దీనిచే పాముపిషమును దింపవచ్చు.

కావున దీనిచేఁ గొలుచుకొని కర్మమార్గము ప్రారంభింతును (కొలిచి, కన్నము త్రవ్వి, దెసలు పరికించి) గోడ యిఁక నొక యిటికవరుస మిగిలినది (అని మరలఁ ద్రవ్వఁబోవుచు) అబ్బబ్బా! పాముకాఁటోలు గఱచినది. (జందె మూడఁదీసి వ్రేలికి జుట్టఁబెట్టి విషబాధ పడుచు దానికి దగిన చికిత్సగావించి) విషబాధ పోయినది (మిగిలినకన్నము త్రవ్వుచు) ఔరా! యింటిలో దీపము వెలుఁగుచు నున్నది. ఎంతకష్ట మెంతకష్టము.

గీ. చత్వరంబున నుండి యీసందిగుండ • దెరలి వెలుఁగుచునున్నది దీపకాంతి
నట్టనడివీధిఁ జీఁకటినడుమ మచ్చు • రాతిపై వెల్గు బంగారుగీఁతబోలె.

(మరల దరువాతిపనిచేసి) సంధి సమాప్తమైనది. కానిమ్ము, లోనికిం బ్రవేశించెద, పోనీ! ముందీకృత్రిమపురుషాకృతి బ్రవేశపెట్టి చూచెదను. (అట్లుచేసి) ఒకఁడును లేఁడు కార్తికేయదేవా! నమస్కారము. (ప్రవేశించి చూచి) వీరె యిరుగురు పురుషులిందు నిదురించుచున్నారు. కానీ! ముందు ఆత్మసంరక్షణార్థము గుమ్మములన్నియు దెరచి యుంచెదను. (తలుపు తెఱవఁబోయి) ప్రాఁతయిల్లగుటచేఁ దలుపు కిఱ్ఱుమనునేమో, నీళ్ళెక్కడ నున్నవో (నాల్గు దెసలు పరికించి నీళ్ళుతెచ్చి తలుపుమీఁదఁ జిమ్మబోవుచు సందేహముతో) నేల మీదఁబడి చప్పుడు కాకయుండునా! కానీ! వీఁపు తలుపునకానించి యెత్తక యెత్తెదను. (అట్లుచేసి) ఇఁక వీరిది మంచినిద్రయో దొంగనిద్రయో పరీక్షింపవలయు (సమీపించి భయపెట్టి) వీరు నిజముగ నిద్రపోవుచున్నారు. ఏమన,

చ. గుఱక సమాంతరంబగుచుఁ గొంకక వెల్వడుఁ, గంటిఱెప్పలుం
దఱుగవు హెచ్చ వింతయును, దారక లల్లలనాడ, వంగముల్
పఱచిన శయ్యదాఁటి వికలత్వముఁజెందె, నివిట్టులుండ ముం
దఱఁగల దీపకాంతి నయనంబులు సైచునె దొంగనిద్రకున్.

(నాల్గుపైపులను జూచి) ఇచ్చట మద్దెలయున్నది. ఈపైపున వీణయున్నది, ఆపైపున బణవమున్నది, ఇవి పుస్తకములు, అమూల పిల్లనగ్రోవులున్నవి, అప్రక్క దర్దురమున్నది. ఇది నాట్యాచార్యుని యిల్లయి యుండునాయేమి. ఇంటిగొప్పఁజూచి మోసపోతిని. ఈ యజమానుఁడు పరమార్థదరిద్రుఁడగునా? లేక రాజభయముననో తస్కరభీతినో ధనము భూస్థాపితముఁ జేసియుండునా. అబ్బే! భూమిలోఁ బాఁతియుంచిన శర్విలకుఁడు కనుఁగొనలేకయుండునా! ఐనను బరిశీలించెదను. (విత్తులుచల్లి) చల్లినగింజలెక్కడను పెరుఁగకున్నవి కావున ధనము పాఁతియుంచలేదు. నిజముగా నితఁడు పరమదరిద్రుఁడే, పోనీ

వెడలిపోయెదను.

విదూ—మిత్రమా! మిత్రమ! ఎవఁడో దొంగ కన్నముత్రవ్వి మనయింటిలోఁ జొరఁబడిన ట్లున్నాఁడు. నీసువర్ణభాండము నీవు పుచ్చుకొనుము. (పలవరించును)

శర్వి—నే నింటఁదూఱితినని తెలిసికొని దరిద్రునియింటికి వచ్చితివేమిరా యని నన్నుఁ బరిహసించుట కాదుగద! (ఆలోచించి) తేలికమానిసి యగుటంజేసి పలవరించుటలేదు గదా! (దగ్గఱకుఁబోయి పరిశీలించి) ఇదిగో! నిజమే. చిరుగు దోవతికొంగున ముడివైచియున్న సువర్ణభాండము దీపకాంతిచే ధగధగ లాడుచున్నది. ఇది దొంగిలించెద. ఛీ! తుల్యావస్థయుఁ దుల్యజాతియుఁ గల వీని బాధింపనేటికి? ఇంకొకయిల్లు దోచుకొనెద.

విదూ—నీ నగ నీవు పుచ్చుకోకున్న గోవుమీఁదను బ్రాహ్మణులమీఁద నొట్టు పెట్టుచున్నాను.

శర్వి—గోబ్రాహ్మణులమీఁది యొట్టు దాఁటరానిది. కావునఁ బుచ్చుకొనియెదను. దీపము వెలుఁగుచున్నదే. దీని ముందార్పవలయు. నందులకై నాయొద్ద నాగ్నేయకీటకమున్నదికదా, దీని వదలెదను. లేకున్న గీటకమును వెంటఁ దెచ్చిన ఫలమేమి. (పురుగును వదలి) వదలినంతనే యీ పురుగు మండలాకారముగా దీపముపయిం దిరిగితిరిగి ఱెక్కలగాలిచే దీపమార్పినది. ఛీ! ఛీ! యీయింటికంతయుఁ జీఁకటితెచ్చి పెట్టితిని. ఈయిల్లే యననేల. యోగ్యమగు బ్రాహ్మణకులమంతయు గటికచీఁకటి పాలుగావించితిని. చతుర్వేదపారంగతుఁడగు బ్రాహ్మణుఁడను; అ బోగముతొత్తు మదనికకొఱకుగదా యిట్టి దుష్కార్యము చేయుచున్నాను. కానీ యీవిప్రుని కోరిక తీర్చెదను. (సువర్ణభాండము గ్రహింపఁబోవును.)

విదూ—మిత్రమా! నీచేయి చల్లగానున్నదేమి.

శర్వి—ప్రమాదమాయెఁగదా! నీళ్ళు తగులుటచేత నాచేయి చల్లఁబడినది. కానీ చంకలో బెట్టుకొని వెచ్చఁజేసెదను. (అట్లుచేసి నగ పుచ్చుకొనును.)

విదూ—పుచ్చుకొంటివా!

శర్వి—నీ వొట్టుపెట్టితివని పుచ్చుకొంటిని.

విదూ—ఇఁక సరకులమ్ముకొన్న కోమటివలె సుఖముగా నిద్రించెదను.

శర్వి—ఓ మహాబ్రాహ్మణుఁడ! నూఱేండ్లు నిదురవొమ్ము. ఛీ! గణికాదాసికొఱకు నాకులమంతయు గళంకితము జేసితిని. నా కులమునకేమి, నాయాత్మను పాపకూపములో బడఁద్రోసికొంటిని.

గీ. నరులకెపుడు మానాభిమానములఁ జంపు • లేమికంటెను బాపంబులేదు జగతిఁ
గూడదనుచును నిందించుకొనుచు మరలఁ • జేయుచుంటిని గటకటా చెట్టసేఁత.

ఇప్పుడు మదనిక దాస్యవృత్తి మాన్పుటకై వసంతసేన యింటికి బోదును. (ఆలించి) చప్పుడువలె నున్నది. వీధిలో యామికులు తిరుగుచున్నారేమో! తిరుగనీ! శర్విలకుఁడ నన్ను యామికు లేమిచేయఁగలరు.

సీ. దాఁటెదఁ బిల్లిచందమునఁ బ్రాఁకెదఁ బాము పగిది మృగంబు నాఁబఱవఁగలను
గుక్కవోలిక మెలఁకువయొ నిద్రయొ గుర్తుపట్టెద దేగనాఁ బట్టుకొందు
మాయకైవడి రూపుమార్చెద మాటలాడెద భాషలెల్ల శారదవిధమునఁ
గలముమాదిరిఁ బోవఁగల నీటిలో ధరాతలముపై గుఱ్ఱమువలె నడచెద

గీ. రేయిఁ జోరనేత్రు పెనుదీపరేఖలీల•సంకటములోర్తు డుడుమంబుసరణిఁ ద్రాఁచు
కొదమగతిఁ బోదు గిరిచాయఁ గదలకుందుఁ•ఖగపతిభాతి మింటిపైఁ బఱవనేర్తు.

గీ. పఱచి గ్రహియింపఁ దోడేలువంటివాఁడ • బలిమిమై మృగరాజును బట్టువాఁడ
సర్వదేశావలోకనసమయమందుఁ • జెవులపిల్లిని నాకేమి చెయిదికొదవ.

రద—(ప్రవేశించి) అయ్యో, అయ్యో! వెలుపటిగుమ్మము సాలలో బరుండువాఁడు వర్ధమానకుండు కన్పడఁడు! మైత్రేయుని బిలిచి యడిగెదను.

శర్వి—(రదనికను జూచి) దీనిం జంపుదునా! (ఆలోచించి) ఆఁడుది పోనీ.

(నిష్క్రమించును.)

రద—(ముంగిలిచొచ్చి భయముతో) అమ్మయ్యో! మనయింటిలో దొంగ కన్నము త్రవ్వి పాఱిపోవుచున్నాఁడు. మైత్రేయుని లేపెదను. మైత్రేయా! లే, లే, మన యింటి కెవ్వఁడో దొంగ కన్నముత్రవ్వి పాఱిపోవుచున్నాడు.

విదూ—(లేచి) ఓసి తొత్తుకూఁతురా! ఏమనుచున్నావు! దొంగవానిని త్రవ్వి కన్నము పాఱిపోవుచున్నదా!

రద—నీయాశ కూలిపోను, వేళాకోళము లాడెదవేమి, నీకంటికిఁ గన్పఁడదా ఏమి!

విదూ—తొత్తుకూతురా! ఏమంటివి! రెండవగుమ్మమంత గన్నము ద్రవ్వినాఁడా? ఓమిత్రమా! చారుదత్త! లే లెమ్మ. మనయింట గన్నము త్రవ్వి దొంగ పాఱి పోయినాఁడు.

చారు—చాలునోయీ పరిహాసము చాలు.

విదూ—పరిహాసము కాదు నీవే చూడుము.

చారు—ఏ ప్రదేశమందు?

విదూ—ఈ ప్రదేశమందు (అని చూపుచున్నాఁడు.)

చారు—(చూచి) ఆహా! ఈ సౌరంగము చూడఁదగియున్నది.

గీ. నడుము వెడఁదగ మీఁద సన్నముగ గుండ • జాడఁ బైనుండి యిటికల నూడఁదీయ
గోడ సందిచ్చి పగిలెను కుజనసంగ • భీతుఁడగు నీతిమంతుని చేతమట్లు.

ఇటువంటి సౌరంగములు త్రవ్వుటయందుఁగూడ నేర్పుండవలయును.

విదూ—అయ్యా! ఈకన్నము దొంగతనము నేర్చుకొనువాఁడో లేక పొరుగూరి వాఁడో త్రవ్వియుండును. కాదేని యీ యుజ్జయినీపురియందు మన విభవమెఱుఁగనివా రెవరు?

చారు—ఉ. కన్నముఁ ద్రవ్వెఁ దస్కరుఁడొకం డెవఁడో పొరుగూరియాతఁ డిం
దున్న జనంబు స్వేచ్ఛఁగఁ బరున్నతెఱంగు నెఱుంగఁ డాయె సం
పన్నుల మన్న యాశ మెయి వచ్చి శ్రమంపడి యిల్లుఁ జొచ్చియుం
జిన్నతనంబుఁ జెంది తన చేసినచేఁతకు నెంతకుందెనో.

ఈ దీనుడు తన స్నేహితులతో "నొక వర్తకునియింటికి రాత్రి దొంగతనమునకు బోతి నేమియు దొరకలేదు" అని యేమని చెప్పునో పాపము!

విదూ—ఏమయ్యా! ఇప్పటికి నాదొంగ చచ్చినవానికై వగచుచున్నావు. వాడీ యిల్లు గొప్పది, సువర్ణభాండమో రత్నభాండమో మనకు దొరకునను పేరాసచే గన్నము త్రవ్వినాడు. (తలపోసి సవిషాదముగ తనలో) ఇంతకు మన సువర్ణభాండ మెచట దాచితివి. (మరల దలపోసి ప్రకాశము) "మైత్రేయుడు మూర్ఖుడు, తెలివిమాలినవాడు" అని యెల్లప్పుడు నన్ను నిందించుచుండు వాడవుగదా! ఈ రాత్రి సువర్ణభాండము నీచేతికొసంగుట తెలివిగలపనికాదా! నాయొద్దనే యున్నచో నాదొంగ తొత్తుకొడుకు తప్పక దొంగిలువాడే.

చారు—చాలులే వేళాకోళము.

విదూ—నేను తెలివిమాలినవాడనే కాని పరిహాసమునకు దేశకాలపాత్రము లెఱుగ ననుకొంటివా యేమి?

చారు—నా కా సువర్ణభాండ మెప్పుడిచ్చితివి?

విదూ—నీయఱచేయి చల్లగా నున్నదేమని యడిగితినే, అప్పు డిచ్చితిని.

చారు—అటులే కావచ్చును. (నలుదెసలు పరికించి సంతోషముతో) మిత్రమా! నీకొక ప్రియవాక్యము చెప్పెద నాలించెదవా!

విదూ—వా డపహరింపలేదుకద.

చారు—అపహరించెను.

విదూ—అటులేని ప్రియమా యిది!

చారు—వాడు కృతార్థుడై చనెను.

విదూ—అది మనది కాదు కద ?

చారు—ఓహో ! న్యాసమా ? (నిర్ఘాంతపడును.)

విదూ—అయ్యా ! ఊరడిలుము. దొంగలెత్తుకొనిపోయిన నీవేమి చేయగలవు.

చారు—(ఊరడిల్లి) మిత్రమా !

గీ. సత్యమెవ్వనికెఱుక నిజముగఁ బ్రజలు • వదరుఁబోతులు తూలనాడుదురు నన్ను
లేమికంటెను లోకువ లేదు జగతి • బడుగుతనమున కొక ప్రతాపంబుకలదె.

ఔరా ! కష్టదినములలోఁ గష్టము.

గీ. ఘాతుకుండగు విధి నన్నుఁ గలిమియెల్ల • బాపి, కావించెఁగాక జీవచ్ఛవంబు
నేఁడు శుద్ధచరిత్రంబు గూడఁ బాపెఁ • బ్రతికియుండుట కింకేది పట్టు నాకు.

విదూ—యిచ్చినవాఁడెవఁడు ? పుచ్చుకొన్నవాఁ డెవఁడు ? చూచినవాఁ డెవఁడు ? అని నే నపలాపము చేయఁగలను, నీవూరకొనుము.

చారు—ప్రకృతావస్థకుం దో డనృతముఁగూడఁ బలుకుమంటివా.

గీ. చివర కే బిచ్చమెత్తి యార్జించియైన • దానినగ విల్వు ద్రవ్యంబు దానికిడుదుఁ
గాని శుద్ధచరిత్రంబు గంగలోనఁ • గలుపఁజాలు నసత్యంబుఁ బలుకఁజాల.

రద—ఈ వృత్తాంతము ధూతాదేవికి విన్నవింతును. (అని వెళ్ళిపోవును.)

(పిదపఁ జారుదత్తునిభార్య ధూతాదేవియు, రదనికయుఁ బ్రవేశింతురు.)

ధూత—(సంభ్రమముతో) చేటికా ! ఆర్యపుత్రునకును మైత్రేయునకు గాయము లేవియు దగులలేదుకద.

రద—అమ్మా ! తగులలేదు. కాని బోగముది యయ్యగారిచేతికి దాచనిచ్చిన సువర్ణ భాండము పోయినది.

ధూత—(నిర్ఘాంతపోవుచున్నది.)

రద—అమ్మా ! ఊరడిలు మూరడిల్లుము.

ధూత—చేటీ ! ఏమంటివి. ఆర్యపుత్రుని శరీర మపరిక్షతమనియా ! చరిత్రము పరిక్షితమగుకంటె శరీరము పరిక్షితమగుటయే మేలు. నేఁ డుజ్జయిని యందలి జనులందఱు దారిద్ర్యముచే నార్యపుత్త్రుఁడే యీకార్యమొనర్చెనని తలంతురు భగవంతుఁడా ! కృతాంతుఁడ ! తామరాకుమీఁది జలబిందువులవలెఁ జంచలములగు పేదవారి అదృష్టముతోడనా, చెలగాటమాడెదవు ! మా సంసారమునకెల్ల మా పుట్టింటివా రిచ్చిన యీ రత్నాలహారమొకటియే మిగిలియున్నది, అది మనస్వియగు నార్యపుత్రున కిచ్చినను బరిగ్రహింపఁడు. చేటికా ! మైత్రేయ

నొకసారి పిలువుము.

రద—అమ్మా మంచిది! (విదూషకుని సమీపించి) ఆర్యమైత్రేయ! ధూతాదేవి సెలవైనది రమ్ము.

విదూ—(సమీపించి) అమ్మా! నీకు శుభమగుఁగాత.

ధూత—అయ్యా! నమస్కారము. పూర్వాభిముఖముగా గూర్చుండుము.

విదూ—పూజ్యురాల! ఇదిగో గూర్చుంటిని. (అని చతికిలంబడును.)

ధూత—అయ్యా! యిది పరిగ్రహించుము.

విదూ—ఇది యేమి?

ధూత—నేఁడు రత్నషష్టియను వ్రతము జేసితిని. అందు, విభవముకొలఁది బ్రాహ్మణునకు దక్షిణ యీవలెను. కాన నీరత్నాలహారమును దక్షిణగా బరిగ్రహింపుము.

విదూ—(పరిగ్రహించి) నీకు స్వస్తి, నేనుబోయి మాప్రియమిత్రునితో దెలిపెదను.

ధూత—మైత్రేయా! నన్ను సిగ్గుపడుదానిఁగాఁ జేయకుమా. (అని వెడలిపోవును) DC.

విదూ—ఔరా! యీ మహానుభావురాలి యోగ్యత! (విస్మయపడును.)

చారు—మైత్రేయుఁ డింకను రాలేదు. మనోదుఃఖముచేత నకార్యమేదైనఁ జేసియుండఁడుగద! మైత్రేయ! మైత్రేయ!

విదూ—(సమీపించి) ఇదిగో! వచ్చితి, నిది పుచ్చుకొనుము.

చారు—ఇదియేమి?

విదూ—తగినపెండ్లమును బెండ్లాడినందులకు ఫలము. RC.

చారు—ఏమీ! బ్రాహ్మణి ననన్నుగ్రహించుచున్నదా? ఎంతదుర్దశ వచ్చినది! నేను నేఁడు గదా దరిద్రుఁడనైతిని.

గీ. విండుదురదృష్టమున దరిద్రుండనైన • నాకు దిక్కయ్యెనే స్త్రీధనంబు తుదకు
ధనములేకున్న పురుషుండుఁ దరుణిసములె•పురుషుఁదేద్రవ్యవతియైనపూవుఁబోఁడి. 2 Tim.
పక్షాంతరమున నేను దరిద్రుఁడనేకాను.

గీ. కల్మిలేములు సరిచూడఁగలుగు భార్య • కష్టసుఖములు పంచుకోఁగల సఖుండు
నాకు దొరకిరి; రిక్తులు నడవలేని • సత్యమార్గంబుఁ గాపాడఁజాలినాఁడ.

మైత్రేయా! నీవీరత్నావళిం దీసికొని, వసంతసేనయొద్దకుంబోయి, 'సువర్ణభాండము నాదేయను నమ్మకముతో జూదమం దోడితిని, దానికి బ్రతినిధిగా నీరత్నావళిం బంపితి' నని నామాటలుగా జెప్పి యిచ్చి రమ్ము.

విదూ—తింటిమా, కుడిచితిమా? దొంగలెత్తుకొనిపోయిరి. అల్పమూల్యమగు నా సువర్ణభాండమునకై చతుస్సముద్రసారభూతంబగు నీరత్నావళి నిచ్చెదవా?

చారు—మిత్రమా ! అట్లనరాదు.

గీ. విలువగల గొప్పనగ దరిద్రులకు మనకుఁ • దరుణి యేనమ్మకంబున దాఁచనిచ్చె
వారకామిని; దాని విశ్వాసమునకు • వింతద్రవ్యంబు మరల నేనిచ్చుచుంటి.

నీవు పట్టుకొనిపోయి యీకున్న నన్ను జంపుకొన్నట్లే. ఎట్లేని నయ్యతివ దీనిం బరిగ్రహించునట్లు చేయవలెను. వర్ధమానకా !

గీ. ఎల్లి ప్రొద్దు రీయూరియెల్లవారుఁ • జేరి పరిపరివిధముల జెప్పికొందు
రీడఁ బదిమంది పదిమాటలాడకుండ • సంది పూడ్పింపు వేగ మిష్టకలచేత.

మైత్రేయ ! నీ వామెతో నకృపణముగా మాటలాడి రావలెనుసుమా.

విదూ—దరిద్రుఁడెప్పుడును నకృపణముగానే యాలోచించును.

చారు—నేను దరిద్రుఁడనుకానోయి ! (కల్మిలేములను పద్యము మరలఁ జదువును.)
నీవు తడయకపొమ్ము. నేను కల్యకరణీయంబులు ముగించి సంధ్య నుపాసించెద.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృత మృచ్ఛకటికమను
ప్రకరణమునఁ సంధిచ్ఛేదమను పేరుగల తృతీయాంకము.

మృ చ్ఛ క టి క ము.

చ తు ర్థాం క ము.

చేటిక—(ప్రవేశించి) అమ్మగారు, చిన్నమ్మగారి చెంతకేగుమని పంపినది ఇదిగో! ఆర్యురాలు చిత్రఫలకముంజూచుచు మదనికతో నేమేమో మంతనము లాడుచున్నది. సమీపించెదను. (పరిక్రమించును)

(యధానిర్దిష్టముగ వసంతసేనయు మదనికయుఁ బ్రవేశింతురు.)

వసం—చేటీ! మదనికా! ఈ చిత్రాకృతి యార్యచారుదత్తుని యధార్థప్రతికృతియేనా?

మద—నిజముగా నార్యునిం బోలియున్నది.

వసం—నీవెట్లు గుర్తించితివి?

మద—నీవు పరమాభిలాషతోఁ జూచుటచేతనే.

వసం—వేశ్యావృత్తిఁజూచుచు, వేశ్యలతో సహవాసము చేయుచుండుటచే నిట్లనుట లేదుగదా?

మద—అమ్మా! వేశ్యవాటిలో నున్నంతమాత్రమున నందఱిచ్చకము లాడుదురా? వేశ్యలు మాత్ర మందఱును గృత్రిమప్రేమఁ జూపుదురా?

వసం—కాదు కాదు. నానాపురుషసాంగత్యముఁ జేయువారగుటచే వేశ్య లలీక ప్రేమము జూపువారే.

మద—అమ్మా! నీదృష్టియు, హృదయము నీచిత్తరువునం దట్లు వ్రాలుచుండ నన్ను వేఱ యడుగవలసిన కారణమేమి?

వసం—చెలికత్తెలు పరిహసింతురేమో యని కొంకుచున్నాను.

మద—చెలికత్తె లెప్పుడును జెలి యాంతరంగికభావము ననుసరించియే వర్తింతురు.

చేటి—(ప్రవేశించి) ఆర్యురాలా! వసంతసేన! 'గవిసెన కప్పియున్న బండి వాకిట నిలిచి యున్నది, కావున దడయక పొ' మ్మని మీయమ్మ నిన్ను నియమించు చున్నది.

వసం—ఆర్య చారుదత్తుఁ డంపెనా యేమే?

చేటి—అమ్మా! ఆ బండి నంపినవారెవరో పదివేల సువర్ణముల వెలగల యొక నగకూడ బంపిరి.

వసం—ఆపంపిన దెవ్వరని యడుగుచున్నాను.

చేటి—రాజుగారి యుంపుడుకత్తె తమ్ముడు సంస్థానకుఁడేనట పంపినది.

వసం—(కోపముతో) ఛీ ఛీ లేచిపొమ్ము; నాయొద్ద నిట్టిమాట లింకనెన్నఁడు నుచ్చరింపకుము.

చేటి—అమ్మా! అనుగ్రహింపుము. మీయమ్మ చెప్పుచున్న మాటలుకదాయని నేజెప్పితిని.

వసం—నేనును నీయం దలుగలేదు; మాయమ్మ మాటలకే కోపించితిని.

చేటి—అటులేని మీయమ్మతో నేమని చెప్పుమనియెదవు?

వసం—నే బ్రతికియుండుట యిష్టమేని యిటువంటి సందేశమెన్నఁడుఁ బంపవల దని చెప్పుము.

చేటి—చిత్తము. (నిష్క్రమించును.)

శర్విల—(ప్రవేశించి)

ఆ. రాత్రికప్రతిష్ఠ రప్పించి రాజభృత్యులను నిద్రతోడ గెలిచియున్న
నాకు శీతభానునకుఁ బోలె భాస్కరోదయమునంద రశ్మి తగ్గె; మఱియు

గీ. పరుఁడు తనయంత నడచుచుఁ బాఱఁజూచె • నేని నాయొద్దకరుదెంచెనేనిగాని
యంతరాత్మ భయంపడు; నకట జగతి•తనకృతంబైన దోషంబు తన్నుఁగలఁచు.

నేను మదనిక కొఱకు గొప్పసాహసముఁ గావించితిని.

చ. విడచితి నాఁడువాండ్రుగల వీఁడనియొక్క గృహంబు. సేవకుల్
గొడగొడలాడ వింటి నొక కొంపకుఁ బోయి. తలార్లఁజూచి యి
క్కడనిలుచుంటిఁ గొయ్యవలె, నిట్టివి కష్టము లెన్నియెన్నియో
పడి, నిశితెల్లవాఱెడి యుపాయమొనర్చితి నల్లనల్లనన్.

(పరిక్రమించుచున్నాఁడు)

వసం—మదనికా! ఈ చిత్రఫలకముఁగొని నాపడుకటింట శయ్యపైనునిచి తాళవృంతము గైకొని వేగ రమ్ము.

మద—మంచిది. (ఫలకము చేతంగొని నిష్క్రమించును.)

శర్వి—ఇదియే వసంతసేన యిల్లు. లోనికిం బోయెద (ప్రవేశించి) మదనిక నాకెచటఁ గన్పడునో! (పిదప విసనకఱ్ఱ చేతఁగొని మదనిక వచ్చుటఁజూచి) ఇదిగోమదనిక.

క. మదనాగ్నితప్తమగు నామదికిం జందనపు జర్చ మానవమూర్తిన్
బొదలు రతిదేవి సొగసున మదనునకుం బరువుదెచ్చు మదవతి యిదిరా!

మదనికా! మదనిక!

మద—(చూచి) ఏమిచోద్యము. శర్విలకుడే! శర్విలకా! కుశలమా. ఏలవచ్చితివి?

శర్వి—చెప్పెదను. (ఒకరినొకరు గాఢానురాగముతోఁ జూచుకొందురు)

వసం—మదనిక యింకను రాలేదు. ఎచటికిఁ బోయెనో! (కిటికిగుండజూచి) ఇదిగో,

నొక పురుషునితో నిది మాటలాడుచున్నది. అందును నిశ్చలమగు స్నిగ్ధదృష్టిచే నాతనిం ద్రాగుచున్నటులున్నది. దీనిం బెండ్లాడి దీని దాస్యము మాన్పింపఁదలఁచిన దీతఁడే కాబోలు, చూడఁగాక, చూడఁగాక, యిటువంటి కార్యములందుం దెవ్వరికి నెవ్వరును బ్రతిబంధకులు కాఁగూడదు, పిలువక కొంతకాల మూరకొందును.

మద—శర్విలకా ! చెప్పుము.

శర్వి—(భయశంకతో నలుదెసలు పరికించుచున్నాఁడు)

మద—శర్విలక ! భయగ్రస్తునివలె నున్నావు, కారణమేమి ?

శర్వి—నీతో నొకరహస్యముఁ జెప్పవలెను. ఈ దాపునం దెవ్వరును లేరుగద ?

మద—ఎవ్వరును లేరు.

వసం—ఏమి పరమరహస్యమో, నేను వినఁదగదు.

శర్వి—మదనికా ! ద్రవ్యమొసఁగినచో వసంతసేన నిన్ను వదలునా ?

వసం—వీరేవో నాపేరెత్తుచున్నారు, ఈ గవాక్షము చాటుననుండి విందును.

మద—నేనీమాట వసంతసేన నడిగితిని, ఆమె యిచ్చయే సాగునేని పరిచారికల నందఱ నూరకయే విడిపింతుననెను. కాని శర్విలకా ! నీకు నన్ను వసంతసేన యొద్దనుండి విడిపించుటకుం దగిన ధన మెక్కడిది ?

శర్వి—క. పడతీ నీయెడగలప్రేముడియును లేవడియు నాకు ముదలయొసంగన్
నడిరేయి నొక్కపాపం బొడికట్టితిగాని తెగువ యుదయింపంగన్.

వసం—సహజప్రసన్నమగు నితని యాకృతి కానిపని చేయుటచే భయంకరముగా నున్నది.

మద—పనికిమాలిన యొకయాఁడుదానికై రెంటిని సంశయములో నుంచితివి.

శర్వి—రెండనఁగా నేదియేది ?

మద—శరీరము, ప్రవర్తనము.

శర్వి—తెలివితక్కువదానా ! సాహసమే లక్ష్మికిఁ గాఁపురము కాదటే.

మద—నీ విందనుక సచ్చరితుఁడ వనిపించుకొంటివి. ఇపుడు నాకొఱకై విరుద్ధ కార్యమేదియుఁ జేయలేదుకద ?

శర్వి—ఉ. సొమ్ములు దాల్చుట స్వికచసూనలతం బురణించు స్త్రీల ద్ర
వ్యమ్మునకై హరింపను సవార్థము ప్రముచ్చిల భూమిదేవవి
త్తమ్ములు దొంగిలన్ నగలుదాల్చిన పిల్లలజోలి కేగఁ; జా
ర్యమ్మునఁగూడ నాకుఁ గనరా వవివేకపుఁ దుచ్ఛమార్గముల్.

గీ. ఇది యొదలికాది యిచ్చి చేయించినట్లు • నీకు దగియున్న వస్తువో నీరజాక్షి
కాన దీనినిఁగడు నప్రకాశముగ ధ • రింపుమా ! నాయెడలఁగల్గు పెంపుజేసి.
అని వసంతసేనతో విన్నవింపుము.

మద—అలంకారము బయటఁ బెట్టునది కాదనియు నది దాల్చునది వసంతసేన యనియు నుడువుచున్నావు. ఈరెండును నసంబద్ధములే. ఏది ! చూపు మా నగ యొకసారి చూచెదను.

శర్వి—ఇదే యలంకారము. (అని బెదురుచుఁ జూపుచున్నాఁడు)

మద—ఈ నగ యెన్నఁడో చూచినయట్లే యున్నది. నీ వెచటినుండి తెచ్చితివో వాక్రుచ్చుము ?

శర్వి—మదనికా ! నీ కదియంతయు నేల ? ఇది స్వీకరింపుము.

మద—(కోపముతో) నాయందంత నమ్మకమేలేనియెడల న న్నెట్లు పెండ్లాడెదవు.

శర్వి—ఇది చారుదత్తుఁడను విప్రవణిజుని నగయని నేను ప్రొద్దుటఁ గోమటివాడలో వింటిని.

(వసంతసేనయు మదనికయు నిరువురును మూర్ఛిల్లుచున్నారు.)

శర్వి— మదనికా ! ఊరడిల్ల మూరడిల్లుము.

గీ. ఒడలు విడిపోవగ విషాదపడెదవేల • వెడదకనుదోయి మిడిగ్రుడ్లుపడగ నేల
దాస్యపుంజెఱమాన్పింప దలచినాడ • గంపమేల ననుఁ గటాక్షింపవేల.

మద—(తెలివితెచ్చుకొని) సాహసికా, నా నిమిత్త మీ యకార్యముఁ గావించిన నీ వా యింట నెవ్వరినేనిఁ జంపలేదు కద ? ఎవరికైనాయమేనిఁ గాయము చేయ లేదుకద ?

శర్వి—మదవతీ ! ఈ శర్విలకుఁడు భయపడ్డవానిని నిదురవోవువానినిఁ దాడింపఁడు సుమా ! నేనెవ్వరినిఁ గొట్టలేదు. చంపనులేదు.

మద—నిజమేనా !

శర్వి—నిజము. నిజము.

వసం—(తెలివి తెచ్చుకొని) బ్రతుకు జీవుఁడా ! నీకేమియాపదయు జరగలేదఁట.

మద—ప్రియమే.

శర్వి—(అసూయతో) మదనికా! ప్రియమే యనగా నర్థమేమి ?

గీ. సజ్జనశ్లాఘ్య మగునింట సంభవించి • చలిపినాఁడఁ గువృత్తి నీవలపుఁదగిలి
మాన మున్నది సుగుణంబు మాయమైన • వదలెదే? మిత్రునను లాతివలపుదగిలి.

క. ఆమూలాగ్రము పండిన భూమీజము లౌర ధనికపుత్రులు వేశ్యా
భామాబకములు నేరినచో మొరడులు గావు పేమిచోద్యము జగతిన్ ?

గీ. ఇంధనంబులు ప్రేమానుబంధనములు • పైకెగయుచుండు నిధువనజ్వాలలెందు
నట్టిఘనమైనకామాగ్నియందు యౌవ • నములుధనములువ్రేల్చుచున్నారు జనులు
వసం—వీని కసమయావేగము కలుగుచున్న దేలొకో!
శర్వి—ఎన్నివిధములచేతనైనను-
గీ. కొమ్మలందును సిరులందు నమ్మకంబు • పూనువారలెపో బుద్ధిలేనినరులు
పడతులైనను సిరులైనఁ బాపపూప • కన్నియలయట్ల దిరుగు వక్రంపునడల. R.C.
గీ. వలపు నిలుపఁగరాదు కోమలులయందుఁ • బరిభవింతురు వలచినవాని స్త్రీలు
తరుణియే తన్ను వలచిన దానివలపు • నడపవలయును లేదేని గడపవలయు.
ఈ మాట మిగుల లెస్సమాట:—
క. సొమ్మిచ్చిన నవ్వింతురు నమ్మింతురు గాని ప్రియులనమ్మరు కులశీ
లమ్ములు గలవారికి రోకొమ్మలు కట్టా! శ్మశానకుసుమము లేలా!
మఱియును.
క. వలపునకు సంజచాయలు, నిలుకడకుం గడలి యలలు నిరసింతురు వే
శ్యలు కలధన ముడిపి నిరర్థుల లత్తుక పిడుచుకొనిన దూదివిధమునన్.
స్త్రీలనగాఁ గేవలము చంచలస్వభావము కలవారు.
గీ. హృదయముననొక్కపురుషునిచ్చగింత్రు • చూపుచేనొక్కపురుషునిజూచుచుందు
రొకనియందు మదప్రసేకోదయంబు • తుదకు వేఱొకడొందు సంగమువిందు.
ఇది యేకవి నుడివిన సూక్తమో మిగులఁ గొనియాడఁదగినది.
గీ. కమలలత మొల్వ దద్రిశిఖరమునందు • బరువుమోయదు ఖరము లశ్వములపగిది
యవలు పండవు శాలిదాన్యంబువలన • బడుపుగూడెములోఁ బతివ్రత కలుగదు. R.C.
ఓరీదురాత్మ! చారుదత్తహతక! నీ వెంతవాఁడవైన నగుదువురా! (అని
కొన్ని యడుగులు నడచును)
మద—(ఉత్తరీయము కొంగు లాగుచు) ఓయీ! అసంబద్ధప్రలాపము సేయుచు
గోపింపఁ దగనివానిపైఁ గోపించెదవేల?
శర్వి—ఇం దసంబద్ధప్రలాపము లేవి? కోపింపఁ దగనివా రెవరు?
మద—ఈ యలంకారము మా యమ్మగారిదిసుమా.
శర్వి—అయిననేమి?
మద—దాని నాయనయొద్ద దాఁచనిచ్చినది.
శర్వి—ఎందులకు దాఁచనిచ్చినది?
మద—(శర్విలకుని చెవిలో రహస్యముఁ జెప్పుచున్నది.)

శర్వి—(తెల్లతెల్లఁబోవుచు) ఔరా ! ఎంతపనిచేసితిని !

గీ. ఎండవేఁడి సహింపలే కెట్టకేల • కాశ్రయించితి నేకొమ్మ విశ్రమింప
దాని రెమ్మలనే పత్రహీనములుగఁ • జేసికొంటిని కటకటా ! చెడుగ నగుచు.

వసం—ఏలొకో యితఁడు సంతప్తుఁ డగుచున్నాఁడు. ఆర్యపుత్రుని యిల్లని యెఱుఁగకే యీ దొంగతనముఁ గావించియుండును.

శర్వి—మదనికా ! ఇఁకఁ జేయవలసినదేమి ?

మద—అందులకును నీవే పండితుఁడ వాలోచించుము.

శర్వి—కాదు కాదు, నీకన్న నాకెక్కువ తెలియదు.

గీ. కూడునీపని యీపని కూడదని వి • చారణము సేయఁజాలిన చతురిమంబు
ముదితలకుసాజమైయుండుఁ;జదువువలనఁ•గానిపురుషులెఱుంగరోకమలనయన.

మద—నాకుందోఁచినగతిఁ జెప్పెదవేనిమరలనీనగయామహానుభావులకే సమర్పింపుము.

శర్వి—అటులేని నన్నతఁడు న్యాయాధిపతియొద్దకుం గొనిపోయి శిక్షింపఁజేయునేమో!

మద—వెఱ్ఱివాఁడా ! చంద్రుఁ డెండఁగాయునా !

వసం—సెబాసు, మదనికా ! సెబాసు.

శర్వి—మదనికా !

చ. అతనిగుణంబు లేలకొనియాడెదవే ! నగయిచ్చుపట్ల దు
ర్గతి యగునంచు లో జడుపుగాని విషాదముగాని లేదు ; కు
చ్చితమగు నామనంబునకు సిగ్గు చిరంబుననుండి లేదు ; దు
ర్మతులగు మాదృశాధముల రాజు లిఁకేమి యొనర్తు రంగనా !

అయిననుజోరనీతికీపనివిరుద్ధముకావునఁగొండొకయుపాయమాలోచింపుము.

మద—అటులే నిది రెండవ యుపాయము.

వసం—ఈరెండవయుపాయ మేమయియుండునో !

మద—ఆ మహానుభావుని సంబంధివై యీనగ వసంతసేనకే యిమ్ము.

శర్వి—అటులిచ్చిన నేమగును ?

మద—నీవు దొంగవు కాకపోవుటయేకాక చారుదత్తభట్టారకుఁడు ఋణవిముక్తుఁడగును. వసంతసేన నగ వసంతసేనకు దొరకును.

శర్వి—ఇది మఱింత సాహసకార్యముకాదా !

మద—కాదు. ఇంకొకవిధ మేమైనను సాహసకార్యము.

వసం—మేలే మదనికా ! పరిచారికకుం దగనియూహ యూహించితివి.

శర్వి—బాపురే మదనికా !

గీ. నిన్ననుసరించుటం జేసి నెలఁత నాకుఁ • గూడ దుర్మతి వదలి చేకూరె సుమతి
సులభముగ వచ్చునే దారిఁ జూపువాఁడు • నష్టచంద్రాతపంబగునాఁటిరాత్రి.

మద—నీ వీ మదనదేవాలయంబున ముహూర్తము నిలువుము. నేనుపోయి వసంతసేనకు నీరాక యెఱిఁగించెద.

శర్వి—మంచిది.

మద—(వసంతసేనను సమీపించి) అమ్మా! చారుదత్తభట్టారకుని యొద్దనుండి తత్సంబంధియగు బ్రాహ్మణుఁ డొకఁడు వచ్చి ద్వారమందున్నాఁడు.

వసం—మదనికా! ఆర్యపుత్రుని సంబంధియని నీవెట్లెఱింగితివి?

మద—మనవారినే నెఱుఁగనాయేమి?

వసం—(తనలో తలయూచి నవ్వుచు) సెబాసు! (ప్రకాశము) రమ్మనుము.

మద—(పోయి) రావయ్యా శర్విలక! (పిలిచి యతనితోఁ బ్రవేశించును.)

శర్వి—(తెలతెల్లపోవుచు) ఆర్యురాలా! నీకు శుభమగుఁగాక!

వసం—ఆర్యా! నమస్కారము. అపీఁటమీఁదఁ గూర్చుండుము.

శర్వి—"నాయిల్లు ప్రాఁతదగుటచేత రక్షించుటకష్టముగానున్నది. నీవే పుచ్చుకొని కాపాడుకొనుము" అని చెప్పి చారుదత్తభట్టు నీ నగ నీ కిచ్చి రమ్మనియె. (అని మదనికచేతి కా నగ యిచ్చి వెడలిపోఁబోవును.)

వసం—అయ్యా! ఏనుగూడ నొకవార్త చెప్పెద. అది యార్యపుత్రునితో విన్నవింపవలయును.

శర్వి—(తనలో) అక్కడకుఁ బోవువాఁ డెవఁడు? (పైకి) ఆసందేశ మేమని?

వసం—మదనికను మీవెంటఁ దీసికొనిపొండు.

శర్వి—నీభావము నాకు గ్రాహ్యమగుటలేదు.

శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషానిలయము

వసం—పోనీ! నేనే తెల్పెదనులే.

శర్వి—ఏమని?

వసం—ఈయలంకార మేపురుషుఁడు నీకుఁ దీసికొనివచ్చియిచ్చునో దాని కీమదనిక నిచ్చి పెండ్లిచేయుమని ఆర్యపుత్రుఁడు నాతోడ సెలవిచ్చెఁగావున దీనిం బరిగ్రహించి పరిగ్రహించితి నని విన్నవింపవలయును.

శర్వి—(తనలో) ఈవసంతసేన నావృత్తాంత మెఱిఁగెనా యేమి? (ప్రకాశముగ) బలా! చారుదత్త!

గీ. సద్గుణంబులులేని భూజానియేని • సద్గుణంబులు గలయకించనునితోడఁ
బురుడుకాఁజాలునే? కానపురుషుఁడెపుడు•సద్గుణములకె యత్నంబునలుపవలయు.

గీ. మంచిగుణములు గల్గిన మనుజులకు న • సాధ్యమగుకార్యముండునే జగతియందు
అట్టిముక్తాంటితలకుఁబూవగుటయందుఁ • గారణముచందురునిగుణగణముకాదె.

వసం——ఎవఁడురా బండివాడు ?

బండివాఁడు——(ప్రవేశించి) అమ్మా! బండి సిద్ధముచేసి యుంచినాను, యేమి సెలవు?

వసం——చేటీ! మదనికా! నన్నదృష్టవతిని జేయుము. నిన్నీవిప్రున కిచ్చితిని. పోయి బండి యెక్కుము, నన్నుమాత్రము మఱవకుము.

మద——అమ్మా! నన్ను వదలుచుంటివా. (యేడ్చుచుఁ బాదములపైఁబడును.

వసం——(లేవఁదీసి) మదనికా! నేఁడు నీవే వందనీయవైతివి. ఏడ్వకుము పొమ్మ. బండి యెక్కుము. నన్ను మఱవకుము.

శర్వి——భగవతీ! నీకు శుభమగుంగాత మదనికా!

గీ. ఎచటఁబారికవైయున్న హేతువునఁ ద • టస్థమయ్యెను నీకుఁ గోడలను పదము
పరమపావని యాభాగ్యవతికి ముందు • వందనముఁచేసి సౌభాగ్యవతివి కమ్మ.

(మదనికతో బండినెక్కును.)

(తెరలో) ఎవరురా అచ్చట? "గోపాలబాలకుం డార్యకుఁ డనువాఁడు రాజగునని సిద్ధుఁడు నుడివిన పలుకులకు జడిసి పాలకమహారా జతని వ్రేపల్లెనుండి రావించి కారాగారమునందు బంధించెనని మీరంద ఱెఱిగినదియే కదా. కావున మీరు మీ మీ పనులయందు జాగరూకులై యుండుఁడు" అని రాష్ట్రియుఁడు శాసించుచున్నాఁడు.

శర్వి——(విని) ఏమీ! పాలకమహారాజు నాప్రియమిత్రు నార్యకుని బందీకృతు గావించెనా! హా! హా! ఎంతకష్టము! అతనియొద్దకుఁ బోకుండఁ గళత్రసహితుఁడనై యుంటిని కానిమ్ము.

గీ. స్నేహితుండొక్కరుఁడుదరుణియునొకర్తు • నిర్వ్యరేకద జనుల కీయుర్విప్రియులు
మానినీమణు లొక వేయిమందికంటె • నిట్టివేళల ప్రియుఁడు సుహృత్తముఁడు.

(అని బండిదిగును.)

మద——(కన్నీరుజాఱ) ఆర్యపుత్రా! నేఁడు పోఁదగదు. నన్ను గురుజనులయొద్ద దించి పిదపఁ జనుము.

శర్వి——బాగు ప్రియురాలా! బాగు. నామదినున్నట్లే పలికితివి. బండివాఁడా! నీవు రేభిలుని యిల్లెఱుఁగుదువా?

బండి——అయ్యా! యెఱుఁగుదును.

శర్వి——ఈమె నాయిల్లు చేర్చుము.

బండి—చిత్తము, చిత్తము. సెలవు తప్పక కావించెదను.

మద—ఆర్యపుత్రుఁడుమాత్ర మప్రమత్తుఁడై యుండవలయును. (నిష్క్రమించును)

శర్వి—నే నిపుడు—

చ. అవమతి జేనిచేఁ గనిన యయ్యయిభృత్యులఁ, గోడెకాండ్ర, బం
దువుల, భుజార్జితాప్రతిమదోర్బలశాలుర, మిత్రవర్గమున్
రవులఁగఁజేసి మున్నదయనప్రభుఁ దత్సచివుండువోలె, బం
ది వనటఁ గుందు నార్యకుని నే విడిపింతు జగమ్ము మెచ్చఁగన్.

గీ. ఎగ్గు రాఁబోవునంచు నిర్హేతుకముగఁ • దివిరి మన్మిత్రు నెవఁడు బందీకరించె
వాని చెఱనుండి విడిపింతువాని నేఁడు, • రాహుముఖముననుండిచంద్రమునివగిది.

(నిష్క్రమించును.)

చేటి—(ప్రవేశించి) అమ్మా! నీపుణ్యము మంచిది. చారుదత్తభట్టారకునియొద్ద నుండి యొక బ్రాహ్మణుఁడు వచ్చినాఁడు.

వసం—చేటీ! నేఁ డెంతసుదినమో! సాదరముగాఁ దోడితెమ్ము, బంధులునిఁ గూడ వెంటఁగొనిరమ్ము.

చేటి—సెలవు నిర్వర్తించెదను. (అని నిష్క్రమించును.)

(పిదప బంధులునితోడను జేటితోడను మైత్రేయుఁడు బ్రవేశించును.)

మైత్రే—ఆహాహా! మున్ను రాక్షసరాజగు దశవదనుఁడు చిరకాలము తపమాచరించి పుష్పకమను విమానము సంపాదించి తిరిగెను. నే నేతపముఁ జేయకుండఁగనే నరనారీమయమగు విమానముమీఁదఁ దిరుగుచున్నాను.

చేటి—అయ్యా! ఇది యింటిసింహద్వారము. ప్రవేశింపుము.

మైత్రే—(ప్రవేశించి యబ్బురముతో) ఔరౌరా! వసంతసేనయింటి సింహద్వారము సొగసు! ఈప్రదేశమంతయు సలిలముతోఁదడిపి, తుడిచి, పచ్చగా నలికి, వివిధ పుష్పోపహారము లుంచినపగిదిఁ జిత్రించిరి. దీని శిఖర మాకాశమును దలయెత్తి చూచుచున్నటులున్నది. ఐరావతము తొండమంతలేసి మల్లెపూలదండలు ముత్యాల పేరులవలె వ్రేలాడుచున్నవి. ఈ ద్వారతోరణమంతయు దంతిదంతమయమే! రత్నమయంబులగు పరివేషములతోఁగూడిన యీ ధ్వజపటంబు లనిలవశమున నల్లలనాడుటఁజూడఁ జూడరమ్మని నన్నుఁ జేరబిలుచుచున్నట్లున్నవి. పచ్చని మావిచివుళ్ళతోడి మంగళకలశములు నిలువు రతనంపుఁ గంబములు నిల్పిన యరంగులపై నిలిచి కన్నులపండు వొనర్చుచున్నవి. పెద్ద రాక్షసుని రొమ్మువలె దుర్భేద్యమైన యీ తలుపుతెక్కలపై సందులేకుండ వజ్రములు తాపిరి.

బాపురే! దరిద్రులకు మనోరథంబులను గుప్పకూరలుగా నుప్పతిలఁజేయుచు మావంటి మధ్యస్థుల చిత్తములనుగూడ నాకర్షించు దీనియంద మేమిచెప్ప!

చేటి—అయ్యా! ఇది మొదటియంకణము. ఇందుఁ బ్రవేశింపుఁడు.

మైత్రే—(ప్రవేశించి నాల్గువంకలఁగలయఁజూచి) బాపురే! చంద్రునివలె శంఖము పగిదిఁ దామరతూఁడులవలెఁ దీర్చి సింగారించిన ముగ్గులచేతను నడుమ నడుమ నవరత్నములు తాపడముచేసిన బంగారు సోపానములచేతను బ్రకాశించుచున్న యీ మేడలు ముత్యాలదండలచే నలంకరింపఁబడిన స్ఫటిక శిలామయవర్తుల వాతాయనముఖంబుల నుజ్జయినీసౌందర్యము నవలోకించుచున్నవని తలంచెదను. సుఖపడు వృద్ధశ్రోత్రియునివలె నీ దౌవారికుఁడు కునుకుపాట్లు పడుచున్నవాఁడు. పెరుఁగులోఁ గలిపిన యీ బల్యన్నమునుగూడ నున్నపుముగ్గులనియెంచి కాకులాదరి కేగకున్నవి. చేటికా! ఇంకను లోపలికి దారిఁ జూపుము.

చేటి—అయ్యా! ఇది రెండవమొగసాల; ప్రవేశింపుఁడు.

మైత్రే—(ప్రవేశించి) అయ్యారే! లెస్సఁగ బలిసిన బండిగిత్తలు మెసవుచున్న యవసబుసమును దగ్గరనుండి తత్సంరక్షకులు ప్రోవుచేయుచున్నారు. కొందఱు గిత్తల కొమ్ములకు నునుపునకై నూనియ రాయుచున్నారు. ఈ దున్నపోతు అవమానముఁ జెందిన కులీనుని పగిది బిట్టు నిట్టూర్పు నిగుడించుచున్నది. ఇచ్చట యుద్ధము మానిపించిన మల్లునికింబోలె నీపొట్టేలు మెడ తోముచున్నారు. ఇందు గుఱ్ఱాలకుఁ జక్కఁగా నొడలిమీఁది రోమములు కత్తిరించుచున్నారు. విఱిచికట్టిన దొంగవానివలెఁ గూర్చున్న దిచట నీకోఁతి. మాష్టికు లిచ్చోట భక్తతైలఘృత మిలితంబులగు ముద్ద లేన్గులనోటి కందించుచున్నారు. చేటీ! యింకఁ బైత్రోవఁ జూపుము.

చేటి—అయ్యా? ఇట్టిటురమ్ము, ఇది మూఁడవమొగసాల; ప్రవేశించుము.

మైత్రే—మర్ఘూరే! ఈ మూఁడవ మొగసాలయందము! ఇందుఁ గులపుత్రకులు కూర్చుండుటకుం దగిన యాసనము లమర్చియున్నవి. ఏదియో సగము చదివి పుటలు విప్పియుంచిన పుస్తకము. రత్నమయశారికాసారితం బగు నెత్తపుంబల కపై నున్నది. స్త్రీ పురుషులకుఁ గలయిక కావలసిన గలయికను నెడఁబాటు కావలసిననెడఁబాటును జేయఁజాలిన సానులును, వృద్ధవిటులును బెక్కురంగులు చిత్రించిన చిత్రపటములు కేలం గీలించి యిట్టటుఁ దిరుగుచున్నారు. పరిచారికా! ఇంక నింకొకమోసాలకు దారిఁ జూపించుము.

చేటి—అయ్యా! ఇది నాలవచత్వరము ప్రవేశించుము.

మైత్రే—(ప్రవేశించి) బాగురే! యువతికరతాడితంబు లగు మద్దెలలు మేఘము లుఱిమినట్లు మ్రోగుచున్నవి. కంచుతాళములు పుణ్యము చాలక నింగినుండి పడు చున్న చుక్కలవలె మెఱయుచున్నవి. మధుకరీనాదమువలె మధురముగాఁ బిల్లన గ్రోవి వినఁబడుచున్నది. ప్రణయకుపిత యగు కామినింబోలెఁ దొడమీఁద నిడు కొని నఖరపరామర్శంబున వీణను సారించుచున్నారు. మకరందము గ్రోలి మదిం చిన యాఁడుఁదుమ్మెదలపలెఁ జెవులకుఁ జవులుపుట్టునట్లు పాడుచు గణికాబాలిక లాడుచున్నారు. సింగారముగ నృత్యాభినయంబులు నేర్చుకొనుచున్నారు. వాతా యనంబులయందు వ్రేలాడఁగట్టిన సలిలగర్గరులు వాయువు నాకర్షించుచున్నవి. చేటికా! ఇఁకఁ బై త్రోవ నడువుము.

చేటి—అయ్యా! ఇటురమ్ము. ఈ పంచమప్రకోష్ఠముం బ్రవేశించుము.

మైత్రే—బాగురే! ఈ ప్రకోష్ఠమునం దింగువనూనితాలింపు గుమగుమ దరిద్రులకు నోరూరించుచున్నది. రాత్రిందివ మెడతెగకుండ నగ్నిచే సంతప్యమానంబగు వంటయిల్లు సురభి ధూమోద్గారచ్ఛలంబున నూర్పుచ్చుచున్నది. వండుచున్న భక్ష్యములయు భోజ్యములయుఁ బరిమళము నా నాసాపుటములం దగుల్కొ-సి న న్నువ్విళు లూర జేసుచున్నది. చినుగుబట్టవంటి పశూదరపేశిని జేతబట్టుకొని కటికవాండ్ర పిల్లవాఁడు కడుగుచున్నాఁడు. వంటవాఁడు చిత్రములగు పెక్కు వంటలు వండుచున్నాఁడు. మోదకములు కట్టుచున్నారు. అపూపములు వండుచు న్నారు. (తనలో) ఇప్పు డెవ్వరైన మడిగట్టుకొమ్మని కాళ్ళుకడుగుకొనుటకు నీళ్లు తెచ్చి యిచ్చిన బాగుండును. వివిధాలంకార శోభితులగు గంధర్వాప్సరోగణముల వలె నున్న గణికలచేతను బంధులులచేతను నిజముగా నీ గేహ మింద్రమందిర మును మించియున్నది. బంధులు లనఁగా నెవరురా మీరు?

బంధు—మే మెవరమా,

చ. పరమపురుషానురక్తలగు భామినులందు జనించినాము; కాఁ
పురము సదా పరాలయము, బుక్తి పరాన్నము, మాధనంబుదులే
పరులధనంబు, లార్యుల కవాచ్యులమై చరియింతు మెప్పుడుం
గరికలభంబులట్ల నవకంబున బంధులు లన్న పేరునన్.

మైత్రే—చేటికా! దారిచూపుము దారిచూపుము.

చేటి—అయ్యా! ఇది ఆఱవముంగిలి ప్రవేశించుము.

మైత్రే—(ప్రవేశించి) ఏమివింత! ఈ యాఱవముంగిట నీలరత్నమునకుం గట్టిన సువర్ణ మణి తోరణంబు లింద్రాయుధముం బురణించుచున్నవి. మణిపరీక్షకు

లన్యోన్యము వైడూర్య మౌక్తికప్రవాళ పుష్యరాగేంద్రనీలకర్కేతర పద్మరాగ మరకతప్రభృతి మణివిశేషములు విచారించుచున్నారు. కొందఱగసాలులు కుందనపుఁబని చేయుచున్నారు. మఱికొందఱు నగలు చేయుచున్నారు. కొందఱు ముత్యము లెఱ్ఱదారములకు గ్రుచ్చుచున్నారు. కొందఱు వైడూర్యములకల్ల నల్లన మెఱుఁగు పెట్టుచున్నారు. కొందఱు శంఖములు దొలుచుచున్నారు. కొందఱు పగడములు సానపెట్టుచున్నారు. కొందఱు కుంకుమపూవు నెండఁబోయుచున్నారు. కొందఱు కస్తూరి సారించుచున్నారు. కొందఱు మంచిగంధము తీయుచున్నారు. కొంద ఱగురువర్తిక లంటించుచున్నారు. కొందఱు జవరాండ్ర క్రీఁగంటిచూపులఁ జూచుచున్నారు. కొందఱు నవ్వుచున్నారు. కొందఱెడతెగకుండ మద్యము నెగబీల్చుచున్నారు. వీండ్రు పరిచారకులు. వీండ్రు పరిచారికలు. ఈ పురుషులు దారపుత్రాదులను విడిచి సర్వదా యిచటనేయుండి గణికాపీతశేషమగు మదిరారసముఁద్రావి యొడ లెఱుంగక పడియున్నారు. చేటీ! ఇంకఁ బై ప్రకోష్ఠమునకు దారి చూపుము.

చేటి—అయ్యా! ఇటురమ్ము. ఇది సప్తమాంగణము ప్రవేశించుము.

మైత్రే—(ప్రవేశించి) ఆహాహా! ఈ పావురాపిట్టల జోడులు పరస్పరము ముద్దుపెట్టుకొనుచు గట్టిగఁ గట్టఁబడిన విహంగవాటికయందు సుఖమనుభవించుచున్నవి. పంజరమునందున్న చిలుకలు పెరుఁగుకూడు కడుపునిండ మెసవి పాఱులవలె సూక్తములు పఠించుచున్నవి. ఇదిగోఁ బెంపుడుగోరువంక యొడయురాలి నన్మానమునిండఁగల దాసివలెఁ గురకుర రాడుచున్నది. అనేక ఫలములు తినుటవలనఁ గషాయకంఠముగల కోయిల కుంభదాసివలెఁ గూయుచున్నది. నాగవాసములకుఁ బెక్కు పంజరములు వ్రేలాడఁగట్టినారు. లావకములను పోరాడించుచున్నారు. పచ్చతీతువులకు మాటలనేర్పుచున్నారు. పంజర కపోతములను బై కెగురవేయుచున్నారు. ఈ గృహమయూరము నవరత్నములు తాపడము చేసినగతినున్న పింఛము విప్పి విసరుచు ఒకమేడనుండి యింకొకమేడకు దుముకుచున్నది. ప్రోవుచేసిన చంద్రకిరణములవలె రాజహంసమిధునములు కామినుల గమనసౌందర్యము నేర్చుకొనుటకుంబోలె నిట్టటుఁ దిరుగుచున్నవి. ఈ పక్షిజాతు లన్నియు నీగణికలశోభ నినుమడింపఁ జేయుచున్నవి. బాపురే! నాకు నిజముగా నీ భోగముదాని యిల్లు నందనవనమువలె నున్నది. చేటికా! నడువుము, దారి చూపుము.

చేటి—రారమ్ము. ఇదిగో నెనిమిదవ మొగసాల ప్రవేశించుము.

మైత్రే—(ప్రవేశించి చూచి) చేటికా! వీ డెవఁడు? పట్టుబట్టలు గట్టుకొని యొడలు నిండ విలువలేని బంగారునగలు దాల్చి మేను విఱుచుకొనుచు నిట్టట్టుఁ బరిభ్రమించుచున్నాఁడు.

చేటి—ఇతఁడు వసంతసేన యన్న.

మైత్రే—వీఁడు వసంతసేనకు నన్నయగుట కెంతపుణ్యము గావించెనో! ఛీ, ఛీ, వీఁడు పుణ్యశాలియనరాదు. వీఁ డెంత యుజ్జ్వలవేషభాషలు కలవాడైనను, నెంత సుకుమారుడైనను, నెంత సిరియనుభవించుచున్నను శ్మశానవాటికయందు జనించిన చంపకవృక్షమువలె లోకులకు మాననీయుఁడుమాత్రము కాఁడు. (ఇంకొక దెసఁ జూచి) చేటీ కాళ్ళనిండ దిగజాఱ నూని రాచుకొని యట్టచెప్పులు తొడుగుకొని మీఁద నీఁగలు ముసరకుండఁ బువ్వులచీర కప్పి యెత్తుపీఁటమీఁదఁ గూర్చున్న ఆ ముసలిది యెవరు?

చేటి—ఈమె వసంతసేన తల్లి.

మైత్రే—ఓహోహో యీ పిశాచి బొజ్జకడుపు! మహాదేవునివలె ముందు దీనినీయింటఁ బ్రవేశపెట్టి తరువాతనే యింటికి ద్వారబంధములు, తలుపు లెత్తించినారాయేమి?

చేటి—ఓరీ! చచ్చినవాఁడ! చాతుర్థికజ్వరముచేత బాధపడుచున్న మాయమ్మగారిం జూచి నవ్వకుము.

మైత్రే—(పెద్దపెట్టున నవ్వి) తల్లీ! చాతుర్థికజ్వరమా! బ్రాహ్మణుఁడను నాపైఁ గూడ నిట్టి యనుగ్రహమే రానిమ్ము.

చేటి—సీయాళ కూలిపోను, చత్తువు.

విదూ—తొత్తుకూఁతురా! ఇంత లంబోదరముతో బ్రతుకుటకన్న జచ్చుటయే మేలు.

గీ. ఆసవము కల్లు మద్య మెల్లపుడుఁ ద్రావి • చెందె నీదురవస్థ యీ చెనఁటితొత్తు
త్వరఁగ నిది చచ్చెనేని సంతర్పణంబు • కడుపునిండ సహస్రసృగాలములకు.

ఓసీ, మీకు నోడలేమైన నున్నవా?

చేటి—మాకోడలు లేవు.

మైత్రే—ఔను, ప్రేమయను నిర్మలజలముగల యీ మదనసముద్రమందుఁ దిరుగుటకు మీ స్తనజఘననితంబములుండ వేఱు నావలేల? మీ వసంతసేన యింటి విభవముఁ జూచిన నాకు ముల్లోకము లొకచోటనే కాన్పించుచున్నవి. కొనియాడుటకు నా కీనోరు చాలదు; ఇది గణికాగృహమా! లేక కుబేరభవనమా! మీ వసంతసేన యెక్కడ?

చేటి—ఆ యుద్యానవనములోఁ జెట్లగుంపునడుమ నున్నది. ప్రవేశింపుము.

మైత్రే—(ప్రవేశించి చూచి) అహా! ఈ వృక్షవాటిక యందము! ఇందలి వృక్షజాతులన్నియుఁ జిత్రవిచిత్రకుసుమములు కలవి. దట్టముగానున్న చెట్లనీడ నొక తూఁగుటుయ్యల బడఁతులపిఱుందులకుఁ జాలునట్లుగా నిర్మింపఁబడియున్నది. తమంతట నేలరాలిన బంగారు బండిగురివిందపూవులును, శేఫాలికాకుసుమంబులును, మల్లెలు, మొల్లలు, జాజులు, గోరంటలు మొదలగు సుమరాజంబులును నందనవనమును గ్రిందుపఱుచుచున్నవి. (వేఱొకదెసఁ జూచి) ఈ దిగుడుబావి యుదయించుచున్న సూర్యునివలె నెఱ్ఱనైన కలువపూవులవలన సంజవలెనున్నది.

గీ. క్రొత్తగాఁ గొంతపుష్పించి కొంతననిచి • క్రాలుచున్న దశోకవృక్షంబుచూడ
రక్తధారలచేత సంసిక్తమైన • భటుని నెమ్మేని రమ్యభావంబుజాడ.

కానిమ్ము. మీవసంతసేన యెచ్చోటనున్నదో చూపుము.

చేటి—అయ్యా! దృష్టివంచి చూడుము. అదిగో మా వసంతసేన.

మైత్రే—(చూచి సమీపించి) పూజ్యురాలా! నీకు శుభము.

వసం—మైత్రేయుఁడా! (లేచి) స్వాగతమా! ఇదె పీఁట; ఇందుఁ గూర్చుండుము.

విదూ—నీవును గూర్చుండుము. (ఇరువురును గూర్చుందురు)

వసం—మీ సార్థవాహకుమారునకుఁ గుశలమా!

మైత్రే—కుశలము.

వసం—ఆర్యమైత్రేయా! ఇప్పటికిని—

గీ. గొనములుచిగుళ్ళువినయంబుకొమ్మగములు • మొదలునమ్మికయోగ్యతపువులుచేయు
పనులు పండ్లుగఁజెలఁగు నజ్జననగమును • జేరుచున్నదె మిత్రపక్షివ్రజంబు?

మైత్రే—(తనలో) ఈ దుష్టవిలాసినిఎంతచక్కఁగఁ బరిశీలించినది!(ప్రకాశము)ఔను.

వసం—ఆర్యా! నీవువచ్చిన పనియేమి?

మైత్రే—వినుము, మాచారుదత్త భట్టారకుఁడు శిరంబున దోసిలియొగ్గి నీకిట్లు విన్నవించుకొనుచున్నాఁడు.

వసం—(దోసిలియొగ్గి) ఏమని యాజ్ఞాపించిరి?

మైత్రే—నేను నీసువర్ణభాండమును విశ్వాసమువలన నాదే యనుకొని జూదములో నోడిపోతిని. ఆ గెలిచిన జూదరి రాజుగారిచారుఁడు. ఎచటికేగెనో తెలియదవి.

చేటి—ఆర్యురాల! నీ యదృష్టము మంచిది. ఆర్యపుత్రుఁడు జూదరి యయ్యె.

వసం—(తనలో) దొంగ యెత్తుకొనిపోయిననగ జూదములో నోడిపోతినని నుడువుచున్నాఁడు. కనుకనే కోరఁదగినవాఁడు.

మైత్రే—దానికి మాఱుగా నీ వీ రత్నావళిఁ బుచ్చుకొనుము.

వసం—(తనలో) ఆ సువర్ణభాండ మితనికిఁ గనఁబఱతునా, ఇప్పుడు వలదా ?

మైత్రే—ఈ రత్నావళి గ్రహింప నిష్టములేదా యేమి ?

వసం—(నవ్వుచుఁ జెలివంకఁ జూచుచు) మైత్రేయ ! ఏల గ్రహింపను ? (తీసికొని చెంతనుంచుకొని తనలో) పువ్వులు రాలిపోయిన తియ్యమామిడిచెట్టునకు మకరందబిందువు లెక్కడివి ? (ప్రకాశము) ఆర్య ! ఆ జూదరితో నేను ప్రదోష సమయమున దర్శనమునకు వత్తునని చెప్పుము.

మైత్రే—(తనలో) ఇది యింటికి వచ్చుమాత్ర మింక నేమి సంపాదించును? (ప్రకాశముగా) అట్లే చెప్పెదను (తనలో) ఈ గణికాప్రసంగము చాలింపుమని.

(నిష్క్రమించును.)

వసం—చేటీ! ఈయలంకారము గ్రహింపుము. మనమార్యపుత్రునభిసరింపఁబోదము.

చేటి—అర్యా ! చూడుము చూడుము. అకాలదుర్దినము తటస్థించుచున్నది. ఎంత మబ్బుపట్టినదో.

వసం—ఆ రత్నావళిఁ దీసికొని వేగ రమ్ము.

గీ. రాత్రి పడుఁగాక యటుకారుచక్రమ్ముఁగాక • చినుకుఘనమయి మిగులవర్షించుఁగాక
నేను లెక్కింపనివియెల్లనిజమునామ • నముతగుల్కొనెఁబ్రేయోభిగమనమందు.
చేటికా ! నీవీరత్నావళిం దీసికొని వేగరమ్ము.

(అని నిష్క్రమించుచున్నారు.)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతంబగు మృచ్ఛకటికంబునందు
మదనికా శర్విలక మను చతుర్థాంకము.

మృచ్ఛకటికము.

పంచమాంకము.

(పిదప నుత్కంఠితుఁడగు చారుదత్తుఁ డాసనస్థుఁడై ప్రవేశించును.)

చారు—(నింగివంకకుం జూచి) అకాలదుర్దినము తటస్థించుచున్నది! ఇదిగో!

గీ. పెంపుడునెమళ్లు తమి బురివిచ్చి చూడ • నాత్రపడి పోదలంచి రాయంచ లెడయ
దుర్దినంబౌర యిదిహతాత్తుగ వియోగి • జనులహృదయము నంతరిక్షమునుగప్పె.

మఱియును—

గీ. బెగ్గురులబారు తెలిసంకు నిగ్గుజూప • మెఱపు నెమ్మేని పుట్టంబు మిసిమిగ్రమ్మ
నాక్రమించెఁ ద్రివిక్రమునట్టు లుదక • సిక్తమహిషోదరానీలజీవనదము.

మఱియును—

గీ. కరగబోసినవెండినాఁ గారుమొగులు • నుండి పడునీటిదార లందుండు మెఱపు
పసిమిచే నిముసం బగుపడక చిన్న • గగనచేలాంచలంబుల గతిఁదనర్చు.

సీ. కలసిన చక్రవాకంబులగతి, ఱెక్కలల్లార్చి యెగురు రాయంచలట్లు
జలములోఁ దిరుగు చేఁపలరీతి, జవపరిభ్రాంతంబులగు మకరములపగిదిఁ
గమనీయ శృంగజంగమసౌధముల భాతిఁ, బరుగిడుచున్న యశ్వములచాయ
ముట్టి పైకెత్తిన లొట్టిపిట్టలమాద్రి, గుమురుగాఁ బోవు నేస్గులవిధమున

గీ. వాయువిశ్లేషితంబులు వారివాహ • ఖండములు పెక్కురంగులు కలవి నడువఁ
జదలు భాసిల్లచున్నది చారుచిత్ర • రచన గన్వింఁ దొసంగు వస్త్రంబుపగిది.
జదలు భాసిల్లుచున్నది చారుచిత్ర • రచన గన్విందొసంగు వస్త్రంబుపగిది.

గీ. ఆంబికేయులి బలగమట్లయ్యె మిన్ను • పొంగుచుండెను రారాజుపోల్కె నెమిలి
యోడి చనసాగె ధర్మజుజాడఁ బికము • డాగె రాయంచగములు పాండవులపగిది.

(ఆలోచించి) మైత్రేయుఁడు వసంతసేన యింటికింబోయి చిరకాలమైనది. ఏలొకో రాలేదు.

మైత్రే—(ప్రవేశించి) ఔరా! ఆ బోగములంజె నిర్దాక్షిణ్యము, లౌభ్యము తలఁచిన నా కచ్చెరువగుచున్నది, రెండవప్రస్తావనయైనఁ దెచ్చినదికాదు. తన చెలిమికిఁ దగినమాటలెన్నియోచెప్పి తుదకురత్నావళిహరించినది. మైత్రేయా! కొంచెము విశ్రమించుమనుమాటయేని దానినోట రాలేదుకదా! ఇన్ని మంచినీళ్ళయిన ద్రాగిపొమ్మన్నదికాదే! ఇఁక నే నెన్నఁడు నాతొత్తుకూఁతు మొగమైన జూడను.

(నిర్వేదముతో) దుంపలేని పద్మలతయు, వంచకుఁడుగాని కోమటియు, దొంగ కాని యగసాలివాఁడును, వివాదలేని పల్లెఅచ్చయు, ద్రవ్యాశలేని సానిదియు నుండరనుమాట లసత్యములుకావు. కావున మిత్రుండగు చారుదత్తుని గణికా వ్యాపారమునుండి మరలించెద. (యెదుటికిఁజూచి) ఏలాకో ప్రియమిత్రుఁ డుద్యానవృక్షవాటికయం దొంటరిగా నున్నాఁడు. సమీపించెద (సమీపించి) అయ్యా! వృద్ధిఁజెందుము, నీకు శుభమగుఁగాత.

చారు—(చూచి) వీఁడుగో నా ప్రియమిత్రుఁడు! మిత్రమా! కుశలమా! కూర్చుండుము.

మైత్రే—కూర్చున్నాను. (అని చతికిలఁబడును)

చారు—వయస్యా! ఆ కార్యమేమైనది?

మైత్రే—ఆ కార్యము భగ్నమైనది.

చారు—అది రత్నావళి పుచ్చుకొన్నది కాదాయేమి?

మైత్రే—మనకాపాటియదృష్టమా? నవనళినకోమలంబగు దోసిలియొగ్గిపుచ్చుకొన్నది.

చారు—అటులేని కార్యము భగ్నమైన దనియెదవేమి?

మైత్రే—ఏల భగ్నముకాలేదు? కుడిచితిమా! ముడిచితిమా! దొంగ లెత్తుకొని పోయిన మూల్య సువర్ణభాండము కొఱకు చతుస్సముద్రముద్రిత ధరావలయసార భూతంబగు రత్నావళి పోయినది,

చారు—మిత్రమా! అట్లనరాదు—

గీ. పడపువగలాడి యయ్యు విశ్వాసముంచి • దానినగ తెచ్చి మనచేత దాఁచనిచ్చె
నయ్యలంకార మల్పమూల్యమగుగాక • దానినమ్మిక విలువగా దఱమె మనకు.

మైత్రే—మిత్రుఁడా! నాకు దానిమీదఁ గోపము మనరత్నావళి హరించినదనియే కాదు. చెలికత్తెలకుఁ గంటిసైగచేసి మొగము పైఁటకొంగుచాటునం బెట్టుకొని నన్ను పరిహసించినది. నేను బ్రాహ్మణుఁడనయ్యు నీపాదములంబడి వేడుకొను చున్నాను. పెక్కు సిలుఁగులు కలుగజేయు సానికూట మీపాటికి గట్టిపెట్టుము. గణికలు చెప్పులోఁదూరిన రాయివలె జాలఁగష్టపెట్టుదురు. ఇదియునుంగాక యోసుహృద్వరా! భోగముది, యేనుఁగు, కాయస్థుఁడు, సన్యాసి, వంచకుఁడు, గాడిద— యివి నిలిచినచోటఁ బూరియైన మొలవదు.

చారు—మిత్రమా! వేశ్యలమీది దోషోద్ఘాటన మింకఁ జాలించుము. గణికా ప్రసంగము నీవు మానిపింపనక్కఱలేదు. నా ప్రస్తుతావస్థయే మానిపింపఁగలదు.

గీ. నడువనేచూచుఁ బ్రాణముల్ నడచునప్పు • డైన జాత్యశ్వ. మడుగులు పడవుగాని
కోర్కులెన్నేనిఁ దలపోసికొనగవచ్చుఁ • గాని యవి బీదహృదయంబు గడువలేవు.
మఱియును—
గీ. ధనముగలవారిసొంతమాతరుణి. వాంద్ర•జాతియే రొక్కములులాగు జాతియగుట
(తనలో) యీ వసంతసేన మాత్రము సుగుణహార్య. (ప్రకాశముగ)
మనల నెన్నడు వదలెనో ధనము నాడె•వదలితిమిగాదె యాకుందరదన మనము.
మైత్రే— (క్రిందికిఁ జూచుచుఁ దనలో) ఇతఁ డాకసమువంకకు దృష్టినిగిడ్చి నిట్టూర్పు విడుచుట చూడ గణికాప్రసంగము మానుమని నేను బోధించుటంజేసి యుత్కంఠ మఱింత హెచ్చినదని తలపోసెదను. కనుకనే కామము చెడ్డదని పెద్దలు నుడువుదురు. (ప్రకాశముగ) మిత్రమా! ఆ లంజెకూఁతురు ప్రదోష కాలమున నీయింటికి వచ్చెదనని నీతోఁ జెప్పుమన్నది. సువర్ణభాండమునకు రత్నావళిచాలదని మొట్టవెట్టి యింకేదేని లాగికొనిపోవుటకని నేనూహించెదను.
చారు—రానిమ్ము. సంతోషపఱచియే మరలఁ బంపుదములే.
చేటుఁడు—(ప్రవేశించి) అయ్యలారా! వింటిరా?
గీ. చెనకి యీవాన దిమ్మరించినకొలంది • వెట్టితిమ్మిరి యెత్తె నావీఁపు తోలు
విసరుచున్నది చలిగాలి విసమువోలె • నాదుహృదయంబు వడకుచున్నదిగదొర.
గీ. ఊఁదఁగల నేడు రంధ్రంబు లున్నవెదురు • మీటగల నేడుతంత్రుల మేటివీణె
పాడగాగల గీతంబు గాడిదెవలె • నారదుఁడు తుంబురుండును నాకు సరియె.
'కుంభీలకా! నీవుపోయి చారుదత్తభట్టుతో నేను వచ్చుచున్నానని మనవి చేయు'మని వసంతసేన నాకాజ్ఞాపించినది. కావున నేను జారుదత్తుఁడుగారి యింటికిం జనుచున్నాఁడ. (పరిక్రమించి చూచి) వాఁడుగో! చారుదత్త భట్టారకుఁడా చెట్లగుంపుక్రిందఁ గూర్చున్నాఁడు. కానీ సమీపించెదను. (పోయి) యీ యుపవనద్వారము మూసియున్నది. ఎట్లుపోదును? కానిమ్ము. ఆ దుష్టవటువునకు సైఁగఁ గావించెదను. (బెడ్డలు వానిమీఁద విసరుచున్నాఁడు.)
మైత్రే—ఎవఁడురా! ముళ్ళకంచెవైచిన వెలగచెట్టుమీదికి ఱాళ్ళు విసరినట్లు నా మీఁదికి ఱాళ్ళు విసరుచున్నాఁడు.
చారు—ఈ యుపవన సౌధముమీఁదఁ గ్రీడించుచున్న పావురాలేమో ఱాళ్ళు క్రిందికి దొరలించినవి.
మైత్రే—తొత్తుకొడుకు పావురమా! ఉండుండుము. ఈకఱ్ఱతో మేఁడమీఁదనుండి ముగ్గిన మామిడిపండువలె నిన్ను నేలఁగూలనేసెద. (కఱ్ఱతీసికొని పరువెత్తును)

చారు—(యజ్ఞోపవీతము పట్టుకొనియాఁపి) మిత్రమా! నిలువుము. పాప మాపావురములు జోడుగట్టి తిరుగుచున్నవి. వానిజోలి కేగకుము.

కుంభీ—ఇతఁడు పావురమనుకొనుచున్నాడు గాని నేనని యెఱుఁగడు. మరల నొక బెడ్డ విసరెదను. (అని విసరుచున్నాఁడు.)

మైత్రే—(దశదిశలు పరికించి) పావురము కాదు. కుంభీలకుఁడు. ఓరికుంభీలక! (సమీపించి) రారా! నీకుఁ గుశలమా? (తలుపు తెఱచును)

కుంభీ—(ప్రవేశించి) అయ్యా! నమస్కారము.

మైత్రే—ఇట్టి యంధకారమయంబగు దుర్దినమం దెటనుండి వచ్చుచున్నావురా!

కుంభీ—ఆమె వచ్చినదయ్యా!

మైత్రే—ఆమె యెవరురా?

కుంభీ—ఆమెయే ఆమె.

మైత్రే—తొత్తుకొడుక! కసాయి యంగడిలో ముసలిమేఁకవలె మెమెమే యనెద వెవరామె?

కుంభీ—తొలకరిలోఁ గప్పవలె నెవరెవరెవరని అట్లఱచెదవేల నీవు?

మైత్రే—నాకుఁ దెలియలేదు చెపుము.

కుంభీ—(తనలో) ఇట్లాడించెదను (ప్రకాశముగ) నేనొక పొడుపుకథ యడిగెదను జెప్పెదవా?

మైత్రే—నేను నీనెత్తిమీఁదఁ గాళ్లు పెట్టెదను, అఁగెదవా?

కుంభీ—సరియేకాని, మామిడిచెట్టేకాలమునఁ బుష్పించును?

మైత్రే—తొత్తుకొడుక! గ్రీష్మఋతువులోఁ గాదటరా!

కుంభీ—(నవ్వుచు) కాదయ్యా కాదు.

మైత్రే—(తనలో) గ్రీష్మఋతువు కాక యేఋతువో! పోనీ చారుదత్తు నడిగెదను. (ప్రకాశము) కుంభీలక! ముహూర్త మోపికచేయుము. (చారుదత్తునొద్దికింబోయి) మిత్రమా! మామిడిచెట్టేఋతువులోఁ బుష్పించును?

చారు—మూర్ఖుఁడ! వసంతఋతువులో.

మైత్రే—(కుంభీలకుని సమీపించి) మూర్ఖుఁడ! వసంతఋతువులో.

కుంభీ—ఇంకొకటి యడిగెదను. సమృద్ధములగు గ్రామములను రక్షించునది యెవరు?

మైత్రే—వీధి.

కుంభీ—(నవ్వుచు) కాదయ్యా కాదు.

మైత్రే—(తనలో) అవును నాకును సంశయముగానే యున్నది. చారుదత్తునడిగి తెలిసికొనెదను. (అని చారుదత్తునొద్దికిం బోయి యడుగును)

చారు—మిత్రమా ! సేన.

మైత్రే—(చేటునితో) తొత్తుకొడుక ! సేన.

కుంభీ—ఈ రెండును గలిపి చదువుము.

విదూ—సేనా వసంత.

కుంభీ—తలక్రిందుగాఁ జెప్పుము.

విదూ—(తల క్రిందుగాఁజేసి) సేనావసంత.

కుంభీ—ఓమూర్ఖబ్రాహ్మణ ! పదములు తలక్రిందుగాఁ జేయుము.

విదూ—(కాళ్లు పైకెత్తి) సేనా వసంత.

కుంభీ—ఓమూర్ఖబ్రహ్మచారి ! నీ పదములుకాదు, ఆ మాటలో నున్నపదములు తలక్రిందుగాఁ జేయుము.

విదూ—(ఆలోచించి) వసంతసేన.

కుంభీ—అటులేనిఁ జారుదత్తునితో నివేదించెదను (సమీపించి) ఓ చారుదత్త ! మీ ధనికుఁడు వచ్చినాఁడు.

చారు—మాయింటికి ధనికుఁ డెవఁడు వచ్చును ?

విదూ—ఇంటికి రాకపోయినను ద్వారమునందున్నాఁడు, వసంతసేన వచ్చినది.

చారు—నన్ను వంచించుచుంటివా ?

విదూ—నామాట నమ్మవేనిఁ గుంభీలకు నడుగుము. ఓ లంజెకొడుక ! కుంభీలక, యిటురమ్ము.

కుంభీ—(వచ్చి) అయ్యా ! దండము.

చారు—కుశలమా ! నిజముగా వసంతసేన వచ్చినదిరా ?

కుంభీ—వచ్చినమాట సత్యమే.

చారు—(సంతోషముతో) ఓరీ కుంభీలక ! ప్రియవచనము నివేదించినవాని నే నెన్న డూరకపంపలేదు. కావున నీయుత్తరీయముగ్రహింపుము.(యుత్తరీయమిచ్చును)

కుంభీ—(గ్రహించి దండముపెట్టి సంతోషముతో) ఆమెతో నివేదించెదను.(పోవును)

చారు—నే నెఱుఁగుదును. సువర్ణభాండమునకు రత్నావళి చాలదని మొట్టిపెట్టి యింకేదియో లాగుటకు.

విదూ—మిత్రుఁడా ! ఎఱుగుదువా, ఇట్టిదుర్దినమునం దెందులకు వచ్చునో !

చారు—(తనలో) రానిమ్ము. సంతోషముతోనే పోవును.

(పిదప నుజ్జ్వలాభిసారికావేషముతో వసంతసేనయు, ఛత్రధారిణియగు చేటియు, విటుఁడును బ్రవేశింతురు.)

విటు—(వసంతసేన నుద్దేశించి)

చ. కమలము కేలలేనిసిరి కామునిచేతిమృదుప్రహేతి శో
కము మగవాండ్ర కందఱకుఁ గంజశరాగముపుష్పమౌర చి
త్రముగ రతిప్రదేశమగు రంగమునన్ రతినాఁటి సిగ్గుపో
డిమి గలకూర్మితోఁ జనియెడిం బ్రియపాంథులు వెంబడింపఁగన్.

వసంతసేనా ! యిటుచూడుము.

మ. ఉఱుమంజొచ్చెఁ బయోదమండలము సౌరొప్పార వ్రేలాడుచున్
గిరిశృంగంబులపై వియుక్త కమలాక్షీహృత్ప్రమానంబులై
పురులన్ విప్పిన నెమ్మిగుంపులఘు సొంపున్నింపుచున్ రత్నచా
మరముల్ గైకొనియో యనం దనరుఁ దన్మార్గంబున న్వీచుచున్.

మఱియును,

చ. బురద మొగంబునిండ, జలపూరముధారలదెబ్బ తించు ద
ర్దురములు గ్రోలెడుం; గడిమి తోరముగాఁ గుసుమించెఁ; గప్పెఁ జం
దిరునిఁ బయోదజాలము యతిం గులదూషణులట్లు; కేకి కం
ఠరుతి నెలంగెఁ, గ్రొత్తకులటల్ వలెఁ జంచలలయ్యెఁ జంచలల్. R-C.

వసం—బావా ! మిగుల మంచివర్ణనఁ జేసితివి.

ఉ. ఉన్నతముల్ నిరంతరపయోధరముల్ గలనన్నుఁ గాక ని
న్మన్నన నేయునే బయిసిమాలినదాన ప్రియుం డటంచు గ
ర్జన్నవనీరదధ్వనిమిషంబున నన్ను నిశాపురంధ్రి నా
తె న్నరికట్టుచు న్మిగులఁ దిట్టుచునుండె సపత్ని పోలికన్.

విటు—అవును. నీచెప్పినట్లే, రాత్రిని నిందింపుము.

వసం—బావా ! స్త్రీస్వభావమగుటంజేసి తెలివిమాలినపని నేయుచున్న దీనినిందించిన - నేమి ఫలము ? నేనొకమాట సిద్ధాంతీకరించెదను వినుము.

గీ. ఉఱుముగాక పయోదముల్ కురియుగాక•పిడుగుపడుగాక యగుగాకపుడమి కదలి
చలియు వేడియు జూడరు లలన లకట•రమణసాన్నిధ్యమున కేగుసమయమందు.

విటు—వసంతసేనా ! చూడు మిది యింకొక చిత్రము.

గీ. ఉఱుము డప్పులతోడ విద్యుద్ధ్వజాళి • తోడ జలధారలనునంపదోముదోడఁ
జంద్రు కరములు హరియించె జలదపటలి•నృపతి శత్రులకరముల్ హరించునట్లు.

వసం—బావా ! నీవు నుడివినది చిత్రమేకాని యింకొక విచిత్రముఁ జూడుము.

చ. ఉఱుముచు దంతినీలవికటోదరజాలము లల్లలాడ బె
గ్గురులు మెఱుంగులం గలసి కోరములయ్యె మొగిళ్ళు డెందమం
దురిసిన పుండుమీదటఁ జలో క్తికిఁ గారము చల్లినట్లు వి
ట్టఱవఁదొడంగెఁ బ్రావృడని యంబరమందు బకంబు లక్కటా.

విటు—వసంతసేనా ! అది యట్టిదేకాని యిదిగో నింకొక విచిత్రముఁ జూడుము.

కం. మెఱుగులు చామరములు బెగ్గురులే తలపాఁగ గాఁగ గొలువంబడు చం
బరమాతంగంబు పయిం దిరుగుచున్నాఁడు జలదదేవుఁడు బళిరే.

వసం—బావా ! యిటుచూడు మిటుచూడుము.

ఉ. అంబుదపాళి భ్రమింగె రవి, నావలకున్ వెడలించె దుర్బల
త్వంబునఁ గ్రుంగు భర్తగల తన్వినేటుల్ శశికాంతి, నభ్రసౌ
ధంబున పైఁడిదివ్వెలవిధంబున శంపలు మించె, నీరధా
రం బడి సీత్కరించెడుఁ గరంబుఁ గరివ్రజమట్లు పుట్టలున్.

విటు—వసంతసేనా ! చూడుము.

గీ. మెఱుపుపగ్గముల్ గట్టిన కరులునాగ • నొండొటిన్ మీఱి యీమబ్బు లుదకధార
లీనుచున్నవి, సురపతియాన బుడమి • వెండిగొలుసులఁ బైకీడ్చుచుండె ననఁగ.

మఱియుం జూడుము.

ఉ. కారెనుబోతునిగ్గుగల కందచయంబు, ప్రచండమారుత
ప్రేరితమౌచుఁ, జంచలలపేరి గరుల్ గల వార్ధులోయనన్
బాఱెడుమింట, వజ్రశరపాతములో యన వారిధారలున్
జీరుపసాగె దూర్వలను జెన్నయి తావి వెలార్చు మేదినిన్.

వసం—బావా ! ఇది యింకొకవిచిత్రము.

శా. రారారమ్మని కేక వేయుచు మయూరస్తోమము ల్వ్రల్వఁగాఁ
జేరంబోయి బలాకలెల్ల రభసశ్రీ నక్కునం జేర్పఁగా
నీరేజంబులు వీడి హంసలు భయోన్మేషంబునం జూడఁగా
ధారాద్రంబులు పూసె నంజనమషీధామంబు నల్దిక్కులన్.

విటు—అది యట్టిదే కాని యిటుచూడుము.

ఉ. నీరజనేత్ర సంపదలు నిశ్చలభావముఁ జెంద సాంద్రశం
పార్చుచి దివ్వెలట్లు క్షణమాత్రము చీఁకటిఁబాప తేఁటివల్

నేరక దిక్కులం దెలియనేరక నిద్దురవోవు ధారికా
గారమునందు లోకము వికస్వరనీరధరాతపత్రమై.

వసం—బావా ! చూచితిఁగాని యాచిత్ర మాలోకింపుము.

ఉ. తారక లంతరించెను గృతఘ్నునియం దుపకారమట్లు ది
గ్వారము కాంతిఁబాసెఁ బధిక ప్రమదాజనమట్లు లంబరం
బౌర సురేశ్వరాయుధమహాశిఖిచేఁ బరితప్తమై ద్రవా
కారముఁ జెంది నేలఁ బడఁగా గమకించెడునట్లు తోఁచెడిన్.

మఱియుం జూడుము.

క. ఎగురుచుఁ గ్రిందికి దిగబడుచుఁ గురియుచుఁ వర్ష ముఱుముచుం జీఁకటిగా
మొగులు దిరుగు బహురూపములుగ నడమంత్రపుసిరి గలుగువానిగతిన్.

విటు—ఔను.

చ. శరములఁ గ్రుమ్మరించు హరిచాపము దాల్చి నటించునట్లు, క్రొ
మ్మెఱుగుల మండినట్టులు, భ్రమియించినయ ట్లనిలంబుచేత, బె
గ్గురుల హసించినఁ ట్లశనిఁగూసినయ, ట్లహినీలనీరద
త్వరఁ బొగచూరినట్లు గనుపట్టుచున్నది మిన్ను చూచితే.

వసం—ఆ. నీకు సిగ్గులేద నీరదమా ! యేను దయితునింటికేగఁ దలఁచుచుండఁ
దడపఁజొచ్చి తీవు ధారాకరంబుల గర్జితముల నడలుఁ గలుగఁ జేసి.
ఓ దేవేంద్రుఁడా !

గీ. తొల్లి నా కున్నయదియె నీతోడిపొందు • జలదసింహారవంబుల గొలుప దగునె
ప్రియునిచే గోరబడి పోవువెలది దారి • వానచే నరికట్టుట వరుసకాదు.
ఇంకొకమాట యాలకింపుము.

గీ. ఎఱుగవే శక్ర ! మునిదారకొఱకుఁ దొల్లి • కోడివైతివి కాల్కంటివాఁడ వైతి
వేల నిరపేక్ష మరలింపు మీ మొగిళ్ళ • నేనుసైతము నీవంటిదానఁ జూవె.
మఱియు నింకొకమనవి వినుము.

క. ఉఱుములు పెల్లుఱిమించుము కురిపించుము వానలు పిడుగులతోఁ గూడన్
మఱలించుట నీతరమా, తెఱవలు ప్రియులను గలయుమతిం బోవునెడన్.

గీ. ఉఱుము లుఱిమిన నీరదం బుఱుముగాక • పురుషులెందును బరమనిష్ఠురులు కాన
మెఱపులతకూనరో నీవుమెలతవయ్యు • నువిదవలవంత లెఱుకయుండదగునె.

విటు—భవతీ ! వసంతసేన ! నిందింపకుము నిందింపకుము. శంపాలత నీ కుప
కారిణి కాని యపకారిణి కాదు.

ఉ. మేలుపుఁటేన్గువక్షమున బిట్టుచలించు సువర్ణరజ్జువుం
బోలె, మహీధ్రమూర్ధమున బొల్చెడి శ్వేతపతాకయట్లు, స్ఫా
టికమందిరాంతరవిభాసితదీపముమాడ్కి నీకు శం
పాలతదారిఁజూపెడుసుమా! ప్రియునింటికి; నేల తిట్టెదే?

వసం—అవును అదియె ప్రియతమునియిల్లు.

విటు—సకలకళావిశారదవగు నీకుపదేశింపవలసిన దేదియు లేదు గాని నీయందలి స్నేహముచే బ్రేలుచున్నాను. లోనికేగినపిదప దగనికోపము దాల్పజనదుసుమా.

గీ. అలిగితివయేని లేదు సౌఖ్యంబు, కోప • గింపకున్నను మదనుండు కీర్తితేఁడు
అలుగు మలిగింపు మొకవేళ నతనిగూడ•నంతనె ప్రసన్నవై తేర్పు మాత్మవిభుని

ఎవరయా అచట? ఆర్యచారుదత్తునకు విన్నవింపుఁడు.

ఉ. నీపసుగంధి యైనరజనీముఖమందలి వానలో స్మరో
త్తాపితచిత్తయై కురులు ధారలచేఁ దడువం దటిద్ధ్వని
ప్రాపితమైనభీతి గడువంబడి దేవరదర్శనార్థమై
నూపురలగ్నపంక మవమున్న మొనర్చుచు నిల్చెవాకిటన్.

చారు—(విని) మిత్రమా! అదేమో తెలిసికొనుము.

మైత్రే—చిత్తము. (పోయి వసంతసేనం జూచి) వసంతసేనా! కుశలమా!

వసం—ఆర్యా! నమస్కారము. మీకుఁగుశలమా! (విటునితో) బావా! యీ ఛత్రధారికను నీయొద్ద నిలుపుకొని గొడుగు పట్టించుకొనుము.

విటు—(తనలో) ఈయుపాయమున నన్నుఁ జక్కఁగా వెడలి పొమ్మన్నది. (ప్రకాశముగ) మంచిది. వసంతసేనా!

చ. రతికయి యిల్లుఁ గట్టుకొని రాగము తేపుచు మాయదంభ ము
ద్ధతి గపటం బసత్యము మొదల్గలవానికి జన్మభూములై
రతిసుఖ మమ్మఁజూపు పెను రక్కసు లీధనకాంత లెల్ల నీ
గతి సుజనత్వనిష్క్రయముగా వలపింతురుగాత లోకులన్.

(నిష్క్రమించును.)

వసం—మైత్రేయ! మీ జూదగాఁ డెక్కడ నున్నాఁడు?

మైత్రే—(తనలో) ఏమి! యీ యబ్బురము! నా ప్రియమిత్రునకు జూదగాఁడని పేరుపెట్టి వన్నెతెచ్చుచున్నది. (ప్రకాశముగ) భవతీ! ఆ యెండు చెట్లగుంపులో నున్నాఁడు.

వసం—ఆర్యా! యెండుచెట్లగుం పనియెదరేమి?

మైత్రే—తిండిపెట్టునా నీరిచ్చునా ? ఎందుల కీచెట్లగుంపు ? (వసంతసేన నవ్వుచున్నది.) రా ప్రవేశించుము.

వసం—(జనాంతికముగ) ప్రవేశించి నే నేమి మాటలాడవలయునో ?

చేటి—ద్యూతకరుఁడా ఈ ప్రదోషకాలము సుఖకరమేనా అని యడుగవలయును.

వసం—అడుగలేనేమో !

చేటి—అవసరమే అడిగించునులెమ్ము.

మైత్రే—రా ప్రవేశించుము.

వసం—(ప్రవేశించి చేరఁబోయి పువ్వులు రువ్వుచు) జూదగాఁడా ! ఈ ప్రదోష కాలము సుఖకరముగా నున్నదా !

చారు—(చూచి) ఇదిగో వసంతసేన వచ్చినది (సంతోషముతో లేచి) ప్రియురాలా!

గీ॥ సంజ జాగ్రదవస్థచేఁ జనుచునుండె • దమియు నూర్పులచేతనే తరలుచుండె
నేఁడు నీరాకచేత నో నీరజాక్షి • కాగలదు నాకు సంధ్య సుఖప్రదంబు.

నీకు స్వాగతమా ? ఇదే పీట, యిందుఁగూర్చుండుము.

మైత్రే—ఇదిగోఁ బీఁట యిందుగూర్చుండుము.

(వసంతసేన పీటమీదఁ గూర్చుండును. అందఱును గూర్చుందురు.)

చారు—వయస్యా ! అవలోకింపు మవలోకింపుము.

గీ. కలికి చెవిమీద నిరుకొన్నకడిమిపువ్వు • నుండిజాఱెడు వర్ష బిందువులచేత
దడుపఁబడుచున్న దీపయోధరము రాచ•బిడ్డ యభిషేక మొనరింపఁబడ్డరీతి.

మిత్రమా ! వసంతసేన వస్త్రములు తడిసియున్నవి. కావున మంచి చీరలు తెప్పించి యిప్పింపుము.

మైత్రే—చిత్తము.

చేటి—మైత్రేయ ! నీవు వలదు. నే నార్యురాలికి సేవ గావించెదను. (చీరలు తెచ్చి యిచ్చును.)

మైత్రే—(జనాంతికముగ) మిత్రమా ! నే నీమె నొకమాట యడుగఁదలచి యున్నా నడిగి చూచెదనా ?

చారు—అడుగుము.

మైత్రే—(ప్రకాశముగా) వసంతసేనా ! వెన్నెలలేని యీ దుర్దినాంధకారమున నెందులకై వచ్చితివి ?

చేటి—ఆర్యురాలా ! ఈ బ్రాహ్మణుఁ డమాయకుఁడు.

వసం—మంచి నైపుణ్యము కలవాడనుము.

చేటి—ఈమె నీవిచ్చిన రత్నావళికి మూల్యమెంతయో యడుగవచ్చినది.

మైత్రే—(జనాంతికము) నేను చెప్పలేదా! రత్నావళి యల్పమూల్యమనియు సువర్ణభాండము బహుమూల్యమనియుఁ దగవిడి యింకేదియో లాగికొనిపోవుట కని.

చేటి—ఆ రత్నావళి తనదే యనుకొని యీమె జూదములో నోడిపోయినది. ఆ గెల్చినవాడు రాజుచారుఁ దేకడకుఁబోయెనో తెలియదు.

మైత్రే—నే నన్నమాటలే నా కొప్పఁజెప్పుచున్నావా యేమి!

చేటి—ఆ సభికుడు కానవచ్చుదనుక నీ సువర్ణభాండము నీయొద్దనుంచు. (చూపును)

(విదూషకుఁ డాలోచించును.)

చేటి—మైత్రేయా! మిగుల నాలోచించుచున్నావు. దీనిని నీవు మున్నెఱుఁగుదువా యేమి?

మైత్రే—పని నేర్పరితనముచే నాదృష్టి నది చక్కఁగా నాకర్షించుచున్నది.

చేటి—నీదృష్టి నిన్ను వంచించుచున్నది. ఆ సువర్ణభాండమే యిది.

మైత్రే—(సంతసముతో) చెలికాఁడా! మనయింటబడి దొంగ దోఁచుకొనిపోయెనే యా సువర్ణభాండమే యిది.

చారు—సుహృత్తమా!

గీ. బదులుతీర్చుటకై యేనెపంబు మనము • పన్నినారమొ యోజించిమున్ను; మరల
నదియ మనయెడ విపరీతమయ్యె నిందు•నెంతనిజమొ, విడంబనమెంతయొ కద!

మైత్రే—నా బ్రాహ్మణ్యము తోడు. నిజముగా నిది యా సువర్ణభాండమే.

చారు—అగుచోఁ బ్రియమే ప్రియమే.

మైత్రే—(జనాంతికముగ) ఇది యెవరివద్దనుండి యీమెకు దొరకినదో యడిగెదను.

చారు—తప్పేమి యడుగుము.

మైత్రే—(చేటి చెవిలో నేమేమో నుడివి) అవునా?

చేటి—(మైత్రేయుని చెవిలో మరల నేదియో గొణిగి) అవును.

చారు—చేటీ మైత్రేయులారా! మీరేమో చెప్పుకొనుచున్నా రా రహస్యమునకు మేము వెలుపలివారమా! వినదగదా!

మైత్రే—(చారుదత్తుని చెవిలో నా రహస్యము నుడువును)

చారు—భద్రురాలా! యిది యా సువర్ణభాండమే?

చేటి—దేవరా! అవును!

చారు—చేటీ! నే నెన్నఁడును బ్రియనివేదనమును వ్యర్థపఱచలేదు. కావున నీ యుంగరము బహుమతిగాఁగైకొనుము. (యుంగరములేని వ్రేలుచూచుకొని

సిగ్గుపడును.)

వసం—(తనలో) నిన్నుఁ గామించుటకుఁ గారణమే యిది.

చారు—(జనాంతికముగ) ఆహా! యెంతకష్ట మెంతకష్టము!

గీ. ఆగ్రహానుగ్రహంబులు వ్యర్థములగు • నర్థహీనున కెందును నందులోన
ధనముఁబాసిన నరుజీవితంబు కంటె • ధనము లేకున్న నరుజీవితంబమేలు.

గీ. ఎండిపోయినచెట్టు నీరెడసియున్న • చెఱువు తెక్కలులేని పక్షియును గోఱ
లూడ్చిన బిలేశయంబు నీయుర్విలోన•సమములగు మిత్రమా! యకించనునితోడ.

ఆ. పాడువడ్డయిల్లు మోడైన చెట్టు నీర్లేనినూయి ధనములేని నరుఁడు
విస్మరింతు రాత్మవృత్తమ్ము పరిచితు ల్గాడినపుడు వేడ్క గూలిపోవ.

విదూ—సుహృద్వరా! అత్యంతము వంతమానుము. ఓ వసంతసేనా! నా యంగవస్త్రముగూడ నిచ్చివేయుము.

వసం—ఆర్యపుత్ర! ఈ మానిసిని రత్నావళిచేఁ బరీక్షించుట యుక్తమా?

చారు—(తెల్లఁబోయి నవ్వుచు) వసంతసేనా!

గీ. సత్య మెవ్వరికెఱుక యీజగమునందు • జాలకనగజాతు రెల్లవారలును నన్ను
శంకసేతురు రిక్తుల సర్వజనులు • బడుగుఁదనమున కొక ప్రతాపంబు గలదె.

విదూ—చేటీ! నీవు నిచ్చుటనే పన్నుండెదవా?

చేటి—(నవ్వి) మైత్రేయా! నీమాటలుచూడ వట్టియమాయకుఁడవనిపించును.

మైత్రే—మిత్రమా! ఈ పర్జన్యుఁడు సుఖముగా గూర్చున్నవారలను మరల లేవఁగొట్టుటకుంబోలె వారిధారలను విస్తరింపజేయుచున్నాఁడు చూడుము.

చారు—నెచ్చెలీ! లెస్సగాఁ బలికితివి.

గీ. బురదనుండి సూచీబిసాంకురము లొదవు • పగిది జలదాంతరమునుండి వారిధార
లురలుచున్నవి చంద్రవియుక్తయైన•నిశి వియోగాగ్ని నోర్చు కన్నీరనంగ.

మఱియును,

గీ. ముసలిచేలముబురణించుమొయిలువృత్ర • రిపునిగనిము త్తెములుగ్రుమ్మరించినట్లు
సజ్జనుల చిత్తముల పార్థుశరచయముల • కొమరుగల వారిధారలు కురియసాగె.
ప్రియురాలా! వసంతసేన! యిటు చూడుము.

ఉ. చీఁకటిపూలపిండివలెఁ జెల్వగుమబ్బు దివంబు గప్పు, శై
త్యాకరమైనతావులు బయల్పడ వీచుఁ బ్రదోషమారుతం, ,
బాకసముం బయోధరసమాగమకాంక్షిణి యైనమించు బ
ల్వీఁకఁ గవుంగిలించుకొనుఁ బ్రేయసు నత్యనురక్తచాడ్పునన్.

వసం——(శృంగార మభినయించుచుఁ జారుదత్తుని గౌఁగిలించుకొనును.)

చారు——(స్పర్శసుఖ మభినయించుచుఁ బ్రత్యాలింగనమిచ్చి)

గీ. అంబుదమః బిట్టు గర్జించుమమ్మ నీ య • నుగ్రహంబున వలవంత నుగ్రమైన
కాఁక దవిలిన నామేను కడిమిపువ్వు • పోలికగ నేడు రక్తిమై బులకరించె.

విదూ——తొత్తుకొడుకా ! దుర్దినమ ! యిప్పటికి నీవు దౌర్జన్యముం జూపుచున్నావా ?
మెఱపులు చూపి మా వసంతసేనను భయపెట్టెదవా ?

చారు——వయస్యా ! నిందింపకుము.

గీ. ఎడతెగక వాన యిట్లు నూ తేండ్లదా క• గురియుఁగాక క్షణప్రభల్ మెఱయుగాక
దొరకె నావంటి పరమరిక్తులకు దొరక • రానిప్రియురాలగు వసంతసేనపొందు.

మఱియు నోమిత్రమా !

గీ. ప్రియులయిండ్లకు దార వరించి సంజ • వానలోఁ దడిసిన చలి మేన వచ్చు
కులుకులాడుల యక్కు లక్కులకుఁ దార్చు • వారిజీవితమే ధన్యమౌర జగతి.

ప్రియురాలా వసంతసేన !

గీ. పీట లురలియు స్తంభాల మీటుమీద • నొట్టునకు నిల్చియున్న దీ యుల్లభంబు
దెరలిపోయిన గచ్చుబెత్తికలు గల్గు • చిత్రభిత్తిక లీ వానచేతఁ దడిసె.

(ఊర్ధ్వముగాజూచి) అదిగో! నింద్రచాప మగపడుచున్నది. కనుంగొనుము.

గీ. మెఱపునాలుక వేల్పురామేటివింటి • చేతులును కార్మొయిళ్ళను సెలవులును బ
యల్పడగ నంబరం బిప్పు డావలించు•చున్నటులనున్నదో యన్నమిన్న! కనుమ

కావున నభ్యంతరములేకుండ నభ్యంతరగృహమునకే పోదము రమ్ము.

(అని లేచి పరిక్రమించుచు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతంబగు మృచ్ఛకటికంబునందు
దుర్దినమను పంచమాంకము.

శ్రీమత్పరదేవతాయైనమః

మృచ్ఛకటికము.

షష్ఠాంకము.

(పిదపఁ జేటి ప్రవేశించును.)

చేటి—ఇప్పటికిని వసంతసేన మేల్కొలేదు. కానిమ్ము పోయి లేపెదను. (అని నాట్యముతోఁ బరిక్రమించును.)

(పిదప ముసుగు వెట్టుకొని నిద్రపోవుచున్న వసంతసేన ప్రవేశము.)

చేటి—(చూచి) అమ్మా! లేలెమ్ము. తెల్లవాఱినది.

వసం—(లేచి) రాత్రిగడవకుండగనే తెల్లవాఱినదా!

చేటి—నీకింకను రాత్రి గడవలేదుగాని మాకుఁ దెల్లవాఱినది.

వసం—దాసీ! మీ సభికుఁ డెక్కడ?

చేటి—అమ్మా! వర్ధమానకునితో నేమేమో సెలవిచ్చి చారుదత్తార్యుఁడు పుష్పకరండకమను జీర్ణోద్యానములోనికిం బోయెను.

వసం—ఏమి సెలవిచ్చెను?

చేటి—వసంతసేన పోవును గాన బండి పూంచి తీసికొని పొమ్మని.

వసం—నే నెచటికిఁ బోవలసినది?

చేటి—ఆర్యచారుదత్తుఁ డున్న యుద్యానవనమునకే.

వసం—(చేటిని గౌఁగిలించుకొని) ఓసీ! రాత్రి తిన్నగాఁ జూడలేదు. ఇప్పుడు నా ప్రియతముని రూపు కన్నులారఁ జూచి యానందించెదను. నేను లోపలికి మొకరాలలోనికిం బ్రవేశించితినా యేమి?

చేటి—మొకరాలలోపలికేకాదు. అందఱిడెందములలోపలికిని బ్రవేశించితివి.

వసం—ఆర్యపుత్రుని పరిజను లందఱుఁ బరితాపపడుచున్నారా యేమి?

చేటి—ముందు పరితాపపడుదురు.

వసం—ఎన్నఁడు?

చేటి—నీవిచటినుండి వెళ్ళిననాడు.

వసం—నాఁడైన నేనే ముందు సంతాపపడవలసినది. (సానునయముగా) చేటీ! ఈ రత్నావళిం దీసికొనుము, తీసికొనిపోయి మాయక్క ధూతమ్మగారికి సమర్పించి "నేను మీ భర్తగారి గుణనిర్జితనగు దాసిని కావున మీకును పరిచారి

కనే. ఈ యమూల్యాభరణము మీ కంఠము నలంకరింపవలసినదే కాని నేను ధరింపఁ దగినదికాదు" అని నామాటలుగా మనవిచేయుము.

చేటి—చారుదత్తుఁడుగారు కోపపడెదరేమో ?

వసం—కోపపడరు.

చేటి—(మంచిది అని ఆ నగ పుచ్చుకొని పోయి మరలవచ్చి) అమ్మా ! వసంతసేన ! "ఆర్యపుత్రుడు మీకది యనుగ్రహముగా నిచ్చినారు. అది నేను క్రమ్మఱ గ్రహించుట తగవు కాదు. ఆ యుత్తమచరితుడే నాకలంకారమని తెలిసికొనుము" అని ధూతమ్మగారు సెలవిచ్చినారు.

(పిదపఁ గుఱ్ఱవానిం దీసికొని రదనిక ప్రవేశించును.)

రద—రా బాబూ ! రా ! యీబండితో నాడుకొందము.

కుఱ్ఱ—రదనికా ! నాకీమట్టిబండి యక్కఱలేదు. ఆబంగారుబండి కావలయు దెమ్ము.

రద—(నిట్టూర్పున నిర్వేదము సూచించుచు) నాయనా ! మనకుం బంగారుగొడవ యెక్కడిది ? మీ తండ్రిగారికి మరల నైశ్వర్యమువచ్చిననాడు బంగారుబండి చేయించుకొందువులే. అప్పు డా బండితో నాడుకొందువు. అదిగో వసంతసేన ! ఆమెయొద్దకుం దీసికొనిపోదునా ! (తీసికొనిపోయి) అమ్మా ! దండము.

వసం—రదనికా ! కుశలమా ! ఇతఁ డెవరిపిల్లవాఁడు. నగ లేమియు లేకున్నను జందురునివంటి యీ మొగమొక్కటియే నన్నానందపఱచుచున్నది.

రద—అమ్మా ! చారుదత్తుఁడుగారి కుమారుఁడు రోహసేనుఁడు.

వసం—రావోయి నా తండ్రీ రా ! కౌఁగిలించుకొనుము (తొడమీఁద నిడుకొని) రదనికా ! వీసమే నెచ్చుతగ్గులేకుండ నంతయుఁ దండ్రిపోలికయేసుమీ !

రద—రూపమే కాదు. స్వభావమునైత మాయనపోలికయే. ఈ యవస్థయం దీ బాలకుని వలననే యాయనకుఁ గాలయాపనము.

వసం—ఎందుల కేడ్చుచున్నాఁడు ?

రద—ఇంతకుముందు పొరుగింటి యజమానుని కొడుకుతోగూడి బంగారుబండితో నాటలాడుకొన్నాఁడు. పిదప నది వారు దాఁచుకొనిరి. నన్నాబండి తెమ్మని యేడ్వఁగా నే నొక మట్టిబండి గావించి యాడుకొమ్మంటిని. నాకిది పనికిరాదు బంగారుబండి కావలెనని పోరుపెట్టి యేడ్చుచున్నాడు.

వసం—అన్నన్నా ! యెంతకష్టము ! అటువంటి చారుదత్తునికొడు కొరుల వస్తువులు చూచి తెమ్మనిన నేడిపించు దుష్కాలము వచ్చినది. హా ! హతవిధీ ! తామరాకు మీఁది జలబిందువులవంటి పురుషభాగధేయములతో నాడుకొనుచుందువా !

(అని కన్నీళ్లు తెచ్చుకొని) అబ్బాయీ! యేడువకుము, బంగారుబండితో నాడు కొందువులే.

కుబ్జ—రదనికా! ఇది యెవరు?

వసం—మీతండ్రిగారి గుణనిర్జిత యగు దాసిని.

రద—బాబు! నీ కమ్మ యగును.

కుబ్జ—రదనికా! అబద్ధాలాడుచున్నావు. ఇది మా యమ్మయైన నిన్నినగ లెక్కడివి?

వసం—తండ్రీ! సుందరవదనారవిందమున ముద్దులొలుక దీనములగు జిలిబిలి పల్కులు రానిచ్చుచున్నావా! (అనియేడ్చుచు నగలన్నియుదీసి) ఇదిగో నిపుడు మీ యమ్మనైతిని చూడుము. ఈనగలు పుచ్చుకొనుము. బంగారుబండి చేయించుకొనుము.

కుబ్జ—పొమ్మమ్మ. నాకక్కఱలేదు. నీ వేడ్చుచుంటివి.

వసం—(కన్నీరు దుడిచికొనుచు) నాయనా! ఏడ్వను వెళ్లుము, ఆడుకొనుము తండ్రీ! సువర్ణశకటిక చేయించుకొనుము. (అని నగలు మట్టిబండినిండఁ బడ వేయును. పిదప బాలకుని వెంటఁబెట్టుకొని రదనిక నిష్క్రమించును.)

(వర్ధమానకుఁడు బండి తోలికొనివచ్చును.)

వర్ధ—రదనికా! వసంతసేనతో వర్ధమానకుఁడు బండి సిద్ధపఱచుకొని వచ్చినాడని మనవిచేయుము.

చేటి—అమ్మా! వర్ధమానకుఁడు బండి తోలికొని వచ్చినాఁడట.

వసం—ముహూర్తము నిలువుమనుము. నే నొడలు కైసేసికొని వచ్చెదను.

చేటి—(మరలిపోయి) వర్ధమానక! ముహూర్తమాగుము, వసంతసేన యాత్మ నలంకరించుకొనుచున్నది.

వర్ధ—ఓహోహో! నేనును బండిలోని యాస్తరణము మఱచిపోయివచ్చినాను. అది పట్టుకొని వచ్చెదను. ముక్కుత్రాళ్ళువోసిన పొగరుగిత్తలివి. యిక్కడనిలువవు. కావున బండితోనే పోయి మరల వత్తును. (నిష్క్రమించును.)

వసం—చేటీ! నాయలంకారము లన్నియుఁదెమ్ము అలంకరించుకొనెదను.

(అంతట స్థావరకుఁడను చేటుఁడు బండితోలుకొని వచ్చును.)

స్థావ—రాజస్యాలకునిచే నిట్లు నియోగింపఁబడితిని. "స్థావరకా! బండితోలికొని పుష్పకరండక మను జీర్ణోపవనమునకు రమ్మని. కానీ! అచటికే పోయె దను. గిత్తలారా! లాగుఁడు లాగుఁడు. (బండితోలుచు నెదుటఁజూచి) రాజమార్గమునిండ నూరిబండ్లు కిటకిటలాడుచున్నవి. ఇప్పుడేమి చేయుదును!

ఓరోరి శాకటికులారా! యొత్తిగిలుం డొత్తిగిలుండు. (సాటోపముగా) ఇది యెవరిబండియని యడుగుచున్నారా! ఇది రాజస్యాలకుఁడగు సంస్థానకుని బండి కావునఁ ద్వరగా నోసరిలుండు. వీఁడెవఁడో, సభికునిఁజూచి జూదములో నప్పు పడిన జూదగాడు పాఱిపోయినపగిది నన్నుఁజూచి పరువెత్తుచున్నాఁడు వీఁడెవఁడో! ఎవఁడైన నేమి. నేను త్వరగాఁ బోవలయును. ఓరోరి గ్రామ్యులార! ప్రక్కలకుబొండు ప్రక్కలకుబొండు! ఓరీ బండివాఁడ! నీబండి తప్పించుము. (విని) ఏమీ! చక్రము కదలుటలేదా! ఆ చక్రముఁ ద్రిప్పుటకు నన్ను రమ్మని యెదవా! రాజస్యాలకుని సారథిని నేను నీకుఁ జక్రముఁద్రిప్పుటకు సాహాయ్యము చేయవలయునా! పోనీ! పాపము! వీడొంటిగాఁడు దీనుడై యున్నాడు. వీనికిఁ జక్రమెత్తిపెట్టెద. నంతదనుక నీ బండిని చారుదత్తుఁడుగారి పుష్పకరండక పక్షద్వారమునం దాపెదను. (బండివానితో) అదిగో వచ్చుచున్నానురా! (నిష్క్రమించును.)

చేటి——అమ్మా! చక్రధ్వనివలె నున్నది. బండివచ్చినదని తలంచెదను.

వసం——నా హృదయము వేగిరపడుచున్నది. పక్షద్వారమునకుఁ ద్రోవఁజూపుము.

చేటి——అమ్మా! నీవు త్వరగా రమ్ము.

వసం——(పరిక్రమించి) మంచిది నీవు రవంతసేపు విశ్రమించుము.

చేటి——సెలవునకు బద్ధురాలను. (నిష్క్రమించును.)

వసం——(కుడికన్నదరుట సూచించుచు స్థావరకుని బండియెక్కి తనలో) ఏమీ! కుడికన్నదరుచున్నది. నా దుశ్శకునము లన్నియు నా ప్రియుని ముఖారవిందమే పోనడఁచుఁగాత.

స్థావ——(ప్రవేశించి) బండ్లన్నియుఁ దప్పించితిని. ఇఁక వెళ్ళుదును. (బండియెక్కి తోలుట నటించి తనలో) బండి బలువెక్కినదేమో! బలువెక్కుటగాదు. చక్రముఁ ద్రిప్పుటచేత నాయాసపడియున్న నాకు బండి బలువెక్కినట్లు కన్పట్టుచున్నది. కానీ! గిత్తలారా! నడువుఁడు నడువుఁడు.

(తెరలో) ఓరోరి దౌవారికులార! మీ మీ గుల్మస్థానములయందు జాగరూకులై యుండుడు. పాలకమహారాజుచే బందీకృతుండగు గోపాలదారకుఁడు బంధనగృహకవాటముం బగులఁగొట్టి కాలిగొలుసులు త్రెంపుకొని పాఱిపోయినాఁడు. పట్టుకొనుండు పట్టుకొనుండు.

(ఒకకాలియందు సంకిలియ గలగలలాడఁ దొందరగా వపటీక్షేపముగా నార్యకుఁడు ప్రవేశించును.)

స్థావ—పురమంతయు గగ్గోలుగానున్నది. తొందరగాఁ బోవలయును.

గీ. కట్టు పెకలించుకొని పాఱు గజముపోల్కి • రాజబంధనవిపదంబురాశి గడచి
ఒంటికాల జీఱాడుచునున్న నిగళ • మీడ్చుకొనుచిట్లు దెసమాలి యేగుచుంటి.

సిద్ధునిమాటలు విని భయంపడి పాలకుఁడు నన్ను వ్రేపల్లెనుండి రప్పించి బందీకృతుం గావించె. నా ప్రియమిత్రుఁడగు శర్విలకుని యనుగ్రహంబున నా కారాగారంబునుండి ముక్తుండనైతిని. (కన్నీరుఁ దుడుచుకొనుచు)

శా. నాకుౝ భాగ్యము లబ్బునేని యచటౝ నాదోసమేమున్న ; దే
లా కట్టెన్ నవనాగమట్టు పతి చల్పాదించి; భాగ్యంబు రా
మోకాలొడ్డినఁ బోవునే? నృపతితోఁ బోరాడఁగానేర్తునే
యేకాకిౝ; సకలాభిగమ్యుఁడుగదా పృథ్వీశుఁ డూహింపఁగన్.

భాగ్యహీనుఁడ నగు నేనిప్పు డెచ్చటికిఁ బోదును. (ఎదుటఁజూచి) ఈ యిల్లే మహానుభావునిదియో, వీధిగుమ్మపు తెక్కలతలుపులు మూయకయే యున్నది.

గీ. ప్రాతయిల్లిది దూలముల్ వ్రయ్యలయ్యె • జాఱువడియెను శీర్ణకవాటయుగము
బాధపడుచుండె బరమనిర్భాగ్యుడగుచు • నెవ్వడో నన్ను బోలిన యీ కుటుంబి
యీ యింటిలోనికిం బోయి విశ్రమించెదను.

(తెరలో) నడువుం డాఁబోతులారా నడువుండు.

ఆర్య—(విని) ఇక్కడ నేదో బండియున్నదే! ఎవరైన సజ్జనులెక్కి పోవుచున్న గోష్ఠియానమై యుండునాయిది? లేక నూత్నవధువును గొంపోవుటకై వచ్చి యిచట నిలచియుండునా? కాక, నా యదృష్టవశమునఁ బ్రవరజను లెవరికొఱకైన నూరివెలుపలి కేగుచున్న బండియై యుండునా? పరిజనము వెంటలేమి చూడ నీ వట్టిబండిని దైవము నాకొఱ కంపియుండవలెను.

వర్ధ—(బండితోఁ బ్రవేశించి) ఇది యేమివింతయో! ఆస్తరణమే మఱచితిని; రదనికా! వసంతసేనతో నివేదింపుము. 'బండివచ్చినది, త్వరగా నుద్యానవనమునకుఁ బోదు'నని.

ఆర్య—(విని) ఇది భోగముదానిబండి, వెలుపలికే పోవుచున్నది. కానీ! పోయి యెక్కెదను. (అని బండిని సమీపించును.)

వర్ధ—(గలగల ధ్వనివిని) అదిగో! అందెలచప్పుడు; వసంతసేన వచ్చినట్లున్నది. అమ్మా! ఈ యెద్దులకుఁ గ్రొత్తగా ముక్కుత్రాళ్ళు పోసినాను. పొగరుకొని యున్నవి, కాన వెనుకనుండి యెక్కుము. (ఆర్యకుఁడు వెనుకనుండియెక్కును)

వర్ధ—ఎక్కునపుడు కదలు నూపురముల చప్పు డడఁగినది, బండియు బలువెక్కె

నది. కావున వసంతసేన బండి యారోహింప నోపు. నింక నడపించెదను. పదుం డాఁబోతులార పదుండు. (బండితోలుకొని నిష్క్రమించును.)

వీరకుడు—(ప్రవేశించి) ఓరోరి జయ జయమాన చందనక మంగళ పుష్పభద్ర ప్రముఖులార !

గీ. మీర లేమైరి నమ్మిఁయున్నారె వాని • బద్దు గోపాలదారకు; వాఁడు రాజు
బంధనంబును మనమునుబగులగొట్టి • తుట్టుమని యొక్కయంగలో దూటినాడు.

ఓరీ ! నీవు తూరుపుదెసఁ గాచుము. నీ వుత్తరదిక్కున నుండుము. నీవు పశ్చిమమున నుండుమురా, నీవు దక్షిణద్వారమునఁ జూడుము. ఈ పడిపోయిన ప్రాకారమెక్కి యేనును జందనకుండును జూచెదము. రారా చందనక రా ! వేగముగా రా !

చంద—(సంభ్రాంతుఁడై ప్రవేశించి) ఓరోరి ! వీరకవిశల్య భీమాంగద దండకాల దండశూర ప్రముఖులార !

గీ. రండు వేగమ నమ్మిన రాచబంటు • లైనమీరంద జేగుఁడు వానిఁ దేర
నితర గోత్రోద్భవుని జేరనీకు డట్టె • మనన్నృపాలుని సుచిరసామ్రాజ్యపదవి.

క. తోటలు నగళ్ళు రచ్చలుఁ బేటలు ఘోషములు విపణివీధులు సభలున్
బాటించి సందియముగల చోటులనన్నింటి నెమకిచూడుడు వానిన్.

గీ. ఏమిరా వీరకా ! గొల్లడెచట డాగె • నెవడు చెఱవిడిపించెరా యిట్లు వాని
సందియముమాని మనసిచ్చిజాడదెలుపు • మెచటగాలింపుమందువో యేనుచూతు

ఆ. ఎన్మిదింటసూర్యుఁ డేనింటగుజుఁడు నాల్గింట శశియుఁ దొమ్మిదింటశనియు
గురువు లగ్నమున భృగువు షష్ఠమందుండు జాతకంబువాడు చందనకుఁడు.

ఆ. బ్రతికియుండ నెవడు వచ్చి గోపాలదా • రకు హరించె వాడు బ్రతుకఁగలడె
వాని వానిగూడ బలియిత్తు మనయూరి • యమ్మవారి కేను నమ్ము మోరి.

వీర—

గీ. ప్రొద్దుపామైన బొడవకమున్నె వాని • నెవడొ తరలించుకొనిపోయె ! నింతకెంత
దూరమేగిరో ; నిజము నీతోడు సుమ్ము • చందనక! వాడు మన కెట్టులందు నింక

వర్ధ—పొండు గిత్తలారా పొండు.

చంద—(చూచి) ఓరి ! వీరక ! చూడు చూడు.

ఆ. నడుపబడుచునుండెనడిరాచ తెరవున మూతబండి యొకనిచేత నదిగొ
ఎవరి, దెవ్వరెక్కి, రెచ్చటికేగుచున్నదియొ యది కనుంగొనంగవలయు.

వీర—(చూచి) ఓరి బండివాఁడ ! బండితోలకు మాపుము. ఈబండి యెవరి.

దెక్కినవారెవ రెచ్చటి కేగుచున్నదిరా !

వర్ధ—అయ్యా ! ఈబండి చారుదత్తుడుగారిది. ఇందు వసంతసేన యున్నది. చారుదత్తుఁడుగారి పుష్పకరండకములోనికి విహారణార్థమై పోవుచున్నది.

వీర—(చందనకునితో) బండి చారుదత్తునిదట, వసంతసేన యెక్కినదట. పుష్పకరండకములోనికిఁ బోవుచున్నదట.

చంద—అట్లయినచోఁ బోనిమ్ము.

వీర—చూడకుండగనే పోనిత్తమా !

చంద—చూడనక్కఱలేదు.

వీర—ఎవరిమీఁది నమ్మకమున ?

చంద—ఆర్య చారుదత్తునిమీఁది నమ్మకమున.

వీర—ఆ చారుదత్తుఁ డెవరు ? ఆ వసంతసేన యెవరు ?

చంద—ఓరీ మూర్ఖ ! ఆర్యచారుదత్తు నెఱుగవు, వసంతసేన నెఱుగవు. వీరిరువురి నెఱుంగనివారు మింటిమీఁది చంద్రుని చంద్రికను గూడ నెఱుగనివారే.

గీ. గౌనములకునీరజము మంచితనమునందుఁచంద్రుడాపన్నదుఃఖమోక్షకుడుచతురుదధులలో సారమైనరత్నం బయారెఁచారుదత్తు నెఱుంగనిజనులు కలరె.

గీ. వేలకొలది జనంబులు గ్రాలు మన నఁ గరికి వారిర్వురే తిలకంబులౌరి నిందుయోగ్యుండు చారుదత్తుండొకండుఁమాననీయయగు వసంతసేన యొకతె.

వీర—ఓరీ చందనక !

గీ. చారుదత్తు నెఱుంగుదు జారుశీలఁ నెఱుగుదు వసంతసేన నాయెఱుకకేమి రాజకార్యభరంబు సంప్రాప్తమైనఁ జో నెఱుంగను నేఁ దండ్రినైన నిజము.

ఆర్య—(తనలో) ఈతడు నా పూర్వవైరియు, నాతడు నా పూర్వబంధువుగా నోపుదురు. వీరిరువురు నేక కార్యనియుక్తులైనను, బెండ్లిలో వల్లకాటిలోఁబెట్టిన యగ్నులందువలె వీరియందును శీలభేదము కాన్పించుచున్నది.

చంద—నీవు రాజునకు నమ్మిన సేనాపతివి, విచారశీలుఁడవు. నీవుపోయి బండి పరీక్షింపుము. నేను బలీవర్దంబుల నాపెదను.

వీర—నీవును రాజునకు నమ్మిన బలపతివేకదా ! నీవే విలోకింపుము.

చంద—నేను చూచిన నీవు చూచినట్లేనా ?

వీర—నీవు చూచిన రాజుగారే చూచినట్లు, కావున నీవే చూడుము.

చంద—ఓరీ బండివాఁడ ! కాడినెత్తుమురా !

(వర్ధమానకుఁడు బండియాఁపి కాడినెత్తుచున్నాఁడు.)

ఆర్య—(తనలో) ఈ భటులు నన్నుఁ జూచెదరేమోకదా ! చేతఁ గత్తియైనలేదు. సర్వవిధముల దురదృష్టవంతుడ నైతిని. కానీ !

గీ. బాహువే నాకు శస్త్రంబు బలముమీఱ • బాహుసమరంబు గావింతు వడముడివలె
బంధనాగారమున బ్రాజీ బాయుకంటె • యుద్ధమొనరించి విడుచుట యుత్తమంబు.

కాని సాహసమున కిది తఱిగాదు.

(చందనకుఁడు బండిమీఁది కెక్కి చూచును.)

ఆర్య—శరణు శరణు.

చంద—శరణుఁ జెందినవాని కభయ మిచ్చితిని.

ఆర్య—

గీ. శరణు శరణన్నవాని రక్షణము సేయ • నట్టివానిని జయలక్ష్మి యాదరింప
దాదరింపరు నెచ్చెలు లాత్మబాంధ • వులును బదిమంది కూడి నవ్వుదురు వాని.

చంద—ఆర్యకుఁడా ! గోపాలదారకుడా ! డేగకుజిడిసిన పక్షి యుచ్చులొగ్గువాని చేతంబడినది. (ఆలోచించి) ఇతఁ డనపరాధి. చారుదత్తుని బండి యెక్కియున్నాఁ డదియునుంగాక ప్రాణప్రదుడగు నా ప్రియమిత్రుఁడు శర్విలకునిం బ్రియమిత్రము. ఈవల మిత్రుఁడు ; అవల రాజనియోగము; ఏమిచేయుట యుక్తమో తెలియకున్నది. ఏల యీవిచారము ? ముందే యభయమిచ్చితిని, కానున్నది కాకమానదు.

గీ. పరుల కుపకారమొనరింప బాటుపడెడు • వాడు శరణాగతత్రాత కీటుఁ జెందె
నేనిఁ జెందునుగాక తాదృశుని లోకు • లెన్నుదురుగాని నిందింప రిందు నందు.

(భయ మభినయించుచు దిగి) ఆర్యునిం జూచితిని. కాదు కా దార్యురాలగు వసంతసేనను. ఆర్యచారుదత్తు నభిసరింపఁబోవుచున్న నన్ను రాజమార్గ మధ్యమునం బరాభవించుట తగదని యీామె నన్నుఁ గూక లిడుచున్నది !

వీర—చందనక ! నాకు సంశయముగా నున్నది.

చంద—ఏమి ? సంశయమా ?

వీర—

గీ. భయముఁ జెందుచు గద్గదస్వరముతోడ•నార్యు డనిముందు తరువాత నార్యురాల
టంటి వందున సంశయం బందె నామ•నంబు లేకున్నయది నాకు నమ్మకంబు.

చంద—ఓరీ ! నీకు విశ్వాసము లేకపోనేల. మేము దక్షిణాత్యులము. విస్పష్టముగా మాటలాడనేరము. ఖష ఖత్తి ఖడ ఖడట్టబిడ కర్ణాటకర్ణప్రావరణ ద్రావిడ చోళ చీన బర్బరఖేర ఖాన ముఖ మధుఘాతప్రభృతు లగుమ్లేచ్ఛ భాషలలో మే మనేక

భాష లెఱింగినవారము గావున యథేష్టముగా మాటలాడుదుము. ఆర్యుఁడో యార్యురాలో. చూడఁబడినాఁడో చూడఁబడినదో యేదియో యొకటి.

వీర—నేనును జూచెదను. అది రాజుగారి యానతి. దేనికి నాయందు నమ్మకము.

చంద—అయిన నేను నమ్మనివాఁడనా!

వీర—రాజ కార్యముగదా!

చంద—(తనలో) గోపాలదారకుఁడు చారుదత్తునిబండియెక్కి పాఱిపోవుచున్నాఁడని రా జెఱిఁగినఁ జారుదత్తునకు మాటవచ్చును; రాకుండు నుపాయమేదియో! (ఆలోచించి) కర్ణాటకలహములోనికి దింపెదను. తరువాతిమాట చూతము. (ప్రకాశము) ఓరీ! చందనకుఁడు చూచినతరువాత నీవు చూడవలయునా! నీవెవఁడవురా!

వీర—ఓరీ నీ వెవఁడవురా!

చంద—ఓరీ! వీరక! రాజు చనువిచ్చెననియుఁ బదిసార్లు పిలుచుచుండుననియు గర్వించి నీజాతి నీ వెఱుఁగకున్నావురా.

వీర—(కోపంబుగా) నాజాతి యేదిరా!

చంద—ఎవ్వఁడు చెప్పఁగలఁడు?

వీర—నీవే చెప్పుము.

చంద—నేను జెప్పను.

గీ. ఎఱిఁగియుండియు నీజాతి యేను నుడువఁ దత్వముగ, నాస్వభావంబు తాదృశంబు నామనంబున నుండని మ్మేమిఫలము • పచ్చివెలగ పగిల్చిన బరువు గలదె.

వీర—కాదు కాదు నుడువుము నుడువుము.

చంద—(సంజ్ఞచేయును)

వీర—ఏమిరాయది!

చం—

గీ. చేతఁబట్టెద వొక నూఱురాతిముక్కఁ • కత్తియును గత్తెరయు, జుట్లుకలయదువ్వి సంస్కరించెద విది నీదు జాతి; యిట్టి • వాఁడవీవును సేనాధిపతివయితివి.

వీర—ఓరీ! చందనక! నీజాతి నీకును దెలియకుండనున్నది.

చంద—చంద్రునివలె స్వచ్ఛమైన నావంశమునుగూడ నాక్షేపించెదవఁటరా! చెప్పుము చూతము.

వీర—ఎవఁడు చెప్పఁగలఁడు.

చంద—నీవే చెప్పుము.

మృచ్ఛకటికము.

సప్తమాంకము.

(పిదపఁ జారుదత్తుఁడు మైత్రేయుఁడును బ్రవేశింతురు.)

మైత్రే—మిత్రమా! ఈ పుష్పకరండకజీర్ణోద్యానము సొబగు చూడుము.

చారు—అగును మిగులఁజక్కఁగా నున్నది.

గీ. పువ్వులను బణ్యములు కుప్పఁబోసి యిచట•నగకిరాటులు కూరుచున్నారు చూడు
తిరుగుచున్నారు కొనఁగ బంభరపురుషులు•వెలసె నారామ మిది పణ్యవీధియట్లు.

మైత్రే—అయ్యా సంస్కరింపక పోయినను రమణీయమైన యీ శిలాతలమునం
గూరుచుండుము.

చారు—(కూరుచుండి) వయస్యా! వర్ధమానకుఁ డింకను రాలేదేమో!

మైత్రే—నే చెప్పినాఁడ. వర్ధమానకా! శీఘ్రముగ వసంతసేనం దీసికొని రమ్మీయని.

చారు—ఏలొకో తడిసినాఁడు.

మ. తనముందల్లన నేగుబండి నెటులే దాఁటింపనో, తల్గు లూ
డిన సంధింపనొ, భగ్నచక్రమును వెండిన్ గూర్ప నోకాక, బా
టను దారూత్కర మడ్డమైనఁ బెరబాటన్ బట్టఁగానో, మతే
మన నీజా; గదలింపఁడో పసుల వాఁ డల్లల్ల నేతేరఁగన్.

(పిదప గోపాలదారకుఁ డెక్కినబండి తోలుకొని వర్ధమానకుఁడు ప్రవేశించును.)

చేటు—గిత్తలారా! నడువుఁడు నడువుఁడు.

ఆర్య—(తనలో)

గీ. నృపతిభటు నెదురైనచో నెంతొభయము•గదుర, నొకకాల నిగళంబుగ్రాల,దెలియ
కుండ నెక్కితి నితరులబండి కాకి•గూట రక్షింపఁబడియున్న కోకిలగతి.

ఆహా! నగరము వదలి చాల దవ్వు వచ్చితిని. ఈ బండి దిగి చెట్లగుంపులో
దాఁగి యుందునా! లేక బండిమీఁదనే యుండి బండియొడయనిం జూతునా!
చెట్లచాఁటున దాఁగుట మంచిదికాదు. పోయి మహానుభావుని నాచారుదత్తునిఁ
గనుంగొనెదను. అతఁ డాపన్నవత్సలుఁడని విందును.

గీ. అతఁడు నాపదు దురవస్థ నరసెనేని•నిరుపమానపుఁగరుణ కన్పింపఁగలఁడు
చిరతరాపదలో మున్గి చివికియున్న•నాయొడలు నిల్పినవి తద్గుణములు కావె.

చేటు—ఇదిగో! బుష్పకరండకము, లోపలికి బండిఁ దోలుదునా! (తోలి) ఓ మైత్రేయా మైత్రేయ! (అని పిలుచును.)

విదూ—మిత్రమా! నీకొకప్రియము నివేదించెదను. వర్ధమానకుఁడు పిలుచుచున్నాఁడు వసంతసేన వచ్చియుండును,

చారు—ప్రియము ప్రియము.

మైత్రే—వర్ధమానకా! తొత్తుకొడక, యింతసేపేమి చేయుచుంటివిరా?

చేటు—అయ్యా! కోపింపకుము, యానాస్తరణము మఱచి రెండుమూఁడు సార్లట్టిటు తిరుగవలసి వచ్చినది. దాన విలంబనమాయె.

చారు—వర్ధమానకా! బండి త్రిప్పుము. మైత్రేయా! వసంతసేనం దింపుము.

మైత్రే—కాలికి సంకెళ్ళు దగిలించినారా యేమి. యేల దిగలేదు. (లేచి బండిఁ జూచి) వసంతసేన కా దయ్యో! వసంతసేనుఁడయ్యా.

చారు—మైత్రేయా! వేళాకోళమువలదు. స్నేహము కాలవిలంబము నపేక్షింపదు. నీవు దింపుము. లేదా నేను దింపెదను (లేవఁబోవును.)

ఆర్య—(చూచి తనలో) ఇతఁడే చారుదత్తుఁడు కాఁబోలు; వినుటకేకాదు చూచుటకును రమణీయుఁడే (ప్రకాశముగా) ఇఁక బ్రతికితిని.

చారు—(బండి యెక్కి చూచి) మైత్రేయా! ఇతఁడెవ్వరు?

ఉ. ఏనుఁగుగున్న తుండమున కెక్కువ చేతులయంద, మున్నతా
పీనతరాంసభాగముల పెక్కువ, రక్తసరోజపత్రముల్
బోని విలోచనంబులు, సమున్నతవక్షము గల్గియున్న యీ
ప్రాణికి నేలొకో నిగళబంధ మొనర్చిరి కాలి కక్కటా.

అయ్యా! నీ వెవ్వఁడవు?

ఆర్య—శరణాగతుఁడ, నార్యకుఁ డనువాఁడ, గోపాలదారకుఁడ.

చారు—వ్రేపల్లెనుండి రప్పించి పాలకమహారాజు కారాగారమునం బెట్టించెనఁట. ఆతఁడవా నీవు?

ఆర్య—అగును.

చారు—

గీ. దైవయోగంబున లభించెఁ దావకాగమనము కందోయి కానంద జనకమయ్యెఁ
బ్రాణముల నైన వదలెద నంతెకాని వదలఁజాలను శరణన్నవాని నేను.

ఆర్య—(సంతస మభినయించును.)

చారు—వర్ధమానక! యతని కాలిసంకెల యూడఁదీయుము.

చేటు—చిత్తము. (అట్లు చేసి) అయ్యా! నిగళ మూడఁదీసితిని.

ఆర్య—మహాత్మా! కాలిసంకిలి యూడఁదీయించి హృదయమునందు దృఢతరంబైన స్నేహనిగళముం దగిలించితివి.

విదూ—ఆ బంధనము గ్రహింపుము. ఈతఁడు ముక్తుఁడాయెగదా మనమిఁక నేగుదము.

చారు—నిదానించు మోయీ!

ఆర్య—మిత్రమా! చారుదత్త! నేను ప్రణయమున మీబండి యెక్కితిని క్షమింపుము.

చారు—స్వయముగా స్నేహదానము గావించిన నీచే నలంకరింపఁబడితిని.

ఆర్య—సెలవిచ్చినం బోయెదను.

చారు—మంచిది.

ఆర్య—బండి దిగెదను.

చారు—మిత్రమా బండి దిగవలదు. ఇంతదనుకఁ గాళ్లకు బంధనము గావించి యుండుటచే నిపుడు వడిగా నడువఁజాలను. రాజభటు లిట్టటుఁదిరుగు నీ మార్గమున బండి విశ్వాసమును గలిగించును గావున బండిమీఁదనే పోవుము.

ఆర్య—తమ సెలవునకు బద్ధుఁడను.

చారు—ఉ. మేలుగఁ జేరుమా చెలుల

ఆర్య—మిత్రుఁడ వీవె మ తెవ్వరయ్య?

చారు—నీ మ్రోలఁ బ్రసంగమైనఁ దలపోయుదె?

ఆర్య—నా మన మే నెఱుంగనే!

చారు—యేలుదు రెల్లచోట్ల సురలే నిను

ఆర్య—నేలితి వీవె నన్ను

చారు—నింతేల తెమల్చె నిన్ భవదదృష్టమె

ఆర్య—దానికి హేతు వీవకా!

చారు—పాలకుఁడు విక్రమించినచో నీకుం దగిన రక్షకులు లేరు కావున శీఘ్రముగా నావలకు దాఁటుము.

ఆర్య—పునర్దర్శనము లభించునుగాత. (నిష్క్రమించును.)

చారు—మిత్రమా! మనము రాజున కప్రియంబొనర్చి యిటఁ దడయఁజనదు. ఆ నిగళము నా పాడునూతఁ బడవేసి రమ్ము. లేనిచో రాజులు చారచక్షువులచే

గుర్తింపఁగలరు. (ఎడమకన్నదరుట సూచించి) మిత్రమా! వసంతసేన యేమా యెనోకదా ?

క. అదరెడు వామవిలోచన, మెదమల్లడిగొనుచు దందడించెడుఁ గతమె
య్యదియుఁ గానరాకయే, నా హృదయేశ్వరి గాంచనైతి నీనాఁడకటా !

పోవుదమురమ్ము. (పరిక్రమించి)ఇదేమి! అమంగళము. శ్రమణకుఁడెదురై నాఁడు (ఆలోచించి) వీని నీమార్గముననే రానిమ్ము. మన మాదారిని బోవుదము.

(అని నిష్క్రమించును.)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతమగు మృచ్ఛకటికమను
ప్రకరణమున ఆర్యకాపహరణమను సప్తమాంకము.

మృచ్ఛకటికము.

అష్టమాంకము.

(పిదపఁ దడిపంచెఁ జేతఁబూని బౌద్ధసన్యాసి ప్రవేశించుచున్నాఁడు.)

భిక్షు — అజ్ఞరాలా! ధర్మసంగ్రహముఁ గావింపుఁడు.

గీ. ఆఁకలియుదప్పికయుఁబాసిధ్యానపటహ • మెల్లకాలంబులందు వాయించుకొనుచు
మేలుకొనికాచుకొనుఁడింద్రియాలపేరి • తస్కరులపాలు గాకుండ ధర్మధనము.

మఱియు ననిత్యమగు నీ దేహాదికమును నమ్మక మేము ధర్మమునే యాశ్ర యించుచున్నాము.

గీ. ఒడలిపేరిటిగ్రామమందున్నదొంగ • లైదుగురనొంచియునుమాయనవలఁ ద్రోచి
చిత్తచండాలునిగ్రహించిన సురక్షి • తమగు గ్రామంబుదొరకుస్వర్గమునిజమ్ము.

గీ. మొగముఁదలయునుముండితంబులగుఁగాక • మనసుకాదేనిఫలమేమి? మనసెవనికి
ముండితంబగువానికిమొగముఁదలయు • ముండితములైనఁగాకున్న ముండితములె.

జేగురురంగునీళ్ళలోముంచిన యీ చీవరమును రాష్ట్రియస్యాలకు నుద్యానము లోని పుష్కరిణియందు జాడించికొని శీఘ్రముగా లేచి పోయెదను.

(తెరలో) శకా — నిలువుమురా! దుష్టశ్రమణక! నిలువుమురా!

భిక్షు — (చూచి భయముతో) వీఁడె రాజస్యాలకుఁడు సంస్థానకుడు వచ్చుచున్నాఁడు. మున్నొకసన్యాసి వీని కపరాధము చేసెఁగాన వీఁడు తనకంటఁబడిన సన్యాసుల కెల్ల నాఁబోతులకువలె ముక్కుకుట్టి పాఱద్రోలుచున్నాఁడు. ఇక్కడ నాకెవరు దిక్కు? ఎవ్వరిని శరణందును! కానీ, బుద్ధభట్టారకుఁడే నాకు దిక్కు.

(శకారుఁడు ఖడ్గమును బూనిన విటునితోఁగూడఁ బ్రవేశించును.)

శకా — నిలువుమురా! దుష్టసన్యాసి! నిలువుమురా! కల్లంగడిలోనికిఁ దెచ్చిన ముల్లంగిదుంపవలె నీతల చితుకఁగొట్టెదను (సన్యాసిని దన్నును.)

విటు — నిర్వేదమువలనఁ గావిగుడ్డలు ధరించిన సన్యాసిని దన్నుట న్యాయముకాదు. వీనితోనేమి; సుఖోపగమ్యమగు నీ యుద్యానవనముసొబగు గనుంగొనుము.

గీ. దుఃఖవంతులకేసియు దుఃఖమెడపి • సౌఖ్యము నొసంగఁజాలు వృక్షములకలిమిఁ
గుజనుల మనంబుఁబోలె నగుప్తమగుచుఁ • గ్రొత్తరాచరికంబునాఁ గూర్చుమదికి.

భిక్షు — స్వాగతము! ఉపాసకా! యనుగ్రహింపుము!

శకా—బావా! చూడు చూడు. వీఁడు నన్నుఁ దిట్టుచున్నాఁడు.

విటు—ఏమని తిట్టుచున్నాఁడు?

శకా—ఏమనియా! న న్నుపాసకా యన్నాఁడు. నేను మంగలివాఁడనా!

విటు—కాదు కాదు. నీవు బుద్ధోపాసకుఁడ వని నుతించినాఁడు.

శకా—శ్రమణకా! నుతించుము! నుతించుము!

భిక్షు—నీవు ధన్యుఁడవు. నీవు పుణ్యుఁడవు.

శకా—బావా! ధన్యుడవు పుణ్యుడవు నని న న్ననుచున్నాడు. నేను చార్వాకుఁడనా కోష్ఠకుఁడనా! కుంభకారుఁడనా!

విటు—కాదు కాదు. నీవు ధన్యుడవు. పుణ్యుడవు నని కొనియాడుచున్నాడు.

శకా—వీఁ డెందుల కిచ్చటికి వచ్చినాడు?

భిక్షు—ఈ చీవరము జాడించుకొనుటకు వచ్చితిని.

శకా—ఓరీ దుష్టసన్యాసి! ఉద్యానముల కన్నింటికిఁ దలమానికమగు నీ పుష్పకరండకమును మా బావగారు నాకిచ్చిరి. ఇందలి పుష్కరిణిలో గుక్కలు నక్కలును నీళ్ళు త్రాగునుగాని యుత్తమపురుషుడ నగు నేను స్నానము చేయను గదా! ఆ చెఱువులోఁ బ్రాతయులవగుగ్గిళ్ళవంటి రంగుగల యీ ముఱికిగుడ్డ యుతికెదవా! నిన్నొక తాఁపు తన్నెదను.

విటు—కాణేలీమాతా! వీడు క్రొత్తగా సన్యసించి నట్లున్నాడు.

శకా—నీ వెట్లు గుర్తించితివి?

విటు—గుర్తింపవలసిన దేమున్నది.

ఉ. ఫాలము తొల్లి యున్నటులఁ బచ్చగనే తనరారుచుండె శూ
న్యాలకమయ్యెఁ, జీవరకృతాంకము కన్పడ దంసకంబులన్
జాలదు కావిశాటికయుఁ జక్కమెయిన్ ధరియించు నేరుపున్
జేలపుటంచు నిల్వదు విశీర్ణకమై సరిగా బుజంబులన్.

భిక్షు—ఉపాసకుఁడా! నిజము. నేను గొలఁదిదినముల క్రిందటనే సన్న్యసించితిని.

శకా—నీవు పుట్టినవెంటనే యేల సన్న్యసింపలేదు. (అని తన్నుచున్నాఁడు.)

భిక్షు—బుద్ధదేవుఁడా! నమస్కారము. (అని ఏడ్చును.)

విటు—ఏల యీదీనునిఁ దన్నెదవు? పోనీ! వదలుము.

శకా—ఓరీ! ఉండుమురా యాలోచించెదను.

విటు—ఎవనితో నాలోచించుట?

శకా—నా హృదయముతోనే.

విటు — అయ్యో ! వీఁడు పోవఁడాయెనే.

శకా — పుత్రకుఁడా ! హృదయమా ! భట్టారకా ! పుత్రకా ! ఈసన్న్యాసిని వదలుదునా మానుదునా ! (తనలో) వెళ్ళను వలదు. ఉండను వలదు. (ప్రకాశముగ) బావా ! హృదయముతో నాలోచించితిని. నా హృదయ మేమని యాలోచన చెప్పినదనఁగా :—

విటు — ఏమని చెప్పినది ?

శకా — ఏమనియా ! వెళ్ళనీకుము. ఉండనీకుము దిగయూపిరికాని విడువనీకుము. వీఁడిక్కడనే పడిచావవలసినదని.

భిక్షు — దేవా బుద్ధా ! శరణంటిని రక్షింపుము !

విటు — పోనిమ్ము.

శకా — ఒక ప్రతిన గావించినఁగాని వదలను.

విటు — ఏమని ?

శకా — నీళ్ళు కలఁగకుండ బురదనుగలుపవలయు లేదా నీళ్ళు మూటగట్టి బురదలోఁ బోయవలయును.

విటు — ఆహాహా మూర్ఖత్వము !

గీ. బుద్ధి విపరీతకృతులపైఁ బొదలువారు • సల్లశిలఁబోలునొడలుల్లసిల్లువారు
చెడఁబెరిగినట్టి మాంసపుంజెట్టులైన • మోరకుల చేతనిండె నీభూమియకట.

(సన్న్యాసి తిట్టుటనటించును.)

శకా — ఏమచున్నాఁడు ?

విటు — నిన్నుఁగొనియాడుచున్నాఁడు.

శకా — ఓరీ కొనియాడుము కొనియాడుము !

(సన్న్యాసి యాపగిదిఁ దిట్టుచునే వెళ్ళిపోవును.)

విటు — కాణేలీమాతృకా ! ఈ యుద్యానవనము సొబగుఁ గనుంగొనుము.

గీ. పండ్లచేఁ బూలచేనొప్పి, పరువమైన • వల్లరులబిగికౌఁగిండ్ల నుల్లసిల్లి
రాజభటరక్షితములగు భూజములివి•యాంధ్రుగల్లుగృహస్థులోయన సుఖించు.

శకా — బావా ! లెస్సగా వర్ణించితివి.

గీ. కుసుమచిత్రితమయ్యె నీవసుధ, తరులు•కుసుమభారమ్ముచే వంగెఁ గ్రోఁతిగములు
భూమిజాతాగ్రశాఖికల్ పూని వ్రేలు • చున్నయవి చూడు పనసపండ్లోయనంగ.

విటు — కాణేలీమాతృకా ? యీ డాతిపలక మీఁదఁ గూర్చుండుము.

శకా — ఇదిగో గూర్చుంటిని. (అని విటునితోఁ గూర్చుండును) బావా ! అవసంత

నేన మఱపురాకున్నదోయి. దుర్జనవచనమువలె హృదయమునుండి లేచిపో
కున్నది సుమా! R.C

విటు—(తనలో) అప్పగిది నిరాకృతుండయ్యు వీఁడు మరల దానినే స్మరించు
చున్నాఁడు.

గీ. స్త్రీలు తన్ను నిరాకరించినకొలందిఁ • గుజనులకు హెచ్చుఁగామంబు: సుజనతతికి
నంతకంతకుఁ జలచల్లనగుట కద్దు • మొట్టమొదటికి నశియించిపోకకద్దు.

శకా—బావా! బండితీసికొని త్వరగరమ్మని స్థావరకునితోఁజెప్పి చాలసేపాయెఁ
గదా! ఇంకను రాలే దేమో! నా కాఁకలి మిక్కుటమగుచున్నది. నడచి
పోదమన్నను రెండుజాములైనది. మిడిమిడియెండకుఁ గాళ్లు కాలఁగలవు.

గీ. మింటినడిమికిఁ జనుదెంచెఁ గంపె కుపిత • వానరంబన రవిభగవానులిపుడు
భూమిసంతప్తమయ్యెను బుత్రశతము • పోలియఁ బొగిలెడుగాంధారపుత్రివోలె.

విటు—అవునిది యిట్టిదియే.

సీ. నెమరువేయుచు గోగణములు నిద్రింపఁగ సాగె భూమీరుహచ్ఛాయలందుఁ
గాసారములలోని క్రాఁగియున్న జలంబు దప్పివడ్డమృగాలు త్రావఁదొడఁగెఁ
దరుణారుణప్రభాతప్తంబులైన రథ్యలును మనుష్యశూన్యంబు లయ్యె
జలశీతలోశీరదళవేష్టితములైన పడుకటిండ్ల సుఖించెఁ బతియు సతియు

గీ. నెండవేఁడికి జడిసియో యేమొ నీడ • చెట్లక్రిందన యుండె నిట్లట్లు చనక
గిత్తలాయాసపడునంచు దొత్తుకొడుకు•శకట మాపెనుగాఁబోలు స్థావరకుఁడు.

శకా—బావా! గీ. శకుని ఖగవిహంగంబులు శాఖలందు
దాఁగె, రవిరశ్మి నాదు మూర్ధమున దాఁగె
నరులు పురుషమనుష్య లుష్టంపుటూర్పు
గదుర గృహగేహముల నెండఁ గడపుచుండ్రు.

బావా! యిప్పటికిని జేటుఁడు రాలేదు. ఆత్మకు వినోదమునకై కొంచెము
పాట పాడెదను (వెట్టిపాట పాడి) బావా! బావా! వింటివా నాపాట.

విటు—ఏమని నుతింతును! నీవు గాంధర్వాంశమునం బొడమితివి.

శకా—బావా! నేను గంధర్వుఁడ నేల కాను?

గీ. వసయు నగుడంబు శొంఠియు భద్రముస్త•లింగువయు జీలకఱ్ఱయు నేను గంధ
యుక్తముగఁ జేసి భక్షించియుంటి నాస్వ•రంబు కాకుండునే మధురంబు బావ.

బావ! మరలఁబాడెదను (గానముజేసి) బావ! వింటివా?

విటు—ఓహో! గంధర్వుఁడవుగదా!

శకా——

గీ. మిరియ మింగువ పొడిచేసి మేలగించి•తాల్చి ఘృతమున వేఁచి ముద్దగ నొనర్చి
పరభృతపు కఱకుట్లతోపాటు తింటి • నాకు రాకున్నె మధురకంఠస్వరంబు.

బావా! యిప్పటికిని జేటుఁడురాలేదుకద !

విటు——స్వస్థుఁడవగుము. ఇప్పుడే వచ్చును.

(పిదప వసంతసేన యెక్కినబండి తోలుకొని స్థావరకుఁడు ప్రవేశించును.)

స్థావ——మట్టమధ్యాహ్నమైనది. రాజస్యాలకసంస్థానకుఁడు కోపగించునేమో! నాకు భయము పొడముచున్నది. త్వరగా నడువుండు గిత్తలారా! నడువుఁడు.

వసం——అమ్మయ్యో! అమ్మయ్యో! ఇది వర్ధమానకుని కంఠస్వరమువలె లేదు. ఇదియేమో! ఆర్యచారుదత్తుఁడు ఎడ్లయొక్క పరిశ్రమము బాపుటకై వర్ధమానకుఁడు తోలుబండి నిలిపి యింకొక బండియు నింకొక బండివానిని బంపించెనేమో! కుడికన్నదరుచున్న దెందులకో! హృదయము గందరగోళపడుచున్నదేమో! దిక్కులు శూన్యములగుచున్నవి. సర్వము విపరీతముగానున్నది. ఏమి కానున్నదో!

శకా——(చప్పుడు విని) బావా! బావా! బండివచ్చినది.

విటు——ఎట్లు తెలిసినది?

శకా——నీకు వినబడుటలేదా! ముసలిపందివలె గురగురలాడుచున్నది.

విటు——(చూచి) బాగుగఁ గనిపెట్టితివి. నిజమే. వచ్చినది.

శకా——స్థావరకా! చేట కొడకా! వచ్చితివా?

చేటు——చిత్తము వచ్చితిని.

శకా——బండికూడ వచ్చినదా?

స్థా——చిత్తము వచ్చినది.

శకా——గిత్తలు వచ్చినవా?

స్థావ——చిత్తము చిత్తము.

శకా——నీవుకూడ వచ్చితివా?

స్థావ——(నవ్వుచు) భట్టారకా! నేనును వచ్చితిని.

శకా——బండి లోనికిం దీసికొనిరమ్ము.

స్థావ——ఏత్రోవను!

శకా——ఆప్రాకారము పడిపోయినచోట నుండి.

స్థావ——అయ్యో! గిత్తలు చచ్చిపోవును; బండివిఱుగును; ఈమీనొకరును చచ్చిపోవును.

శకా—ఓరీ స్థావరక ! నేనెవఁడను ! రాజస్యాలకుఁడను ; గిత్తలు చచ్చిన నింకొక గిత్తజోడు కొందును. బండివిఱిగిన మరలఁజేయించుకొందును. నీవు చచ్చిన మా కింకొకఁడు దొరకును.

స్థావ—అన్నియు మీకు దొరకును గాని నాకుమాత్రము నేను మిగులను.

శకా—సర్వము నశించిన నశింపనిమ్ము. నీ వాత్రోవనే బండి దీసికొనిరమ్ము.

స్థావ—పదవే బండీ ! నీస్వామితోఁగూడ జదిసిపొమ్ము. నీ తాతవంటిబండి యింకొకటి వచ్చును. నేనీసంగతి అయ్యగారితో జెప్పుదును. (ప్రవేశించి) ఎట్లు ! బండి విఱుగనే లేదే ! భట్టారకా ! బండి వచ్చినది

శకా—ఏమిరా ! గిత్తలు తెగలేదు. త్రాళ్ళు చావలేదు. నీవును విఱుగలేదటరా !

స్థావ—చిత్తము ఏమియు జరుగలేదు.

శకా—బావా చూతము బండి. రా రమ్ము. బావా ! నీవు నాకు గురువవు పరమ గురువవు అంతరంగికుఁడవు, పూజ్యుఁడవు, పురస్కరణీయుఁడవు గాన నీవే ముందు బండి యెక్కుము.

విటు—కానిమ్మన్లే కానిమ్ము. (అని బండి యెక్కుచున్నాఁడు.)

శకా—బావా ! నీవుండుము. ఈబండి నీయబ్బసంపాదించెనా, నీతాతసంపాదించెనా చట్టన యెక్కుచున్నావు దిగు దిగు; బండినాది. నేనే ముందెక్కెదను.

విటు—నీవే యెక్కుమంటివిగదా !

శకా—నేను నిన్నెక్కుమనినను 'అయ్యా ! నీవే ముందెక్కుము' అనవలయును; నిది యాచారము, ఏగోలయు నెఱుఁగవు.

విటు—అయ్యా ! నీవే ముందెక్కుము.

శకా—ఇదిగో ! ఎక్కుచున్నాను. పుత్రకా ! స్థావరక ! బండి త్రిప్పుము.

స్థావ—(బండి త్రిప్పి) భట్టారక ! ఎక్కుము.

శకా—(ఎక్కిచూచి భయపడి గుభాలునఁ గ్రిందికుఱికి విటుని కంఠము గట్టిగాఁ గౌఁగిలించి) బావా బావ ! చచ్చిపోతివి. చచ్చిపోతివి. బండిమీఁద రక్కసియో దొంగయో యున్నది. రాక్షసియైన మనలఁ దోఁచుకొనును దొంగయయిన భక్షించును.

విటు—భయపడకుము. ఎద్దులబండిమీఁద రాక్షసియుండునా ? మట్టమధ్యాహ్నమగుటచే నీదృష్టి చెదరినది. చొక్కా తొడుగుకొనిన స్థావరకుని నీడఁజూచి యట్లు భ్రాంతిపడలేదుగద ?

శకా—బాబూ ! స్థావరక ! బ్రతికియున్నావా !

స్థావ—బ్రతికియున్నానయ్యా!

శకా—బావా! బండిలో నెవ్వతెయో స్త్రీ యొకతె యున్నది చూడుము.

విటు—ఆఁడుదియా!

గీ. మొగముపై జల్లుకొట్ట నాఁబోతు లేగు • పగిది(బోదము వడిఁ దలవంచికొనుచు
గౌరవంబాసపడునాదు కన్నుదోయి • భయముజెందుఁ గులస్త్రీలపట్ల నెపుడు.

వసం—(ఆశ్చర్యముతో దనలో) ఏమీ! నాకందోయి కాయాసముఁ గలుగఁజేయు రాజస్యాలకుఁడే వీఁడు. మందభాగ్యురాలను చిక్కున బడిపోతినికదా! ఊషర క్షేత్రపతితములగువిత్తులవలె నాపడినప్రయాస మంతయు నిష్ఫలమైనది. నేనేమి చేయుదాన!

శకా—ఈముదిపంద చేటుఁడు భయపడుచున్నాఁడు. బావా నీవు బండిలోనికిఁ జూడుము.

విటు—ఇందు దోస మేమున్నది? అటులనే చూచెదను.

శకా—ఓహో! నక్క లెగురుచున్నవి. కాకులు పఱువిడుచున్నవి. బావ నారాక్షసి దంతములతో జూచి నేత్రములచే భక్షించునంతలో నేను పాటిపోయెదను.

విటు—(వసంతసేనం జూచి విషాదముతోఁ దనలో) కటకటా! లేడిచెలువ పెద్ద పులి వెంటఁ దలిగినదేమి! ఎంతకష్ట మెంతకష్టము!

గీ. పూర్ణశారదచంద్రుని బోలి పులిన • మందు శయనించియున్న రాయంచతోడఁ
గలసి సుఖమొందఁ దగునంచకలికి యకట • కాకిపాలను బడెఁ గాలకర్మవశత.

(జనాంతికముగ) వసంతసేనా! ఈపని అయుక్తము. నీకుఁ దగినదిగాదు.

గీ. మొదట నభిమానపడియును బిదపఁ దల్లి•వచనమున నిట్టు లకట ద్రవ్యంబుకొఱకు

వసం—లేదు లేదు (అని తలత్రిప్పుచున్నది)

విటు— ధైర్య మెదనిల్పుకోలేనిదాని నిన్ను • వేశభావంబు తుదకుఁ బ్రవేశపెట్టె.

నేను నీతో నాఁ డంటినిగదా. 'కలిగెంబోభువి అంతగూడెములు మాకై సుంతయోజింపుమా' అని (ఆపద్యము చదువును.)

వసం—బండి మార్పుదలచే నిట్లు వచ్చితిని. శరణాగతురాలను రక్షింపుము.

విటు—భయపడకుము. కానీ, వీని నే మోసపుచ్చెదనులే (శకారుని సమీపించి) కాణేలీమాతృకా! నిజముగా నిందున్నది రాక్షసియే సుమీ!

శకా—బావ! నిజముగా రక్కసియైన నిన్నేల దోఁచుకొనలేదు; లేక దొంగయైనచో నిన్నేల మ్రింగలేదు.

విటు—ఏల యీవివేచనము ఈ యారామముల నడుమనుండి యుజ్జయినీపురము

లోనికి గాలి నడకనే పోవుట మేలు.

శకా—అట్లు చేసిన నేమియగును?

విటు—వ్యాయామము కలుగును, గిత్తల కాయాసముతీఱును.

శకా—మంచిది. ఆ శ్లేకానిత్తము. స్థావరకా! నీవు బండి తీసికొనిపొమ్ము. వలదు వలదు తీసికొనిపోకుము. దేవతలముందఅను బ్రాహ్మణులముందఅను నేను గాలి నడక నేలవత్తును? వలదు వలదు. బండియెక్కియే వచ్చెదను. నేను శకటము మీఁదఁ బోవుచుండగా వారందఱు 'వీఁడే రాజస్యాలకుఁడు భట్టారకుఁ' డని దవ్వులనిలిచి చెప్పుకొనవలెను.

విటు—(తనలో) విషము నౌషధముచేయుట కష్టముకదా! ఇట్లగుఁగాక (ప్రకాశముగ) కాణేలీమాతృకా! యీబండిమీఁద నున్నది వసంతసేన. నిన్నభిసరించుటకై వచ్చినది.

వసం—పాపము శాంతించునుగాక, పాపము శాంతించును గాక.

శకా—బావ! నేను ప్రవరపురుషుఁడననియు, మనుష్యుఁడననియు, వాసుదేవుఁడననియునా వచ్చినది?

విటు—అవును, అవును.

శకా—నాకపూర్వమైన యదృష్టము పట్టినది. నాఁ డామెను గోపగింపఁజేసితిని. నేఁడు పాదములంబడి బ్రతిమాలుకొనెదను.

విటు—మంచిమాట నుడివితివి.

శకా—ఇదె కాళ్ళపైఁ బడుచున్నాను. (అని వసంతసేనను సమీపించి) అమ్మా, తల్లీ! నామనవి యాలింపుము.

గీ. స్థూలలోచన! దశనఖా! శుద్ధదంతి! • చరణములమీఁదఁ బడుదు నంజలిఘటింతు
నీకు దాసుఁడ మదనార్తి నేను నాఁడు • నీకుఁజేసిన తప్పు మన్నింపుమమ్మ.
(పాదములమీఁదఁ బడబోవును)

వసం—(కోపముతో) ఛీ మూర్ఖా! అయుక్తప్రశంస చేయకుము (కాలితో తన్నును)

శకా—(కోపమున)

గీ. అమ్మలును దల్లులును ముద్దులాడినట్టి • దెన్నఁడును దేవునకునైన నెఱఁగనట్టి
దీశిరముఁ గాలఁదన్నితివేమె! యడవిఁ•బీనుఁగతల జంబుకము దన్నువిధముగాఁగ.
ఓరీ స్థావరక, చేట! నీకిది యెచ్చట దొరకినదిరా?

స్థావ—అయ్యా! రాజమార్గ మూరి బండ్లచే సందులేక యుండఁగా నేనీబండి చారుదత్తుని వృక్షవాటికాద్వారంబునం దాఁపి మఱియొకని బండిచక్రములు త్రిప్పఁ

బోయితిని. ఆ సమయమున నీమె యింకొకబండి యెక్కబోవునదియై యిదియే యదియని యెక్కెఁగాఁబోలు నే నెఱుంగను.

శకా—ఓహో! శకట విపర్యాసమున వచ్చితివా; నన్నభిసరించుటకు రాలేదు. అటులేని నాబండిదిగు. దరిద్రుఁడగు నాసార్థవాహకపుత్రు నభిసరించుటకు బోవుచుంటివా? నిన్ను నాగి త్తలు మోయవలెనా! దిగు దిగు గర్భదాసికానా! దిగుము.

వసం—ఆర్యచారుదత్తు నభిసరింపఁ బోవుచున్నాననుమాట సత్యము. ఆపలుకు వలన మిగుల నలంకరింపఁబడితిని. ఇప్పుడు కానున్నది కాకమానదు. కానిమ్ము.

శకా—

గీ. కుముదపత్రంబులనుబోలు గోళ్లుపదియు • నీయొడల గ్రుచ్చిగ్రుచ్చి జటాయువపుడు వాలిపెండ్లము నీడ్చిన పగిది వేణిఁ • బట్టి పడలాగువాఁడ నిన్ బండినుండి.

విటు—

గీ. గుణసమన్వితలై యున్న కుముదపత్ర • నేత్రలను గొప్పుపట్టుట నీతిగాదు పూవుఁదోఁటలలోనున్న భూమిజముల • పల్లవంబులఁ ద్రుంచుట భావ్యమగునె?

కావున నీయుద్యోగము విడువుము. నీవిటు రమ్ము. నే నామెను బండినుండి దింపెదను: వసంతసేనా! బండి దిగుము.

(వసంతసేన దిగి యేకాంతస్థలమున నిలుచును.)

శకా—(తనలో) వెనుక నామాట నిరాకరించుటంజేసిన కోపాగ్ని నిప్పుడు పాద ప్రహారముచేఁ బ్రజ్వలింపఁ జేసినది కావున దీని నిపుడు చంపెదను కానీ! యిట్లు చేసెదను. (ప్రకాశము) బావా! బావ!

గీ. చుహూచుహూ చుహూచుహూయంచు సొక్కుచుఁ బల
లంబు నాతోడఁ దినఁగఁ దలంచితేని
కుచ్చులల్లాడు నెసకంపుక్రొమ్మెఱుంగు
టుత్తరీయంబుధరియింప నూహయేని,-

విటు—ఉన్నచో నేమందువు?

శకా—నా చెప్పిన మాట వినుము, నాప్రియ మొనరింపుము.

విటు—అకార్యము కాకున్నఁ దప్పక కావింతును.

శకా—అకార్యము లేశమైనను లేదు, ఇది రాక్షసియుగాదు.

విటు—అటులేని వాక్రుచ్చుము.

శకా—వసంతసేనం జంపుము.

విటు—(చెవులు మూసికొని.)

ఉ. ఆఁడుది బాల యీనగరి కంతయు మేలివిభూషణంబు రో
చేడియయయ్యొ దాని కులచేష్టలు లేనిది నాకుఁ జంపఁ జే
తూడునె? యాడెఁబో యిటు నిరాగసురాలికి నెగ్గుసేయు నా
కోడ లభింపనేర్చునె యయో పరలోకనదిం దరింపఁగన్.

శకా—నీకు నే నోడనిచ్చెద. నదియునుంగాక జనశూన్యమగు నీయుద్యానంబునం జంపినచో ని న్నెవఁడు చూచును.

విటు—ఎవరు చూతురా.

గీ. దెసలు ధర్మానిలులు వనదేవతలును • చంద్రసూర్యులు నంతరిక్షంబు నంత
రాత్మయును భూమి పాపపుణ్యములనెపుడు•జూచుచుందు రికెవ్వరు జూడకున్న.

శకా—అటులేని బట్టచాటుచేసి చంపుము.

విటు—మూర్ఖుఁడా! చెడిపోవుచుంటివిరా?

శకా—ఈ ముసలినక్క యధర్మమునకు జడియుచున్నాఁడు గావున స్థావరకునిం బ్రతిమాలుకొనియెదను. స్థావరకా! చేట! పుత్రకా! బంగారు కడియములు బహుమతి యొసంగెదను.

స్థావ—ధరించెదను.

శకా—నీకు బంగారుపీఁట చేయించి యిచ్చెదనురా!

స్థావ—నేను గూర్చుందును.

శకా—నే దినఁగా మిగిలినది నీ కిచ్చెదను.

స్థావ—తిందును.

శకా—నిన్నందఱి చేటులలోఁ బ్రధానునిఁ గావించెదను.

స్థావ—ప్రధానినయ్యెదను.

శకా—అట్లుచో నాయానతి సేయుము.

స్థావ—అకార్యము కాకున్నచోఁ గావించెదను.

శకా—ఇం దకార్యము లేశమయిన లేదు.

స్థావ—అటులేని సెలవిండు.

శకా—వసంతసేనను జంపుము

స్థావ—అయ్యా! శకటవిపర్యాసమున నామె నిచ్చుటకిఁ దీసికొనివచ్చుటయె నాది మొదటితప్పు.

శకా—ఓరీ చేటా! నీచేతఁగూడ మాటవినిపింప లేకున్నానురా.

స్థావ.—మీరు నాశరీరమునకుఁ బ్రభువులుకాని శీలమునకుఁగాదు. కావున నన్ను గ్రహింపుఁడు. నేను భయపడుచున్నాను.

శకా—నాపరిచారకుఁడవైన నీకు భయ మెవరివలనరా?

స్థావ—పరలోకము వలన.

శకా—పరలోకమనగా నెవరు?

స్థావ—అయ్యా సుకృత దుష్కృత పరిణామమే పరలోకము.

శకా—సుకృత పరిణామ మనగా నేమి?

స్థావ—నీకు బంగరు మురుగులు మురిడీలు లభింపఁజేసినదే సుకృతపరిణామము,

శకా—దుష్కృత పరిణామ మనఁగా నేమి?

స్థావ—నాచే నొరులకు సేవచేయించుచుఁ బరపిండమును దినఁజేసినదే దుష్కృతము. కావున నే నీ యకార్యమొనరింపను.

శకా—చంపవఁటరా! (అని పెక్కుభంగులఁ దన్నుచున్నాడు.)

స్థావ—భట్టారకా! తన్నుము చంపుము. నే నకార్యము మాత్రము చేయజాలను.

గీ. తొల్లి నాయొనరించిన దుష్కృతంబు • గర్భదాసునిఁ గావించెఁ గాదె నన్ను
నీభవంబున సైతి మల్లే యొనర్చి • యేమి కాబోవువాడనో యింక నేను.

వసం—అయ్యా! శరణుఁజెందినదానను. రక్షింపుము.

విటు—కాణేలిమాతృకా! సహింపుము సహింపుము స్థావరకా! సెబాసు.

గీ. దశతొలగి లేమిజెందియు దాస్యవృత్తి • నేయునీకంటె నధముండు నీయొడయడు
ఏలచెందరు నాశ మీదృశులు చెట్ట • నేయుచుందురు శుభకృతి నేయరెపుడు.

మఱియును.

గీ. నీకుబ్రభుత దాస్యంబు వీనికి నొసంగి • నట్టి రంధ్రానుసారి కృతాంతుఁ డకట!
విషమబుద్ధిసుమీ! నిన్ను వీని. వీని • నిన్నుగాఁ జేసికద వర్ణనీయుడగును.

శకా—(తనలో) యీముసలినక్క యధర్మమునకు జడియుచున్నాఁడు. ఈ గర్భదాసుఁడు పరలోకమునకు భీతిలుచున్నాడు. నేను రాష్ట్రియస్యాలకుడను వరపురుష మనుష్యుడను నాకేమి భయము. (ప్రకాశముగా) ఓరీ గర్భదాస చేటపోరా పొమ్మురా! తలుపు బిగించుకొని గదిలోదూఱి విశ్రమింపుమురా!

స్థావ—దేవర సెలవిచ్చినట్లే కావించెదను. (వసంతసేనను సమీపించి) వసంతసేనా! నాశక్తి యింతవరకే (నిష్క్రమించును.)

శకా—(నడికట్టుకట్టి) వసంతసేనా! నిన్నుచంపెదను నిలుచుండుము.

విటు—ఓరీ దుర్మార్గుడ! నాయెదుటనే చంపెదవురా! (కంఠము పట్టుకొనును.)

శకా—(భూమిపై పడుచున్నాడు) బావా! నన్నుఁజంపెదవా! (మోహముజెంది మూర్ఛతెలిసి)

గీ. పుట్టువాదిగనీవు నాపెట్టినట్టి • నేతినంజుళ్ళ పోలిచేతనే పెరిగియుఁ
దగినసమయంబు వచ్చిన తఱిని నాకు • బ్రతిఘటించెదవా? బావః పరుడవగుచు.

(తనలో) కానీ నా కుపాయము దొరకినది. ఈ వృద్ధసృగాలము తలయూచి నన్ను హెచ్చరించినాడు. కావున వీనింబంపి వసంతసేనం గడతేర్చెదను. ఇట్లు గావింతును. (ప్రకాశముగా) బావా! మల్లకప్రమాణంబగు కులంబునం బొడమిన నేనుమాత్ర మకార్యము గావింతునా దీనిని లో బఱచుకొనుట కట్లంటిని.

విటు—

గీ. ఉత్తమకులంబుతోడ బ్రయోజనంబు • లేదు సచ్ఛీలమొకటి కల్గినను జాలు
మంచిక్షేత్రంబునందు జన్మించి కంట • కద్రుమంబులు నభివృద్ధిఁ గాంచకున్నె.

శకా—బావా! ఈలంజె నీయెదుట సిగ్గుపడుచున్నది. నీవు పోయినఁగాని నామాట వినదు. పొమ్ము; స్థావరకుని దన్ని సాగదోలితిని. పరుగెత్తుచున్నాడు. వానిం దీసికొని మరల రమ్ము.

విటు—(తనలో)

గీ. సిగ్గుపడెనేమొకొ వసంతసేన నా స • మీపమున మూర్ఖు వీని గమింపఁబోదు
కాన నీప్రదేశము వివిక్తంబొనర్తు • మరుగుచోఁ గదా కాముఁ డరుగుచోటు.

(ప్రకాశముగా) మంచిది. నే బోదును.

వసం—(విటుని యుత్తరీయము కొంగులాగి) అయ్యా! శరణంటినిగదా! దీనురాలైన నన్ను వదలుట న్యాయమా!

విటు—వసంతసేనా! భయపడకుము! (శకారునితో) కాణేలీమాతృకా! వసంతసేనను నీచేతుల నిడిపోవుచున్నానుసుమా! నీదే భారము,

శకా—నిజము. బావా! నాచేతి కప్పగించితివి.

విటు—నిజమేనా!

శకా—నిజము.

విటు—(కొన్నియడుగులు నడిచి) ఈనృశంసుఁడు నే నావలకు బోయినవెనుక నిది యంగీకరింపనిచో జంపునేమో! కావునఁ జాటునుండి వీడు చేయదలచిన పనిఁ జూచెదను. (అని మరుగున నిలుచును.)

శకా—కానీ! దీనిం జంపెదను. ఈ కపటబ్రాహ్మణుఁడు, ముసలినక్క చాఁటున నుండునేమో! పోయి నక్కజిత్తులు చేయగలడు. వీనిని మోసపుచ్చుటకై

యిల్లు చేసెదను. (పువ్వులుకోసి తన్నలంకరించుకొని) బాలా! బాలా! వసంత సేన! యిటురమ్మ.

విటు—వీఁడు కాముకుఁడైనాడు. ఇఁక నకార్యము జరిగింపడు. నేను బోవచ్చును. (నిష్క్రమించును.)

శకా—

గీ. పైఁడి యొసగుదు నేఁబ్రియభాషినగుదు । బాదములబడెదను దలపాగతోడ
సేవకుడ నాదుమనవిని జిత్తగింప । కునికిఁ, బురుషులు కష్టభాజనులుగారె!

వసం—సందేహమేమి? రవంతసేపుతాళుము. (తలవంచుకొని)

గీ. చాలు దుర్మార్గుడా! దుష్టచరిత! నన్ను । లోభపఱచెదవా ధనప్రాభవమునఁ
జారుదత్తుఁ ద్యజింపగాఁ జాల నేను । గమలమును నాడుతుమ్మెదకరణి నెపుడు.

గీ. కులము శీలంబుఁగలవాని లలన లెందు । గూడవలె వాడు శుద్ధరిక్తుడగుఁగాక
సానికొమ్మలుసైతము సదృశజనస । మాగమము గోరగా వలదనునె మరుఁడు.

మఱియును సహకారవృక్షము నాశ్రయించినదానను బలాశవృక్షము నాశ్రయింతునా!

శకా—తొత్తుకూతుర! దరిద్రచారుదత్తుఁడు సహకారవృక్షమా! రాష్ట్రియస్యాలకుఁడు పలాశవృక్షమా! కింశుకవృక్షమైనను గాఁడుగా! నీవు నన్ను పరిభవించుచు దరిద్రచారుదత్తునే స్మరించుచున్నావా!

వసం—నేను స్మరింపనక్కరలేదు, సర్వదా నాహృదయమంద యున్నాఁడు.

శకా—అటులేని నీహృదయమందున్నవాని నిన్నుఁగూడ రూపుమాపెదను జూడు. దరిద్ర సార్థవాహకకాముకీ! నిలునిలుము.

వసం—అనుమనుము. మరల ననుము. నీవామహానుభావునిపే రెన్నిసారు లుచ్చరించినను నాకు సంతోషమే.

శకా—ఆ దరిద్రగొట్టుతొత్తుకొడుకు వచ్చి యడ్డుపడునేమో చూత మిదిగో నిన్నుఁ జంపుచున్నవాఁడను.

వసం—నన్ను జూచినయేని రక్షించును.

శకా—లంజె! మరల నిట్లా దరిద్రచారుదత్తునకై పలవించెదవు?

గీ. అతడు దేవేంద్రుడో వాలిసుతుడు స్వర్ధ । పాలుడో రంభకొడుకైన కాలనేమి
ద్రోణసుతుడు జటాయువో ధుంధుమారుఁడో త్రిశంకువో చాణక్యుడో శివుండొ.

కాక యీ నుడివినవారందఱుఁ జనుదెంచి నిన్ను రక్షింపలేదు.

గీ. భారతయుగానఁ జాణక్యవీరుడెట్లు • చంపెనో సీతను, జటాయు వంపగముల
ద్రుపదపుత్రిక నేరీతిఁ ద్రుంచినాఁడొ • నేఁడు గడతేర్తు నట్లనే నిన్ను నేను.
(తన్నబోవుచున్నాఁడు)

వసం—హాతల్లీ ! యెచటనున్నావు ? హాచారుదత్త ! ఈనీప్రేయసి యసంపూర్ణ మనోరథావస్థతోనే చచ్చిపోవుచున్నది. ఎలుగెత్తి యేడ్చెదను. చీ ! వసంతసేన యెలుగెత్తి యేడ్చుచున్నదన సిగ్గుగావా ! ఆర్య చారుదత్త ! నీకిదియే తుది నమస్కారము.

శకా—ఈగర్భదాసి యిప్పటికి నాపాపిచారుదత్తునే స్మరించుచున్నది. (మెడ నొక్కి పట్టుకొని) గర్భదాసీ ! తలంపుము తలంపుము.

వసం—చారుదత్తా ! నమస్కారము.

శకా—చావుము, గర్భదాసీ ! చావుము. (అని మెడఁబిసుకును)

వసం—(మూర్ఛితురాలై నిశ్చేష్టురాలై క్రిందబడును)

శకా—(సంతోషముతో)

గీ. దోసములకూఁత, మవినయావాసభూమి • కాలవశగత దుష్ట యీకాంత నన్య
రక్తఁ జంపి చూపితిని శూరత్వమిదిగొ • చచ్చె భారతమున సీత చచ్చినట్లు.

గీ. మేము కామింప మమ్ముగామింప దనెడు • కోపమున జంపినారమీ కుటిలగణిక
నహహ పుష్పకరండకోద్యానమందు•మెడ నదిమిపట్టి యొరుకంటబడకయుండ.

గీ. ఇట్టినాదగు సాహసకృత్యమునకు • ద్రౌపదీదేవిఁ బోలు మాతల్లియేని
తండ్రియేనియు మఱి యన్నదమ్ములేని • నెంతగా సంతసింతురో యిచటనున్న.

కాని, ముదుసలి వఱడు వచ్చునేమో చాఁటునడాగెదను. (అని డాగును)

విటు—(చేటునితోఁ బ్రవేశించి) స్థావరకుని బ్రతిమాలి తీసికొనివచ్చితిని. ఈ కాణే లీపుత్రుఁ డెచట నున్నాఁడో చూచెదను. (పరిక్రమించి చూచి) దారికడ్డముగ నిచట చెట్టుగూలిఁ యొక యాఁడుది మడసినది. ఓసి పాపివృక్షమా ! ఎంత దుష్కార్య మొనర్చితివే ఈహతస్త్రీ దర్శనముచే, నీతోపాటు మేమును పతితుల మైతిమి. ఈ యపశకునముచే వసంతసేన విషయమున నాహృదయ మారాటము నెందుచున్నది. సర్వవిధముల దేవత లామెకు శుభము గావింతురుగాక. (శకారుని సమీపించి) కాణేలీమాతృకా ! వీఁడె స్థావరకుఁడు. బతిమాలి తీసికొని వచ్చితిని.

శకా—బావా సుఖముగ వచ్చితివిగద! పుత్రకా! స్థావరకచేటుడ! నీకుస్వాగతమేకద!

స్థావ—దేవా ! చిత్తము.

విటు—నేనింతకుముందు నీచేతి కప్పగించితినే, దానిని మరల నొప్పగింపుము.
శకా—నీ వప్పగించినదేది ?
విటు—వసంతసేన.
శకా—పోయినది.
విటు—ఎక్కడికి ?
శకా—నీ వెన్వెంటనే పోయినది.
విటు—(సవితర్కముగ) నేను బోయినదెస కామె రాలేదే!
శకా—నీ వేదెసకుఁ బోయితివి ?
విటు—తూర్పుదెసకు.
శకా—అది దక్షిణదిక్కునకుఁ బోయినది.
విటు—నేను దక్షిణదిక్కునకే యేగితిని.
శకా—అది ఉత్తరదిక్కునకుఁ బోయినది.
విటు—ఆకులపాటుతోఁ జెప్పుచుంటివి. నాయంతరాత్మకు నమ్మికలేదు. నిజము చెప్పుము.
శకా—బావా! ఒట్టుసుమీ. నీనెత్తిమీఁద నాకాళ్లు పెట్టినట్లే. నీహృదయమును పదిలపఱచుము. దానిం జంపితిని.
విటు—(దుఃఖముతో) నిజముగాఁ జంపితివా ?
శకా—నామాటయందు నమ్మకము లేదేని పద రాష్ట్రియశ్యాలకసంస్థాపకుని శూరత్వమును గనుఁగొందువు (పడియున్న వసంతసేనం జూపును.)
విటు—(చూచి) హాహా! యెంతనిర్భాగ్యుడను. (అని మూర్ఛపోవును)
శకా—హీహీహీ! బావయుం జచ్చెనా యేమి ?
స్థావ—అయ్యా! విచారింపకుము. చూడకుండ బండితోలుకొని వచ్చిననేనే వసంతసేనను జంపినవాఁడనైతిని.
విటు—(మూర్ఛ తెలిసి) హా వసంతసేనా! హా వసంతసేన!

సీ. దాక్షిణ్యజలమునదరులు ముంచుచుఁ బాఱు వొడుపుచేరా! యెండిపోతివయయొ
తనలోకముత్యజించి చనుదెంచినరతీసతీ! పోతివటవె స్వదేశమునకు
నడుగంటిపోతివా యకట సౌభాగ్యరత్నాకరమా! మన్మథాపణంబ!
చిరునవ్వుసుమతిన్నె చెన్నుఁగైకొన్న సౌజన్యనదీ! పూర్ణచంద్రవదన!

గీ. నగలు మెయినిండబూని మందగతిమీఱ • నొలుకు సింగారమున బేర్మిచిలుక నీవు
నడచి యేతెంచు టింకఁ గన్పడకయుండ • జేసెనే మాలపెనువేల్పు చెడ్డయకట

(కన్నీరుఁ దుడుచుకొనుచు) హాహా! ఎంతకష్ట మెంతకష్టము!

గీ. పాపకల్పుండు వీడు నిర్భాగ్యుడకట • పాపమింతేని నెఱుఁగక పట్టనమున
కెల్లమండన మగు నిన్ను నేవు మాపె • వీని కేమెగ్గు నీవు గావించినావొ.

(తనలో) ఈపాపాత్ముఁ డీయకార్యమును నామీఁదికి ద్రోయగలడు. కావున నిటనుండి పోయెదను. (పోవుచున్నాడు)

శకా—(వెళ్ళనీకుండఁ బట్టుకొనును)

విటు—ఓరీపాపాత్మ! నన్నుముట్టకుము! నీజోలి నాకింకవలదు. నన్ను బోనిమ్ము.

శకా—ఓరీ! వసంతసేనను నీవుచంపి నామీఁద నాదోషమారోపించి నన్ను దిక్కుమాలిన వానింజేసి యెక్కడికిఁ బోయెదవురా?

విటు—ఛీ పొమ్ము. చావుము.

శకా—

గీ. కాసు లిచ్చెద నీకు బంగార మిచ్చు • వాడ వందలకొలది నావాఁడవగుచు
మొనని యస్మత్ప్రతిష్ఠకు మూలమైన • దోషమును బంచుకొమ్ము నాతోడగూడి

విటు—ఛీ! నాకీపాపమును బంచకుము. నీవే ప్రామికొనుము.

చేటు—పాపము శాంతించును గాక!

శకా—(నవ్వుచున్నాఁడు.)

విటు—

గీ. లేకి! నీకగుశాస్తి. చాలించు నవ్వు • పరిభవము గూర్చు నీప్రీతి వలన నాకుఁ
జాలుఁ బదివేలువచ్చె; నీజోలివలదు • విడుతు నిను నిర్గుణంబైన విల్లుబోలె.

శకా—బావా! అనుగ్రహింపు మనుగ్రహింపుము. రమ్ము, సరసియందు జలకము లాడుదము.

విటు—

గీ. మున్నె నీచెల్మికల్మి నన్ బ్రువ్వదిట్టు • చుండెఁ బౌరలోక మ్మవార్యుండటంచు
శంకితార్తాక్షముగఁ బురసతులుగాంచి • త్రీఘ్నుడని తిట్టనిన్నింకఁ జేరుపెట్లు.

(కరుణముగా) వసంతసేన!

గీ. ఎన్నిజన్మంబు లెత్తిన నింకమీఁద • నిట్టివేశ్యాకులంబునఁ బుట్టఁబోక
గుణము చారిత్రమును గూడుకొన్న మంచి•కులమునందుజనింపుము కోమలాంగి.

శకా—నా పుష్పకరండక జీర్ణోద్యానమున వసంతసేనను జంపి యెచటికిఁ బాటి పోయెదవు. రమ్ము, మాబావగారియెదుట వ్యవహారమునకు నుత్తరవాదివిగమ్ము. (పట్టుకొనును)

విటు—చీ, జాల్మ ! నిలువుము. (యొఱనుండి కత్తిని లాగుచున్నాఁడు.)

శకా—(భయముతోఁ బరుగెత్తుచు) ఓరీ భయపడితివాయేమి ? నీవు పొమ్ము.

విటు—(తనలో) ఇచట నిలుచుట తగదు. ఆర్యులగు శర్విలక చందనకు లున్న చోటికిఁ బోయెదను. (నిష్క్రమించును)

శకా—పో. పీడవదలినది. ఓరి స్థావరకా ! నే నేమిచేసితినో చెప్పుము.

స్థావ—భట్టారక ! గొప్ప యకృత్యమే చేసితిరి.

శకా—ఏమంటివిరా ! నే నకృత్యము చేసితినా ! పోనీ. నీకీ నగ లిచ్చెదను. తీసి కొనుము. ఇవి అలంకారసమయమున మాత్రము నావి. ఇతరసమయముల నీవి.

స్థావ—ఈనగలు దేవరకే శోభించును. నాకేల ?

శకా—నీవీయెద్దులను బండిని దోలుకొని పోయి మదీయ ప్రాసాదాగ్రప్రతోళికయం దుండుము.

స్థావ—చిత్తము. (నిష్క్రమించును)

శకా—తనమీఁది కీ యపవాదరాకుండ బావ దాఁటినాఁడు. ఇఁకఁ జేటుఁడొకఁ డున్నాడు. వానిని ప్రాసాదప్రతోళికయం దుండుమంటినిగదా ! వాని కాళ్ళకు సంకెలలు తగిల్చెదను. ఇటులేని మంత్రము సురక్షితమగు గావున నింటికేగె దను. వలదు వలదు. అది మృతిచెందినదో బ్రదికియున్నదో చూడవలయును. బ్రతికియున్నచో మరలఁజావమోది పంపెదను (చూచి) చప్పగాఁ బచ్చినది. ఈ యుత్తరీయము మీఁద గప్పెదను. వలదు వలదు. దీనిపై నున్న నాపేరుచూచిన తగవరులు గుర్తింతురు. కావున వాయుదేవునిచే రాల్పఁబడిన పండుటాకులచేఁ గప్పెదను. (అట్లుచేసి ఆలోచించి) అధికరణంబునకుం బోయి "ధననిమిత్తము చారుదత్తుఁడు నాపుష్పకరండకోద్యానంబున వసంతసేనయను సానిదానిం జంపి పాఱవేసినాఁ" డని వ్యవహారపత్ర మొసంగి తగవు నడపెదను.

గీ. చారుదత్తుని దేహనాశంబు కొఱకుఁ • దగిననూతనకపట మిప్పగిదిఁ గాన
కాశిలో గోవు జంపినకరణి నేఁడు • దారుణంబుగఁ జంపింతుఁ జారుదత్తు.

కానీ ! పోయెదను. (ఎదుటఁ జూచి) అమ్మయ్యో ! అమ్మయ్యో ! నే నే దారిని బోవలె ననుకొన్నను ఈదుష్టశ్రమణకుఁడు జేగురురంగద్దిన ప్రాతగుడ్డ వ్రేలాడ నాపైపునకే చనుదెంచుచున్నాడు. మున్ను వీనిముక్కుగుట్టి వదలితి గాన వీనికి నామీఁదపగ. వీఁడు నన్నుఁ జూచెనేని నేనే చంపితినని బయటఁ బెట్టును. ఇఁక నే నేత్రోవను బోదునో ! (ఆలోచించి) కానీ ! సగము పడిపో యిన ప్రహరిగోడ దూఁకి పరువెత్తెదను.

గీ. ధరణియందునుమింటఁ బాతాళమందుఁ,బొందరగఁబోవునామహేంద్రుడుహనుమ
లంకలోపలి ప్రాకారలంఘనంబుఁ • జేయుగతి గోడ దాఁటెదఁ జిత్రముగను.

(నిష్క్రమించును.)

భిక్షు—(అపటీక్షేపముగాఁ బ్రవేశించి) ఈకాషాయవస్త్ర ముతికికొంటిని గదా. ఇది చెట్టుకొమ్మ కాఱఁగట్టుకొందునా ! చెట్టుకొమ్మకుఁ గట్టుకొన్న దుష్టవానరములు చింపి చీలికలు చేయునేమో ! నేలఁబఱచిన దుమ్ముపడి మాసిపోవును. నాకు గుడ్డయెండగట్టుకొనుటకు దావే కన్పడకున్నది. కానిమ్ము. (చూచి) ఇదిగో గాలిచే బ్రోగుచేయబడిన పాఱుటాకులున్నవి. ఇం దాఱఁబఱచెదను. (అట్లుచేసి) బుద్ధదేవా ! నమస్కారము. (కూరుచుండి) ధర్మాక్షరములు బారాయణము చేయుదునా ! (అంకారంభమందలి పద్యములు చదువును) అయినను నాకేటికీ సుగతి ? బుద్ధోపాసకురాలగు వసంతసేనకుఁ బ్రత్యుపకారము గావించినంజాలు, నాకదియే స్వర్గము. నాఁడు జూదరులు నన్ను బాధింపం బడినాణెము లిచ్చి నన్ను విడిపించిన దామెయెకదా ! నాయాత్మ యామెకు నాఁడే యమ్మబడినది. (చూచి) ఈయాకులగుంపులో నేదియో యూర్పుచ్చుచున్నట్లున్నదే. ఆకులు కదలుచున్నవి. నిశ్వాసముకాదేమో !

ఆ. గాలికెండకాఱి కదలుచుఁ గదలుచుఁ జీవరోదకంబుచేతఁ దడిసి
యాకులివి ప్రసారితాండజపక్షచ్ఛదాళివోలెఁ గదలియాడఁబోలు.

వసం—(కొంత మూర్ఛ తెలిసి చేయి సాచుచున్నది.)

భిక్షు—హాహా ! శుద్ధాలంకారభూషితంబగు స్త్రీహస్తము బయటికి వచ్చుచున్నది. ఇదిగో రెండవచేయికూడ ; ఈచేతులెవరివో గుర్తించెదను. (చూచి) గుర్తింప నక్కఱలేదు. ఏచేతులు నాకభయ మిచ్చినవో యాచేతులే యివి కానీ ! చూచెదను. (ఆకుగుంపు తొలఁగించి చూచి గుర్తించి) ఈమె ఆ బుద్ధోపాసకురాలే!

వసం—(భిక్షువును జూచి నీళ్ళిమ్మని సన్న చేయుచున్నది)

భిక్షు—పాప మీమె నీరిమ్మని యాచించుచున్నది. దిగుడుబావి దూరముగానున్నది. ఏమిచేయుదును. కానీ! ఈకాషాయార్ద్రవస్త్రము మీఁద గప్పెదను. (అని అట్లు చేయును)

(వసంతసేన తెలివితెచ్చుకొని లేచుచున్నది. సన్న్యాసి పటాంతముచే విసరుచున్నాఁడు.)

వసం—ఆర్యా ! నీవెవ్వఁడవు.

భిక్షు—అమ్మా ! నన్ను మఱచితివా ! నాఁడు పదిసువర్ణము లిచ్చి నన్ను విడిపి

కొన్న బుద్ధోపాసికవుకాదా నీవు.

వసం—మఱవలేదు, కాని యార్యుఁడు వచించినది సరికాదు. నేను చచ్చిపోయిన బాగుండెడిదికదా!

భిక్షు—బుద్ధోపాసికా! ఏమి యీ యాపద యేల వచ్చినది?

వసం—(నిర్వేదముతో) ఇది వేశ్యాజన్మమునకుం దగినదేకదా!

భిక్షు—అమ్మా! యీ చెట్టున ప్రేలాడుతీవ పట్టుకొని లెమ్ము. (అని తీఁగె చేతి కందిచ్చుచున్నాఁడు.)

(వసంతసేన పట్టుకొని లేచుచున్నది.)

భిక్షు—ఇచటికి దగ్గఱనున్న విహారమున నాధర్మభగిని బౌద్ధసన్యాసిని యున్నది. ఆమెచే రవంతసేవుపచరింపబడి యాయాసము పోయిన పిదప నీయింటికి నీవు పోదువుగాక. రమ్ము అల్లనల్లన నడచిరమ్ము. (పరిక్రమించి చూచి) అయ్యలారా! తొలగుఁడు, దారినిండు. ఈమె వయసులోనున్న స్త్రీ, నేను సన్న్యాసిని; అయ్యో నాకిదియే పరిశుద్ధ ధర్మము.

కం॥ పలుకుల నేతల నేమముగల నిగృహీతేంద్రియునకుఁ గరగతమౌ వే
ల్పులలోకమనఁగ భూమీశుల శాసనభీతి నతఁడు స్రుక్కంబడునే. ౹

(అని నిష్క్రమించుచున్నారు.)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతంబగు నాంధ్ర మృచ్ఛకటికంబునందు వసంతసేనా మేడన మను నష్టమాంకము.

మృ చ్ఛ క టి క ము.

న వ మా ం క ము.

(పిదప శోధనకుఁడు ప్రవేశించును.)

శోధ — అధికరణాధికారులచే "ఓరీ! శోధనక! వ్యవహారమండపములోన నాసనములన్నియు సిద్ధపఱుపు" మని నియోగింపఁబడితిని గావున నధికరణమండపము బాగుచేయుటకై వెళ్ళుచున్నాను. (పరిక్రమించి) ఇదిగో! అధికరణమండపము, ప్రవేశించుచున్నాను. (ప్రవేశించి బాగుచేసి యాసనములన్నియు నాయత్తపఱచి) అధికరణమండపమంతయు వివిక్తముగావించితిని. ఆసనములన్నియు సిద్ధపఱచితిని. ఈవృత్తాంత మధికరణికులకుఁ దెలుపువాఁడను. (పరిక్రమించి యెదుట జూచి) వీఁడె రాష్ట్రియస్యాలకుఁడు, దుష్టజన మనుష్యుఁడు వచ్చుచున్నాఁడు. వీనియెదుటఁ బడఁగూడదు. చాటుగాఁ బోయెదను. (అని యేకాంతస్థలమున డాగుచున్నాడు.)

(పిదప నుజ్జ్వలవేషధారియై శకారుడు ప్రవేశించుచున్నాడు.)

శకా — గీ. సలిల జల నీరములచేత జలకమాడి
సువిహితంబగు నంగకశోభతోడ
స్త్రీలు యువతులు తరుణులు తివిరికొలువ
నుపవనోద్యానములఁ గూరుచుంటి నహహ.

గీ. క్షణము ముడి, చూలికక్షణమ్ము, క్షణము జాఱు
డలయు, క్షణమూర్ధ్వచూడంబు దనరునటుల
వాలకుంతలములు కూర్చువాఁడ, రాజు
స్యాలకుఁడఁ జిత్రచిత్రపుఁ జర్యవాడ.

మఱియును విషగ్రంధి గర్భప్రవిష్ఠంబగు కీటకమువలెఁ దగిన యంతరము వెదకికొని బయటబడితిని. ఇపు డీ తుట్ట యెవనితలపైఁ ద్రోయుదును? (ఆలోచించి) ఆఁ! స్మృతికివచ్చినది. దరిద్రచారుదత్తుని మీదనే త్రోసెదను. ఇంకొకటి. వాఁడు దరిద్రుడుకావున వాఁ డీపని చేసియుండునని అందఱు నమ్ముదురు. కానీ! అధికరణమండపములోనికిం చారుదత్తుఁడు వసంతసేనను బలాత్కారముగా గొంతుపిసికి చంపినాఁడని వ్యవహారపత్రము నేనే ముం దొసంగెదను. కావున నధికరణమండపముఁ జొచ్చెదను. (పరిక్రమించి చూచి) ఇదే

అధికరణమండపము. ఇందు ప్రవేశించెదను. ఆసనములన్నియు నాయత్తపఱచిరి. అధికరణభోజకులు చనుదెంచు దనుక ఈదూర్వాచత్వరమునందుండి పరిశీలించెదను. (అట్లు చేయుచున్నాడు.)

శోధ — (మఱియొక వంకనుండి వచ్చి చూచి) అధికరణికు లందఱుఁ జనుదెంచుచున్నారు. నేను సమీపించెదను. (సమీపించుచున్నాడు)

(పిదప శ్రేష్ఠికాయస్థాది పరివారముతో నధికరణికుడు బ్రవేశించును.)

అధిక — ఓ శ్రేష్ఠికాయస్థులారా!

శ్రేష్ఠికాయస్థులు — అయ్యా! యేమి నెలవు?

అధిక — వ్యవహారము పరాధీనము కావున నధికరణికు లొరులచిత్తము గ్రహించుట దుష్కరముకదా! న్యాయదూరములగు ప్రచ్ఛన్నకార్యములను అధికరణమునకుఁ గొనివచ్చు పురుషులు స్వప్రయోజనపరులై యచటఁ దమదోషములు కప్పిపుచ్చుచుందురు. ఉభయపక్షములును దమతమ దోషములనట్లు కప్పిపుచ్చి పరదోషోద్ఘాటనమొనర్చి వాదించుటచే న్యాయపరిశీలనము దుష్కరమై రాజునకు బాపమును, మాకు నిందయు సులభముగా సిద్ధించును. గుణగ్రాహు లెచ్చటనో కాని యుండరుకదా. కావున శాస్త్రజ్ఞుడు, కాపట్యగ్రహణకుశలుడు, వక్త, అక్రోధనుడు, స్వపరభేదరహితుడునై, ముందుగనే కార్యనిశ్చయ మొనర్పక, సధర్ముఁడు లోభదూరుడునై, దుర్బలులకు నండయై, శఠులకు గుండె తల్లడమై, సత్యబద్ధహృదయుడై, రాజభీతి లేనివాడే అధికరణికుడై యుండదగును.)

శ్రేష్ఠికాయస్థులు — తమగుణములయందుఁగూడ దోషమారోపించువారు వెన్నెలలో జీఁకటి నారోపించువారే.

అధికర — శోధనకా! అధికరణమండపములోనికి దారిచేయుము.

శోధ — అయ్యా! దయచేయుఁడు. అధికరణ మండపమిదే.

(అందఱును మండపముఁ బ్రవేశింతురు.)

అధికర — శోధనకా! బైటకుఁబోయి వ్యవహారమునకు వచ్చినవారినందఱిం బిలువుము.

శోధ — చిత్తము. (బైటకుఁ బోయి) కార్యార్థు లెవ్వరో తమతమ కార్యములను మనవిచేసికొనుఁడు. (అని పిలుచును.)

శకా — (సంతసముతో) అధికరణికులు వచ్చిరి. (సాటోపముగాఁ బరిక్రమించి) వరపురుషుఁడను మనుష్యుఁడను వాసుదేవుండను రాష్ట్రియస్యాలుడను రాజస్యాలకుఁడను నేనే కార్యార్థిని.

శోధ—(సంభ్రమముతో) మొదటనే యీరాజస్యాలకుని కార్యము నివేదించుటా! కానీ, ఆర్య! ముహూర్త మాగుము. అధికరణికులతో నివేదించి వత్తును. (లోనికింబోయి) అయ్యా! రాష్ట్రియస్యాలకుడు కార్యార్థియై ద్వారమందున్నాడు.

అధికర—మొదటనే రాష్ట్రియస్యాలకుని వ్యవహారమా! సూర్యోదయమునందలి యుపరాగమువలె నేదియో యొక మహోపద్రవమునకు నిమిత్తమై యుండ వచ్చును. శోధనక, నేఁడు వ్యవహారములు వ్యాకులత గూర్చునని తలంచెదను. పోయి వానితో "నేఁడు నీవ్యవహారము చూడరు పొ" మ్మని చెప్పుము.

శోధ—(పోయి) అయ్యా, శకార! నీవ్యవహారము నేఁడుకాదు పొమ్మని అధికరణికు లానతిచ్చుచున్నారు.

శకా—(క్రోధముతో) ఏమీ నావ్యవహారము వినరా! నావ్యవహారము లేదేని మాయావుత్తుఁడు భగినీపతి పాలకమహారాజుతో విన్నవించి, మా యప్పతోడను మా యమ్మతోడను జెప్పి యీ యధికరణికుని యుద్యోగ మూడఁదీయించి యింకొకని నిందుఁ బ్రవేశపెట్టించెదనని చెప్పుము. (అని వెళ్ళబోవుచున్నాడు)

శోధ—అయ్యా! ముహూర్తమాగుము; నేను పోయి యధికరణికులతో విన్నవించెదను. (పోయి) అయ్యా వానికిఁ గోపమువచ్చినది. (అని శకారుడన్న మాట లన్నియుఁ జెప్పును.)

అధిక—ఈ మూర్ఖుఁ డేమి చేసిన చేయఁగలడు. శోధనకా! రమ్మనుము.

శోధన—అయ్యా! రమ్ము. నీవ్యవహారము విచారించెద మనుచున్నారు.

శకా—మొదట నీకు వ్యవహారములేదనియుఁ దరువాతఁ గలదనియు నీయధికరణికుఁ డనుచున్నాడు. నాకు భయపడినట్లే యున్నాడు. కావున నేను జెప్పినదెల్ల నమ్మను. కానీ! లోనికిం బోయెదను. (ప్రవేశించి) మీకు సుఖము, మాకును సుఖము పోనీ సుఖము మీకేల? మాకే సుఖము.

అధిక—(శకారుం జూచి తనలో) ఏమీ వ్యవహారార్థియైవచ్చిన వీని కీపొగరుఁబోతుతనము (ప్రకాశముగా) కూర్చుండుము.

శకా—ఈభూమియంతయు నాదియే! నాయిచ్చవచ్చినచోటఁ గూర్చుండెదను. (శ్రేష్ఠితో) ఇచటఁ గూర్చుందునా (శోధకునితో) ఇచట గూర్చుందునా (అని పదిచోట్ల గూర్చుండి లేచి అధికరణికుని నెత్తిమీఁదఁ జేయిపెట్టి) ఇచటఁ గూర్చుందును. (అని భూమిమీదఁ జతికిలఁబడును.)

అధి—నీవా కార్యార్థివి?

శకా—నేనే కార్యార్థిని.

అధి—ఆ కార్య మేదియో నుడువుము.

శకా—రహస్యముగాఁ జెవిలో జెప్పెదను. నేను మల్లకప్రమాణంబగు పెద్దకులమునఁ జన్మించినవాఁడను.

గీ. భూమిజానికి నాతండ్రి మామగారు • నాదు తండ్రి కల్లుండు భూనాయకుండు
బావమఱదిని నేను భూపాలకునకు • భూమిపతి భర్త నాతోడబుట్టువునకు.

అధి—సర్వము యథార్థమే. (ఉత్తమకులంబు అను పద్యమును చదువును.) కార్య మేదియో నుడువుము.

శకా—ఇదిగోఁ జెప్పుచున్నాను. నాయందుఁ దప్పున్నను నన్నేమియుఁ జేయరు గదా! మద్భగినీపతియగు రాజు నాకుఁ గ్రీడించుకొఱకును రక్షించుకొఱకును సర్వోద్యానములకు శిరోభూషణమగు పుష్పకరండకజీర్ణోద్యానము నొసంగె. నేను ప్రతిదిన మాయుద్యానములోనికిఁ జూచుటకు నెండబెట్టుటకు దుడుచుటకుఁ బువ్వులు కోయుటకుఁ జివుళ్ళు త్రుంపుటకుఁ బోవుచుందును. దైవయోగంబున నాకొక స్త్రీశవమచటఁ గన్పించినది— లేదు కన్పించలేదు.

అధికరణి—అచచ్చిపోయిన స్త్రీ యెవరో నీవెఱుగుదువుగదా!

శకా—అధికరణభోజకులారా! ఈపట్టనమునకంతకు నలంకారమగునదియు వేలకొలది బంగారునగలు కలదియు నగు నాస్త్రీని నేనెఱుంగనా? వసంతసేనను డబ్బుకొఱకొకదుర్మార్గుఁడు నాపుష్పకరండకజీర్ణోద్యానమున నొంటిగ మెడ పిసికి చంపినాడు. నేను కాను- (అర్ధోక్తిలో నోరు మూసికొనును.)

అధి—ఆహా! తలారుల యజాగ్రత్త! శ్రేష్ఠికాయస్థులారా! వ్యవహారమున కుపయోగించునది “నేను కాను” అను పదము ముందు వ్రాసికొనుఁడు.

కాయస్థు—చిత్తము (ఆమాట వ్రాసి) అయ్యా వ్రాసినాము.

శకా—(తనలో) తొందరపడి వేడిపాయసము మ్రింగినవానివలె నాకే యుపద్రవము దెచ్చిపెట్టుకొన్నాను. కానీ ఇట్లు చేసెదను. (ప్రకాశముగా) అయ్యా అధికరణభోజకులార! పెద్దకోలాహలము చేసెదరేమి. దానిని నేనే చూచితినంటిని. ఆ మాట వ్రాసికొనుఁడు. (యింతకుమున్ను వ్రాసినది కాలితోఁ దుడిచివేయుచున్నాఁడు.)

అధి—ద్రవ్యముకొఱకు బాహుపాశమున జంపిరని నీకెట్లు తెలిసినది?

శకా—మెడవాచినది, ఆభరణస్థానములన్నియు శూన్యములై యున్నవి.

శ్రేష్ఠికాయ—ఈమాట లెస్సగనే యున్నది.

శకా—(తనలో) అమ్మయ్యా! బ్రతికితిని.

శ్రేష్ఠి—ఈ వ్యవహారము ఎవని నవలంబించినది ?

అధి—ఇక్కడ వ్యవహారము రెండు విధములు.

శ్రేష్ఠికాయ—అవి యేవి ?

అధి—వాక్యానుసారమని, అర్థానుసారమని, మొదటిది వాది ప్రతివాదుల వాదము నవలంబించినది, రెండవది యధికరణికుని బుద్ధి నవలంబించినది.

శ్రే-కా—అటులైన నీవ్యవహారము వసంతసేన తల్లి నవలంబించుచున్నది.

అధి—అవును. శోధనకా ! వసంతసేన తల్లిని భయపెట్టకుండఁ దీసికొనిరమ్ము.

శోధ—(పోయి ముసలిదానితోఁ బ్రవేశించి) అమ్మా ! అటు నడువుము.

వృద్ధ—(తనలో) నాకూఁతురు యౌవనసుఖ మనుభవించుటకు మిత్రగృహమునకుం జనియె, నింకను రాలేదు. ఈ దీర్ఘాయుష్మంతుఁ డధికారులు పిలుచుచున్నారు రమ్ము రమ్మని పిలుచుచున్నాఁడు. దైవమా ! యేమి యుపద్రవమోగదా ! నామది మోహపరవశ మగుచున్నది గుండె లదరుచున్నవి. (ప్రకాశము) నాయనా ! అధికరణమంటపమునకు దారి చూపింపుము.

శోధ—ఇటు రమ్మిటు రమ్ము (యిరువురు ప్రవేశింతురు)

వృద్ధ—(సమీపించి) అయ్యలారా ! మీకు సుఖమగుగాత.

అధి—స్వాగతమా ! అందుఁ గూర్చుండుము.

వృద్ధ—మంచిది (అని కూర్చుండును)

శకా—(ఆక్షేపముగా) వచ్చితివా ? ముసలిలంజె ! వచ్చితివా ?

అధి—వసంతసేన తల్లివా నీవు ?

వృద్ధ—అవును.

అధి—ఇప్పుడు మీవసంతసేన యెచటికి వెళ్ళినది ?

వృద్ధ—మిత్రునింటికిఁ జనియెను.

అధి—ఆమిత్రుని పేరేమి ?

వృద్ధ—(తలలో)అబ్బబ్బా ! ఈవిషయ మతిలజ్జనీయముకదా ! (ప్రకాశముగ) ఈ 'మాట నితరులవలెఁ దమవంటి ప్రభువు లడుగదగినది కాదు.

అధి—సిగ్గేల ? వ్యవహార మడుగుచున్నది.

శ్రేష్ఠి-కా—వ్యవహారమడుగుచున్నది, దోసములేదు. సిగ్గుపడక చెప్పుము.

వృద్ధ—ఇది వ్యవహారమా ! అటులేని వినుఁడు. అతడు సార్థవాహ వినయదత్తుని మనుమఁడు. సాగరదత్తుని కొడుకు సుగృహీతనామధేయుడు చారుదత్త భట్టారకుఁడు. కోమటివాడలోఁ గాపురమున్నాడు. అతనితో నాకూతురు యౌవనసుఖ

మనుభవించుచున్నది.

శకా__అధికారులు! వింటిరా? యీమాటలు తప్పక వ్రాసికొనుడు. ఆచారుదత్తునితోనే నాకు వివాదము.

శ్రేష్ఠికాయ__చారుదత్తుడు మిత్రుడనుచున్న దిందు దోస మేమున్నది?

అధి__ఈవ్యవహారమంతయుఁ జారుదత్తు నవలంబించి యున్నది.

శ్రేష్ఠికాయ__అవును అట్లే కన్పించుచున్నది.

అధి__ధనదత్తా! వసంతసేన చారుదత్తునింటికి వెళ్ళినది అని వ్రాసికొనుము. ఇదియే వ్యవహారమునకు మొదటిపాదము. ఆర్య చారుదత్తునిగూడఁ బిలిపింప వలయునా! వ్యవహారముకదా పిలిపింపక తప్పదు. శోధనక! నీవుపోయి, చారుదత్తునిఁ దొందరపెట్టకుండ భయపెట్టకుండ సాదరముగా స్వేచ్ఛగాఁ దీసికొనిరమ్ము. ఎందులకో అధికరణికులు మిమ్ముఁ జూడఁగోరుచున్నారని చెప్పి తోడ్కొనిరమ్ము.

శోధ__చిత్తము (పోయి చారుదత్తునితోఁ బ్రవేశించి) ఆర్యా! ఇటురమ్మిటురమ్ము.

చారు__(ఆలోచించి)

గీ. నాకులము నానువృత్తము నానడవడి • యెఱిగి యుండియు రాజు నన్నేలపిలుచు
నీయకాలసమాహూతి నాయవస్థ • కేదియో వైపరీత్య మూహింపఁజేయు.

(సవితర్కముగాఁ దనలో)

కం. సంకెళ్లు త్రెంచుకొని నిశ్శంకం బరుగిడిన గోపబాలకు శకటీ
సంకలితుం జేసితివని కంకోష్ఠులు చాడి చెప్పగా వినెనేమో.

ఏల యీ విచారము. అధికరణమండపములోనికే పోవుచున్నానుగదా! శోధనకా మండపములోనికిం దారిచూపుమురా!

శోధ__అయ్యా యిటురం డిటురండు (ఇరువురును బరిక్రమింతురు)

చారు__(సందియముతో) ఇఁకేమున్నది!

గీ. కాక ఘుఅవగదొడగె రూక్షస్వరముగ • బిలుచుచున్నారు నను మంత్రిభృత్యులెల్ల
నదరుచున్నది వామనయనముఁగూడ • దుశ్శకునముల డెంద మాందోళపడియె.

శోధ__అయ్యా దయచేయుము.

చారు__(పరిక్రమించి ముందుఁ జూచి)

గీ. ఎండుమ్రానుపయిం గూరుచుండి కాకి•యఱవదొరకొనె నెడమక న్నురిమిచూచె
గాదలచియున్న దేదియో కఠినమైన • యాపదయటంచు నాడెంద మదలుచుండె.

చ. అదె! నడిత్రోవ నంజననిభాసితమౌ తను వుబ్బి చుట్టలై
 పొదలగఁ గూర్కి చెందు ఫణి బుస్సుమటంచును లేచి గాంచుచు
 న్నది నను రూక్షవీక్షణభయంకరమై, నిడునాల్క సాచుచు
 న్నది, విశదమ్ములైన రదనమ్ములు నాలుగు గానుపింపఁగన్.

శోభ—తొందరపడకుండ దయచేయుఁడు.

చారు—(నలుప్రక్కలుం జూచి) ఇంతియకాదు.

గీ. కర్దమము లేనిపుడమిపై గాలుజాఱు • చుండె గంపించుచుండె వామోరునయన
 భుజము, లఱచుచున్నవి పులుగు లకట • ఘోరతరమైనకీడు నాకుం ఘటించు.

 సర్వవిధముల నాకులదేవతయే నాకు శుభమొనరించుంగాత!

శోధన—అయ్యా! రమ్ము. రమ్ము. ఇదె యధికరణమండపము ప్రవేశించుము.

చారు—(ప్రవేశించి నాలుగు ప్రక్కలు గలయంజూచి) ఔరా! ఈ యధికరణ
 మండప మెంతచక్కగా నున్నది? ఇచట—

 సీ. చింతానిమగ్న సచివలంఘసలిలంబు దూతోర్మిజాలశంఖాతతంబు
 సవిధస్థితానేకచరనక్రమకరంబు నైకనాగాశ్వహింస్రాకులంబు
 ప్రచురపాశకకంకపత్రపక్షికులంబు కాయస్థకాకోదరాయతంబు
 నీతిశాసనపథీభూతోభయతటంబు కమలాక్షిరూపాధికారిపీఠ

గీ. మైన యీసభచూడ క్షీరాబ్ధిమాద్రి • దోఁచె వామోరుభుజము లద్రువఁదొడంగు
 టయునుసర్వంబుకన్పడుటయునుజూడ•స్వస్తి యస్వస్తియును నాకుసంభవించు.

 కానీ (ప్రవేశించుచు గుమ్మము తలకుఁ దగులుట యభినయించి) మరల
 నిదియొకటి. (ప్రవేశించును)

అధిక—(తనలో) ఇతఁడా చారుదత్తుఁడు!

 ఉ. ఉన్నత మైననాసయు సమున్నతచారువిలోచనంబులు
 న్మాన్నగులక్షణంబులు కనుంగొని యీతడు దోషియంచు నే
 నెన్నుట యెట్లు? గుజ్జములు నేన్గులు గోవులు మర్త్యు లెన్నఁడు
 న్నన్నుతలక్షణంబులు కనబడియుండినఁ గావు దుష్టముల్.

చారు—అధికారులారా! మీకు స్వస్తియగుంగాత! ఓ నియుక్తులారా! మీకు
 గుశలమా?

అధిక—(సంభ్రమముతో) ఆర్యా! స్వాగతము. శోధనకా! ఆర్యున కాసన
 మొకటి తీసికొనిరమ్ము.

శోధ—(ఆసనముఁ దీసికొనివచ్చి) ఇదిగో నాసన, మార్యా! యిందుగూర్చుండుము.

చారు—(కూర్చుండును.)

శకా—(క్రోధముతో) ఓరీ, స్త్రీఘాతుక ! వచ్చితివిరా ! వచ్చితివా ! ఈవ్యవహార మునం దేమి పరిశీలన ! యెంతటిధర్మము ! ఆహా ! ఘాతుకున కాసనమిచ్చె దరా ! కానిండు కానిం డాసన మిండు.

అధిక—ఆర్య చారుదత్త ! ఈముసలిదాని కూఁతుతో నీకు ప్రసక్తిగాని ప్రణయముగాని ప్రీతిగాని యున్నదా ?

చారు—ఏ ముసలిది ?

అధికర—ఈ ముసలిది (అని వసంతసేనతల్లిం జూపించును.)

చారు—(లేచి) ఆర్యురాలా ! అభివాదనము గావించుచున్నాను.

వృద్ధ—నాయనా ! చిరకాలము జీవించుము. (తనలో) ఇతఁడా ! ఆ చారుదత్తుఁడు ఆహా ! నాకూతురు తన యౌవన మితనియందు వినియోగించి సార్థకపఱచ కొన్నది.

అధి—అయ్యా ! నీకు లంజెసాని స్నేహితురాలు కలదా ?

చారు—(సిగ్గుపడును.)

శకా—

గీ. జంకుచేతనొ లేక లజ్జావశతనొ • తన యసత్యప్రవర్తన దాఁచు నితఁడు
ధనముకొఱ కీతడే చంపె దాని నిజము; • నమ్మకుండయ్య యీతని నడతమీఁ

శ్రేష్ఠికాయస్థు—ఆర్య చారుదత్త ! చెప్పుము సిగ్గేల, యిది వ్యవహారముకదా !

చారు—(సిగ్గుతో) ఓయధికృతులారా ! గణిక యొకతె నాకు మిత్రమనుమాట నెట్లు నుడువుదును ! యౌవనకృతమగు గణికాసంగ్రహమువలనఁ జరిత్ర లోపమా ?

అధిక—గీ. విఘ్నములు మెండు వ్యవహారవిషయమందు
మదిఁ గలఁచుచున్న లజ్జను వదలవలయు
వలదు జాలము తథ్యంబు పలుకవలయుఁ
గాక యనృతంబు గ్రహింపలేకపోము.

సిగ్గు వదలుము, వ్యవహార మడుగుచున్నది గాని మేముకాదు.

చారు—అధికరణికా ! యెవ్వనితో నాకు వ్యవహారము ?

శకా—(సాటోపముగా) నాతోరా వ్యవహారము.

చారు—నీతోడివ్యవహారము నాకుఁ జాల దుస్సహమే.

శకా—ఓరీ స్త్రీఘాతుక ! అనేక రత్నమయభూషణంబులు దాల్చిన నిరుప

సౌందర్యవతియగు వసంతసేనం జంపి కపటకాపటికుడవై యిపుడు లేదని బొంకినఁ బోవునఁటరా!

చారు—నీవు కేవల మసంబద్ధప్రలాపివి.

అధిక—అయ్యా! చారుదత్త! నీకు వానితో నేమి. నిజము నుడువుము, నీకా సానితో స్నేహమున్నదా లేదా?

చారు—అవును; ఉన్నది.

అధిక—అయ్యా! వసంతసేన యిపుడెక్కడ నున్నది?

చారు—ఇంటి కేగినది.

శ్రేష్ఠికాయ—ఎట్లు వెళ్ళినది? ఎప్పుడు వెళ్ళినది? ఎవరితో వెళ్ళినది?

చారు—(తనలో) ప్రచ్ఛన్నముగా వెళ్ళిన దని చెప్పుదునా!

శ్రేష్ఠి—అయ్యా త్వరగాఁ జెప్పుము.

చారు—ఇంటి కేగినది; యిం కేమిచెప్పుదును?

శకా—నాపుష్పకరండకజీర్ణోద్యానమునకుం దీసికొని వచ్చి ద్రవ్యముకొఱకు మెడ పిసికి చంపి యింటికిఁ బోయినది నేనెఱుగ ననుచున్నావా!

చారు—ఓరీ! అసంబద్ధప్రలాపీ!

ఆ. పాలపిట్టమీఁది పత్త్రంబువలె నిన్ను ముంచదేల రోరి మొగులు వాన
నన్నృతమాడు నీదు నాననమ్మది హైమనామంబు జాతసదృశమయ్యె నదిగొ.

అధిక—(జనాంతికముగా)

క. అద్రిపతిం గదలుచుట సముద్రము దాటుటయు ననిలముం బట్టుట యా
భద్రుని మీఁదం దూషణముద్రిక వైచుటయు దురితము లని తలంతున్.

(ప్రకాశముగా) ఇతడు చారుదత్తుడుకదా! ఇంతటి యకార్య మాచరిం చునా! (అని "ఉన్నతమైన" అను పద్యమును జదువును.)

శకా—వ్యవహారంబునఁ బక్షపాత మగపడుచున్నది.

అధిక—ఛీ మూర్ఖా! అవలకు లేచిపొమ్ము.

సీ. ప్రాకృతుండవు నిగమార్థముల్ తెల్పెద వేలొకో నీనాల్క వ్రీలకుండె
నడిమింటి వెలుగులయెడయుఁ జూడగ నెంతు వేలొకో నీదృష్టి మాలకుండె
పావకజ్వాలలోపల నుంచజూచెద వేలొకో నీకేలు కాలకుండెఁ
జారుదత్తచరిత్ర దూఱుచున్నాడ వీ వేలొకో దహింప దీధరిత్రి.

గీ. సలిలమాత్రావశిష్టంబుఁ జలిపె నెవని • యీఁగి వార్థిని నర్థుల కిచ్చువేళ
నతడు గుణనిధి తుచ్ఛధనాశ నిట్టి • నీచకృతిసల్ప నొడిగట్టు నే దురాత్మ!

వృద్ధ—ఓరీ చచ్చినవాఁడా! తనయొద్ద నాకూతురు దాచిన సువర్ణభాండమును దొంగ లెత్తుకొనిపోఁగా దానికై చతుస్సముద్రసారభూతం బగు రత్నావళి నొసఁగిన మహాత్ముఁడు ధనముకొఱ కీకార్య మొనరించునా! చాలుఁజాలు నిట్టిపలుకులు పలుకకుము. హా బిడ్డా! హా వసంతసేన! (అని యేడ్చును)

అధిక—ఆర్య చారుదత్తా! ఆ వసంతసేన మీయింటనుండి బండిమీఁద బోయెనా లేక నడచిపోయెనా?

చారు—నే నుండఁగా వెళ్ళలేదు; నడచి వెళ్ళెనో బండిమీఁదనో నే నెఱుఁగను.

వీరక—(కోపముతోఁ బ్రవేశించి)

గీ. చందనకుఁ డొర చేతితో జఱచి నన్ను • గాలితోఁదన్నె నన్నయాగ్రహముకతన గంటికిం గూర్కురామి దీర్ఘమయినట్టి • యీనిశీథము తెలవాఱె నెట్లొ నాకు.

ఈ యధికరణమండపములోనికిం బ్రవేశించెదను. (ప్రవేశించి) ఆర్యమిశ్రులారా! కుశలమా?

అధిక—తలారియగు వీరకుఁడా! వీరకా నీవు వచ్చిన కార్యమేమి?

వీర—దేవరా! సంకెల లూడఁదీసికొని పాఱిపోయిన గోపాలదారకు నార్యకుని వెదకుచుఁబోయి దారిలో నొకపెట్టెబండిం జూచితిమి. దానిలోపలికి దిగి చందనకుఁ 'డిం దార్యకుఁడు లేఁ' డనియు 'నేను జూచితిని గావున నీవు చూడనక్కఱలే' దనియు వాదించెను. నేను జూడకమాననని బండి నెక్కఁబోగ నన్నుఁ గ్రిందికిలాగి పెద్ద మొద్దువంటి కాలితోఁదన్నెను. పైన దేవరచిత్తము

అధిక—ఓరీ ఆబండి యెవరిదో యెఱుగుదువా?

వీరక—ఈ చారుదత్తునిదే. వసంతసేనను బుష్పకరండకజీర్ణోద్యానమునకుం గొనిపోవుచుంటినని యాబండి త్రోలువాడు చెప్పెను.

శకా—అయ్యా! వింటిరా? నేనన్నమాటకే సరిపోయినది.

అధిక—

గీ. తఱపివెన్నెల కాయు చంద్రముని జేరుఁచున్న దక్కట మ్రింగ రాహుగ్రహంబు నిర్మలంబగుజల మొడ్డునేలవిఱిగి • పడుటచే గలుషంబు గాఁదొడఁగె నకట!

వీరకా! మీయురువురితగ వావలఁ జూచుకొందము. అధికరణమండప ద్వారంబునం గుఱ్ఱమున్నది; దాని నెక్కి పుష్పకరండకోద్యానమునకుం బోయచటఁ జచ్చిపోయిన యొకయాఁడు దున్నదో లేదో చూచి రమ్ము.

వీర—చిత్తము. (పోయి మరలఁ బ్రవేశించి) అయ్యా! చూచివచ్చితిని. స్త్రీ కళబరమం దొకటి యున్నది. నక్కలచే నట్టిటు దొరలింపబడుచున్నది.

శ్రేష్ఠికా—అది స్త్రీకళేబరమని నీవెట్లు గుర్తించితివి?

వీరక—నక్కలు తినఁగా మిగిలిన కరచరణాద్యవయవములచేతను నిడుపైన తల వెండ్రుకలచేతను గుర్తించితిని.

అధిక—అక్కటా! వ్యవహారమంతయు నెంతవిషమముగా వచ్చుచున్నదో!

గీ. వరుసఁ జర్చించినకొలంది•వచ్చుచుండెఁ • జారుదత్తునిమీఁదికే సంకటంబు

మీఱరానిది యీవ్యవహారనీతి • బురదలోఁబడ్డ గోవయిపోయె బుద్ధి. R.C.

చారు—(తనలో) గీ. మొదటఁ గ్రొవ్విరికి వికాస మొదవునపుడు

భ్రమరములు వందలకొలంది వ్రాలునట్లు

నరున కాపద వచ్చినతరుణమంద

వందలకొలంది లోపముల్ వచ్చుచుండు.

అధిక—అయ్యా! చారుదత్త! సత్యము వక్కాణింపుము.

చారు—

గీ. కలుషితాత్మకుఁడును హంతుకామబుద్ధి•మత్సరాగాంధుఁడైన మర్త్యుండనృతమె

సత్యమని చెప్పు జాతిదోషంబువలన•జెవినిడక దాని మిగులఁ జర్చింపవలయు.

అదియునుంగాక—

గీ. పుష్పితంబగు లతనైనఁ బువులకొఱకు • వంచి కోయఁగ నేజాలిపడెడువాఁడ

భ్రమరపక్షంబులను బోలు ప్రమదకురులు • పట్టి చంపుదునే యేడ్చునట్టిదాని!

శకా—ఓహోహో! అధికరణభోజులార; మీరు వ్యవహారమునఁ బక్షపాతమే చూపించుచున్నారుగదా! హతాశున కీచారుదత్తున కిప్పటికిని నాసనమేటికి జెప్పఁడు.

అధిక—శోధనకా! యిటురమ్ము (అని పిలిచి వానిచెవిలో నేదియో చెప్పును.)

శోధ—(అధికరణికుఁడు చెప్పినట్లు చేయును.)

చారు—(ఆసనముమీఁదనుండి దిగి భూమిమీఁద గూర్చుండి) అధికృతులారా! పరిశీలింపుడు!

శకా—(సంతోషముతో గంతులువైచుచు దనలో) హీహీ! నేను జేసినపాతకము వీనినెత్తిమీఁద బెట్టితిని. ఈ చారుదత్తుఁడు విడిచిన యాసనమున నే కూర్చుందును (అట్లుచేసి) చారుదత్త! నన్నుఁ జూడు చూడు. చంపితినని చెప్పు చెప్పు.

చారు—("కలుషితాత్మకుఁడు" ననుపద్యముఁ జదివినతరువాత దనలో)

గీ. ఏమియిది నాకు మైత్రేయ యిటులువచ్చె!•హా విమలవంశజాత బ్రాహ్మణి! కుమార కాంచవేమి నాయాపద? కష్టమెట్టిదో యెఱుఁగ కాడు నీమోద మిట్టులగునె?

శకటికనిమిత్తము రోహసేనునకు వసంతసేన యిచ్చిన నగలన్నియు మరల

దాని కిచ్చివేయుమనియు దానివృత్తాంత మరసిరమ్మనియు మైత్రేయుం బంపితిని. ఆతఁడింకను రాలేదు. ఏలొకో తడసినాఁడు.

(పిదప నగలుమూటతో మైత్రేయుఁడు ప్రవేశించును)

విదూ—(తనలో) ఆర్యచారుదత్తుఁ డీనగలమూట నిచ్చి వసంతసేనయొద్దకుఁ బొమ్మని చెప్పి "మైత్రేయా! వసంతసేన రోహసేనుని యొడలునిండ నీనగ లలంకరించి తల్లియొద్దికిఁ బంపెనఁట. మనము వానిని గ్రహింపరాదు. కావున దాని నగలు మరల దానికిచ్చి ర"మ్మని యానతిచ్చెఁ గదా! కావున వసంతసేన యొద్దకే పోయెదను (పరిక్రమించి మింటఁ జెవియొగ్గి) బావ, రేభిలుఁడా, ఏమనుచున్నావు? ప్రియవయస్యుఁడగు చారుదత్తుఁ డధికరణమండపము లోనికిం బిలువఁబడియె ననియా! (ఆలోచించి) యేమియో యల్పకార్యమైయుండదు. కానీ తరువాతనే వసంతసేనయింటి కేగెదను. ముం దధికరణమండపమున కేగెదను. (పరిక్రమించి యవలోకించి) ఇదె యధికరణ మండపము, ప్రవేశించెదను (ప్రవేశించి) అధికరణభోజులారా! మాప్రియవయస్యుఁ డెచ్చటనున్నాడు?

అధిక—అచ్చటఁ గూర్చుండెను.

విదూ—మిత్రమా నీకు స్వస్తి.

చారు—కాఁగలదు.

విదూ—వయస్యా, క్షేమమేకదా ?

చారు—అదియుం గాఁగలదు.

విదూ—చెలికాఁడా! ఏల నుద్విగ్నుఁడవై యున్నావు. నీవీయధికరణమండపము లోనికి రాఁ గారణమేమి ?

చారు—నెచ్చెలీ!

గీ. ఘాతుకుఁడనగుచుఁ బరలోకం బెఱుఁగక•ధనమునందాశ నేనొక్క-వనిత—నకట
వనితనేకాదు, రతిదేవివంటిదా ని• నతఁడె నుడువును మిగత వృత్తాంత మెల్ల.

విదూ—ఏమేమి !

చారు—(చెవిలో నిట్లని చెప్పును)

విదూ—ఇటు లన్నవాఁడెవఁడు ?

చారు—(సన్నచే శకారునిం గనఁబఱచుచు) ఈదీనుఁడు నిమిత్తముగా నాప్రతికూలవిధియే యట్లు చెప్పుచున్నది.

విదూ—(జనాంతికముగా) వసంతసేన యింటి కేగెనని యేల చెప్పవైతివి ?

చారు—చెప్పితిని. చెప్పినను బ్రకృతావస్థవలన వారు వినకున్నారు.

విదూ — ఆర్యులారా! పేటలు, కోటలు, విహారము లారామములు, దేవాలయములు తటాకములు యూపములు మున్నగువానిచే నీయుజ్జయినీనగరమంతయు నలంకరించిన మహానుభావుఁడు చారుదత్తుఁడు. దైవయోగమున దరిద్రుఁడే యగును గాక, ధనమునకై యింతటి యకార్య మొనరించునా! (కోపముతో) ఓరీ లంజకొడుక! రాజస్యాలక! సంస్థానక! అడ్డు లేకుండ నరులందు లేనిపోని దోసము లారోపించు దుర్మార్గుఁడ! బంగారునగ లలంకరించుకొనిన మర్కటమా! నాయెదుట నుడువుము. పుష్పించిన మాధవీలతను సైతము పల్లవచ్ఛేద మగునేమో యని వంచి పువులుకోయని దయాశాలి నాప్రియవయస్యుఁడు చారుదత్తుఁ డీయుభయలోక విరుద్ధమైన యకార్య మొనరించునఁటరా! ఓరీ! తారుపుఁగత్తెకొడుక! నిలువుమురా నిలువుము. నీహృదయమువలెఁ గుటిలమగు నాదుడ్డుకఱ్ఱతో నీబుఱ్ఱ వేయిముక్కలు గావించెదను.

శకా — (కోపముతో) ఆర్యమిత్రులారా! వినుండు వినుండు. వ్యవహారముగాని వివాదముగాని చారుదత్తునకును నాకును గలదు; నడుమ వీఁ డెవ్వఁడు? కాకపదమువంటి తల నెత్తితో నెగురులాడుచు నీతల వేయిముక్కలు కావించెద నని వాఁగుచున్నాఁడు. వలదురా! తొత్తుకొడుక! దుష్టబ్రహ్మచారీ! వలదురా నీకింతపొగరు!

(విదూషకుఁడు దుడ్డుకఱ్ఱయెత్తి ఓరీ తారుపుఁగత్తెకొడుక;' అనునది చదువును. శకారుఁడు కోపముతో దాడించును. విదూషకుఁడు మరలఁ గొట్టును. ఇరువురకును ముష్టియుద్ధము జరుగుచుండ విదూషకుని చంకనుండి నగల మూట క్రిందఁబడును.)

శకా — (నగలుతీసి చూచుచు భయముతో) అయ్యలారా! చూచితిరా! పాపము వసంతసేన నగలివిగో! (చారుదత్తుని చూపుచు) ఈ పాడుసొమ్ము కోసమే యీతఁడు దాని గొంతుపిసికి చంపెను.

(అధికృతులందఱు నధోముఖులగుదురు.)

చారు — (జనాంతికముగా)

గీ. సంకటంబైన యిట్టి దుస్సమయమందు • నీనగలమూట నీచెంత నిట్లుదొరకె
నాదురదృష్ట మీరీతి నన్నుఁ గోఁతఁ • ద్రోయుచున్నది ముందును ద్రోయఁగలదు.

విదూ — మిత్రమా! వీరితో యథార్థ మేలచెప్పవు?

చారు — మిత్రమా! మైత్రేయ!

గీ. దుర్బలంబైన నృపతికందోయి యీ నిజంబుఁ బరిశీలనము నేయఁజాలఁ దయ్య
మనము మొఱవెట్ట నెవ్వఁడు వినును? తప్పుదీకరణి దైన్యమరణంబు నాకునేఁడు.

ఆధిక—అన్నా! యెంతకష్ట మెంతకష్టము!

గీ. ఔర! యంగారకవిరుద్ధుఁడయిన యమరదేశికుని క్షీణదశయందు దివిని ధూమ
కేతు వుదయించినట్లుగా నీతఁ డొకఁడువచ్చె నకట యమాయిక బ్రహ్మచారి.

శ్రే-కా—(వసంతసేన తల్లితో) ముసలిదానా నీ వవహితురాలవై యీనగల నవ
లోకించి యివి నీకూతు నగలో కావో చెప్పఁగలవా!

వృద్ధ—(చూచి) ఇవి నాకూఁతునగలవంటివే కాని యవిమాత్రము కావు.

శకా—ఓసీ ముసలిలంజె! కన్నులచే నవునని నోటితో కావనుచున్నావా!

వృద్ధ—(చూచి) చీ చీ ఛచ్చినవాఁడా! లేచిపొమ్ము!

శ్రేష్ఠికా—బాగుగాఁ బరిశీలించి నుడువుము! ఆనగ లగునా కావా!

వృద్ధ—ఈ నగలయందలి పనివానితనము నాదృష్టి నాకర్షించుచున్నదే కాని యివి
యానగలు కావు.

అధిక—భద్రురాలా! నీవానగలు గుర్తింపఁగలవా?

వృద్ధ—లేదు. నే నానవాలు పట్టలేదు. ఆపనివాఁడే యీనగలుగూడఁ జేసియుండు
నేమో?

అధిక—శ్రేష్ఠి

గీ. సదృశవస్తువు లుండవే జగతిఁ గృత్రిమమ్ములగునగలందు రూపమ్ములందు
శిల్పివర్గంబు నగఁజూచి చేయఁగలరు నగను దొల్లింటిదే యనదగినరీతి.

శ్రేష్ఠికాయ—ఈనగలు మీరు చారుదత్తునివే యందురా యేమి?

చారు—కావు కావు.

శ్రేష్ఠికాయ—మఱి యెవరివి?

చారు—ఈముసలియామె కూఁతువే.

శ్రేష్ఠికాయ—ఇవి యామె వియోగము నెట్లు చెందినవి?

చారు—ఇట్లు చెందినవి (అని చెప్పుచుఁ దొందరపడును)

శ్రే-కాయ—అయ్యా! చారుదత్త! యీపట్ల సత్యము నుడువవలయును.

గీ. సత్యమునయంద నిలిచెదో సకలసుఖము పాతకము రాదుసుమి సత్యభాషణమున
సత్యమను నక్షరము లనశ్వరములగును సత్య మనృతంబుచేత దాఁచంగవలదు.

చారు—నగలగొడవ యేమో నే నెఱుఁగను గాని యివిమాత్రము మాయింటినుండి
తెచ్చినవే.

శకా—ఉద్యానమునం బ్రవేశింపఁజేసి చంపి నేఁడు కపటకాపటికుండవై లేదనెదవా!

అధిక—ఆర్యచారుదత్త! యథార్థము చెప్పుము.

క. సుకుమార మైననీమే నకటా కర్కశములగుకశాఘాతము లో
ర్వక కూలు నిపుడు మాకౌతుకములతోపాటు సత్యదూరుఁడవైనన్.

చారు—అధికరణభోజులారా! నామనవి యాలింపుఁడు.

గీ. పాప మెఱుఁగనియింట సంభవముఁజెంది • నాఁడ నేపాపమెఱుఁగనివాఁడ నేను;
చిత్తమునఁ బాపి నని తలంచిరేని • ఏను పాపిని, కాకుండి యేమిఫలము ?

(తనలో) వసంతసేన లేని నేను బ్రతికి చేయునదియే లేదు. (ప్రకాశముగా)

ఆర్యులారా! పలుపలుకులేల?

గీ. ఉభయలోకంబు లెఱుఁగకయున్న నేను • ఘాతుకుఁడనై యొకానొకకామినీమ
జీనిఁ గృతాంతునిపగిది దుర్నీతిమెఱియ • నాతఁడే చెప్పు మిగతవృత్తాంతమెల్ల.

శకా—చంపితివి. ఓరి! నీవుఁగూడఁ జంపితి నని చెప్పుమురా!

చారు—నీవే చెప్పితివి కదా!

శకా—భట్టారకులారా! వినుండు వినుండు. ఇతఁడే చంపెను. ఇతఁడే సంశయచ్ఛేదముఁ గావించెను. ఈ దరిద్రచారుదత్తునిఁ గొఱ్ఱు వైచి చంపింపవలెను.

అధికర—శోధనక! రాష్ట్రియుఁడు చెప్పినట్లు చేయించుము. రాజపురుషులార! చారుదత్తునిం బట్టుకొనుఁడు. (రాజపురుషులు బట్టుకొందురు.)

వృద్ధ—ఆర్యమిశ్రులారా! అనుగ్రహింపుఁ డనుగ్రహింపుఁడు. నాకూఁతురు చచ్చిపోయిన జచ్చిపోనిండు. ఈచారుదత్తుఁడు చిరంజీవి యగుంగాత! వ్యవహార మర్థిప్రత్యర్థుల ననుసరించుగదా. నే నర్థిని; వదలుచుంటిని గావున వదలుఁడు.

శకా—గర్భదాసీ! లేచిపొమ్ము. నీకు వీనికి నేమి సంబంధము పోపొమ్ము.

అధిక—ఆర్యురాలా! నీవేగుము. రాజపురుషులార! మీరామెను గొంపొండు.

వృద్ధ—అయ్యో! నాబిడ్డా! అయ్యో (యేడ్చుచు నిష్క్రమించును)

శకా—(తనలో) వీనికిఁ దగినప్రాయశ్చిత్తము గావించితి నిఁకఁ బోయెద.

(నిష్క్రమించును)

అధిక—ఆర్యచారుదత్త! మేము దోషనిర్ణయము చేయుదుమేకాని తక్కినదంతయు రాజాధీనము. శోధనకా! నీవు పోయి పాలకభూపతితో నిట్లు విన్నవింపుము.

గీ. భూసురుడు పాతకుండైన బొలియజేయ•దగఁదనుచుదొల్లి మనువుశాస్త్రంబుచెప్పె
గాన వధ్యునిఁ జంపుట మాని వాని • నన్యదేశంబులకు సాగనంపుటొప్పు.

శోధ—చిత్తము (అని నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) అయ్యా! పాలకమహారాజుగారు 'ద్రవ్యముకొఱ కెవ్వఁడు వసంతసేనను జంపెనో వానికానగలు మెడకుఁగట్టి చాటింపుతో నూరేగఁజేసి దక్షిణశ్మశానంబునకుం దీసికొని పోయి యచట శూలారోపమునం బ్రాణములు పాపవలయును. ఎవ్వఁడేని యిట్టి దుష్కార్యమొనరించినచో నిట్టిరాజదండనము కలుగుననిజనులందఱకుం దెలియవలయు' నని సెలవిచ్చినారు.

చారు—ఆహా! పాలకమహారా జవిమృశ్యకారిగదా! (ఆలోచించి) అతనిం దూఱ నేటికి?

గీ. అకట! యీదృశమగు వ్యవహారపావ • కమున మంత్రులుద్రోవ భూరమణులందుఁ గూలి యెందుకుఁ గొఱగానిక్రూరనీచ • దశకుఁ బాల్పడిచెడుట తథ్యమగుఁగాదె.

గీ. తెల్ల కాకంబు కలదన్నఁ దెలివిలేక • నమ్మ నీదృశమంత్రిగణమ్ముచేతఁ జంపఁబడుచుండి రెందఱో చంపఁబడిరి • చంపఁబడుదు రపాపులు జగతియందు.

మిత్రమా! మైత్రేయ! నీవుపోయి మాయమ్మకు నాచరమనమస్కారము మనవి చేయుము. కుమారుని రోహసేనునిం గాపాడుము.

విదూ—మొదలు విఱిగిపడినఁ జెట్టును గాపాడుకొను టెట్లు!

చారు—చెలీ! అటుకాదు.

గీ. ఇహమువిడిచెడి ప్రాణుల కెల్లరకు శ • రీరములఁ బూరటసుమీ కుమారుఁడనఁగ నీకు నాయందుఁ గల పేర్మి నాకుమారు • నందుఁ జూపించి వానిఁ గాపాడవయ్య.

విదూ—మిత్రరత్నమా! నీకు నింతకాలము స్నేహితుఁడనై నీవులేకుండ నీప్రాణములు రక్షించుకొందునా!

చారు—రోహసేనునిమాత్ర మొకసారి చూపింపుము.

విదూ—ఇది బాగున్నది. అట్ల కావించెదను.

అధిక—శోధనక! ముం దీబ్రహ్మచారి నావలకుం బంపుము.

(శోధనకుఁ డట్లు కావించును)

అధిక—ఎవఁడురా యక్కడ! చండాలురఁ కాజ్ఞయొసఁగుడు.

(అధికరణికాదు లందఱును జారుదత్తుని విడిచి నిష్క్రమింతురు)

శోధ—అయ్యా! ఇటురమ్ము.

చారు—(కరుణముగా, 'ఏమి యిటువచ్చె మైత్రేయ' అను పద్యమును జదువుచు మింటివంకఁ జూచి)

చ. విసమును నీడు నిప్పు తుల వీనికతానఁ బరీక్షచేసి నా
దెస దొసఁగుంట నిక్కమని తేలినచోఁ గ్రకచంబుతోడ నా
యుసురులు గొన్నఁగాని కడునొప్పనుగా; కరిమాటపట్టి యే
దొసఁగునులేని పాఱు నిటుదున్మిన మీకులమెల్లఁ గ్రుంగదే.

ఇదిగో ! వచ్చుచుంటిని.

(అందఱును నిష్క్రమింతురు)

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతంబగు
మృచ్ఛకటికంబునందు
వ్యవహారమను నవమాంకము.

మృచ్ఛకటికము.

దశమాంకము.

(పిదప నిరువురు చండాలురచే ననుగమ్యమానుండగు చారుదత్తుఁడు ప్రవేశించును)

చండా——

గీ. విఱిచికట్టి వధ్యస్థలి దఱియఁజేర్చి • తలదరిగికాని కొఱ్ఱుపై నిలిపికాని
యచిరమున సభ్యులను జంపునట్టి నేరు•పలవడియె మన; కద్దియేయగు గతమ్ము.

ఆర్యులారా! ఒత్తిగిలుం డొత్తిగిలుండు. ఇతఁ డార్యచారుదత్తుఁడు.

గీ. హింసకులమగు మాచేత నిపుడు కంఠ • సీమ గన్నేరుదండ కైసేయఁబడిన
యితఁడు నిస్తైలమగు దివ్వెవితముగాఁ బ•రిక్షయముఁ జెందు నింక ననుక్షణంబ.

చారు——(విషాదముతో)

చ. తొరఁగువిలోచనాంబువులఁ దోఁగుచు వాని ధరాపరాగధూ
సర మగుచుఙ్ శ్మశానసుమసంతతి పైఁబడ రక్తగంధభం
గుర మగునామమేను బలికూడనియెంచి తినం దలంచి యం
బరమున మూఁగుచున్నవి రవంబులతోఁ బలిభుక్కు లక్కటా.

చండాలు——అయ్యలారా! ఓసరిలుం డోసరిలుండు!

గీ. సుజనశకునాధివాసమై సొంపుఁగాంచి • ఖ్యాతిఁబూనిన యొక సజ్జనాగమంబు
నఱకుచున్నార మిదె కాలపరశుధారఁ • జూడవచ్చెదరేటికి చోద్యపడుచు.

చారుదత్త! రారమ్ము.

చారు——పురుషుని యదృష్టవ్యాపారము లచింత్యములు కదా! నావంటివాని కిట్టి దుర్దశ సంప్రాప్తమైనది.

గీ. రక్తచందనహస్తముద్రలిడి మీఁదఁ • బిండి వెదజల్లినారు మేనిండ నాకు
నెంతలో నెంతమార్పయ్యె! నిపుడు నేను•పశువుగా మాఱితిని దైవవశతజేసి.

(ముందువంకకుం జూచి) ఆహా! ప్రజలయొక్క తారతమ్యజ్ఞానము!

గీ. 'మనుజుఁడై పుట్టరా' దంచుఁ గనులనీర•మొలుకఁగొందఱు శోకించుచున్నవారు
నన్నుఁ గాన నశక్తులై 'నాక మేగు•మా' యనుచు నన్ను దీవించి పోయినారు.

చండా——పొం డయ్యలారా! పొండు.

గీ. భ్రష్టరాజ్యుఁడై పోయెడి రాజుపాటు • తారకాపతనంబు వత్సప్రసూతి
సజ్జనప్రాణహానియు జనులు చూడ • రాని వీనాళ్లు కావున మాన్పరయ్య.

ఒకచండా—ఓరీ! అహ్హాంతా! చూడు చూడు.

గీ. ఉజ్జయినికెల్లఁ బేరొందు నుత్తముండు•నేఁడు వధియింపఁబడునను నెగులు కతన
నోయనఁగమిన్నుకన్నీరునోడ్చుజలద•రహితమయ్యును బిడుగులురాల్చఁదొడగె.

రెండవ చండా—ఓరోరి! గోహ!

గీ. అంతరిక్షము పలవించు టన్నృతమోరి • చాలుఁ జాలు నవ్రభవ్రబ్రవశంస
తరుణులందఱుఁ గూడి సౌధములమీఁద• నేడ్చుచున్నారు కంట నీరోడ్చియోడ్చి.

మఱియును,

గీ. వధ్యుడగు వీని గొంపోవఁ బౌరులెల్ల • నల్లకల్లోలముగ గొల్లుగొల్లు మనుచు
గోలపెట్టఁగ వారి కన్గొనలనుండి • జాఱు కన్నీట భూమిరజం బడంగె.

చారు—(చూచి కరుణముగా)

గీ. అకట యీ స్త్రీలు సౌధవాతాయనార్ధ • గతములయి వన్నెదఱుగు మొగములతోడ
దూముకాల్వలఁ గన్నీరు దోరునట్లు • లడలుచున్నారు చారుద త్తాయటంచు.

చండా—ఓరీ చారుదత్త! రా రా. ఇదే ఘోషణస్థానము. డిండిమము వాయించి చాటుదము (అని మ్రోగించుచు) ఆర్యులారా! వినుండు వినుండు. ఇతఁడు సార్థవాహుఁడగు వినయదత్తుని మనుమఁడు. సాగరదత్తుని కొడుకు చారుదత్తుఁడను పేరివాఁడు. వీఁడు కాలకర్మవశమున వసంతసేన యను లంజెసానిని జనశూన్యమగు పుష్పకరండక జీర్ణోద్యానమునకుం గొంపోయి ధనముకొఱకు మెడ పిసికి చంపినాఁడు. దొంగిలిన సొమ్ముతో పట్టుబడి ఇతఁడు నేరము నొప్పుకొన్నాఁడు. దానివలన రాజుగారు శూలారోపమునం జంపుడని మా కానతిచ్చినారు. మఱి యెవ్వరే నెప్పుడేని దుష్కార్య మిటువంటి దాచరించిరేని వారికి నిట్టి శాస్తియే యని తెలిసికొనుఁడు. (అని డప్పువాయించుచు ఘోషణమ్రోగింతురు.)

చారు—(నిర్వేదముతోఁ దనలో)

గీ. జన్మముల వేదఘోషప్రశస్తిఁజేసి • మున్ను నాకులమెంతయు వన్నెకెక్కె
నదియె నేఁడంత్యదశను నాయఘముకల్మి•నసదృశజనంబు చాటింపనయ్యె నకట.

(ఒడలు కంపింపఁ జెవులు మూసికొని) హాప్రియురాలా! వసంతసేన!

గీ. తరుణచంద్రికఁబోలు దంతములతోడ • బగడపుంజిగి గలమోవిసొగసుతోడఁ
దనరునీమోము నమృతంబు ద్రావి నేడు • దుర్యశోవిషమెట్టు ద్రావుదును లతాంగి.

చండా—ఆర్యులారా! ఒత్తిగిలుం డొత్తిగిలుండు.

క. గొనము లనురతనములకుం గని సజ్జనతాపహరుఁడు కారుణికుఁడు ప
ట్టనమునకున్ వెలియగుచుండెను పైఁడిది గాని యొక్కటే నగ పురికిన్.

మఱియును.

గీ. సిరియు సంపద సౌఖ్యంబు జెలగు నరుల • కష్టసుఖము లాలోచింపగలర పెక్కు
 రంతియేకాని దైవోపహతుల యాప • దల నివారింపఁజూచువా రిలఁ గలారె.

చారు—(నాలుగు దిక్కులుఁ గలయం జూచి)

గీ. అనుగు కాంగ్రడంద ఉత్తరీయాంతపిహిత • వదనులై పోవుచున్నారు వారె తొలగి
 మంచిదశనున్న నరియు బ్రేమించు నరుని • విషమదశ మిత్రుడేనియు విడిచిపెట్టు.

చండాలు—ప్రజలందఱుఁ దొలగిరి. రాజమార్గము విజనంబయ్యె. దత్తవధ్య చిహ్నుండగు వీనిని శీఘ్రముగాఁ దీసికొనిరమ్ము.

(ఏమియిటువచ్చె మైత్రేయ అను పద్యము చారుదత్తుండు చదువును)

(తెరలో) హాతండ్రీ! హాప్రియవయస్య!

చారు—(విని దైన్యముగా) ఓయీ స్వజాత్యగ్రేసర! నీవలన నే నొకటి ప్రతిగ్రహింపఁ దలఁచుచున్నాను.

చండా—మాచేతినుండి నీవు ప్రతిగ్రహింపవలసిన దేమున్నది?

చారు—పాపము శాంతించునుగాక! చండాలుఁడుగూడఁ గార్యపరిశీలనలేని పాలక మహారాజు నంతటి చండాలుడు కాఁడు; పరలోకసుఖావాప్తికొఱ కవసానకాలమునఁ బుత్రముఖముఁ జూపింపుమని ప్రార్థించెదను.

చండాలు—అటులనే సేయుము.

(తెరలో) ఓతండ్రీ! ఓనాయనా!

చండాలు—పౌరులారా! సందిండు సందిండు. పాపమీచారుదత్తుఁడు పుత్రుని మొగము కనుంగొనునట. ఆర్య! ఇటురమ్మిటురమ్ము. అబ్బాయీ! యీలాగునరా! బాబూ! యీలాగున రా (అని పిల్లవానిం బిలుతురు.)

(పిదప రోహసేనునితో విదూషకుఁడు ప్రవేశించును.)

విదూ—తండ్రీ! రోహసేన! త్వరగా నడువుము. నీతండ్రిని జంపుటకై కొంపోవుచున్నారు.

రోహ—హాతండ్రీ! హానాయనా!

విదూ—ఓ ప్రియమిత్రమా! నిన్ను నెక్కడఁ జూతును.

చారు—(మిత్రునిఁ బుత్రునిఁ జూచి) హాకొడుకా! హానెచ్చెలీ! (కరుణముగా) ఎంతకష్టకాలము సంప్రాప్తమయ్యెనోయీ!

క. పరలోకంబున నేనుం జిరకాలంబుం బిపాసచేఁ బొగులుదు నీ
 చిఱుతని చిన్నారి కరాంబురుహం బిచ్చెడి నివాపభోజనమెంతో!

ఈపుత్రున కేమి యొసగునో (తన శరీరముఁ జూచుకొని) ఈయజ్ఞోపవీత మొకటి యున్నది.

గీ. కనకమయమునుగాక ముక్తామయంబు • గాక వెలగున దీయలంకార మౌర
విప్రకోటుల కిదికదా వేల్పులకును • బితరులకు గూడ భాగ మర్పించుచుండు.

(అని యజ్ఞోపవీతమును దీసి యిచ్చును.)

చండా—ఓరీ చారుదత్త. రారా!

రెండవ చండా—ఓరీ! ఆర్యచారుదత్తుని నిరుపపదముగాను నోరీ యనియు బిలుచుచున్నావేమిరా!

గీ. సంపదలవేళ నాపత్తిసమయమందు • దేజరిల్లుచునుండు రాత్రిందివంబు
దివ్యతేజంబుతోడఁ బ్రతిష్ఠయను కి • శోరి కెక్కడఁ గలదురా మారకదశ.

ఇంతేకాదు.

క. ఇతఁ డపవాదార్ణవమున బతితుండై నంత గౌరవముచెడెనె? నమ
స్కృతికిఁ దగడె? రాహుగ్రస్తత దొలచునె శీతరుచికి జనులసపర్యల్? R.C

రోహ—ఓరీ చండాలులారా! మానాయన నెక్కడకురా తీసికొనిపోయెదరు?

చారు—అబ్బాయీ రోహసేన!

ఉ. స్కంధమునందు శూలమును గంఠమునం గరవీరమాల హృ
ద్బంధిత మైనశోకమును దాలిచి పోవుచు నుంటి మారణ
గ్రంథము విన్చుచోటికి వికారముగా శమితృప్రబంధనం
బంధము కల్గుచోటికి సవంబునఁ బోయెడు మేకచాడ్పునన్.

చండా—పిల్లడా!

గీ. మాది చండాలకులము జన్మంబుచేత•గాని చండాలురము మేము కాము నూవె
ఎవరు నిష్కారణంబు సాధువుల హింస • నం బొనర్తురో వారు చండాలు రనగ.

రోహసే—అటు లైనచో మాతండ్రి నేల చంపుచున్నారు?

చండా—చిరంజీవి! ఇది రాజనియోగము. మాయం దేదియు నపరాధము లేదు.

రోహ—మానాయనను వదలుడు నన్నుఁజంపుడు.

చండా—మాతండ్రీ! అట్లనకుము. నీవు చిరకాలము జీవింపుము.

చారు—(కన్నీరోడ్చుచు పుత్రునిం గవుంగిలించుకొని) ఆహా! ఇది యుశీరగంధానులేపనంబును జందనానులేపనంబునుగూడ నతిశయించుచున్నది.

గీ. ప్రేమ సర్వధనంబు దరిద్రులకును • భాగ్యవంతులకును దుల్యభాగ మౌర
పుత్రగాత్రపరిష్వంగమున జనించు • సుఖముకంటెను వే రొండుసుఖము కలదె.

("స్కంధమునందు శూలమును" అను పద్యమును మరలఁ జదువును. ముందుకుఁజూచి "అనుగుకాంౘందదఱు" అనుపద్యమును జదువును.)

విదూ—ఓభద్రముఖులారా ! నాప్రియమిత్రుని వదలుఁడు నన్ను జంపుఁడు.

చారు—(చూచి) పాపము శాంతించునుగాక. (తనలో) ఇప్పుడు తెలుసుకొనుచున్నాను. (ప్రకాశముగా "అకట యీ స్త్రీలు" అను పద్యమును జదువును.)

చండా—ఓ త్తిగిలుం డయ్యలారా ! యొత్తిగిలుండు !

గీ. ఏలచూచెద రయ్యయో యితని, దుర్వ • శంబుచే మేనువాయుసజ్జనుని మీరు
పదుగురకు నుపయోగమౌ పైడిఘటము • త్రాడు తెగి మున్గుచున్నది నేఁడు నూత.

చారు—(దైన్యముగా "తరుణచంద్రికఁబోలు" అను పద్యమునుఁ జదువును.)

రెండవ చండా—ఓరీ మరల డప్పువాయించి చాటింపుమురా ?

మొదటి చండా—(డప్పువాయించి "ఆర్యులారా ! వినుండు, వినుండు" అను మొదలైనది చదివి చాటించును.)

చారు—కటకటా !

గీ. ఆఘుదానిని జంపితినన్న దుష్ట • వార్త చాటింపగా వినవలసివచ్చె
వ్యసనకృశమును గడునిపూజ్యంబునగు ద • రిద్రదశకును దోడీ యుపద్రవంబు.

(పిదప మేడమీఁద సంకెళ్ళతో స్థావరకుఁడు ప్రవేశించును.)

స్థావ—(చాటింపు విని) కటకటా యేపాపమెఱుగని చారుదత్తుని జంపుచున్నారు ! నాస్వామి నాకుఁ గాళ్ళకు సంకెలలుగూడం దగిల్చినాఁడు తానీ; పెద్దగోల పెట్టెదను. ఆర్యులారా ! వినుండు ! వినుండు ! పాపాత్ముండ నగు నేను ప్రవహణవిపర్యాసమునఁ బాపమా వసంతసేనను బుష్పకరండక జీర్ణోద్యానంబునకుం దీసికొనిపోయితిని. అచట మాస్వామి తనతోడిపొత్తున కంగీకరింపలేదను దురాగ్రహంబున మెడ పిసికి యావసంతసేనం జంపినాఁడు. కాని యీమహానుభావుఁడు చారుదత్తు డాపాప మెఱుగఁడు. అక్కటా దూరముగా నున్నారు. నామాట లెవరికిని వినఁబడవు కాఁబోలు. ఏమిచేయగలను ? (ఆలోచించి) క్రిందికి దుమికెదను. ఇట్లు చేసితినేని జారుదత్తార్యుఁడు చావక బ్రతుకఁగలడు. కావున నీప్రాసాదాగ్ర ప్రతోళికయందుండి యీజీర్ణగవాక్ష ద్వారంబున గ్రిందికి దుమికెదను. నేను జచ్చినను గులపుత్రవిహంగంబుల కెన్నింటికో నివాసవృక్షం బగు చారుదత్తుఁడు బ్రతుకును. ఒక సజ్జనునికొఱకుఁ జచ్చినను నాకుఁ బరలోకము రాఁగలదు. (అని క్రిందికి దుమికి) ఆశ్చర్యము ! నేను జావకుంటయే కాక నా కాలిసంకెలలుగూడ విడిపోయినవి ! కానీ, యాచండాలఘోషము వీతెంచుచోటికి బోయెదను. (పోయి) ఓ చండాలులారా ! దారియిండు, దారియిండు.

చం—ఓరీ! ఎవఁడు వీఁడు? దారియిమ్మనుచున్నాఁడు?

స్థావ—(వినుఁడు వినుండు మొదలుకొని.........చారుదత్తుఁడా పాపమెఱుఁగడు.... దాకఁ జదువును.)

చారు—

గీ. కాలపాశంబు బిగువుగాఁ గంఠమునకుఁ • దగులుకొనియున్న నామీఁదిదయ నితండె
వండొకో చిమ్ముచున్నాఁడు వాన లేక • మాడుసస్యంబుపైఁ బెద్దమబ్బుకరణి.

అయ్యలారా! వింటిరా!

గీ. మరణ మన్నను నేభయంపడుట లేదు • దూషితంబయ్యె నాకీర్తి దుష్పదమున
సజ్జనులకు విశుద్ధమౌ చావుతోడఁ • బుత్రసంభవమైనను బోలఁబోదు.

ఇంతియే కాదు.

గీ. నిజమునకుఁ దాను దోషియై నిర్నిమిత్త • వైరమూనిన నీచునికారణమున
దూషితుడనై యరుగుచుంటి దుర్విషాక్త • శరముచే విద్ధుడై చను జనునిపోల్చి

చండా—స్థావరకా! నీవు చెప్పునది సత్యమేనా?

స్థావ—నిజము నిజము. ఎవ్వరితోడనైన నీయుదంతము జెప్పెద నేమోయని నన్ను బాలప్రాసాదాగ్రప్రతోళికయందు బొండవేసెను.

శకా—(ప్రవేశించి సంతోషముతో)

గీ. ఒబ్బిగారమ్ము పులుసు గుడోదనమ్ము • కుడుములుం జేపలును బప్పుగూరతోడ
పలలయుక్తమ్ముగా నేను భక్షణమ్ము • సలిపివచ్చితి నాగృహసద్మమందు.

(చెవియొగ్గి) పగిలిపోయిన కంచువలె ఖణఖణలాడుచుఁ జండాలురు మాటలాడుచున్నారు. వధ్యస్థానమున డిండిమము మ్రోగించుచున్నారు. ఆ దరిద్ర చారుదత్తుఁడు వధ్యస్థానంబునకుం గొంపోఁబడియె నని తలంచెదను. పోయి చూచెదను. శత్రువినాశము గన్నారఁగని యానందించెదను. ఎవఁడు శత్రువును జంపుచుండఁ గన్నులారఁ గాంచునో వానికి జన్మాంతరమున నక్షీరోగము రాదని పెద్దలు చెప్పఁగా వింటిని. విషగ్రంధి కడుపులో దూఱినకీటకమువలె నేనాదరిద్ర చారుదత్తునిఁ జంపుటకుఁ ద్రోవ వెదకి వెదకి తద్వినాశమునకుం దగిన యుపాయ మారసి యట్లు కావించుచున్నాను. కావున నాబాలప్రాసాదాగ్రప్రతోళికయందుం గూర్చుండి నాపరాక్రమముఁ జూచి యానందించెదను. (మేడమీది కెక్కి చూచి) హీహీహీ! ఈదరిద్ర చారుదత్తుని వధ్యస్థానమునకుఁ దీసికొనిపోవుచున్నప్పుడే యింతమంది గుమిగూడినారే, యిక నావంటి నరమనుష్యుఁడు చంపబడునప్పు డెంతమంది గుమికూడుదురో కదా! వీనిం గ్రొత్తగిత్తవలె నలంకరించి శ్మశా

నమునకుం గొనిపోవుచున్నారు. (మరలం గనుగొని) డప్పులమ్రోత మాన్పించినారేమో! (చూచి) స్థావరకుండు సైత మిందు గానరాడు. వాడుపోయి మంత్రభేదము గావింపలేదుకద; వీనిని ముందు వెదకెదను. (వెదకి) వీఁడె స్థావరకుఁడు. ఈమందిలో నున్నాడు. (మేడదిగి వాని సమీపమునకుం బోవును.)

స్థావ—అయ్యలారా! వీఁడె వాఁడు వచ్చినాఁడు. (అని చూపును.)

చండా—

గీ. ఒత్తిగిలుడయ్యదారియిందొత్తిగిలుడు•మూసికొనుడయ్య తలుపులుమూసికొనుడు
దుర్ణయం బనుకొమ్ములు దులపరించు • కొనుచు దుష్టబలీవర్ద మెనయుచుండె.

శకా—ఓరోరి జనులార! సం దిండు సం దిండు. పుత్రకా! స్థావరక చేట! యిటుర మ్మిటురమ్ము. పోదమురా.

స్థావ—హీ హీ! దురాత్మ! పురమున కంతయు నలంకారమగు వసంతసేనం జంపినది చాలక ప్రణయిజన కల్పవృక్షంబగు నార్యచారుదత్తునింగూడ జంపింప నుంకించుచుంటివా;

శకా—రత్నాలకుండ వంటివాఁడ నే నాఁడుదానిం జంపుదునఁటరా!

అందఱు—నీవే చంపితి; నార్యచారుదత్తుఁ డేమియు నెఱుగడు.

శకా—ఇటు లన్నవాఁ డెవఁడు?

అందఱు—(చేటుని జూపుచు) ఈ సజ్జనుఁడు చెప్పుచున్నాడు.

శకా—(భయముతోఁ దనలో) అయ్యో యీస్థావరకుని ద్రాళ్ళతో గట్టిగా గట్టిపెట్టలేదు కాఁబోలు. నాదుష్కృత్యము నెదుటనుండి చూచినవాఁడే వీఁడు. (ఆలోచించి) కానీ! యిట్లు బొంకెదను. (ప్రకాశముగా) అయ్యలారా! అబద్ధ మబద్ధము. వీఁడు నాదాసుఁడు; నాదగ్గఱ నున్న బంగారము దొంగిలించెను. దానంజేసి వీనిం దన్ని చావమోఁదీ సంకెళ్ళువైచి కట్టిపెట్టితిని. ఆకోపమున వీఁ డీయసత్యమాడుచున్నాఁడు. (ప్రక్కకుఁదిరిగి రహస్యముగా) నాయనా స్థావరక! నీకీ బంగారమిచ్చెదను లేదనుము. (బంగారమిచ్చును)

స్థావ—(అది పుచ్చుకొని) అర్యులారా! చూడుఁడు. నాకు బంగారము లంచ మిచ్చి నన్నసత్యమాడు మనుచున్నాడు. (అని బంగారముఁ జూపించును)

శకా—(ఆ బంగారము లాగికొని) అయ్యా! నాదగ్గఱ దొంగిలించినదే యీబంగారము. దీని కొఱకే నేను వీనిం దన్నితిని, గట్టిపెట్టితిని. ఓచండాలులారా! వీని నా నగలపెట్టెకు గాపువెట్టితిని. వీఁ డందులోని దీబంగారము దొంగిలించెను. దానిచే వీనిం దన్నితిని చూడుఁడు వీనివీఁపు.

చండా—(చూచి) నిజమే చెప్పుచున్నాడు; దెబ్బలు తిన్న వీ దేమాటయైన ననగలడు.

స్థావ—ఆహా! దాసభావ మనగా నిట్టిది! నిజముఁ జెప్పినను నెవ్వరును నమ్మరు. (విచారముతో) ఓచారుదత్తా! నేనేమి చేయుదును? నావిభవ మింతటిదే. (పాదములపైఁ బడుచున్నాఁడు)

చారు—(కరుణముగా)

గీ. సాధుబాధానుకంపివి, సచ్చరితుడ • వన్న! నను గావ నీసల్పనట్టి యత్న
మేది? నాకర్మమిటులుండ నేమిసేతు? • లెమ్ము; నా కనిమిత్త మిత్రమ్మవైతి.

చండా—ఈచేటునిఁ దన్ని యావల కీడ్వుము.

శకా—ఛీ, నీవు లేచిపోరా! (నిష్క్రమింపజేయును) ఓ చండాలులారా! యేల విలంబనము. ఈ చారుదత్తుని వేగ జంపుడు.

చండా—నీ కంత తొందరగానున్న నీవే చంపుము.

రోహ—ఓ చండాలులారా! మా తండ్రిని వదలి నన్నుఁ జంపుడు.

శకా—అటులేని వీనితోఁగూడ చారుదత్తునిం జంపుడు.

చారు—తండ్రీ! వీఁడేమి చేయించినను జేయింపగలడు. నీవింటికిఁ బోయి మీ యమ్మదగ్గఱ నుండుము.

రోహ—నేను బోయి చేయవలసిన దేమున్నది?

చారు—క. మీయమ్మ వెంటరాఁజనుమీయాశ్రమమునకు బోయి మెలగుము మునివై
మీయమ్మ యొనర్చిన పాపాయతి నినుగూడ వెంటనంటునొయేమో?

మిత్రమా మైత్రేయ! నీవు వీని వెంటంగొనిపొమ్ము.

విదూ—నీవెట్లనుకొంటివి? నీవు చనిపోయినవెనుక నేను ప్రాణములు ధరింతునా?

చారు—చెలికాఁడా! నీప్రాణము నీయధీనమై యున్నప్పుడు నీవు ప్రాణత్యాగముఁ గావింపవలసిన యవసర మేమి వచ్చినది?

విదూ—(తనలో) ఇది బాగున్నది. కాని ప్రియవయస్యవిరహితుండనై ప్రాణము లెట్లు నిల్పుకొందును! యీపిల్లవానిం దల్లికప్పగించి యేనును ప్రియవయస్యునితోఁ బ్రాణములు పాసెదను. (ప్రకాశముగా) నెచ్చెలీ! పిల్లనిం గొంపోయి బ్రాహ్మణి కప్పగించెదను. (చారుదత్తుని కంఠాలింగన మొనర్చికొని కాళ్ళపైఁ బడును.)

(పిల్లవాడును నేడ్చుచు తండ్రికాళ్ళపైఁ బడును.)

శకా—ఓరీచండాలులారా! పుత్రునితోగూడ జారుదత్తునిజంపుడని నేననలేదటరా!

చారు—(గజగజవడఁకును.)

చండా—మాకు రాజాజ్ఞ యట్లులేదు. కావున మేమీ యర్భకునిం జంపము. అబ్బాయీ! నీవు పొమ్ము నీవు పొమ్ము (అని యావలకుం బంపుదురు) ఇది మూఁడవ ఘోషణస్థానము. డిండిమము మ్రోగింపుము! మ్రోగింపుము. (మరల చాటింతురు.)

శకా—(తనలో) ఈపౌరు లిప్పటికి నమ్మకున్నారు. (ప్రకాశముగా) ఓరీ! చారుదత్త హతక! ఈ పౌరులు నమ్మకున్నారు. నీనాలుకతో నీవే "వసంతసేనం జంపితి"నని చెప్పుమురా!

చారు—(ఊరకుండును.)

శకా—ఓరీ చండాలురలారా! ఈ చారుదత్తహతకుఁడు చెప్పఁడు. మీ రీ వెదురు కఱ్ఱతో మొత్తి చెప్పింపుడు.

చండా—(కఱ్ఱయెత్తి) ఓరీ చారుదత్త చెప్పుమురా!

చారు—(కరుణముగా)

గీ. ఘోరవిపదబ్ధి మున్గియు గొంచెమైన • భయముజెందను మదివలవంతజెంద
చెలియ సేన చంపితినంచుబలుకదుర్య•శోగ్నిననుగాల్చునని మాత్ర మలుకుచుంటి.

శకా—ఓరీ చారుదత్త! నీనాలుకతో నీవే వసంతసేనం జంపితి ననుమురా. లేకున్న నీపౌరులు నమ్మకున్నారు.

చారు—ఓపౌరులారా! (అని "ఘాతుకుఁడ నగుచుఁ బరలోకం బెఱుగక" అను పద్యముం జదువును.)

శకా—చంపబడినది.

చారు—కానిమ్ము.

ఒక చండా—ఓరీ! యీదిన మితని వధించుట నీవంతురా!

రెండవ చండా—నీదేరా.

ఒక చండా— చీట్లు వైచుకొందము, (అని చీట్లువైచి) నాకే వచ్చినయెడల ముహూర్త మాఁగుదము.

రెండవ చండా—ఎందునిమిత్తము?

మొదటి చండా—నాతండ్రి స్వర్గమునకుఁ బోవుచు "ఓరీ వీరకా! నీకు వధ్యపాలిక వచ్చిన రవంతసే పాఁగు" మని చెప్పిపోయెను.

రెండవ చండా—ఎందునిమిత్తము?

మొదటి చండా—ఏప్పుడైన నేసాధువైన ద్రవ్య మిచ్చి వధ్యుని వదలింపగలడేమో, రాజునకుఁ గొడుకు పుట్టునేమో, ఆ మహోత్సవకాలమున వధ్యులందఱకని

విమోచనము కలుగును. హస్తిబంధమును ద్రెంచుకొనునేమో, అతొందరలో వధ్యుఁడు విముక్తుడగును. రాజు మాఱిపోవునేమో, అప్పుడు వధ్యులందఱకును విముక్తి కలుగును.

శకా—ఏమేమి రాజపరివర్తనమగునా?

మొదటి చండా—ఓరీ వధ్యపాలికకుఁ జీట్లు వైచుకొందము.

శకా—త్వరగాఁ జారుదత్తుని జంపుఁడు. త్వరగాఁ జంపుఁడు. (చేటునితో నొక్క ప్రక్కకేగి నిలుచును.)

మొదటి చండా—ఆర్యచారుదత్త! రాజనియోగము నీకపరాధముఁ జేయుచున్నది. కాని మేము కాము. కావున నీవు తలఁచుకోదగిన దేదియో తలంచుకొనుము.

చారు—

గీ. అధికృతులవాక్యములచేత విధివశమున • దూషితుడనయ్యు ధర్మవంతుండనేని
స్వర్గముననే నింకెటకేనిఁ జన్నఁ దప్వ • నాకళంకంబుఁ బోకార్చుగాక వచ్చి.

ఓ చండాలులారా! నే నెచటికిఁ బోయి యుండవలెను.

చండా—(ముందుఁ జూచి) ఓరీ యిదె దక్షిణశ్మశానము. దీనిం జూచినంతనే వధ్యులు చంపబడకయే ప్రాణములు వదలుదురు.

క. వఱకులు మెయిసారించును నఱపా ల్దిగలాగి మెసవ, నదె! కొట్టుకొనన్
దిరమయి నిలిచినది కళేబర మఱపా లట్టహాసభయదాకృతితోఁ.

చారు—హా! యెంత దురదృష్టవంతుడనైతిని! (పోయి యందె కూర్చుండును)

శకా—నేను చారుదత్తుని చావు చూచి కాని వెళ్ళను. (పరిక్రమించి చూచి) వీఁడే చారుదత్తుఁ డెట్లుకూర్చున్నాఁడో.

చండా—ఏమి చారుదత్తా! భయంపడుచుంటివా యేమి?

చారు—(శీఘ్రముగాలేచి) చీమూర్ఖ! ("మరణమన్నను" అను పద్యముజదువును.)

చండా—చారుదత్తా! ఆకాశమునందున్న సూర్యచంద్రులు సైతము విపత్తిబొందుచున్నారు. మరణభీరువు లగు మానవుల కాపదలు రాకుండునా! లోకమున నుచ్ఛస్థితుఁడు పడుచుండును, నీచస్థితుడు లేచుచుండును.

గీ. పాతవస్త్రమ్ము విడనాడి నూతనమగు • నన్యవస్త్రముదాల్చిన ట్లాత్మ దేహ
మన్యము గ్రహించుచుండు; నీయర్థ మెఱిగి•ధీరులగువారు మృతికి విచారపడరు.

ఇదిగో నాలవసారి చాటించుచున్నాము. (అని వెనుకటియట్ల చాటింతురు)

చారు—హా ప్రియురాల వసంతసేన! ("తరుణచంద్రికఁబోలు" అను పద్యము జదువును.)

(పిదపఁ దొందరగా వసంతసేనయు భిక్షువును ప్రవేశింతురు.)

భిక్షు—ఔరా ! నే నీసన్న్యాసాశ్రమము స్వీకరించుటచేతంగదా, యస్థానమూర్ఛిత యగు వసంతసేనకుఁ బరిచర్య గావించి యూరడింపఁ గలిగితిని. ఓ బుద్ధో పాసకా ! నిన్నెచటికిఁ గొనిపోవలయును ?

వసం—ఆర్యచారుదత్తు నింటికే. ఆ యనఘుని దర్శనముఁ జేయించి నన్నుఁ జంద్రుని జూచిన కుముదినిం గావించి యానందింప జేయుము.

భిక్షు—(తనలో) ఏదారినిబోదునో ! (ఆలోచించి) ఆదారియు నీదారియునేల రాజ మార్గముననే పోదును, (ప్రకాశము) ఉపాసికా ! రమ్ము. (ఆలకించి) రాజ మార్గమునఁ బెద్దకోలాహలము జరుగుచున్న దిది యేమయి యుండును ?

వసం—(ఎదుటఁజూచి) చాలమంది గుమిగూడిరి. ఆర్య ! ఇదియేమయియుండునో కనుగొనుము. వసుంధరకుగూడ బరువగునట్లుజ్జయిని యంతయు నొకచోటికే యొరిగినది.

చండా—ఇదిగో నైదవ ఘోషణాస్థానము. ఐదవసారి డిండిమము మ్రోగింపుము రా ! (మరల దప్పు మ్రోగించుచు వెనుకటియట్లే చాటింతురు) చారుదత్తా ! సిద్ధముగా నుంటివా ? భయపడకు మొక్కత్రుటిలోఁ గడతేర్తుము.

చారు—ఓ భగవతులగు దేవతలారా !

భిక్షు—(విని తొందరపడి) ఉపాసికా ! నీవు చారుదత్తునిచేఁ జంపబడితి వని తగవు తేఁబడి చారుదత్తుఁడు చంపబడుచున్నాఁడు.

వసం—(సంభ్రమముతో) అమ్మయ్యో ! దురదృష్టవతినగు నాకై యార్య చారు దత్తుఁడు చంపబడుచున్నాడా ! అయ్యో ! త్వరగ దారిచూపుము. త్వరగ దారి చూపుము.

భిక్షు—అమ్మా వేగరమ్ము. బ్రతికియుండగా జారుదత్తుం గనుగొందము. ఆర్యులారా! దారియిండు దారియిండు.

చండా—అయ్యో ! చారుదత్తా ! రాజనియోగము నెఱపకతీఱదు. నీవు తలఁచుకోఁ దలచినది తలంచుకొనుము.

చారు—వెయ్యేల ("అధికృతులవాక్యములచేత" అను పద్యముం జదువును)

చండా—(కత్తియెత్తి) అయ్యో ! వెల్లకిలంబడి సమముగఁ బరుండుము. ఒక్క వ్రేటుతో నీతల నఱికి నిన్ను స్వర్గమునకుఁ బంపించెదను.

చారు—(చండాలుఁడు చెప్పినట్లు చేయుచున్నాడు.)

చండా—(నఱకబోయి చేతినుండి కత్తి జాఱిపోవుటనభినయించి) హా ! యెంతకష్టము.

క. పిడి రోసముగా లాగియుఁ బిడి గట్టిగఁ బట్టుకొనియుఁ బిరుతివియక నే
వడినెత్తినఖడ్గం బిలఁ బడియె నహో యశనిసన్నిభం బిది యకటా.

ఇది యిట్లగుటఁ జూడ నార్యచారుదత్తున కీయాపద దాటునని నే ననుకొని యెదను. ఓయమ్మా సహ్యావాసినీ! అనుగ్రహింపు మనుగ్రహింపుము. చారుదత్తున కీయాపదదాఁటించితివా నీవు మాచండాలకులమునెల్ల ననుగ్రహించినట్లే.

ఒక చండా—మనము రాజాజ్ఞ నెఱవేర్చుకొందము.

రెండవ చండా—కానీ, యట్లే కావింతము.

(అని యిరువురును జారుదత్తుని శూలారోపము చేయదలతురు.)

చారు—("అధికృతులవాక్యములచేత" నను పద్యముం జదువును.)

వసంత } (చూచి) వలదు. వలదు. ఆర్యులారా! చంపవలదు. ఏనిమిత్తమున నీ
భిక్షు } మహానుభావుఁడు వధింపబడియెడినో యాదురదృష్టవతి ఇదిగోవచ్చినది.

చండా—(చూచి)

గీ. కురులు వీడి బుజమ్ముపై బొరలుచుండ • మృదుతతంబైన కుడిచేయి మింటికెత్తి
యీమె యెవ్వరొకో యటులేగుదెంచు • చుండె వలదంచు ఘోషించుచుండె నకట

వసం—ఆర్యపుత్రా! చారుదత్త! ఇదియేమి? (అని యురముపైఁబడును.)

భిక్షు—ఆర్యా! చారుదత్త! ఇది యేమి? (అని కాళ్ళపైఁ బడును.)

చండా—(భయంపడుచుఁ దొలంగి) ఈమె వసంతసేనయేనా? మనమీసజ్జనుని జంపకుంట మేలేయయ్యెను.

భిక్షు—(లేచి) ఓరీ! చండాల! చారుదత్తుఁడు జీవించియుండెనా!

చండా—నూఱేండ్లు బ్రతుకును.

వసం—(సహర్షముగ) నేను బ్రతికితిని.

చండా—యాగవాటమునకుం బోయిన రాజుగారితో నీవృత్తాంతముఁ దెలిపెదను. (అని నిష్క్రమించుచుండ)

శకా—(వసంతసేనంజూచి భయముతో) ఈగర్భదాసి బ్రతికియే యున్నది. ఇఁక నాప్రాణముల కాస వదలుకోవలయు. కానీ, పాఱిపోయెదను. (పాఱిపోవును.)

చండా—(శకారుని సమీపించి) ఓరీ మనకు వసంతసేన నెవరు చంపిరో వానిం జంపుమని రాజుగా రానతిచ్చిరి. కావున మనమీసంస్థానకుని బట్టికొందమురా (కూడఁ బరుగెత్తుదురు.)

చారు—(అబ్బురముతో)

గీ. చంపుటకు మీది కెత్తిన శస్త్రముండ • మృత్యుముఖమున నేనుండ వృష్టిలేక
యెండుసస్యంబునకు ద్రోణవృష్టి పగిదిఁనిపుడు ననుగాచినది యీమె యెవ్వరొక్కొ

(చూచి గుర్తించి) ఆహా! యీమె వసంతసేనయే (వితర్కించి)

గీ. నాకు విభ్రాంతి నట్టులున్న యది యేమొ • కానిచో రెండవవసంతసేన యేమొ
చచ్చిపోయియు దివినుండివచ్చినదియొ • మరల; లేకున్ననన్మృతమో మరణవార్త.

అదియునుం గాదు.

గీ. నాకలోకంబునుండియు నన్ను బ్రతుక • జేయగా నిటువెంచి వచ్చినది యీమె;
కాదుకాదీమె యెవతెయో కాని యామె • రూపువహియించి నాసిల్గుఁ బాపవచ్చె.

వసం—(కన్నీరు దిగజాఱ లేచి కాళ్ళపైబడి) ఆర్యపుత్ర! నీకిన్ని పాట్లు తెచ్చి పెట్టిన యా పాపాత్మురాలను నేనే.

(తెరలో) చిత్రము! చిత్రము! వసంతసేన బ్రతికియున్నది. (అని యేక స్వరముగా నందఱును బలుకుదురు.)

చారు—(విని వేగ లేచి స్పర్శసుఖ మభినయించి కనులు మూసికొనియె హర్షగద్గదాక్షరముగా) హా ప్రియురాలా! వసంతసేన! నీవేనా?

వసం—ఔను నేనే యా పాపాత్మురాలను.

చారు—(చూచి సంతోషముతో) వసంతసేనయే (ఆనందముతో)

గీ. మృత్యుముఖమున నే నున్నయిపుడు నీవు • తరలుకన్నీట నక్షును దడుపుకొనుచు
బ్రతుకగా జేయ నెటనుండి వచ్చినావు • వెలవు పుట్టింపగా మంత్రవిద్య వోలె

ప్రియురాలా! వసంతసేన!

గీ. నీకొఱకు జంపబడు మేను నీవు వచ్చి • ప్రోచితివి కాన నిదియు నీపుణ్య మతివ
వహవ! ప్రియసంగమప్రభావంపుగరిమ! • మరల బ్రతుకునె చచ్చిన మానవుండు

మఱియు నోకాంతామణీ! చూడుము—

గీ చావుకొఱకైన రక్తవస్త్రంబ రక్త • కుసుమమాలయె నను బెండ్లికొడుకుఁ గాఁగ
జేసినవి నేడు మరణసూచిప్రతోద్య • రావమే నాకు మంగళరావ మయ్యె.

వసం—ఆర్యుని యతిదాక్షిణ్యముకతమున వాటిల్లిన యీముప్పునకు మూలమెట్టిది?

చారు—ప్రియురాలా! నీవు నాచేఁ జంపబడితివని.

గీ. పూర్వవైరంబు మదిలోన బొదల రాజు • గారి కే స్యాలకుడనంచు గర్వపడుచు
బాపి యగువాడు నేరంబుమోపె. దాని • కధికృతులు శిక్షవిధియించి రవలనిట్లు.

వసం—(చెవులు మూసికొని) పాపము శాంతించునుగాక; వానిచే మీరుకాదు నేఁ జంపఁబడితిని.

చారు—(భిక్షువుం జూచి) తరుణీ! యితఁడెవ్వఁడు?

వసం—ఆ పాపాత్ముడు చంపగా నన్ను బ్రతికించిన పుణ్యాత్మకుఁ డితఁడు.

చారు—ఈ యకారణబాంధవులు మీ రెవరయ్యా?
భిక్షు—ఆర్యా! నన్ను మీరు గుర్తింపరైతిరి. దేవరకాళ్ళు పిసుకు సంవాహకుండను. జూదమాడి యోడిపోయి ఋణపడి వారిచేఁ దరుమఁబడి యాబుద్ధోపాసికయింట దూఱితిని. ఈమె మీవాఁడనని జాలిపడి తన బంగారునగ యొకటి యొసఁగి నన్ను ఋణముక్తునిఁ గావించినది. తదాది ద్యూతనిర్వేదంబున బౌద్ధసన్యాసినైతి. ఈమె బండి మార్పుడువలనఁ బుష్పకరండక జీర్ణోద్యానమునకుఁ గొంపోఁబడియె. ఆ పాపాత్ముఁడు తనపొత్తున కంగీకరింపలేదని బాహుపాశబలాత్కారంబునం బంపె; పిమ్మట నేఁజూచితిని.

(తెరలోఁ గలకలము)

కవిరాజవిరాజితము

జయమగు దక్షనిజన్నముఁ ద్రోచినస్వామికి గోపతికేతునకున్
జయమగుఁ గ్రౌంచరసాధరభేత్తకు షణ్ముఖముల్ గలదేవరకున్
జయమగు శాత్రవసంతతి నెల్లప్రజల్ జయపెట్ట జయించిన య
ద్వయమగు విక్రమవత్తతగంధరఁ దన్పెడు నార్యకభూపతికిన్.

శర్విలకుఁడు—(ప్రవేశించి)

ఉ. పాపనృపాలకుండయిన పాలకునిం గడతేర్చి యార్యకుం
భూపరిపాలనోచితుని భూపతిఁజేసి తదాజ్ఞ మోయుచున్
బాపమతుల్ మహాపదకుఁ బాలొనరించిన చారుదత్తుసం
తాపముఁ బాపఁగా మనము తద్దయు నన్ బురికొల్ప నేగెదన్.

క. బలమంత్రహీను శాత్రవుఁ బొలియించి ♦ ప్రజాళి నెగులు బోకార్చిన మా
కిలయెల్లఁ గైవసంబై యలరుఁ ద్రిలోకాధిపత్య మమరపతికటుల్.

కావున వేగమపోయి చారుదత్తుం గాపాడవలయును. (ముందుఁ జూచి) ఇదె జనసముదాయ మాతఁ డిం దిందుండవలయు. క్షితిపతియగు నార్యకుని మనోరథ మీకార్యము గావించిన సఫలంబగును. (త్వరగా నడచి) జాల్ములార! యొత్తిగిలుండు. (చూచి సంతోషముతో) ఇదిగో! జారుదత్తుడు వసంతసేనతో గూడ బ్రతికియే యున్నాఁడు. ఏమిపుణ్య మేమిపుణ్యము! మాస్వామియగు నార్యకభూపతి మనోరథములన్నియు నేఁటికి సంపూర్ణములైనవి.

చ. వ్యసనమహార్ణవాంతరమునందు మునింగియు, శీలమున్ గుణ
ప్రసరముచేఁ జెలంగు నుడుపంబనఁబొల్చు వసంతసేనచే
నసువులు దాల్చి నాప్రియవయస్యుఁడు కంటఁబడెన్ విధుంతుద
గ్రసనము దాఁటి రేవెలుగు కౌముదితో నలరారుచాడ్పునన్.

ఇయ్యనఘునియింట దొంగతికముఁ గావించిన మహాపాతకిని నే నెట్లితని సమీపింతును ! కానీ; ఇతఁడు సర్వసముడుకదా ! (దగ్గరకుఁబోయి దోసిలియొగ్గి) ఆర్యా ! చారుదత్త !

చారు—అయ్యా ! మీరెవరు ?

శర్వి—

గీ. అపహరించెనొ నిశివేళ న్యాసమిడిన • నగను మీయింటి కెవడు కన్నంబుత్రవ్వి యామహాపాతకుడ నేన యనఘ నిన్ను • శరణమంటిని నన్ను రక్షణముసేయు.

చారు—సఖా ! అట్లుకాదు. నీవు నాకుపకృతియే చేసితివి. (అని కౌఁగిలించును)

శర్విల—అయ్యా యింకొకమనవి చిత్తగింపుము.

గీ. ఆర్యనుతచర్యుడైన యా యార్యకుండు • కులము మానంబు రక్షించుకొనుచు నేడు యజ్ఞవాటంబునందు దురాత్ముడైన • పాలకుని రూపుమాపె దోర్లీలమెఱయ.

చారు—ఏమి !

శర్వి—క. నీబండియెక్కి యెవ్వడు తా బైటికిబోయి యాపదం దరియించెం దూబయగు పాలకుం బలిగాఁ బొరిగొనె నాతఁ డార్యకక్ష్మాపతియే.

చారు—శర్విలకా ! పాలకుడు వ్రేపల్లెనుండి రప్పించి నిష్కారణముగఁ గారాగారమునం దుంచఁగా నీవు విడిపించిన యార్యకుఁ డను గోపాలదారకుఁడా !

శర్వి—భట్టారకు లానతిచ్చిన యతఁడే.

చారు—మనకుఁ బ్రియము మనకుఁ బ్రియము.

శర్వి—ఉజ్జయినీరాజ్యమందుఁ బ్రతిష్ఠింపబడినవెంటనే మీమిత్రుఁ డార్యకుఁడు, వేణానదీతటమునందలి కుశావతీరాజ్యము మీకు సమర్పించెను. మిత్రుని యీ ప్రథమ ప్రణయము మన్నింపబడుగాక. (వెనుకకుఁ దిరిగి) ఓరోరి పాపాత్ముఁడగు రాష్ట్రీయశఠు నిటు కట్టితెండురా !

(తెఱలో) శర్విలకాజ్ఞకు బద్ధులము.

శర్వి—ఆర్యకమహారాజు 'మీగుణోపార్జితమగు నా యీరాజ్యము మీ చిత్తానుసారముపయోగింపుఁ' డని ఆర్యునకు విన్నవించుచున్నాఁడు.

చారు—ఎట్లు ! రాజ్యము మద్గుణోపార్జితమా ?

(తెరలో) ఓరీ ! రాష్ట్రీయస్యాలక రారా ! నీవుచేసిన దుర్ణయంబునకు ఫలమనుభవింపుమురా.

(తరువాత రాజపురుషులచే రెక్కలు విఱిచికట్టబడిన శకారుఁడు ప్రవేశించును.)

శకా—ఆశ్చర్య మాశ్చర్యము !

గీ. పరుగిడితి దూరముగ గర్ధభంబుమాద్రి • గట్టితెచ్చిరి ఘనకమ్మ కరణి మరల
దిక్కుకాన్పింప రెవ్వరు దిక్కునాకు, • శరణుజొచ్చుట కెవ్వారు శరణునాకు.

(ఆలోచించి) కానిమ్ము శరణాగతత్రాతయగు చారుదత్తునే శరణందును.
(అని చారుదత్తుని సమీపించి) రక్షించుమయ్యా! రక్షింపుము (అని కాళ్ళపై బడును)

(తెరలో) ఆర్యచారుదత్త! వదలుము వదలుము. వీనిం జంపెదము.

శకా—అయ్యా! ఆ శరణ శరణ! నన్ను రక్షింపుము.

చారు—(దయతో) శరణాగతున కభయమిచ్చితిని.

శర్వి—(వేగముగా) వీనిం జారుదత్తునొద్దనుండి యావలకుం దీసికొనిపొండురా!
(చారుదత్తునితో) అయ్యా! ఈపాపాత్మునకుఁ జేయదగినశిక్ష విధింపుము.

క. శూలారోపము చేయుదుమా? లే కర్పింతుమా శ్వమండలికిం? బా
శాలం గట్టుదుమా? అంపాలం గోయుదుమ? చెప్పు త్వరగా మాకున్.

చారు—వీనికి విధింపవలసిన శిక్షఁ జెప్పెదను అట్లు చేసెదరా.

శర్వి—సందేహ మేమున్నది?

శకా—భట్టారక! చారుదత్త! శరణంటిని. నన్ను గాపాడుము, కాపాడుము. మీకు దగినట్లు చేయుడు. ఇఁక నెన్నం డిట్టి దుష్కృత్య మాచరింపను.

(తెరలో) చంపుఁడు చంపుఁడు. పాతకి నేల బ్రతుకనిచ్చుచున్నారు.

వసం—(చారుదత్తుని కంఠమునుండి వధ్యమాలందీసి శకారుని కంఠమునవైచును)

శకా—గర్భదాసీపుత్రి! అనుగ్రహింపు మనుగ్రహింపుము. నిన్ను మరల నెన్నఁడును జంపను; రక్షింపుము.

శర్వి—దూరముగాఁ దీసికొనిపొండురా! అయ్యా చారుదత్త! వీని కేమిశిక్షఁ గావింపవలయునో వేగ నెలవిమ్ము.

చారు—చెప్పెదను. నేను జెప్పినట్లు చేయుదువా?

శర్వి—సందేహమేమి!

చారు—సత్యమేనా?

శర్వి—సత్యము.

చారు—అటులేని శీఘ్రముగా—

శర్వి—చంపుమనియా?

చారు—కాదు కాదు, వదలుఁడు.

శర్వి—వల విడువవలయును?

చారు—గీ. శత్రువపరాధి యగుఁగాక శరణ మనుచుఁ
జరణములమీఁదఁ బడెఁగాన శస్త్రమెత్తి
చంపరాదయ్యా—

శర్వి—అటులేని గుక్కలచేఁ గఱపింతమా.

చారు—వలదు.

ఉపకృతి సలిపి వానిఁ బ్రాణములతోడ విడుచుటేయగును శాస్తి.

శర్వి—ఎంత యాశ్చర్యముగా నున్నది? ఏమిచేయుదు నార్యు డిట్లుపలుకుచున్నాడు.

చారు—నీ వేమియుఁ జేయవలదు. వీనిని వదలుము.

శర్వి—కానీ; వదలెదను.

శకా—అమ్మయ్య! బ్రతికితిని (అని నిష్క్రమించును.)

(తెరలోఁ గలకలము)

కటకటా! చారుదత్తుని భార్య ధూతాంబ, చీర చెఱఁగు పట్టిలాగుచు కాళ్ళ కడ్డుపడుచున్న దారకునినైత మావలకుం ద్రోచివైచి నీరునిండిన కనులతో వలదనివేఁడు పౌరుల బాటింపక, పావకజ్వాలలో బ్రవేశించుచున్నది. ఎవ్వరు వలదన్నను మానకున్నది.

శర్వి—(విని తెరవంకఁజూచి) చందనకా! ఏమది?

చంద—(ప్రవేశించి) శర్విలకా! నీకుఁ గనఁబడుటలేదా! మహారాజసదనమున కెడమపైపున గొప్ప జనసమూహము కలదు చూడుము. నేను ధూతాంబగారితో 'అమ్మా! సాహసము పూనకుము. మా చారుదత్త భట్టారకుఁడు బ్రతుకు' నని విన్నవించితిని. దుఃఖసముద్రములో మునిఁగి యున్న యామె కెవ్వరు నమ్మకము చెప్పఁగలరు?

చారు—(ఉద్వేగముతో) హా! ప్రియురాలా! ధూత! నేను బ్రతికియున్నను నీ కీ సాహసకృత్యమేల! (మింటివంకఁజూచి గాఢముగా నూర్పుచ్చి)

గీ. చారుచరితరొ! తావకచరితములు ధ • రాతలంబున నుందగారాని వైన్నఁ
బరమసాధ్విని నీవెట్లు పతిని విడిచి • స్వర్గలోకసుఖంబు గాంచంగఁ జనెదు.

(అని వివశుఁ డగుచున్నాఁడు.)

శర్వి—ఓహో! ప్రమాదమగుచున్నదే!

గీ. ఆర్యుఁడిప్పుడు సమ్మోహ మధిగమించె • నడువుముర వేగ నీవు చందనక యటకు
లేకయున్నఁ గటా! యాపెపోకకతన • వ్యర్థమైపోవుఁజుమి మనయత్న మెల్ల.

వసంత—అయ్యో! ఊఱడిల్లు మూఱడిల్లుము! అచ్చటికిఁబోయి యా పూజ్యురాలిం బ్రతికింపుము. ధైర్యము వహింపుము. లేనిచో ననర్థము వచ్చును.

చారు—(వేగలేచి యూఁబడిలి) ప్రియురాలా! ఎచటనుంటివి! నాకుఁ బ్రతివచన మీవేమి?

చంద—అయ్యా! ఇటు దయచేయుము.

(అందఱును బరిక్రమింతురు)

(పిదప నగ్ని జ్వాలయందుఁ బ్రవేశించు ధూతాంబయు నామె చీరచెఱఁగు లాగుచున్న రోహసేనుఁడును వారి ననుసరించుచున్న విదూషక రదనికలును బ్రవేశింతురు.)

ధూతా—(కన్నీటితో) తండ్రీ! నన్ను వదలుము. నాకు విఘ్న మొనరింపకుము. ఆర్యపుత్రుని యమంగళవార్త నేను వినఁజాలను. (లేచి చీఱచెఱఁగు లాగికొని అగ్నిని సమీపించును.)

రోహ—అమ్మా! నన్నుఁ గాపాడవా! నిన్ను వదలి నే నెట్లు బ్రదుకుదును? (అని చేలాంచలమును మరల గ్రహించి లాగును)

విదూ—పూజ్యురాల! బ్రాహ్మణి యొంటరిగా జితాధిరోహణము చేయగూడదనియు జేసినఁ బాపమనియు ఋషులు చెప్పుచున్నారు.

ధూతా—అయ్యా! ఆర్యపుత్రుని యమంగళవాక్యమును వినుటకంటెఁ బాపాచార మైనను మేలుగదా!

శర్వి—(ముందుఁ జూచి) ధూతాంబ యగ్నిజ్వాలలను సమీపించుచున్నది. కావున నోయార్య! త్వరగా నడువుము త్వరగా నడువుము!

చారు—(గబగబ నడుచుచున్నాఁడు.)

ధూతా—రదనికా! పిల్లవానిం బట్టుకొనుము. నాకోర్కె నెఱవేర్చుకొందును.

రద—(దైన్యముతో) అమ్మా! నీయుపదేశమే నేనును అనుసరించుచున్నాను.

ధూతా—(విదూషకునిం జూచి) అయ్యా! నీవు పిల్లవానిం బట్టుకొనుము.

విదూ—(ఆవేగముతో) సమీహితసిద్ధికొఱకు యత్నించువా రొక యోగ్యబ్రాహ్మణు బురస్కరించుకొని పోవలయుఁ గావున నీకు ముందు నే నగ్నిలో బ్రవేశింతును.

ధూతా—వీరిరువురును నివారించుచున్నారే! (పుత్రుని గౌఁగిలించి) అబ్బాయి! రోహసేన! నీ యాత్మను నీవే కాపాడుకొనుము. లేనిచో మాకుఁ దిలోదక మిచ్చువారెవ్వరు? అతిక్రాంతమనోరధులమగు మాకింక నేమికావలయును? ఇఁక నార్యపుత్రుఁడు వచ్చి నిన్నుగాపాడుట యబద్ధము.

చారు—(విని శీఘ్రముగా డగ్గఱి) నేనే బాలకుని రక్షించువాఁడను. ఇదిగో వచ్చితిని. (అని పిల్లవాని నెత్తి కౌఁగిలించుకొనుచున్నాఁడు)

ధూతా—(చూచి) అమ్మయ్య! ఆర్యపుత్రుని కంఠధ్వనివలెనున్నదే! (మరల నిపు ణముగాఁ జూచి సంతోషముతో) ఆర్యపుత్రుఁడే! ప్రియము! ప్రియము!

రోహ—(తండ్రినిఁజూచి సంతోషముతో) మాతండ్రియే నన్ను గౌగిలించుకొను చున్నాఁడు. ఇదియేమి యాశ్చర్యము! అమ్మా! మనము బ్రతికితిమి. తండ్రియే నన్నుఁ గాపాడుచున్నాడు. (తండ్రిని మరల గౌఁగిలించుకొనుచున్నాఁడు)

చారు—(భార్యతో)

గీ. ప్రేయసీ నీదుభర్త జీవించియుండ • నిట్టి ఘోరప్రయత్న మిదేల నీకు
మింటిమానిక మస్తంగమింపకుండఁ • బద్మిని మొగుడ్చునే నేత్రపద్మములను.

ధూతా—ఆర్యపుత్ర! కనుకనే దాని నచేతనమందురు.

చారు—(ముద్దు పెట్టుకొనుచున్నాఁడు.)

విదూ—(చూచి సంతోషముతో) హిహీహి! ఈకన్నులతోనే నాప్రియవయస్యునిఁ జూచుచున్నాఁడను. ఆహా! పతివ్రతాప్రభావము! జ్వలనజ్వాలాప్రవేశ ప్రయత్న ముచేతనే ప్రియసమాగమమును బొందినది. నా నెచ్చెలికి జయము జయము!

చారు—మిత్రమా! రమ్మ (కౌఁగిలించుకొనును.)

రద—ఆహా! ఏమి సంఘటనము! ఆర్యా! నమస్కారము. (పాదములపైబడును.)

చారు—(వీఁపు చేతితో నిమురుచు) రదనికా! లెమ్ము. (లేవదీయును.)

ధూతా—(వసంతసేనం జూచి) చెల్లెలా! పుణ్యమూలమున జీవించితిని!

వసంత—నే నప్పుడు గా దిప్పుడు జీవించితిని. (ఇరువురును గౌగిలించుకొందురు)

శర్వి—దైవయోగమున నార్యుని సుహృద్వర్గ మంతయు జీవించినది.

చారు—మీ యనుగ్రహముచేతనే.

శర్వి—ఆర్య! వసంతసేన! రాజు పరితుష్టుఁడై నిన్ను వధూశబ్దముచే సత్క రించుచున్నాఁడు.

వసం—అయ్యా! కృతార్థురాలనైతిని.

శర్వి—(వసంతసేనకు మేలిముసుగువైచి బహూకరించి చారుదత్తునితో) ఆర్య! యీ సన్న్యాసి కేమిచేయవలయును?

చారు—భిక్షు! నీయభిమత మేది?

భిక్షు—శరీరములయందలి యనిత్యత్వమునిట్లు చూచుచున్న నాకుఁ బ్రవ్రజ్యాశ్ర మమునందె యత్యాశ కలుగుచున్నది.

చారు—వీని నిశ్చయము దృఢము. కాన నితండు బౌద్ధవిహారముల కన్నిటికిఁ గుల పతి యగుఁగాక.

శర్వి—ఆర్యుఁడు చెప్పినట్లు చేయుము.

భిక్షు—నా కది ప్రియమే.

వసంత—నాకిప్పుడు నిజముగాఁ బ్రాణములు వచ్చినవి.

శర్వి—స్థావరకునకుఁ జేయవలసిన యుపకారమేమి?

చారు—వానికి దాస్యము వదలుంగాక. ఆ చండాలు రందఱుఁ జండాలరాజు లగుదురుగాక! చందనకుఁడు పృథివికి దండపాలకుఁడై యుండుఁగాక! రాష్ట్రియస్యాలకుఁడు తన పదవియం దుండుఁగాక!

శర్వి—అన్నియు బాగుగ నున్నవి గాని శకారుని మాత్రము చంపనిండు.

చారు—శరణాగతున కభయమిచ్చితినిగదా. ("శత్రు వపరాధి యగుఁగాక" యను పద్యముం జదువును.)

శర్వి—అయ్యా! తమ కింకేమి ప్రియ మాచరింపవలయును?

చారు—నా కింకేమిప్రియము కావలయును?

శా. చారిత్రంబు పవిత్రమయ్యె రిపుఁ డస్మత్పాదము ల్వట్టె మ
త్తారాతిం బరిమార్చి యార్యకుఁడు రాజయ్యెన్ సుహృన్మౌళి త
న్వీరత్నంబగు ప్రేయసిం జెలిమికాని న్నిన్నుఁ గన్గొంటి నేఁ
గోరంగాఁ దగునటి దేది యిఁక నాకుం జెప్పుమా మిత్రమా!

ఉ. కొందఱ లొచ్చొనర్చు మఱికొందఱ హెచ్చొనరించుఁ గొందఱ
న్గుందఁగజేయుఁ గొందఱ కనూనముదంబు ఘటిల్లఁజేయు ని
ట్లందఱ కన్నిరీతుల మహావ్యసనోదయము ల్పొనర్చు చు
న్నందునఁ జెప్పుచుంద్రు విధియాటల కేతపుఁగుండన్యాయమున్.

అయిన నిట్లగుఁగాక!

స్రగ్ధర.

పాలిచ్చుంగాత గోవుల్ వసుమతి ఫలసంపత్తిచే మీఱుఁగాతన్
గాలంబందుం సువృష్టుల్ కలుగుత నలరుంగాత మందానిలంబుల్
గ్రాలుంగాతన్ సుఖంబుల్ జనుల కభిమతుల్కావుత న్నెలవేల్పుల్
పాలింతుర్గాత భూమిం బ్రశమితరిపులై పార్థివుల్ ధర్మనిష్ఠన్.

[అందఱును నిష్క్రమింతురు.]

ఇది శ్రీ తిరుపతి వేంకటేశ్వరాంధ్రీకృతంబగు మృచ్ఛకటికంబను ప్రకరణంబున సంహారమను పేరుగల దశమాంకము సర్వము సంపూర్ణము.

శతావధానులు,

శ్రీ తిరుపతి వేంకటేశ్వరుల గ్రంధములకు:

శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, కడియం.

లేక

శ్రీ తిరుపతి వేంకటేశ్వర పబ్లికేషన్సు,

రాజమండ్రి.

నెం ....
తేది ....

అవంతీ ప్రెస్ - రాజమండ్రి. (20-8-48)